ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: పూర్ణిమ ఉ. 6.40 వరకు, అనంతరం బహుళ పాడ్యమి తె.4.56 వరకు; నక్షత్రం: పుబ్బ రా.11.00 వరకు, అనంతరం ఉత్తర; అమృతకాలం: సా.4.50 నుండి 6.25 వరకు; వర్జ్యం: ఉ.7.39 నుండి 9.10 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.24 నుండి 9.12 వరకు, మ. 12.24 నుండి 1.12 వరకు; రాహుకాలం: ఉ. 10.30 నుండి 12.00 వరకు; యమగండం: మ. 63.00 నుండి 7.30 వరకు;

Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!

సంపుటి:56 • సంచిక:320 • శుక్రవారం 2 మార్చి 2018 • హైదరాబాద్ ✻ పేజీలు:12+4 • వెల: 5.00 • Published from:Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

• ఆరోగ్య తెలంగాణాకు టాటా సహకారం



హైదరాబాద్: కేసీఆర్ కిట్' వస్తు సామగ్రిని ఆసక్తి తిలకిస్తున్న టాటా గ్రూప్స్ చైర్మన్ రతన్‌టాటా, చిత్రంలో మంత్రులు కేటీఆర్, లక్ష్మారెడ్డి

మోడీ కల మేకిన్ ఇండియా సాకారం

శరవేగంగా టాటాబోయింగ్

ఏరోస్పేస్

3

• కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ వెల్లడి • రక్షణ ఉత్పత్తుల కేంద్రంగా తెలంగాణ • అపాచీ హెలికాప్టర్..మేడిన్ ఆదిభట్ల : ఐటీ మంత్రి కేటీఆర్

కేటుగాళ్ల ఆస్తులు జప్తు!



• రుణాలు ఎగ్గొట్టి పరారైతే... కోర్టుల్లో అరదండాలే!
• వందకోట్లు ఎగ్గొట్టిన వారంతా ఈ చట్ట పరిధిలోకే
• సివిల్ క్లయిమ్‌లకు అనర్హులే.. ప్రత్యేక కోర్టుల్లో విచారణ
• సొంత, బినామీ ఆస్తుల స్వాధీనం.. అమ్మి అప్పులకింద జమ
• ఆడిటర్ల నియంత్రణకు నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ
• పంజాబ్ నేషనల్ బ్యాంక్ స్కాం నేపథ్యంలో కేంద్రం చర్యలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం నేపథ్యంలో, బ్యాంకులకు రుణాలు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోతున్న ఆర్థిక నేరగాళ్ల భరతం పట్టేం దుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం పరారీ ఆర్థిక నేరగాళ్ల బిల్లును రూపొందించింది. గురువారం న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో సమావేశమైన కేంద్ర మంత్రి వర్గం ఈ బిల్లుకు ఆమోదం తెలిపింది. భారత చట్టాల నుంచి తప్పించుకు తిరుగు తున్న ఆర్థిక నేరగాళ్ల ఆటకట్టించేందుకు ఈ బిల్లును తయారు చేశారు. వంద కోట్ల రూపాయలకు పైగా రుణా లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన కేసులను ఈ బిల్లు పరిధి కిందికి తీసుకువచ్చారు. ఎగవేతదారులను తిరిగి స్వదేశానికి రప్పించి విచారణ జరిపించేందుకు ఈ చట్టాన్ని ఉపయోగించనున్నారు. దీని ద్వారా బ్యాంకుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చాలని కేంద్రం భావిస్తోంది. ఈ బిల్లు ద్వారా రుణ ఎగవేతదారుల ఆస్తులను స్వాధీనం చేసుకోనున్నారు. ఎగవేతదారులు గనుక నోటీసులకు స్పందించకపోతే వారిని పరారీలోవున్న ఆర్థిక నేర గాళ్లుగా స్పెషల్ కోర్టు ప్రకటించనుంది. ఈ కేసుల విచారణకు ప్రత్యేకంగా కోర్టులను కూడా ఏర్పాటు చేయనున్నారు. స్వదేశంలోనూ, విదేశాల్లోనూ ఉన్న సొంత, బినామీ ఆస్తులను కూడా స్వాధీనం చేసుకుంటారు. రుణ ఎగవేతదారులకు ఎటువంటి సివిల్ క్లెయిమ్‌లను కూడా చేసుకునే అవకాశం

➪ 3వ పేజీలో...

‘ప్రత్యేక కోర్టు నోటీసులకు స్పందించకుంటే వారిని పరారీలో ఉన్న ఆర్థిక నేరగాళ్లుగా ప్రకటిస్తాం. దేశంలోని, విదేశాల్లోని ఆస్తులు, బినామీ ఆస్తులు స్వాధీనం చేసుకునేలా చట్టం తీసుకురానున్నాం. అవసరమైతే ఆయా దేశాల సహకారం కూడా కోరతాం’

- ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ



• పీఎన్‌బీ కుంభకోణం

1217 కోట్ల చోక్సీ ఆస్తులు సీజ్!

Punjab National Bank

• ముంబైలో 15 ఫ్లాట్లు
• 17 ఆఫీస్ ప్రాంగణాలు
• కోల్‌కతాలో మాల్ జప్తు
• 230 ఎకరాల భూమి ఎటాచ్ చేసిన ఈడీ

11

గ్యాస్ ధర తగ్గింపు

• సబ్సిడీ సిలిండర్‌పై రూ. 2.50, సబ్సిడీయేతర సిలిండర్‌పై రూ. 47

11

ఏ నాయకుడిని వదులుకోం

- కార్యకర్తల నుంచి ఫిర్యాదులు రావద్దు
- కార్యకర్తలకు అండగా నిలుద్దాం
- పార్టీ సీనియర్లతో చంద్రబాబు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పార్టీ కార్యకర్తల నుంచి భవిష్యత్తులో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా వ్యవహరించాలని తెలుగుదేశంపార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకులకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సూచించారు. పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అమలుచేస్తూ కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని ఆయన వారిని ఆదేశించారు. తెలంగాణలో పార్టీ పనితీరుపై ఆ పార్టీ పొలిట్ బ్యూరో, జాతీయ కమిటీ తెలంగాణ విభాగం నాయకులతో గురువారం చంద్రబాబు సమావేశం నిర్వహించారు. పార్టీ నాయకుల పని తీరుపట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసినట్టు సమాచారం. తాను ఆంధ్రప్రదేశ్‌లో తీరిక లేకుండా ఉన్న తరుణంలో పార్టీని నడిపించే బాధ్యత నాయకులు తీసుకోకపోవడంపై ఒకింత అసహనం ప్రదర్శించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, ఎన్‌టిఆర్ భవన్‌లో బుధవారం జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పార్టీ కార్యకర్తలు చంద్రబాబు ప్రసంగాన్ని అడ్డుకున్న విషయం తెలిసిందే. కొందరు కార్యకర్తలు తెలంగాణ పార్టీ నాయకులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేయగా, మరికొందరు నాయకులు ఉన్నారా, లేరా అంటూ ప్రశ్నించి చంద్రబాబును నిలదీశారు. సామాన్య కార్యకర్తలు సైతం తన ప్రసంగాన్ని అడ్డుకుని నిలదీయడంపై చంద్రబాబు స్పందించి వారిని సముదాయించ ప్రయత్నం చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని సీనియర్ నేతలతో జరిపిన సమావేశంలో ఆయన వారిని ఉద్దేశించి పై విధంగా మందలించారు.

పార్టీ శ్రేణులు ధైర్యంగా ఉన్నపుడు వారికి భవిష్యత్తుపై భరోసా కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర నాయకులదేనని చంద్రబాబు ఉద్బోధించారు. రాష్ట్ర నాయకులు ప్రజా కార్యక్రమాలకు రూపకల్పన చేసుకుని ప్రజల్లోకి వెళితే కార్యకర్తల్లో ధైర్యం వస్తుందని చెప్పారు. పల్లెపల్లెకు తెదేపా కార్యక్రమాన్ని మరింత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నాయకులకు సూచించారు. అన్ని గ్రామాల్లో పర్యటించడం సాధ్యం కాకుంటే, నాలు గైదు గ్రామాల నేతలను ఒక చోటకు రప్పించి సమావేశం నిర్వహించాలని సూచించారు.

మహానాడులోపు మూడు బహిరంగ సభలు నిర్వహిస్తా మని, అందుకు తగ్గట్లుగా పార్టీ సమాయత్తం కావాలని చంద్రబాబు సూచించారు. పార్టీ నాయకులపై తప్పుడు కేసులుపెట్టి వేధిస్తే అండగా ఉండి వారిని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. పార్టీ నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డికి పార్టీ అండగా నిలిచి అన్ని విధాలా ఆదుకుం టుందని హామీ ఇచ్చారు. పార్టీని నమ్ముకున్న ఏ ఒక్క నాయకుడికి కష్టమొచ్చినా వారికి మద్దతుగా నిలుస్తామని, ఏ నాయ కుడిని వదులుకోమని ఈ సందర్భంగా చెప్పారు. వచ్చే ఎన్నికల్లో పొత్తుల గురించి ఇప్పుడే చర్చలు పెట్టు కోవద్దని, పార్టీ పటిష్ట కోసం పనిచేయాలని వారికి సూచించారు. ప్రతి నెలకోసారి పార్టీ నేతలను కలుస్తానని, దీనిపై త్వరలో స్పష్టత ఇస్తానని ఆయన చెప్పారు. పార్టీలో అనేక పదవులు అనుభవించిన వారు పార్టీ ఇబ్బందుల్లో ఉన్నపుడు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండడాన్ని ఆయన తప్పుబట్టారు. మరోవైపు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా పార్టీకి నష్టం చేకూర్చే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సరికాదని అన్నారు. పార్టీ నేతలు హుందాగా, సమయ స్ఫూర్తితో, క్రమశిక్షణతో వ్యవహరించాలని ఆయన సూచించారు. పార్టీలో ఖాళీగా ఉన్న జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని, అయితే నియోజకవర్గ స్థాయిలో సమర్థులైన అభ్యర్థులను గుర్తించాలని నాయకులకు సూచించారు.

రానున్న రోజుల్లో పార్టీ చేయాల్సిన కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించామని సమావేశం అనంతరం రావుల చంద్రశేఖరరెడ్డి మీడియాతో చెప్పారు. ఈనెల 29 వరకు పల్లెపల్లెకు తెదేపా కార్యక్రమాన్ని కొనసాగుతుందని, మే నెలాఖరుకు అన్ని కమిటీలను భర్తీ చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించాలని నిర్ణయించామని, ముందుగా ఖమ్మంలో సమావేశం ఉంటుందని, దానికి చంద్రబాబు హాజరవుతారని రావుల తెలిపారు. పార్టీని తెరాసలో విలీనంచేస్తే బాగుంటుందని వ్యాఖ్యానించిన సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులుపై ఎలాంటి చర్చ జరగలేదని ఆయన చెప్పారు. కేవలం పార్టీ పటిష్టత కోసం అనుసరించాల్సిన వ్యూహం, రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, కార్యకర్తల్లో మనోధైర్యం నింపే అంశాలపైనే చర్చించామని రావుల తెలిపారు.



మా పార్టీకి పెద్ద కేడర్ ఉంది

- కమ్యూనిస్టుల ఉనికి ప్రస్తుతం ప్రశ్నార్థకం
- బంగారు లక్ష్మణ్ పాత్ర మరువలేం:నిర్మలా సీతారామన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశంలోనీ జాతీయ పార్టీల్లో అత్యంత క్యాడర్‌ఉన్న పార్టీ భాజపానేనని కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ అన్నారు. ఒకప్పుడు కమ్యునిస్టు పార్టీల్లో పటిష్టమైన కార్యకర్తలు ఉండేవారని.... కానీ ఇప్పుడు వారి ఉనికే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. భాజపాను ఒక వటవృక్షంగా తీర్చిదిద్దడంలో పార్టీ మాజీ జాతీయ అధ్యక్షుడు, దివంగత నాయకుడు బంగారు లక్ష్మణ్ చేసిన కృషి మరవరానిదన్నారు. గురువారం నాంపల్లోని భాజపా కార్యాలయంలో బంగారు లక్ష్మణ్ నాలుగవ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, పార్టీ కోసం సర్వం త్యాగం చేసిన బంగారు లక్ష్మణ్ సంస్మరణ సభలో తాను పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. అయితే ఆయన మనమధ్య లేకపోవడం మరోరకంగా బాధ కూడా ఉందన్నారు. భాజపా జాతీయ అధ్యక్షుడిగా ఆయన నిస్వార్థంగా సేవలు అందించారని ప్రశంసించారు. జనసంఘ్, రాష్ట్ర స్వయం సేవక్ సంఘ్ నుంచి ఆయన అంచలంచలుగా భాజపాలో కీలక వ్యక్తిగా ఎదిగాడని అన్నారు.

తెలుగు, ఇంగ్లీష్, హిందీ పలు భాషల్లో అనర్గలంగా మాట్లాడే బంగారు లక్ష్మణ్....మనస్సు కూడా బంగార మేనని అన్నారు. పైగా చాలా సౌమ్యుడని అన్నారు. అలాంటి నాయకుడి చూపిన బాటలో పయనించేందుకు...ఆయన ఆశయ సాధనను నిజం చేసేందుకు ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్ మాట్లాడుతూ, అనేక మంది నాయకులు, కార్యకర్తల త్యాగా ల పునాదులతోనే నేడు కేంద్రంలో భాజపా ప్రభుత్వం కొనసాగు తోందన్నారు. అందుకే నరేంద్రమోదీ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని అన్నారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భాజపాను ఒక శక్తివంతమైన పార్టీగా తీర్చిదిద్దడంలో బంగారు లక్ష్మణ్ చేసి కృషి మరువరానిదన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు..



నిజామాబాద్ అర్బన్, ప్రభన్యూస్ : బంగారు తెలంగాణగా మారుస్తామన్న రాష్ట్రంలో నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్ప డుతున్నారని, ప్రజలు మార్పు కోరుకుం టున్నారని కాంగ్రెస్ శాసనసభ పక్ష నేత షబ్బీర్ అలీ పేర్కొన్నారు. ఈ నెల 4న ప్రజా చైతన్య బస్సు యాత్ర జిల్లాకు చేరుకుంటున్న సందర్భంగా జిల్లా కేం ద్రంలోని కలెక్టరేట్ మైదానాన్ని గురువారం పరిశీలించారు. అనంతరం కాంగ్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలోఆయన మాట్లాడుతూ తెలంగాణలో నిరుద్యోగుల ఆత్మహత్యలు పెరిగా యని ఆయన ఆరోపించారు. ఇటీవల కామారెడ్డిలో ఓయువతి ఉద్యోగం రాక ఆత్మహత్య చేసుకుందని దీనికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు చంద్రబాబు భరోసా

- వంద మందికి రూ.5 కోట్ల విలువైన చెక్కుల పంపిణీ
- చివరి రూపాయి వరకూ బాధితులకు ఇప్పిస్తా
- అధిక వడ్డీల మాయలో చిక్కుకోకండి
- ఎలాంటి నిబంధనలను లెక్క చేయను: ఏపీ సీఎం హామీ



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో లక్షలాది మంది డిపాజిటర్లకు శఠగోపం పెట్టి, వందలాది మంది మరణానికి కారణమైన అగ్రిగోల్డ్ బాధితుల కుటుంబాలకు అండగా నిలుస్తానని, చివరి రూపాయి వరకు ఇప్పించేందుకు కృషి చేస్తానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు భరోసానిచ్చారు. గురువారం సాయంత్రం సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో గ్రీవెన్స్ సెల్‌లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన మృతుల కుటుంబాలతో ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రభుత్వం బాధితులకు బాసటగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 100 మంది మృతుల కుటుంబాలకు ఐదు లక్షల చొప్పున రూ.5 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేసి వారిలో భరోసా కల్పించారు. అగ్రిగోల్డ్ బాధితులకు అండగా ఉంటామని, వారికి చెల్లింపుల బాధ్యత తీసుకుంటామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలను ఆదుకుంటామనిస్పష్టం చేశారు. దీనిపై ఎటువంటి నిబంధనలున్నా లెక్క చేయమన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామనీ, ప్రైవేటు పెట్టుబడులు పెటొద్దనీ, ఎక్కువ వడ్డీలిస్తామనీ, రెండేళ్లలో రెట్టింపు చేస్తామనే ప్రచారాలకు మోస పోవద్దని సూచించారు. ఇటువంటి సంస్థలపై నిఘా ఉంచామనీ, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఆస్తులు జప్తు చేసి మరీ చెల్లిస్తామని హెచ్చరించారు. పేదలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందనీ, ఎట్టి పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు డబ్బులిప్పిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖామంత్రి యనమల రామ కృష్ణుడు, ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఫెడరేషన్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు బి.విశ్వనాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.తిరుపతి రావు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈవీ నాయుడు, ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఐడీ ఎస్పీ ఉదయభాస్కర్, ఏఎస్పీ త్రిమూర్తులు, వివిధ జిల్లాల పోలీసు అధికారులు హాజరయ్యారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో అగ్రిగోల్డ్ లో డిపాజిట్లు చేసి ఆత్మహత్య, గుండెపోటుకు గురైన మృతుల కుటుంబాలను ఆయా జిల్లాల్లోని సీఐడీ అధికారులు ప్రత్యేక వాహనంలో సచివాలయానికి తీసుకొచ్చారు.

స్థాయిని మించి మాట్లాడొద్దు

కేటీఆర్‌కు జానారెడ్డి హెచ్చరిక



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర మంత్రి కల్వకుంట్ల తారకరామారావుపై సీఎల్పీ నేత జానారెడ్డి ఫైర్ అయ్యారు. మంత్రి కేటీఆర్‌కు అహంకారం పెరిగిపోవడంతో కు సంస్కారంతో మాట్లాడు తున్నారని మండిపడ్డారు. జానా బాబా 40 మంది దొంగలు అంటూ మంత్రి కేటీఆర్ తన స్థాయికి మించి మాట్లాడటం సరికాదని హెచ్చరించారు. కాం గ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక టీఆర్ఎస్ పార్టీ కనుమరు గవుతోందని ఆయన జోష్యం చెప్పారు. రాజకీయాల్లో ఉండాలని అనుకునే వాళ్లందరూ తిరిగి కాంగ్రెస్‌లోకే వస్తారని ఆయన తెలిపారు. తెలంగాణలో టీడీపీకి మనుగడ లేదనే రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వచ్చారని ఆయన పేర్కొ న్నారు. గురువారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లా డారు. మంత్రి కేటీఆర్‌లాంటి వ్యక్తులపై కౌంటర్‌గా మీడియా సమావేశాలు పెట్టడం తన స్థాయి తగ్గించుకున్నట్లే అవుతుం దన్నారు. ఇకపైన మంత్రి కేటీఆర్‌పైన కౌంటర్ సమావేశాలు ఉండవని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ ఫిరాయిం పులకు తానెప్పుడు వ్యతిరేకమేనని ఆయన తెలిపారు.

తమ పార్టీకి చెందిన నాయకులపై కేసులు ఉన్నాయని పదే పదే విమర్శలు చేస్తున్న వారు ఆధారాలుంటే బయటపెట్టాలని జానారెడ్డి డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ నాయకులపై కేసులున్నాయనే విషయం మర్చిపోవద్దని ఆయన హితవు పలికారు. తప్పు చేసిన వాళ్లకు, మోసం చేసిన వాళ్లకు భవిష్యత్‌లో ప్రజలే బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

నల్లగొండలో ఫ్లోరైడ్ విషయాన్ని గుర్తించి పరిష్కారం చూపింది కాంగ్రెస్ పార్టీనేని ఆయన తెలిపారు. ఫ్లోరైడ్‌పైన పరిశోధనలు చేపించి రూ. 200 కోట్లు వెచ్చించి గ్రామాలకు మంచి నీళ్లు ఇచ్చామన్నారు. 66 గ్రామాలకు మంచినీరు ఇవ్వాలని తాను గతంలోనే వంద కోట్ల నిధులు కేటాయించి శంఖుస్థాపన చేయగా.. మంత్రి కేటీఆర్ ఇప్పుడు ప్రారంభిం చారని ఆయన వివరించారు. తమ ప్రభుత్వ హయాంలో సిద్దిపేట, ఎల్లాఆరెడ్డి, ముథోల్‌తో పాటు సిరిసిల్ల అసెంబ్లీ నియోజక వర్గాలకు నిధులు కేటాయించింది వాస్తం కాదా..? అని ఆయన ప్రశ్నించారు. పాలేరు కట్టమీద వేసిన శిలా ఫలకాన్ని చూసుకుంటే తెలుస్తుందన్నారు. హైదరాబాద్‌కు కృష్ణ నీళ్లు తెచ్చామన్నారు. పునాదులేసి ఎవరో ఇళ్లు కట్టిన తర్వాత.. దానిపై పెంట్‌హౌస్ వేసి.. చూసినావా నేను కట్టిన ఇళ్లు ఎట్లున్నది అన్నట్లుగా మంత్రి కేటీఆర్ మాటలు ఉన్నాయని జానారెడ్డి ఎద్దేవా చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన గొర్రెల్లో కనీసం సగమైనా ఉన్నాయా..? అంటూ ప్రశ్నించారు. కులాల పేరుతో ఓట్లు దండుకునే పనిలో టీఆర్ఎస్ ఉందన్నారు. నాలుగేళ్ల టీఆర్ఎస్ అధికారంలో రూ. 2.20 లక్షల కోట్లు అప్పు చేశారని ఆయన పేర్కొన్నారు.



గోరటి వెంకన్నను సన్మానిస్తున్న మంత్రి హరీష్‌రావు

సిద్దిపేట జిల్లాకు గోదావరి జలాలు

- కళాకారులు, కవులకు సిద్ధిపేట పెట్టిన కోట
- రూ.25 కోట్లతో కోమటి చెరువు అభివృద్ధి
- మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, ప్రభన్యూస్ : సిద్దిపేట కళాకారులకు, కవులకు, సాహితీవేత్తలకు పెట్టిన కోటని భారీ నీటిపారుదల శాఖా మంత్రి తన్నీరు హరీష్‌రావు ఉద్ఘాటించారు. గురువారం జిల్లా కేంద్రమైన సిద్దిపేట కోమటిచెరువు వద్ద రూ.6.25 కోట్లతో నిర్మించిన కోమటి చెరువు కళాక్షేత్రంను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాకారులకు తెలంగాణ సర్కార్ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. సిద్దిపేటలో కళాకారులు, సాహితీవేత్తలు ఎందరో తెలంగాణ ఉద్యమంలో ఊతమందించారని కొనియాడారు. మైమ్ మధు ప్రదర్శన అద్భుతంగా ఉందని, వైష్ణవి సాయినాథ్ అద్భుత కళాప్రదర్శన ఆకట్టుకుందని, వీరికి ప్రభుత్వం పక్షాన సహకారం అందిస్తామన్నారు. తెలంగాణ బీడు భూములన్నీ రాబోయే రోజుల్లో పచ్చని మాగాణిగా మారబోతున్నాయని తెలిపారు. గోదావరి నీళ్ళతో ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేస్తామని హామీనిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఇప్పుడు ఎక్కడ చూసినా నీళ్ల పరవళ్లు తొక్కి చెరువులు, కుంటలు నిండి పచ్చని పంట పొలాలు దర్శనమిస్తున్నాయని తెలిపారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక ప్రాంతాలు గోదావరి నీటికోసం వేచిచూస్తున్నాయని తెలిపారు. వర్షాకాలంలోపు గోదావరి నీళ్ళు జిల్లాకు తీసుకువస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్ కోమటిచెరువు అభివృద్ధికి రూ.25 కోట్లు కేటాయించారని తెలిపారు. కోమటిచెరువు వద్ద శిల్పారామం, బొటానికల్ పార్క్, నైట్ బజార్, మల్టీప్లెక్సీ థియేటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

కళలతోనే జీవితం..

పని ఒత్తిడిని దూరం చేసి మానసిక ఉల్లాసాన్ని కలిగించేవి కళలేనని, కళల వల్ల ఆయుష్షు పెరుగుతుందని మంత్రి తెలిపారు. కళలను తిలకించడం వల్ల అందరికీ ఎంతో ఉత్సాహం కలుగుతుందన్నారు. అనంతరం గోరటి వెంకన్న మాట్లాడుతూ సిద్దిపేటతో తనకు ఎంతో అనుబంధం ఉందని, కళాకారులు ఇలాంటి గొప్ప వేదికలను కోరుకుంటారని తెలిపారు. తెలంగాణలో ఎంతో మంది ప్రసిద్ద కవులు, కళాకారులు ఉన్నారంటూ..సిద్దిపేట నుంచి కొత్త చరిత్ర లిఖించబడుతుందని చెప్పారు. ఈసందర్భంగా గోరటి వెంకన్న పాడిన పాటలు ఉర్రూతలూగించాయి. అనంతరం పలువురు కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక రథసారధి రసమయి బాలకిషన్, ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి, ఎమ్మెల్సీలు ఫారుఖ్‌హుస్సేన్, సుధాకర్‌రెడ్డి, బేవరేజెస్ చైర్మన్ దేవీప్రసాద్, ఇండస్ట్రియల్ చైర్మన్ బాలమల్లు, సీఎం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, నందిని సిద్దారెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక డైరెక్టర్ మామిడాల హరికృష్ణ, కార్యదర్శి బుర్రా వెంకటేశం, మున్సిపల్ చైర్మన్ రాజనర్సింహతో పాటు పలువురు కళాకారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికార మదంతో విర్రవీగుతున్నారు

మోడీని, జానారెడ్డిని విమర్శించే స్థాయా వీళ్లది: కోమటిరెడ్డి



మిర్యాలగూడ, ప్రభన్యూస్ : రాష్ట్ర రాజకీయాల్లో కేటీఆర్ అంత పెద్ద బ్రోకర్.. ఛీటర్ ఎవరూ లేరని.. కనీస పరిజ్ఞానం లేకుండా ఆంధ్రా వాళ్ళకు కాంట్రాక్టులు అప్పగించి కమీషన్ల రూపంలో కోట్ల రూపాయలు దండు కుంటున్నారని.. మంత్రి కేటీఆర్ అధికారం.. డబ్బు మదంతో విర్ర వీగుతున్నారని.. స్థాయి మరిచి విమర్శలు చేస్తున్నారని.. జానారెడ్డిని వాళ్ళ నాన్న గౌరవిస్తే.. ఈయన మాత్రం జానా బాబా 40 దొంగలని అగౌరవంగా ఆరో పణలు చేస్తున్నారని.. సీఎల్పి ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. మిర్యాలగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డిలపై ఘాటు విమర్శలు చేశారు. కేటీఆర్ ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి సీనియర్ మంత్రిగా పనిచేసిని సీఎల్పి నేత జానారెడ్డిని జానా బాబా 40 దొంగలని కామెంట్ చేస్తున్నారని అన్నారు. హంతకులను వెంట వేసుకొని తిరుగుతున్న వీళ్ళు దోపిడి దొంగలకంటే దారుణంగా రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. వీరు చేసిన అవినీతి, అక్రమాలకు ఫలితంగా అధికారం పోయాక వీళ్ళు జీవితాంతం జైళ్ళోనే ఉండాల్సి వస్తుందన్నారు. సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌నాయక్, శంకర్‌నాయక్, ఎంఏ ఖరీం, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ధనలక్ష్మీ, శ్రీనివాస్, కోడిరెక్క శౌరీ, కాంతారెడ్డి, బంట్రు రమేష్, ఎల్లమ్మ తదితరులు ఉన్నారు.

తెరాసలో డబుల్ ట్రబుల్

- రెండు టికెట్లు కోరుతున్న నేతలు
- హామీ ఇచ్చారంటూ దూకుడు
- నియోజక వర్గాల్లో మొదలైన లొల్లి
- పరకాల లేదా భూపాలపల్లి అదనంగా కోరుతున్న కొండా సురేఖ
- డోర్నకల్, మహబూబాబాద్ మాదే అంటున్న రెడ్యానాయక్
- పాలమూరులో.. వారసులకు రెండో సీటు అడుగుతున్న నేతలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: టిఆర్ఎస్‌లో.. డబుల్ ట్రబుల్స్ మొదలయ్యాయి. ఒక నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలు కొందరు.. తమ ఫ్యామిలీకి రెండో టికెట్ ఖాయమని, అధినేత తమకు గతంలోనే హామీఇచ్చారంటూ దూకుడు ప్రదర్శిస్తున్నారు. తాము ఆశిస్తున్న నియోజకవర్గాల్లో పర్యటనలకూ శ్రీకారం చుడుతున్నారు. దీంతో.. అక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న నేతలు ఆందోళనకు గురవుతుండగా, రాజకీయం ఆసక్తికరంగా మారింది. టిఆర్ఎస్ టికెట్లకు ఈసారి విపరీతమైన డిమాండ్ ఉండగా, నేతల సర్దుబాటు సమస్యగా మారింది. పునర్విభజన జరిగితే సర్దుబాటు చేద్దామని గతంలో కొందరికి టిఆర్ఎస్ హామీనివ్వగా, ఇపుడు.. జరిగినా, జరగ కున్నా ఇవ్వాల్సిందేనంటూ కొందరు నేతలు చాపకిందనీరులా పోటీకి బలాన్ని ప్రోదిచేసుకుంటున్నారు. ఐదు నుండి పదిచోట్ల ఈ సమస్యలున్నాయి. ఇక సిట్టింగ్ ఎమ్మెల్యేలున్నా.. వారికి ఈసారి సీటురాదంటూ మరికొందరు పోటీనేతలు తమ వర్గంతో పోటీగా బలప్రదర్శనలకు దిగుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గాల్లో రాజకీయం ఆసక్తికరంగా మారింది.

డబుల్ డిమాండ్..














- మాజీ మంత్రి కొండాసురేఖ వరంగల్ తూర్పు నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈసారి తన కూతురు సుస్మితాపటేల్‌ను బరిలోకి దింపాలనుఉంటున్న కొండా దంపతులు పరకాల లేదా భూపాలపల్లి నియోజక వర్గాల్లో తమక కూతురికోసం అదనంగా ఒక స్థానం ఇవ్వమని అడుగుతామని బహిరంగంగానే చెబుతున్నారు. ముఖ్య మంత్రి కెసిఆర్ నిర్ణయాన్ని తమ భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని చెబుతున్నారు. పరకాల, భూపాలపల్లి ఈరెండు చోట్లా టిఆర్ఎస్‌కు సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నారు.

- ఇక డోర్నకల్ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రెడ్యానాయక్, తమ కూతురి కోసం మహబూ బాబాద్ స్థానం ఇవ్వాల్సిందే నని.. తాము పార్టీ లోకి వచ్చేటపుడే రెండుసీట్ల హామీని చ్చారని చెబుతున్నారు. ఇపుడు తాజాగా మహబూ బాద్ పార్లమెంట్, డోర్నకల్, మహబూ బాబాద్ అసెంబ్లీలు లక్ష్యంగా తన పర్యటనలు కొనసాగిస్తున్నారు. రెడ్యా నాయక్ కుమారుడు కూడా విస్తృతంగా నియోజకవర్గంలో తిరుగుతున్నట్లు చర్చ జరుగుతోంది. మహబూబాబాద్‌లో టిఆర్ఎస్ కు సిట్టింగ్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఉండగా, టికెట్ ఖాయమని ప్రచారం చేసుకుంటున్న రెడ్యానాయక్ కుమార్తె కవితకు మధ్య పరిస్థితి పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉంది. ఈ క్రమంలో టికెట్ ఎవరికి ఇస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనన్న చర్చ జరుగుతోంది.

- ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి కూడా ఈ ఎన్నికలలో తన వారసురాలిని రంగంలోకి దింపే అవకాశం ఉంది. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంపై ఆమె దృష్టిపెట్టి పర్యటనలు సాగిస్తున్నారు. ఇక్కడి నుండి మాజీ ఉప ముఖ్యమంత్రి రాజయ్య ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన కొంత ఆందోళనకు గురి అవుతున్నారు.

- పాలకుర్తి నియోజకవర్గం నుండి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఆయన సొదరుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు వరంగల్ తూర్పు నియోజక వర్గంపై కన్నేశారు. దీంతో ప్రదీప్‌రావు నియోజకవర్గంలో చేస్తున్న హడావుడిపై ఇక్కడి నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండా సురేఖ బాహాటంగానే పలుమార్లు మండి పడ్డారు.

- మహ బూ బ్‌నగర్ ఎంపీ జితేం దర్‌రెడ్డి ఈసారి తన వారసుడిని పార్లమెంట్ పరిధిలోనే ఏదో ఒక నియోజకవర్గం నుండి బరిలోకి దించాలని ప్రయత్ని స్తున్నారు. షాద్‌నగర్ లేదా కొడంగల్ నియోజకవర్గాలలో ఒకటి కేటాయించమని అధినేత కోరుతారని అనుచరులు ప్రచారం చేస్తున్నారు.

- మంత్రి జూపల్లి కృష్ణారావు వారసుడు కూడా ఈసారి రాజకీయ అరంగేంట్రం కోసం ప్రయత్ని స్తున్నా రు. ప్రస్తుతం జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహి స్తుండగా, కుమారుడు అరుణ్ వనపర్తి నియోజకవర్గంపై దృష్టి పెట్టారు. క్యాంపు కార్యాలయం కూడా ఏర్పాటు చేసుకుని.. గత కొన్ని మాసాలుగా కార్య కలా పాలు నిర్వహి స్తున్నారు. మరోవైపు వనపర్తి కేంద్రంగా ప్రణా ళికా సం ఘం ఉపాధ్యక్షుడు సిం గిరెడ్డి నిరంజన్‌రెడ్డి గత నాలు గేళ్ళుగా పార్టీని బలోపేతం చేయ డంతో పాటు అభి వృద్ధి పనుల వేగవంతం లోనూ కృషి చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి, మంత్రి తనయుడికి రెండు టికెట్లు కేటాయింపు జరుగుతుందా.. అన్న చర్చ జరుగుతోంది.

- రంగారెడ్డి జిల్లా తాండూరు నుండి మంత్రి మహేందర్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండగా.. ఈసారి ఆయన సోదరుడు నరేందర్‌రెడ్డికి కొడంగల్ టికెట్ ఇవ్వమని కోరుతున్నారు.

తెరాస నేతలకు మతి భ్రమించింది



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాంగ్రెస్ పార్టీ చేపట్టిన బస్సుయాత్రకు ప్రజల నుంచి స్పందన వస్తుండటంతో.. టీఆర్ ఎస్ నేతలు మతి స్థిమితం కోల్పోయి పిచ్చినట్లుగా మాట్లాడు తున్నారని మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. గురువారం ఆయన గాంధీ భవన్‌లో పార్టీ నేతలు లక్ష్మణ్‌రావు గౌడ్, ఉజ్మాషాకిర్‌తో కలిసి మీడియాతో మాట్లా డారు. కాంగ్రెస్ నేతలను బాబా దొంగ లంటూ చేసిన టీఆర్ఎస్ విమర్శలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు. కల్వకుంట్ల బాబా దొంగలు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ వచ్చాక పదవులు అవసరం లేవని, కాపలా కుక్కలాగ ఉంటానని చెప్పిన కేసీఆర్ ఇప్పుడు పదవులన్ని తన కుటుంబానికే తీసుకుంటున్నారని ఆయన విమర్శించారు. టీఆర్ఎస్‌కు 106 అసెంబ్లీ సీట్లు వస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని, ఒక వేళ 106 సీట్లు రాకపోతే కేసీఆర్ తప్పుకుంటారా..? అని టీ పీసీసీ చీఫ్ ఉత్తమ్ చేసిన సవాల్‌కు టీఆర్ఎస్ నుంచి ఎందుకు స్పందన రావడం లేదన్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుండటంతో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు పిచ్చిపట్టినట్లుగా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు.

గిరిజనుల మధ్య చిచ్చుపెట్టారు..

ప్రశాంతంగా ఉన్న గిరిజనుల మధ్య చిచ్చుపెట్టిన ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు అదిలాబాద్‌ను కశ్మీర్‌లోని అల్లర్ల ప్రాంతంగా చేశారని కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ రవీంద్రానాయక్ విమర్శించారు. గురువారం ఆయన పార్టీ నేత సూర్యానాయక్ తో కలిసి మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల్లో ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీ అమలు కాకపోవడంతో ఇప్పుడు లంబాడిలు, ఆదివాసిల మధ్య ప్రభుత్వం చిచ్చు పెట్టి తమాషాగా చూస్తోందన్నారు. గిరిజనులకు రాజ్యాంగ బద్దంగా రావాల్సిన హక్కులను కూడా తెలంగాణ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు.



హోలీ పాటల సీడీ ఆవిష్కరించిన కవిత

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హోలీ పాటల సిడిలను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గురువారం ఆవిష్కరించారు. హోలీ పండుగను పురస్కరించుకుని తెలంగాణ జాగృతి సాంస్కృతిక విభాగం కన్వీనర్ కొదారి శ్రీను నిర్వహణలో తయారైన ఈ సిడిలను ఎంపి కవిత నివాసంలో ఆవిష్కరించారు. తెలంగాణ జాగృతి సంప్రదాయ హోలీ పాటలను, జనం నోళ్ళలో నానే పాటలను రికార్డు చేయించిన కోదారి శ్రీనును కవిత అభినందించారు. సిడి ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, ఉపాధ్యక్షులు రాజీవ్‌సాగర్, తెలంగాణ జాగృతి గల్ఫ్ అధ్యక్షులు చెల్లంశెట్టి హరిప్రసాద్, సాంస్కృతిక విభాగం కన్వీనర్ కోదారి శ్రీను, యువజన విభాగం కన్వీనర్ కొరబోయిన విజయ్, జాగృతి మహారాష్ట్ర అధ్యక్షులు సుల్లె శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శులు బిక్షపతి, కృష్ణారెడ్డి, నితీష్, నరేందర్ పాల్గొన్నారు.

సిరియాలో స్వీయహననం!



- క్లోరిన్ ప్రయోగంతో పౌరులు మృతి
- రసాయన ఆయుధాలకై సన్నాహాలు
- రష్యాకు ఉత్తరకొరియా సహకారం
- ఉగ్రవాదుల ఏరివేతలో పౌరులపైనా గురి
- సిరియా సైన్యం అకృత్యాలు

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

కొన్ని మాసాల క్రితం ఐసీస్ ఉగ్రమూకల దాడితో కకావికలమైన సిరియన్లు ప్రాణాలు అరచేతబట్టుకుని దొరికిన పడవలు, తెప్పలపైనే సముద్రాన్ని ఈది బతుకు జీవుడా అంటూ పారిపోయారు. ఇలా సురక్షిత ప్రాంతానికి పడవలో వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయి సముద్రపు ఒడ్డున పడున్న చిన్నారి అలంకుర్ది ఫొటో మీడియాలో ప్రచురితమైంది. ఈ ఒక్క ఫొటో ప్రపంచాన్ని కుదిపేసింది. అంతవరకు సిరియాపై పెద్దగా దృష్టిపెట్టని ప్రపంచ దేశాలన్నీ ఒక్కసారిగా అక్కడ జరుగుతున్న అంతర్యుద్ధంపై దృష్టిసారించాయి. ప్రపంచ వ్యాప్తంగా పౌరహక్కులు, ప్రజాస్వామ్యవాదులు, బాలల హక్కుల సంఘాలతో పాటు హృదయమున్న ప్రతిఒక్కరు స్పందించారు. ఆ ఒక్క ఫొటోయే సిరియాకు అంతర్జాతీయ సాయం అందేందుకు దోహదపడింది. ఉగ్రమూకలపై సిరియా ప్రభుత్వదళాలు దాడులు చేసి తరిమికొట్టేందుకు వీలైన ఆర్థిక, సైనిక, ఆయుధ సంపత్తిని సమకూర్చిపెట్టింది.

ఇదంతా ఒకప్పుడు. ఇప్పుడు సిరియాలో సొంత సైనిక దళాల కాల్పులు, బాంబుల పేలుళ్ళతో లక్షలాదిమంది చిన్నారులు అనాథలైపోయారు. కాల్పుల తీవ్రతకు ఒళ్ళంతా గాయాలై రక్తమోడుతున్న శరీరంతో బేలచూపులు చూస్తున్నారు. కొనప్రాణంతో కొట్టుమిట్టాడుతున్నారు. నెత్తుటి చారికలతో బిక్కు బిక్కుమంటున్నారు. సిరియాలో కొంతకాలంగా వేర్పాటువాద మిలిటెంట్లు, ఉగ్రమూకలపై ప్రభుత్వ దళాలు ఆకస్మిక దాడులు నిర్వహిస్తున్నాయి. చిట్టచివరి ఐసీస్ ఉగ్రవాదిని కూడా దేశం సరిహద్దుల నుంచి వెళ్ళగొట్టడమే తమ లక్ష్యంగా సిరియా ప్రభుత్వ దళాలు ఈ కాల్పులకు తెగబడుతున్నాయి. అయితే ఉగ్రమూకల సాకుతో సాధారణ జనావాసాలపై కూడా బాంబుల వర్షం కురిపిస్తున్నాయి. సిరియా దళాలకు రష్యా కూడా సహకరిస్తోంది. ఆ దేశం నుంచి కూడా పెద్ద ఎత్తున సైనిక దళాలు సిరియాలోకి ప్రవేశించాయి. బాంబర్లు, ఆయుధాల్ని రష్యా సరఫరా చేస్తోంది. ఈ అత్యాధునిక సైనిక సంపత్తిని మిలిటెంట్లతో పాటు సొంత పౌరులపై కూడా దాడులకు సిరియా వినియోగిస్తోంది. మరోవైపు రసాయన ఆయుధాల్ని కూడా సిరియా సిద్ధం చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా కొన్ని కర్మాగారాల్ని నెలకొల్పింది. ఇందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ముడిసరుకుని కూడా ఉత్తరకొరియా నుంచి పొందుతోంది.

ఓ వైపు సిరియాలో జరుగుతున్న మానవహక్కుల హననంపై అంతర్జాతీయ సమాజం విమర్శలు సంధిస్తోంది. ఐక్యరాజ్య సమితి కూడా ఈ దాడుల్ని తీవ్రంగా ఖండించింది. ఫిబ్రవరి 25న భద్రతా మండలి ప్రత్యేక సమావేశం నిర్వహించింది. సిరియాలో కాల్పుల్ని వెంటనే విరమించాలంటూ ఓ తీర్మానం కూడా ఆమోదించింది. ఈ సమావేశంలో పాల్గొన్న రష్యా ఇందుకు అనుకూలంగా ఓటేసింది. కానీ సిరియాతో కలసి పౌరనగరాలపై దాడుల్ని మాత్రం రష్యా ఆపలేదు. సిరియా రాజధాని డమాస్కస్‌కు 18కిలోమీటర్ల దూరంలో గౌటా నగరముంది. 2013లో ఈ నగరంలోకి ఐసీస్ ఉగ్రవాదులు చొచ్చుకొచ్చారు. 2017నాటికి వీరితో పాటు మరికొన్ని ఉగ్రవాద గ్రూపులు ఈ నగరంలోకి ప్రవేశించాయి. గతేడాది మార్చి నాటికి గౌటా నగరం ఉగ్రమూకలకు కేంద్రంగా మారిపోయింది. ఉగ్రవాద బృందాలు నగరాన్ని తమ బలానికి అనుగుణంగా పంచేసుకున్నాయి. ప్రభుత్వ పెత్తనం లేకుండా నగరంపై అధికారం చెలాయించడం మొదలెట్టాయి. గత ఏడాది చివరలో గౌటాలో పెత్తనం చెలాయిస్తున్న ఉగ్రమూకల మధ్య ఆధిపత్య పోరాటం మొదలైంది. పరస్పర దాడులకు పాల్పడ్డాయి. దీంతో మూడు లక్షల మందికి పైగా జనాభా ఉన్న ఈ నగరంలో ప్రజలు బిక్కుబిక్కుమనే స్థాయికొచ్చారు. సరిగ్గా ఆదే సమయంలో సిరియాలోని ఇతర ప్రాంతాల్లో ఐసీస్ ప్రాబల్యం తగ్గింది. ఇదే అదనుగా గౌటాను తమ అధీనంలోకి తెచ్చుకునేందుకు సిరియా వ్యూహాలు సిద్ధం చేసింది. ఇందుకు రష్యా తన సహకారాన్ని అందించింది. ముందుగా జనాన్ని తరలించి ఆపై ఉగ్రమూకలే లక్ష్యంగా దాడులు చేయాలని మిత్రదేశాలు సూచించాయి. కానీ ఈ సూచనను సిరియా, రష్యాలు పెడచెవిన పెట్టేశాయి. ముందస్తు తలింపునకు ప్రయత్నించకుండా నేరుగా బాంబుల దాడిని మొదలెట్టాయి. గత నాలుగు రోజుల్లో ఈ దాడుల కారణంగా సుమారు 1700మంది ఒక్క గౌటా నగరంలోనే మృతిచెందారు. వేలాది మంది క్షతగాత్రులయ్యారు. వేలాది మంది చిన్నారులు ఒళ్ళంతా బాంబుల గాయాలకు గురయ్యారు.

ఈ పరిస్థితిపై అంతర్జాతీయ సమాజం విస్మయం వ్యక్తం చేసింది. వెంటనే దాడులు ఆపాలంటూ ఆదేశించింది. కానీ మానవతా దృక్పథంతో రోజుకు ఐదుగంటలు మాత్రమే దాడులకు విరామమిస్తామంటూ రష్యా ప్రకటించింది. ఈ సమయంలోనే ప్రజలు తమ పనులు ముగించుకుని సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలంటూ ఆ దేశాధ్యక్షుడు పుతిన్ తేల్చిచెప్పారు.

ఇప్పటికే ఈ దాడులతో సిరియా ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతుంటే తాజాగా ఆ ప్రభుత్వం రసాయన ఆయుధాల తయారీకి సిద్ధపడుతున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. సాక్షాత్తు అమెరికా నిఘా బృందాలు ఈ విషయాన్ని గుర్తించాయి. కొంతకాలంగా ఐసీస్, మరికొన్ని ఉగ్రవాద మూకల కబంధ హస్తాల్లో చిక్కుకున్న సిరియా చిట్టచివరి ఉగ్రవాదిని కూడా ఏరిపారేయాలన్న దృఢసంకల్పంతో ముందుకెళ్తోంది. ఈ ప్రయత్నంలో ఆ దేశం ఎలాంటి కఠిన నిర్ణయాలకైనా వెనుకాడ్డంలేదు. ఇప్పటికే ఉగ్రమూకలు అధికసంఖ్యలో తలదాచుకున్నారంటూ డమాస్కస్, గౌటా నగరాల్లో క్లోరిన్ వాయువును విడుదల చేసింది. దీంతో కొంతమంది మిలిటెంట్లతో పాటు పెద్దసంఖ్యలో సాధారణ ప్రజలు కూడా మృత్యువాతబడ్డారు. అయినా సిరియా ప్రభుత్వం శాంతించలేదు. నిద్రలోనే వేలాదిమందిని శాశ్వతనిద్రలోకి పంపేసినా ఏరివేత కార్యక్రమాన్ని ఇంకా ఆపలేదు. పైగా రసాయన ఆయుధాల ద్వారా ఒకేసారి పెద్దసంఖ్యలో ఉగ్రవాదుల్ని మట్టుబెట్టేయాలని సిరియా ప్రయత్నాలు మొదలెట్టింది. ఇందుకు అవసరమైన యాసిడ్ రెసిస్టెంట్ టైల్స్, వాల్వ్స్, పైప్‌లు ఇతర సామగ్రిని ఉత్తరకొరియా నుంచి కొనుగోలు చేసినట్లు అమెరికా గుర్తించింది. దీంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం కూడా సిరియాకు బదలీ అయినట్లు తేలింది. రసాయన ఆయుధాల తయారీ పూర్తయితే ఇప్పటికే అంతర్యుద్ధంతో అట్టుడుకిపోతున్న సిరియా స్మశానంగా మారకతప్పదన్న భయం ప్రపంచ దేశాలకు పట్టుకుంది. ఇప్పటికే ఆ దేశానికి రష్యా సహకరిస్తుంటే తాజాగా ఉత్తరకొరియా కూడా వెన్నంటి నిల్చిందన్న వార్తలు ప్రపంచాన్ని భయకంపితుల్ని చేస్తున్నాయి.

దీర్ఘకాలం సిరియన్లు ఉగ్రవాదులంటే భయపడేవారు. కానీ ఇప్పుడు సొంత అధికారులు, సైనిక బలగాలంటే మరింత భయకంపితులౌతున్నారు. ఒకప్పుడు సైన్యం కోసం సిరియన్లు ఎలాంటి త్యాగాలకైనా వెనుకాడేవారు కాదు. ఐసీస్ చెరనుంచి విడిపించిన సిరియన్ల కోసం ప్రభుత్వం శిబిరాలు నిర్వహిస్తోంది. ఇందులో అధికారులు, సైనిక ప్రతినిధులు మహిళల పట్ల క్రూరంగా వ్యవహరిస్తున్నారు. ఆఖరకు వారికి ఆహారం పెట్టాలన్నా ముందుగా తమ కామవాంఛలు తీర్చాల్సిందేనంటూ పట్టుబడుతున్నారు. దీంతో మహిళలు ఈ సహాయ శిబిరాలకు వెళ్ళేందుకు భయపడుతున్నారు. సిరియాలో ప్రస్తుతం మానవతాసహాయం లైంగిక దోపిడీతో ముడిపడి నడుస్తోంది. ఈ విషయం ఐక్యరాజ్య సమితి దృష్టికి రావడంతో అక్కడకు ప్రత్యేక సహాయ బృందాల్ని పంపాలని నిర్ణయించింది.

అంగారకుడిపై సరికొత్త డ్రిల్లింగ్



వాషింగ్టన్: అంగారక గ్రహంపై నాసాకు చెందిన క్యూరియాసిటీ రోవర్ సరికొత్త డ్రిల్లింగ్ టెక్నిక్‌పై తొలి పరీక్ష జరిపిందని అమెరికా అంతరిక్ష ఏజెన్సీ తెలిపింది. లేక్ ఆర్కెడి అనే లక్ష్యంపై ఇది కేవలం ఒక సెంటీమీటరు లోతైన రంధ్రం మాత్రమే చేసిందని, అది పూర్తి స్థాయి శాస్త్రీయ నమూనా సేకరించడానికి ఉపకరించదని నాసా చెప్పింది. అయినప్పటికీ కొత్త విధానం యాంత్రికంగా పనిచేస్తుందని ధృవీకరించడానికి సరిపోతుందని తెలిపింది. మీరు ఇంట్లో ఎలాగైతే డ్రిల్లింగ్ చేస్తారో దాదాపు అదే తీరుగా అంగారక గ్రహంపై మేము డ్రిల్లింగ్ చేస్తున్నాము అని స్టీవెన్ లీ తెలిపారు. కాలిఫోర్నియాలో నాసాకు చెందిన జెట్ ప్రొపల్షన్ ల్యాబరేటరీలో డిప్యూటీ మేనేజర్‌గా లీ వ్యవహరిస్తున్నారు. మానవులు ఎలాంటి ఆలోచన లేకుండా డ్రిల్లింగ్ చేయడంలో సిద్ధహస్తులు. కానీ అసలు అలాంటి పనికి ప్రోగ్రామ్ కాని క్యూరియాసిటీ రోవర్‌తో డ్రిల్లింగ్ చేయించడం సవాల్‌తో కూడుకున్నది అని లీ తెలిపారు. రాతి నమూనాలను పొడి చేయడానికి డ్రిల్ వినియోగానికి వస్తుంది. అలా పొడిగా మారిన రాతి నమూనాలను క్యూరియాసిటీకి చెందిన ల్యాబ్ పరికరాలు సామ్, చెమిన్‌లలో భద్రపరుస్తారు. 2012లో అంగారకుడిపై అడుగుపెట్టిన నాటి నుంచి క్యూరియాసిటీ నమూనాల సేకరణలో భాగంగా డ్రిల్‌ను 15 సార్లు వినియోగించింది. అయితే 2016, డిసెంబర్‌లో డ్రిల్‌కు చెందిన ఒక కీలకమైన భాగం పనిచేయడం మానేసింది. దీంతో సరికొత్త డ్రిల్లింగ్ టెక్నిక్‌ను రంగంలోకి తీసుకువచ్చారు.

ఆరోగ్య తెలంగాణకు 'టాటా' సహకారం

- తెలంగాణ అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం
- ఆరోగ్య సంరక్షణకు వినూత్న చర్యలు చేపడుతోంది
- క్యాన్సర్ నియంత్రణలో సహకారం అందిస్తాం: రతన్ టాటా



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం వినూత్న చర్యలు చేపడుతోందని టాటాగ్రూప్స్ చైర్మన్ రతన్ టాటా ప్రశంసించారు. రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధి నివారణకు తమ గ్రూప్స్ సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. తెలంగాణలో క్యాన్సర్ మహమ్మారి నివారణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, టాటా గ్రూప్స్ మధ్య గురువారం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. శంషాబాద్ విమానాశ్రయం ప్రాంగణంలోని నోవోటెల్ హోటల్‌లో జరిగిన ఒకకార్యక్రమంలో రతన్ టాటా, రాష్ట్ర మంత్రులు కేటీఆర్, లక్ష్మారెడ్డి సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి శాంతికుమారి, టాటా గ్రూప్స్ ట్రస్టీ వెంకటరామణ్ అవగాహన పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా రతన్ టాటా మాట్లాడుతూ, రాష్ట్రాన్ని, దేశాన్ని ఆరోగ్యపరంగా సురక్షితంగా జీవించే ప్రాంతాలుగా మార్చాలని పిలుపునిచ్చారు. వ్యాధులు ప్రబలకముందే నివారణ చర్యలు చేపట్టాలని, అదే విధంగా వ్యాధిని గుర్తించి వెంటనే ప్రాథమిక దశలోనే నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ దేశంలో అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఒకటని ప్రశంసించారు. వైద్య, ఆరోగ్య రంగాలను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న కార్యక్రమాలు, నూతన ఆలోచనలు మంత్రి కేటీఆర్ వివరించారని, ఏదో చేయాలన్న తపన మంత్రి కేటీఆర్‌లో ఉందని రతన్ టాటా కితాబిచ్చారు.

టాటా సహకరిస్తే మరిన్ని చర్యలు:కేటీఆర్

టాటా గ్రూప్స్ సహకరిస్తే రాష్ట్రం వైద్యపరంగా మరింత పురోగతి సాధిస్తుందని , క్యాన్సర్ వైద్యపరంగా మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు వీలవుతుందని ఐటి మంత్రి కేటీఆర్ చెప్పారు. క్యాన్సర్ నియంత్రణకు టాటా సంస్థ ముందుకు రావడం పట్ల కేటీఆర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఏరో స్పేస్, హెలికాప్టర్ విడిభాగాల తయారిలో ఇప్పటికే రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పడ్డాయని, అమెరికా అధ్యక్షుడి హెలికాప్టర్ క్యాబిన్ ఇక్కడే తయారవుతుందని చెప్పారు. టాటా సంస్థకు తెలంగాణకు ఎంతో అనుబంధం ఉందనీ, జంషెడ్‌పూర్ తర్వాత హైదరాబాద్‌లోనే టాటా ప్రాజెక్టులు, గ్రూప్ కంపెనీలు ఇతర సంస్థలు ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తోందన్నారు. ఒక్క టాటా కన్సల్టెన్సీ సంస్థలోనే వేలాది మంది ఐటి ఇంజినీర్లకు ఉపాధి కల్పిస్తోందన్నారు. సీఎం కేసీఆర్ వైద్య, విద్యారంగాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల పక్కనే ఉన్న నల్గొండ జిల్లాలో సురక్షిత నీరు తాగలేని పరిస్థిత ఉన్నందున వేలాది మంది ఫ్లోరోసిస్ బారిన పడి వికలాంగులవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు కోటి ఇళ్లకు సురక్షత నీరు అందించేందుకు మిషన్ భగీరథ కార్యక్రమాన్ని ప్రారంభించామని, రూ. 53,000 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు చెప్పారు.

వైద్యపరంగానైతే ఇప్పటికే ఆస్పత్రు లను పటిష్టపరుస్తున్నామని, 40 కి పైగా దవాఖానాల్లో డయా లసిస్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, 20 ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల మాతా శిశు మరణాల రేటు తగ్గుతోందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేరోగుల సంఖ్య బాగా తగ్గిందన్నారు. ప్రసవించిన తల్లి, బిడ్డల ఆరోగ్యం కోసం రూ. 15,000తో కేసీఆర్ కిట్‌లను ప్రారంభించామని, దీనివల్ల ప్రభుత్వాసుపత్రులకు వచ్చే మహిళల సంఖ్య పెరుగుతోందన్నారు. ఆపరేషన్లు లేని ప్రసవాల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నాయని కేటీ ఆర్ చెప్పారు. ప్రజలకు ఉచిత వ్యాధి నిర్ధారక పరీక్షలను ఏప్రిల్ నెల నుంచి ప్రారంభిస్తున్నట్లు కేటీఆర్ వెల్లడించారు.

హెల్త్ కేర్‌లో తెలంగాణ రోల్ మోడల్: లక్ష్మా రెడ్డి

హెల్త్ కేర్ రంగంలో తెలంగాణ రోల్ మోడల్ అని వైద్య శాఖ మంత్రి చెర్లకోల లక్ష్మారెడ్డి చెప్పారు. క్యాన్సర్ నివారణకై ఇప్పటికే అనేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారి వివరాలను డిజిటలైజేషన్ చేస్తున్నామని, దీనివల్ల వారికి చికిత్సాపరంగా ఉపయోగం ఉంటుందన్నారు. వైద్య శాఖ కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ, రాష్ట్రంలో 60 వేల మందికి పైగా సిబ్బం దితో వైద్యసేవలను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమీ షనర్ వాకాటి కరుణ, వైద్యవిధాన పరిషత్ చైర్మన్ బి శివప్రసాద్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ జయలత, టాటా గ్రూప్స్‌కు చెందిన అధికారులు లక్ష్మణ్ సేతూరాం, శ్రీనివాస్, డాక్టర్ శర్మ, గిరీష్ క్రిష్ణమూర్తితో పాటు పెద్ద సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు.



మేకిన్ ఇండియా సాకారం

శరవేగంగా టాటా ఏరోస్పేస్

- కేంద్రమంత్రి నిర్మాలా సీతారామన్ వెల్లడి

హైదరాబాద్ , ఆంధ్రప్రభ: దేశం మేకిన్ ఇండియాగా ఎదగాలన్న ప్రధాని నరేంద్రమోడి కల నెరవేరుతోందని కేంద్ర రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. హైదరాబాద్ సమీపంలోని ఆదిభట్ల వద్ద తెలంగాణ రాష్ట్ర మౌళిక సదుపాయాల సంస్థ అధ్వర్యంలోని వైమానిక్ సెజ్‌లో టాటా బోయింగ్ ఏరోస్పేస్ నిర్మించిన వైమానిక విడిభాగాలు, హెలికాప్టర్ల తయారీ పరిశ్రమకు కేంద్రమంత్రి ప్రారంభోత్సవం చేశారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమ శాఖల మంత్రి కేటీఆర్, టాటా సన్స్ ఎమిరిటీస్ ఛైర్మెన్ రతన్ టాటా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్రమంత్రి సీతారామన్ మాట్లాడుతూ అతితక్కువ సమయంలో మేక్ ఇన్ ఇండియా పట్ల తమ నిబద్ధతను చాటుతూ టాటా బోయింగ్ సంస్థలు ముందడుగు వేయటంతోపాటుగా రక్షణ రంగంలో భారీ పెట్టుబడులు పెట్టిన ఈ రెండు సంస్థలను తాను అభినందిస్తున్నట్టు తెలిపారు. అత్యాధునిక రక్షణల వేదికల తయారీ ,అతిక్లిష్టమైన అంతర్జాతీయ సరఫరా చైన్‌తో వాటిని అనుసంధానించడం ద్వారా మన విమానయాన రంగం సాంకేతికతను సొంతం చేసుకుందన్నారు. అంతేకాకుండా విమాన యాన ఉత్పత్తుల్లో అంతర్జాతీయ ఎగుమతిదారుగా నిలవగలుగుతున్నట్టు వెల్లడించారు.ఆదిభట్లలో జీరో డిఫెక్ట్‌తో హెలికాప్టర్ల తయారీ జరుగుతుందని అమెరికా సంస్థ వెల్లడించిందన్నారు. అపాచి హెలికాప్టర్లను అమెరికా సైన్యం ఎక్కువగా వాడుతుందన్నారు. యుద్ధ సమయాల్లో ఈ హెలికాప్టర్లు మల్టీ కంబాట్ రోల్స్ ప్లే చేస్తాయన్నారు. రోబోట్లు తయారు చేస్తే లోపాలు ఉండవన్నారు. అదే తరహాలో ఎటువంటి లోపాలు లేని హెలికాప్టర్లు ఇక్కడ నిర్మిస్తున్నారన్నారు. ఆదిభట్లలో ఉన్న సౌకర్యాలు ఖచ్చితత్వాన్ని ప్రదర్శిస్తున్నాయన్నారు. అత్యంత నైపుణ్యం కలిగిన మానవ శక్తితోనూ లోపాలు లేని హెలికాప్టర్లు తయారు చేయవచ్చని ఆదిభట్ల యూనిట్ తెలియచేస్తుండటం గర్వకారణం అన్నారు. ఆదిభట్ల రక్షణ ఉత్పత్తుల ప్రాజెక్టు నిర్ణీతసమయానికే పూర్తి చేశారన్నారు. 2016 జూన్‌లో అప్పటి రక్షణ శాఖమంత్రి మనోహర్ పారికర్ ఈ యూనిట్‌కు శంకుస్థాపన చేసినట్ట గుర్తు చేశారు. గడువుకంటే ఎంతో ముందుగానే ఉత్పత్తులను డెలివరీ చేస్తుండటం ఈ ప్రాజెక్టును ఎంత పకడ్బందీగా నిర్వహిస్తున్నారన్న దానికి నిదర్శనం అని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేంద్ర రక్షణ శాఖమంత్రికి విజ్ఞప్తి చేశారు. పారిశ్రామిక అభివృద్ధికి అన్నిరకాల అనుకూలతలు ఉన్న ఈ ప్రాంతానికి డిఫెన్స్ క్లస్టర్ కావాలన్నారు . తెలంగాణ ప్రభుత్వ పారిశ్రామిక విధానాల అనుకూలత వల్ల ఇప్పటికే బోయింగ్‌తోపాటు జిఇ, పర్‌బస్, యుటిసీ, సీఎఫ్ఎం, వంటి ఎన్నో ప్రతిష్టాత్మక సంస్థలు ఇక్కడికి వచ్చాయన్నారు. ఈజ్‌ఆఫ్ డూయింగ్‌లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. పారిశ్రామిక రంగానికి హైదరాబాద్ సురక్షిత నగరం అని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.బోయింగ్ డిఫెన్స్ స్పేస్ సెక్యూరిటీ సీఈవో లెన్నక్రేట్ , బోయింగ్ ఇండియా ప్రెసిడెంట్ ప్రత్యూష్‌కుమార్ ,టాటా సన్స్ డిఫెన్స్ ఏరోస్పేష్ అధ్యక్షుడు బెన్మల్ అగర్వాల్ , టీఏఎస్ఎల్ సీఈవో సుక్రాన్ సింగ్ తదితరులు మాట్లాడుతూ భారత్‌లో బోయింగ్ భవిష్యత్ భాగస్వామ్య ప్రయాణ ప్రారంభానికి టీబీఏఎల్ సూచిక అన్నారు. టాటా బోయింగ్ భాగస్వామ్య ఇంజనీరింగ్ ప్రయాణంలో ఇది అతిముఖ్యమైన మైలురాయిగా పేర్కొన్నారు. అంతకు ముందు టాటా బోయింగ్ ఏరోస్పేస్ ఫెసిలిటీ సెంటర్‌కు రతన్ టాటా ప్రారంబోత్సవం చేశారు. 13 ఎకరాల విస్తీర్ణంలో రూ.200కోట్లతో నిర్మించిన ఈ యూనిట్ ద్వార ఏహెచ్-64 ఆపాచి హెలికాప్టర్ల ప్రధాన విడిభాగాలు ఉత్పత్త కానున్నాయి. ఈ యూనిట్ ద్వారా సుమారు 350 మందికి ఉపాది అవకాశాలు కలుగనున్నాయి.ఈ కార్య క్రమంలో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్ ,ఎంపీలు కొండా విశ్వేశ్వరరెడ్డి, బూర నర్సయ్య గౌడ్ , ఎమ్మెల్యేలు టి.కృష్ణారెడ్డి, ఎం.కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌గా హైదరాబాద్: మంత్రి కేటీఆర్

ప్రధానిని అలా అనొచ్చా?

- కేసీఆర్ అలా మాట్లాడటం తగదు
- రాకూడదనుకుంటూనే వచ్చాను
- రక్షణశాఖ మంత్రి నిర్మలాసీతారామన్



హై దరాబాద్, ఆంధ్రప్రభ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ముఖ్య మంత్రి కేసీఆర్ ఏకవచన సంభోదన పట్ల కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అభ్యంతరం వ్యక్త చేశారు. ఈ వ్యాఖ్యలపై మంత్రి కేటీఆర్ తనకు వివరణ ఇచ్చిన తరువాతనే హైదరాబాద్‌లో టాటా బోయింగ్ ఏరో స్పేస్ కార్యక్రమనికి హాజరయ్యానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికిరావాలా? వద్దా? అన్న సందిగ్ధంలోపడ్డా నని, ఎయిర్‌పోర్టులో ఉండగా ఒక సారి... ఆతర్వాత హైదరాబాద్‌లో వేదికమీద మరోకసారి కేటీఆర్ తనతో ఈ విషయంపై మాట్లాడారని ఆమె తెలిపారు. మోదీపై ఉద్దేశ పూర్వకంగా కేసీఆర్ వ్యాఖ్యలు చేయలేదని, ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ, ఫ్లోలో పొరపాటున నోరు జారారని కేటీఆర్ తనకు వివరణ ఇచ్చారని తెలిపారు. ఈ విషయంపై కేటీఆర్ తనకు ఫోన్‌లో పూర్తి వివరణ ఇచ్చిన తరువాతనే సంతృప్తి చెంది హైదరాబాద్‌కు వచ్చానని ఆమె స్పష్టం చేశారు.

గురువారం సాయంత్రం నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో జరిగిన బంగారు లక్ష్మణ్ నాలుగవ వర్ధంత సభలో కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ పాల్గొ న్నారు. అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆమె మాట్లాడుతూ, రాజకీయాల్లో విలువలు కాపాడాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందని అన్నారు. ఉన్నత పదవుల్లో ఉన్న వారు మరింతగా జాగ్రత్తగా మాట్లాడాల్సి ఉంటుందన్నారు. 125 కోట్ల మంది ప్రజలకు ప్రధానిగా ఉన్న నరేంద్రమోదీపై సిఎం కేసీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. ఒక వేళ పొరపాటున కేసీఆర్ నోరు జారి మాట్లాడితే... వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పి ఉండాల్సిందన్నారు. కానీ కేసీఆర్ ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటనా చేయలేదన్నారు. ఏరో స్పేస్ రంగంలో టాటా బోయింగ్ కంపెనీతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఒప్పంద కార్య క్రమా నికి కేంద్ర రక్షణ శాఖ మంత్రిగా హాజరు కావాలా? వద్దా? అని కొంత సేపు సందేహించానన్నారు. ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేసిందుకుగానూ ఈ కార్యక్రమానికి హాజరుకావాలంటే తన మనస్సు ఎంత మాత్రం అంగీకరించలేదన్నారు. సిఎం కేసీఆర్ పక్షాన కేటీఆర్ ఇచ్చిన వివరణకు సంతృప్తి చెందిన మీదటనే మేకిన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పాల్గొనాల్సి వచ్చిందన్నారు. నగరానికి వచ్చిన తరువాత మంత్రి కేటీ ఆర్ తన వద్దకు వచ్చి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మరింతగా క్లారిటీ ఇచ్చారన్నారు. ఏదేమైనప్పటికీ ప్రధానిని తక్కువగా చేసి మాట్లాడితే దేశ ప్రజలందరిని అవమాన పరిచినట్లేనని అన్నారు. కీలక పదవుల్లో ఉన్న వారు... రాజకీయంగానీ, ప్రభుత్వపరంగానీ ఎదుటి వారిపై వ్యాఖ్యలు చేసే సమయంలో హుందా తనం పాటిం చాలని సూచించారు. అప్పుడే ప్రజల్లో మరింత గౌరవం పెరుగుతుందన్నారు.


కేటుగాళ్ల ఆస్తులు జప్తు!

(మొదటిపేజీ తరువాయి)

ఉండదు. జప్తుచేసిన ఆస్తుల నిర్వహణకు ప్రత్యేక అడ్మినిస్ట్రేటర్‌ను నియమించి వాటిని అమ్మి అప్పుల కింద జమకడతారు. అలాగేఎగవేతదారులకు చట్టపరంగా తన వాదనను వినిపించుకునేందుకు పూర్తి అవకాశం కల్పిస్తారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చట్టాలకు ఉపక్రమించింది. ప్రత్యేక కోర్టు నోటీసులకు స్పందించకుంటే వారిని పరారీలో ఉన్న ఆర్థిక నేరగాళ్లుగా ప్రకటిస్తామని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. దేశంలోని, విదేశాల్లోని ఆస్తులు, బినామీ ఆస్తులు స్వాధీనం చేసుకునేలా చట్టం తీసుకురానున్నామని, ఇందుకోసం ప్రపంచదేశాల సహకారం కూడా కోరుతామని చెప్పారు. చట్టాలను అవహేళన చేసే వ్యక్తులను చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. దీంతో పాటు నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ బిల్లుకు కూడా కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలిపింది. చార్టర్డ్ అకౌంటెంట్లను నియం త్రించే ఉద్దేశంతో ఈ బిల్లును తయారుచేశారు. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే దీని ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యారు. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ దీనిని రూపొందించింది. అకౌంటంట్లతోపాటు, లిస్టెడ్, అన్‌లిస్టెడ్ కంపెనీ వ్యవహారాలను ఈ బిల్లు ద్వారా నియంత్రించనున్నారు. నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ స్వతంత్ర నియంత్రణ సంస్థగా ఆడిటర్లను నియంత్రిం చనుంది. ఈ అథారిటీలో ఓ చైర్‌పర్సన్, ముగ్గురు పూర్తికాల సభ్యులు, ఒక కార్య దర్శి ఉండనున్నారు. విదేశీ పెట్టుబడులు పెరిగిన నేపథ్యంలో ఈ ప్రక్రియలో అంతర్జాతీయ వృత్తి ప్రమాణాలను పాటించేందుకు ఈ అథారిటీని తీసుకువచ్చారు.

బాబ్లీ గేట్లు ఎత్తిన మహారాష్ట్ర

- సుప్రీం ఆదేశాల మేరకే నీటి విడుదల



హైదరాబాద్, ఆంధ్రప్రభ: బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరుచుకున్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్రతి ఏడాది మార్చి1న గేట్లు తెరవాల్సి ఉంటుంది. తాగునీటి అవసరాల కోసం బాబ్లీ నీటిని కిందికి వదలాలి. అందులో భాగంగా తెలంగాణ, మహారాష్ట్ర అధికారుల సమక్షంలో గేట్లు తెరిచారు. బాబ్లీ ప్రాజెక్టులో ప్రస్తుతం 0.04టిఎంసిలు మాత్రమే నిల్వ ఉండగా, దిగువకు వచ్చే నీటి శాతం స్వల్పంగానే ఉండనుంది. నాందేడ్ జిల్లాలోని బాబ్లీ ప్రాంతంలో మహారాష్ట్రప్రభుత్వం 203లో బాబ్లీ ప్రాజెక్టును పూర్తిచేసింది. నిర్మాణ సమయంలో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అనంతరం కేంద్రజలసంఘం ఆధ్వర్యంలో ఇరు రాష్ట్రాలకు ఒప్పందం కుదిరింది. ప్రతి ఏటా జూలై 1న గేట్లు తెరిచి అక్టోబర్ 28న మూసివేయాలని ఆదేశించింది. మార్చి 1న ఒక రోజు 0.6టిఎంసిల నీటిని తాగునీటి అవసరాలకు విడుదల చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను అధికారులు అమలుచేశారు. బాబ్లీలో నీరు లేనందున గేట్లు ఎత్తలేమని ఇటీవల నాందేడ్ అధికారులు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులకు లేఖరాయగా, లెక్కప్రకారం గేట్లు తెరవాల్సిందేనని.. ఎగువ ప్రాజెక్టుల నుండి నీరు తీసుకోవాలని తెలంగాణ అధికారులు ప్రతిలేఖ రాశారు. ఈ నేపథ్యంలో గురువారం అధికారులు గేట్లు తెరిచారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
శుక్రవారం 2 మార్చి 2018

కమల్ రాజకీయం వికసించేనా!



డాక్టర్ పెంటపాటి పుల్లారావు,
రాజకీయ విశ్లేషకులు, న్యూఢిల్లీ
ppr193@gmail.com

సాహసవంతుణ్ణే విజయం వరిస్తుందనేది ఒక పాత సామెత. తమిళ రాజకీయాల్లోకి కమల్ హాసన్ అడుగుపెడుతున్నారు అంటే.. ఆయనొక పెద్ద సవాలును స్వీకరించినట్లు. అంతేకాకుండా అదృష్టం కోసం ఎదురు చూస్తున్నట్లు కూడా. ఐదు దశాబ్దాల సినీ రంగ జీవితంలో ఆయనో దిగ్విజయమైన నటుడిగా పేరు తెచ్చుకున్నారు. దీనికి తోడు ఆయన మంచి వాగ్ధాటి ఉన్నవాడు కూడానూ. ఆయనకు మాస్ లీడర్‌గా పేరు లేకపోయినప్పటికీ, నటుడిగా కమల్‌ను అందరూ అభిమానిస్తారు. ఏ అంశంపైనైనా చక్కగా ప్రసంగిస్తారు. ఆ ప్రసంగం ఏ స్థాయిలో ఉంటుందంటే ఆ అంశంలో తనకు నైపుణ్యం ఉన్నట్లుగా వినేవారికి తోస్తుంది. చాలామంది నటులు మాటల్లో నిజాయితీ కనిపిస్తుంది.. అదే కమల్ హాసన్ విషయానికి వచ్చే సరికి చాలా కచ్చితమైన మనిషనిపిస్తుంది. జయలలిత మరణానంతరం, కమల్ రాజకీయాల గురించి ప్రస్తావిస్తున్నారు. ప్రణాళిక ప్రకారం అడుగులేస్తున్నారు. నేను భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకినని ఆదిలోనే ప్రకటించారాయన. ఈ కారణంగా కేరళ ముఖ్యమంత్రి పినరాయ్ విజయన్ నుంచి ఆయనకు పిలుపందింది. అలాగే, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతోనూ కమల్ సంబంధాలను పెంచుకుంటున్నారు. వారు ముగ్గురూ బీజేపీ వ్యతిరేకులే కావడం దీనికి కారణం. రజనీ కాంత్ బీజేపీ మద్దతుదారయితే తానాయనతో చేయి కలపనని కుండబద్దలు కొట్టారు. ఫిబ్రవరి 22న కమల్ తన పార్టీని ప్రకటించారు. కమల్ వేసిన ప్రతి అడుగు చక్కగా ప్రణాళిక ప్రకారం వేశారు. ఇది మీడియా దృష్టిని ఆకర్షించింది. అదృష్టవశాత్తూ తమిళనాడులో ఎటువంటి రాజకీయంగా ఎటువంటి సంచలనాలూ చోటుచేసుకోకపోవడంతో మీడియా మొత్తం కమల్ వెంటే నడిచింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా మూడేళ్ళ సమయముంది. పార్లమెంటు ఎన్నికలకు ఏడాది గడువుంది. ఆ సమయంలో కమల్ కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటటుంది. అది ఆయన పనితీరు ఎలా ఉందో తెలియజేస్తుంది. ఫిబ్రవరి 22న ప్రణాళికాబద్ధంగా సాగిన కమల్ మొదటి బహిరంగ సభ విజయవంతమైంది.

కమల్‌కు అనుకూలతలు

ఎ) కమల్ హసన్ పరిచయం అవసరం లేని వ్యక్తి. అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ వంటి జాతీయ నాయకుల మద్దతు ఆయనకుంది. ఆశ్చర్యకరంగా ఆయన కాంగ్రెస్ పార్టీని దూరం పెడుతున్నారు. కరుణానిధి, రజనీకాంత్‌లను తన సభకు పిలవడం ద్వారా కమల్ తాను కోపాన్ని, ఈర్ష్యనూ వదులుకుంటున్నానని చెప్పజూశారు. వివిధ నాయకులను కలవడం ద్వారా వారు తనను దూషించకుండా జాగ్రత్త పడ్డారు.

బి) జయలలిత మరణం తమిళనాట ఒక శూన్యతను సృష్టించింది. నటుడిగా కమల్ ఏఐఏడీఎమ్‌కెతో పాటు స్వతంత్ర ఓటర్లను ఆకర్షించడానికి ప్రయత్నించవచ్చు. తమిళనాడులో డజన్ల కొద్దీ పార్టీలున్నాయి. ఈ పార్టీల ఓట్ల నుంచి కొంత చీల్చగలిగితే, కొంతకాలం నెట్టుకువెళ్ళచ్చు.

సి) డీఎంకే, ఏఐఏడీఎంకే పార్టీలు రెండూ రాజకీయ పోరాటంలో అలసిపోయున్నాయి. వరుసగా రెండోసారి ఓటమి పాలయ్యి డీఎంకే కుంగిపోయింది. రెండోసారి అధికారంలోకి వచ్చిన అనంతరం ఏర్పడిన పరిణామాలూ, జయలలిత అస్తమయం ఏఐఏ డీఎంకేను డస్సిపోయేలా చేశాయి. రెండు పార్టీలు కలిసి, మొత్తం ఓట్లలో 50శాతం ఓట్లను సంపాదించుకోగలవు. రెండు పార్టీలూ అత్యంత ధనికమైనవి. ఈ బలంతో అవి కార్యకర్తలను కొనుగోలు చేసి మరీ, ఎన్నికలలో పోరాడగలవు. గడిచిన 50 ఏళ్ళలో ఈ ద్రవిడ పార్టీలే తమిళనాట



మూడో పార్టీకి అవకాశమీయకుండా రాజ్యమేలాయి. ఉన్నా చెప్పుకోదగ్గ సీట్లను సాధించలేకపోతున్నాయి. తాను ద్రవిడుడనని ప్రకటించుకున్న కమల్‌కు ఆ పార్టీలకు చెందిన కొన్ని ఓట్లను సొంతం చేసుకునే అవకాశముంది.

డి) డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు తమిళ రాజకీయాలపై ఆధిపత్యం చెలాయిస్తుండడమే కాక, గత 50 ఏళ్ళుగా అవే ముఖాలు ఓటర్లకు కనిపిస్తున్నాయి. కొత్తగా వచ్చే వారికి ఆ పార్టీలలో టికెట్లు దక్కడం దాదాపూ అసాధ్యం. ఈ క్రమంలో డబ్బుండీ ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశిస్తున్న వారు కమల్ హాసన్ పార్టీలో చేరవచ్చు. డీఎంకే, ఏఐఏ డీఎంకేల్లో ఈ పరిస్థితి కనిపించదు. రాజకీయాల్లోకి వచ్చి, ఎన్నికల్లో పోటీ చేయాలని కోరుకునే ఎవరైనా కమల్ పార్టీలో చేరవచ్చు. పదేళ్ళపాటు అధికారంలో లేని కారణంగా డీఎంకే ఇప్పటికే నీరసించిపోయింది.

ఇ) కమల్ హాసన్ ఎంత తెలివైన వారు అనే అంశంపైనే రానున్న సంవత్సరాలలో పార్టీని తన ఆకర్షణ శక్తినుపయోగించి బలోపేతం చేస్తారు, పోరాట శక్తిగా మలుస్తారనేది ఆధారపడి ఉంది. మిగిలిన అందరు సినీ నటులతో పోలిస్తే కమల్ భిన్నమైన వ్యక్తి. ఆయన ప్రజలను అర్థం చేసుకుంటారు. అంతేకాకుండా కమల్ ఆకర్షణీయమైన రూపమున్న వాడు కూడా కావడం అదనపు అర్హత.

కమల్‌కు ప్రతికూలతలు..

ఎ) డీఎంకే, ఏఐఏ డీఎంకేలను ప్రసన్నం చేసుకోవడానికి కమల్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆ పార్టీలు ఇప్పటికే ఆయనపై రాజకీయంగా దాడి ప్రారంభించాయి. కమల్ హసన్ పార్టీనుద్దేశించి స్టాలిన్.. అలాంటి పార్టీలు కాగితపుపువ్వుల్లాంటివని వ్యాఖ్యానించారు. వాటిని పరిమళం ఉండదు. తమిళనాడులో అవి అదృశ్యమవుతాయన్నారు. కమల్ హాసన్‌ను వంచకుడని ఏఐఏ డీఎంకే అభివర్ణిస్తోంది. అబ్దుల్ కలాం అంటే తనకు ఎనలేని గౌరవమని చెబుతున్న కమల్, ఆయన అంత్యక్రియలకు హాజరుకాలేదు. గడిచిన వారం వరకూ కలాం సంబంధించిన ప్రస్తావన కూడా తేలేదని పార్టీ విమర్శించింది. కమల్ హాసన్ గొప్ప అవకాశవాదని మండిపడింది.

బి) అన్ని పార్టీలూ అవినీతిలో కూరుకుపోయాయనీ, మతపరమైన విశ్వాసాలకు ప్రాధాన్యతనిస్తున్నాయనీ విశ్వనటుడు వ్యాఖ్యానించారు. దీన్ని పట్టుకుని ప్రధాన పార్టీలన్నీ ఆయన్ను లక్ష్యంగా చేసుకుని విమర్శల వర్షం కురిపిస్తాయి. ఓ విషయంలో కమల్ సమాధానం చెప్పుకోవాల్సుంటుంది. పన్ను ఎగవేతదారులకు స్వర్గధామమైన కేమన్ ద్వీపంలో కమల్ తన వెబ్‌సైట్‌ను ఎందుకు నమోదు చేసుకున్నదీ అనే అంశంపై అవి నిలదీస్తే.. సమాధానం ఇవ్వక తప్పదు. ఇప్పటికే ఆయనపై ఆర్థికపరమైన ఆరోపణలున్నాయి.

సి) రాజకీయాల్లో రజనీకాంత్ ప్రవేశిస్తే పెను తుపాను చెలరేగడం ఖాయం. ఇది కమల్ హాసన్‌పై ప్రభావాన్ని చూపుతుంది. కమల్ కంటే రజనీ కచ్చితంగా పెద్ద స్థాయి ఉన్నవాడు. రజనీ రాజకీయ రంగ ప్రవేశం తరవాత పరిణామాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే. రజనీకాంత్‌కు ఆయన ఇప్పటికే తలుపులు మూసేశారు. రాజకీయాల్లో ఇలాంటి చర్యలు తెలివైనవి కావు. ఎవరితోనైనా జట్టు కట్టేందుకు ఎప్పుడూ సిద్ధంగానే ఉండాలి.

డి) కమల్ హాసన్ అంశంలో ఏం జరుగుతుందో చెప్పడానికి ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఉదాహరణగా చూపవచ్చు. ఏళ్ళతరబడి కేజ్రీవాల్‌కు గొప్ప పోరాట యోధుడిగా గుర్తింపుంది. ప్రజా సంబంధ అంశాలలో కమల్ ఎప్పుడూ పోరాడింది లేదు. ఇద్దరి వ్యక్తిత్వాలలోనూ, నేపథ్యంలోనూ చాలా భేదముంది. ఇద్దరి రంగాలూ, కేజ్రీవాల్‌ను కమల్ హాస్‌తో పోల్చలేం.

ఇ) కొత్త పార్టీలను తమిళనాడు అంత తొందరగా ఆదరించదు. ఒక ప్రధాన పార్టీతో కలిస్తే తప్ప ఈ పార్టీలు విజయాలను సాధించలేవు. డాక్టర్ రామ్‌దాస్ పార్టీ డీఎమ్‌కే లేదా ఏఐఏ డీఎంకేలతో కలిసి పోటీచేసినప్పుడు మంచి ఫలితాలను పొందగలిగింది. సొంతంగా పోటీ చేసినప్పుడు ఘోరమైన వైఫల్యాలను నమోదు చేసింది. కెప్టెన్ విజయకాంత్ పార్టీ ఏఐఏ డీఎంకేతో కలిసినప్పుడు సత్ఫలితాలను పొందింది. ప్రధాన పార్టీలతో కలిసి పోటీచేయడమే తమిళనాడులో కొత్త పార్టీల విజయం వెనుక రహస్యం. ప్రస్తుతం డీఎంకే ఓట్ల శాతం కూడా 25శాతానికి తగ్గిపోయింది. కమల్ హాసన్ అందరు రాజకీయవేత్తలను ఖండించడం ద్వారా ఒంటరిగా మిగిలిపోయారు. అదే ఆయన చేసిన పెద్ద తప్పు. అంటే ఫలితాన్ని మేధావులు ఊహించవచ్చు.

ముగింపు...

రాజకీయ రంగంలో కమల్ హాసన్ ప్రవేశం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ఒక ఉదాహరణగా నిలుస్తోంది. ప్రస్తుతం ఏపీలో ప్రధాన పార్టీలు రెండున్నాయి. పవన్ కల్యాణ్ వంటి అనేకమంది కమల్ నుంచి స్ఫూర్తి పొంది, ధైర్యాన్ని కూడగట్టుకుని రాజకీయాల్లో ప్రవేశించాలి. కొత్త పార్టీల అనుభవాన్ని అంచనా వేయడం దుర్లభం. కమల్ హాసన్ విషయానికొచ్చే సరికి కొత్త పనులు చేయడం, వివిధ ప్రాంతాలను సందర్శించడం వంటి వైఖరితో మీడియా దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా ప్రస్తుతానికి ఇలాంటి చిట్కాలను అనుసరించవచ్చు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ కూడా దీన్నే అనుసరించాల్సుంది. గాలి పీల్చడంపైనే మనిషి ఎంతకాలం ఆధారపడగలడు? బతకడానికి తిండి కావాలి. కమల్ హాసన్‌కు కూడా ఎవరి మద్దతు దృఢంగా లభిస్తుందో చూడాల్సుంది. దేశంలోనూ, తమిళనాడులోనూ బుర్రలేని అవినీతిరులైన ఓటర్లను కమల్ హాసన్ ప్రసన్నం చేసుకోవాల్సి ఉంది. వారికి డబ్బుపై ఆపేక్ష తప్ప ఎటువంటి విశ్వాసమూ ఉండదు.

విజయాలు సాధించిన ప్రతి వ్యక్తికీ రాజకీయాలపైనే అత్యధిక మోజుంటుంది. అథ్లెట్, యాక్టర్, బిజినెస్ టైకూన్.. ఇలా ఎవరైనా అద్భుత విజయాలు సాధిస్తే చాలదు.. రాజకీయాల్లోనూ విజయసోపానం అధివసించాలనుకుంటారు. ఎందుకంటే భారత్‌లో అధికారానికి భయపడినట్లుగానూ, గౌరవం లభించినట్లుగానూ ఏ రంగంలోనూ సాధ్యం కాదు. కమల్ హాసన్ కూడా ఇప్పుడీ పోటీలో చేరారు. రాజకీయాల్లో తానూ ఏదో సాధించాలనుకుంటున్నారు. ప్రజాసేవ చేయాలనుకుంటున్నారు. నటుడిగా కమల్‌కు తిరుగులేదు. జార్జి బెర్నార్డ్ షా ప్రవచించినట్లుగా రాజకీయాలు దుష్టుడి ఆఖరి మజిలీ అనే సూత్రం కమల్‌కు నప్పదని భావిద్దాం.

హెచ్చరికా? సంకేతమా?

ఈశాన్య రాష్ట్రాల్లో ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ధీమాగా చెబుతున్నప్పటికీ, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పరిస్థితి అంత తేలిగ్గా లేదన్న విషయం రాజస్థాన్, మధ్యప్రదేశ్ ఉప ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఇవి ప్రజల తాజా నాడికి సంకేతమా? లేక పాలక పక్షానికి హెచ్చరికా అన్న చర్చ మొదలైంది. ఆర్థిక వ్యవస్థ క్రమంగా పుంజుకుంటోందనీ, ఈ ఏడాది వృద్ధిరేటు 7.6 శాతం ఉండవచ్చనీ మూడీస్ రేటింగ్ సంస్థ అంచనా వేసిందని ప్రభుత్వం పేర్కొంటోంది. లోక్‌సభకూ, అసెంబ్లీలకూ ఒకేసారి ఎన్నికల నిర్వహణకు గల అవకాశాలపై బుధవారం తమ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి ఢిల్లీలో చర్చించారు. ప్రతికూలతలు ఏమీ లేవని చెప్పుకుని అతి ధీమా కనబర్చడం బీజేపీకి కొత్త కాదు. వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు భారత్ వెలిగిపోతోందనే నినాదాన్ని ఇచ్చారు. అంతా బాగానే ఉందనే అభిప్రాయాన్ని కలిగించేందుకు ప్రయత్నించారు. ఈ రెండు నినాదాల కారణంగా ముందస్తు ఎన్నికలకు వెళ్ళడం, 2004లో ఘోర పరాజయం పాలవడం ఇంకా స్మృతి పథంలోనే ఉంది. ప్రతిపక్షాలకు సరైన నాయకత్వం లేదన్న కమలనాథుల ధీమా నిరాధారం కాకపోవచ్చు. కాంగ్రెస్‌కి నేతృత్వం వహిస్తున్న రాహుల్ గాంధీ యూపీఏ కూటమికి సారథ్యం వహించలేడన్న బలమైన నమ్మకం కమలనాథుల్లో ఉంది. యూపీఏలో గతంలో ప్రధాన భాగస్వామ్య పక్షాలుగా ఉన్న శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ, తమిళనాడుకు చెందిన డిఎంకె, బీహార్‌కి చెందిన రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) వంటి పార్టీల వైఖరులు స్పష్టంగా లేవు. సోనియాగాంధీ ప్రధానమంత్రి పదవిని చేపట్టేందుకు ముందుకు రావడం వల్లనే తాను కాంగ్రెస్ నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని శరద్‌పవార్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాత విషయాన్నే కొత్తగా చెప్పారు. నర్మగర్భంగా రాహుల్ నేతృత్వంలోని యూపీఏ కూటమిలో చేరడానికి ఆయన తన విముఖతను తెలిపినట్టయింది. డిఎంకెకు బీజేపీతో జత కట్టే ఉద్దేశం లేకపోయినా, కాంగ్రెస్ గొడుగు కింద కొనసాగడానికి సంసిద్ధంగా ఉన్నట్టులేదు. ఆర్‌జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ ప్రస్తుతం జైలులో ఉన్నారు. పార్టీ నేతృత్వాన్ని ఆయన కుమారుడు, మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వి చేపట్టవచ్చు. అతడి వైఖరి ఏమిటో ఇదమిత్థంగా తెలియదు. యూపీఏ కూటమి యథాతథంగా కొనసాగే అవకాశం ఉంటుందని ఎవరూ అనుకోవడం లేదు. కమలనాథుల ధైర్యానికి ప్రధాన కారణం ఇదే. ఈ సారి ఎన్నికల్లో మోడీ సమ్మోహన శక్తి గత ఎన్నికల్లో మాదిరి ఉండబోదన్న సంకేతాలను ఉప ఎన్నికల ఫలితాల ఇస్తున్నాయి. రాజస్థాన్‌లో మూడు సీట్లనూ, మధ్య ప్రదేశ్‌లో రెండు స్థానాలను గెల్చినంత మాత్రాన కాంగ్రెస్ బాగా పుంజుకుందని అనుకోవడానికి లేదు. ఈ ఐదు సీట్లలో మధ్యప్రదేశ్‌కి చెందిన రెండు స్థానాలూ కాంగ్రెస్‌వే. అవి కూడా కాంగ్రెస్ నాయకుడు, మాజీ కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోనివి. రాజస్థాన్ ఉప ఎన్నికల్లో రెండు లోక్‌సభ సీట్లనూ, ఒక అసెంబ్లీ స్థానాన్ని గెలవడం వెనక కుల రాజకీయాలు బాగా పనిచేశాయని బీజేపీ ఆరోపిస్తోంది. అది అసత్యం కాకపోవచ్చు. పెద్దనోట్ల రద్దు వల్ల, జిఎస్‌టీని బలవంతంగా ప్రవేశపెట్టడం వల్ల ప్రజల్లో తలెత్తిన అసంతృప్తి ఈ ఫలితాల్లో కనిపించిందనేది కాంగ్రెస్ వాదన. తాము తెచ్చిన సంస్కరణల వల్ల తొలి దశలో ఇబ్బందులు ఎదురైన మాట వాస్తవమే అయినా ఇప్పుడంతా సర్దుకుందని కమలనాథులు అంటున్నారు. అవినీతి రహిత పాలనను అందిస్తున్నామని పదే పదే చెప్పుకుంటున్న కమలనాథులకు పిఎన్‌బి, రొటోమాక్ కుంభకోణాలు వెలుగు చూడటం మింగుడు పడటం లేదు. ఈ రెండు కుంభకోణాల్లో వేల కోట్ల రూపాయిల మేరకు బ్యాంకులకు నష్టం కలగడం వల్ల ప్రజల్లో ఆలోచనలు ప్రారంభమయ్యాయి. తాము దాచుకున్న డబ్బుకి బ్యాంకులు గ్యారంటీ ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్నాయనే అభిప్రాయం ప్రజల్లో క్రమంగా నెలకొంటోంది. ప్రధానమంత్రి మాటలకీ, ప్రభుత్వం చేతలకీ చాలా తేడా కనిపిస్తోందనే అభిప్రాయం కూడా బలపడుతోంది.

మధ్యప్రదేశ్, రాజస్థాన్ రెండూ బీజేపీకి చాలా ముఖ్యమైన రాష్ట్రాలు. ముఖ్యమంత్రులుగా ఉన్న శివరాజ్ సింగ్ చౌహాన్, వసుంధర రాజే ఇద్దరూ పార్టీలో దాదాపు మోడీతో సమానమైన సీనియారిటీ ఉన్నవారే. శివరాజ్ సింగ్ చౌహాన్ రైతులకు కేంద్రం ఇచ్చే మద్దతు ధరకు తోడుగా ప్రవేశపెట్టిన బోనస్ పథకం గురించి ప్రధాని, కేంద్ర మంత్రులూ అదే పనిగా ప్రశంసించడం, కేంద్రం కూడా ఇలాంటి పథకాన్ని తీసుకుని రావడానికి యోచిస్తోందని వార్తలు వచ్చాయి. బోనస్ పథకం కొత్తదేమీ కాదు, అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో ధాన్యానికి కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు బోనస్‌ను పూర్వపు ప్రభుత్వాలు చెల్లించాయి. మధ్యప్రదేశ్ బీజేపీలో వర్గ పోరాటం ఇప్పటికీ సాగుతోంది. కేంద్ర మంత్రి ఉమాభారతి వర్గం ఇప్పటికీ చురుకుగానే పని చేస్తోంది. మరోవంక వ్యాపం కుంభకోణంతో తమ ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని ముఖ్యమంత్రి చౌహాన్ బల్లగుద్ది చెబుతున్నా, ఈ కేసులో సాక్ష్యాలు చెప్పిన వారు అకాల, అనుమానాస్పద మరణాల పాలు కావడం వల్ల చౌహాన్ ప్రతిష్ఠ మసక బారింది. రాజస్థాన్‌లో బీజేపీ, కాంగ్రెస్ వంతుల వారీగా అధికారంలోకి వస్తుంటాయి. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ వంతు రావచ్చు. మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ప్రతీసారి కాంగ్రెస్‌కి నాయకత్వం వహించేవారు. రాహుల్ హయాంలో ఇప్పుడు సచిన్ పైలట్‌కి ప్రాధాన్యం లభిస్తోంది. యువ నాయకత్వంలో ముందుకు వస్తున్న కాంగ్రెస్‌కి ఓ అవకాశం ఇవ్వాలని ప్రజలు నిర్ణయానికి వచ్చి ఉండవచ్చు. మోడీ హవా గత ఎన్నికల్లో మాదిరిగా యథాతథంగా కొనసాగుతుంటే స్థానిక పరిస్థితుల ప్రభావం ఉండదు. అంతిమంగా ఈసారి మోడీ హవా అంతగా ఉండకపోవచ్చనీ, గెలుపోటములకు స్థానిక పరిస్థితులే కారణంగా నిలవవచ్చన్న సంకేతాలను ఉప ఎన్నికల ఫలితాలు ఇస్తున్నాయి.

జగతి వీడిన జయేంద్ర సరస్వతి

సనాతన హిందూ ధార్మిక జ్యోతి
మానవ సేవలోనే మహా శివుని దర్శించిన యతి
కులమతాల్ని గణించని మానవతా మూర్తి
ఆలయాలనే కాక, విద్యా, వైద్యాలయాల్ని
పోషించిన పీఠాధిపతి
అయోధ్యలో మత సమోధ్య కోసం యత్నించిన సమవర్తి
కష్టసుఖాలను, కక్షసాధింపులను లక్ష్యపెట్టని దృఢమతి
జాతి జాగృతి కై రగిలిన నిత్యస్ఫూర్తి.. నిజమైన వేదాంతి.
ప్రణతి ప్రణతి జయేంద్ర సరస్వతీ ప్రణతి ప్రణతి!
అఖండ జ్యోతిగా వెలుగును నీ దీప్తి.

-డా. డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీపురం

మంచి మాట

వృద్ధాప్యం నాటికి ఇప్పుడే ఆదా చెయ్యి.
ఉదయం ఎన్నడూ సాయంత్రం దాకా
కొనసాగదు కదా.


-బెంజమిన్ ఫ్రాంక్లిన్

అవినీతి అంటని రంగానికి సలాం

పామరజనం, పాలిత జనం అనే వివక్షకు ఏమాత్రం తేడా లేని సామాజిక న్యాయం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బలీయంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైంది. ఎన్నికల వేళ ప్రజాభీష్టాన్ని గౌరవించని ప్రభుత్వాలు, పార్టీలు భవిష్యత్తులో మన్నన పొందే దిశకు ఎదగబోవు. ప్రజాస్వామిక దేశంలో ప్రజల మనోభావాలకు వారిచ్చే తీర్పును తప్పుపట్టే హక్కు ఏ పార్టీలకూ, ప్రభుత్వాలకు లేదు. ఓటు ప్రజల అంతర్గత భావాలకు ప్రతీకని పార్టీల నాయకులు, ప్రభుత్వాలలో ఇదివరకు ఉన్నత పదవులను అనుభవించిన నాయకులు ప్రజాభిప్రాయానికి విలువనిచ్చే దిశగా పయనించాలి. అదే ప్రజాస్వామిక మనుగడకు కీలకాంశం.

ఎన్నికలలో వార్డుల వారీగా ఓట్లు బేరీజు వేసుకొని భవిష్యత్తులో వారి మనుగడకు అవరోధాలు కల్పించడం, ప్రజాస్వామిక దేశంలో అలాంటి వారి ఉన్నతికి ప్రతిబంధకమే అవుతుంది కానీ, ప్రజల పరంగా ఏమాత్రం మద్దతు లభించని వైనం పొడగట్టి, లబ్ధ ప్రతిష్ఠులను లుబ్ధప్రతిష్ఠులుగా మార్చే ఆంతరంగిక భావం పొటమరిల్లుతోంది. ప్రజలు కాదనుకున్న ఏ నాయకుడు పదవిలో మనలేడు.

అంగబలం, ఆర్థికబలం, కుల బలం కేవలం మంచుపట్టి విడిపోయినంతగా ప్రదర్శితమవుతుందే కానీ, నాయకుని సచ్ఛీలతకు చేదోడు వాదోడుకాబోవు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా అంతర్గతంగా జనబాహుళ్య అంతరంగాలదే పైచేయిగా ఉంటుంది.



నాయకత్వాన్ని స్వతహాగా జనం కోరుకోరు. జనం బాగోగుల్ని కోరుకునే నాయకుని కోసం అన్వేషిస్తారు. అలాంటి నాయకత్వం కోసం జనం మనలో ముద్రపడిన అంతరంగాన్ని ఓటు ద్వారా ప్రదర్శితం చేసి తీర్పునిస్తారు. ప్రజల్లో నేడు రాజకీయ చైతన్యం మసకబారినట్లు కొట్టొచ్చినట్లు కనపడుతోంది. తనను తప్పితే జనం మరొకరినే అనే మూఢ విశ్వాసం రాజకీయ అంధత్వానికి మారుపేరుగా మారుతోంది.

ఎన్నికల కమిషన్లు ఎంత పకడ్బందీగా ఓట్లకు నోట్లు కట్టడి చేసినా, ఏదో విధంగా పార్టీల నాయకులు జనానికి నోట్లు పంపకానికి, మద్యం పంపకానికి, మరెన్నో ప్రలోభాల వేపు దృష్టి మళ్లించి, ఇబ్బడి ముబ్బడిగా జనం చేతుల్లోకి ధనం, మద్యం, మరెన్నో సదుపాయల కల్పనా వాగ్దానాలు చేసినా జనం అంతిమతీర్పు లక్షిత నాయకుడికి విజయం చేకూర్చుతోంది.

మరి ఈ ధన ప్రవాహం, మద్యాన్ని ఏరులై పారించడం, వాగ్దానాల పరంపర నిరుపయోగమని పోటీచేస్తున్న ఏ నాయకుడు గుర్తించడు. కోడి పందెంలో గెలుపు ఒక్క కోడిదేననే యదార్థాన్ని ఏమాత్రం గుర్తించరు. ఎవరి ఆలోచనలు వారివి. గెలుపు తమదేననే నికర నిర్ణయం.

విజయపథం సాధించిన నాయకుల వైఖరి ఏంటి?!

ప్రజల సేవకై అంకితం కావాలనే నాయకులు లేకపోలేరు. పరమార్థం ప్రజాధనాన్ని దొడ్డిదారిలో మళ్లించి, స్వార్థంతో స్వాహా చేసే నాయకులకు కొదవలేదు. ప్రజాహితం ప్రకటనలు గుప్పిస్తూ తన హితంకోసం ఒనగూడేదెంత అని మల్లగుల్లాలు పడే కక్కుర్తి నాయకుల ఆపసోపాలు అంతా ఇంతా కాదు. పార్టీని ప్రభుత్వాన్ని దీక్షాదక్షతలతో ముందుకు సాగించి, భవిష్యత్తును తమవైపు మలచుకోవాలనే నాయకుల ధృఢ సంకల్పానికి అదే పార్టీలో, ప్రభుత్వంలో మాకేంటనే, పాలక నేతల్ని ప్రశ్నించినా, గద్దించినా ప్రయోజనం ఆశించినంతగా లేకపోవడం వల్ల ప్రభుత్వాల మనుగడ భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారుతున్నాయి.

ఈ విషయంగా కీలకనేతల ఆంతర్యంలోని మనోభావాలు బోలెడన్ని ఉన్నాయి. సంపాదించుకోకపోతే భవిష్యత్తు ఎన్నికల్లో నెగ్గుకు రావడం సులభ సాధ్యం కాదని, అంతో ఇంతో ఉన్న చేతి చమురును ఇలా జనాలకు అందించి బికారులు కావడం ఏమాత్రం సరికాదని వారి భవిష్యత్తు ఆలోచన.

ప్రభుత్వ పరంగా అగ్గిలా నిగ్గుతేల్చి ప్రజాసేవకు పూనుకోవాలి

ఏ రంగంలోనైనా నీతులు కోటాను కోట్లు చెప్పడం సులభతరం. ఆచరణలోనే అసాధ్యం. పాలక అధినేతలు పదే పదే హెచ్చరించే హితవులు అప్పటికప్పుడు సముచితంగాను, హితంగానూ, స్వార్థ రహితంగానూ ఉంటాయి. అధినాయకుల పలుకులకు అధిక్షేపం చెప్పలేని పాలకవర్గ మంత్రులు, ప్రభుత్వంలోని యావన్మంది యంత్రాంగం విన్నట్టే విని, అవును అలాగే ఉండి పేరు తెచ్చుకోవాలని ఆశిసిస్తారు. ఆచరణలో కష్టసాధ్యమై కకావికలమవుతుంటారు. వారి ఆలోచనలన్నీ వచ్చే ఎన్నికల్లో వ్యయం గురించి, ఎలా తిరిగి విజయం సాధించాలనే ఆలోచనలు ముప్పిరిగొని ఆత్మ ఆదేశానుసారం పాలనారంగంలో పవిత్రతకు మకిలి తగలకుండా తానొప్పక ఇతరులను బాధించకుండా తమదైన శైలిలో ముప్పుతిప్పలు పెడుతుంటారు.

120 కోట్ల భారత్‌లో పులుకడిగిన ముత్యాలకు సలాం

దేశంలో కానీ, రాష్ట్రాలలో కానీ అవినీతి పెచ్చరిల్లుతుందని ఇదమిద్ధంగా చెప్పలేం కానీ ఇటీవల రాజకీయ పరిణామాలలో చాలా రాష్ట్రాలలో అవినీతి పెచ్చుపెరిగి న్యాయ పాలికలు అవినీతికి పాల్పడిన ఉదంతాలు కోకొల్లలు. చట్టం అవినీతి పరులుగా నిగ్గుతేల్చిన రాజకీయ నేతలు కారాగారాలు, జరిమానాల పాలవుతుండగా, చట్టపరంగా తేలని అవినీతి నిందితులకు ఏదో ఒకనాడు అలాంటి ఫలితాలకు గురికాకపోరని రాజకీయ విశ్లేషకుల భావన.

అవినీతికి అడ్డూ అదుపూ లేదు

రాజకీయంగా చేసినా, సామాజిక పరంగా చేసినా జరిగినన్నాళ్లు గుట్టుచప్పుడు కాకుండా సాగిపోతుంది. అది కాస్తా బయటపడి చట్టం చట్రంలో ఇరుక్కున్నప్పుడు తీగలాగితే డొంకంతా కదలినట్లు అవినీతి పూర్వాపరాలు అగ్గి బాగా రాజుకొంటుంది.

నేతలకయినా, పారిశ్రామికవేత్తలకైనా, ప్రజలను మోసపుచ్చి లక్షలకు లక్షలు కాజేసిన ఫైనాన్స్ కంపెనీలకైనా, మరే ఇతర చట్టవిరుద్ధ కార్యక్రమాలకు ఆలవాలమైన వ్యక్తులకు, సంస్థలకు చివరికి దక్కేది ప్రజాగ్రహం, చట్టపరిధిలో శిక్షలు ఆపై జీవితాంతం మానసిక సంక్షోభం. ఇదే ప్రజాస్వామిక సూత్రం. పరివర్తన చెందితే భవిష్యత్తులోనైనా కొంత మానసిక శాంతి. లేకపోతే జీవితమంతా విభ్రాంతితో అలముకొన్న అశాంతి. అవినీతి ఎలాంటి వారికైనా చెదపట్టిన వృక్షం. చెరగని సంక్షోభం.

-దాసరి కృష్ణారెడ్డి,
9885326493

కంది పంట కష్టాల మంట

అనేక వ్యయ, ప్రయాసలకోర్చి పండించిన పంటలను అమ్ముకోవడం రైతులకు ప్రహసనంగా మారుతోంది. గత పక్షం రోజులుగా కంది రైతుల కష్టాలు తీరే దారి కనిపించడం లేదు. కొనే దిక్కులేక, నిల్వ ఉంచితే తెచ్చిన అప్పులు తీర్చే మార్గం తోచక వారి సమస్యలు జటిలమవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లోపం అన్నదాతల ఇబ్బందులకు కారణమవుతోంది. కనీస మద్దతు ధర రూ.5,450లుగా ప్రకటించినప్పటికీ బహిరంగ మార్కెట్లో ఎక్కడా రూ.4వేలకు మించి కొనుగోలు చేయడంలేదు. ఈ ఏడాది ఖరీఫ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 6.20 లక్షల ఎకరాల్లో కంది పంట



సాగైనట్లు అధికారులు చెబుతున్నారు. లక్షా 34వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈ లెక్కల ఆదారంగా కేంద్రానికి నివేదిక పంపిస్తే నాఫెడ్ ద్వారా కేవలం 53,600 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసేందుకు అంగీకారం తెలిపారు.

పత్తికి ప్రత్యామ్నాయంగా కంది పంటను సాగు చేయాలని ప్రభుత్వం విస్తృత ప్రచారం చేయడంతో దాదాపు లక్షహెక్టార్ల విస్తీర్ణానికి ఇది పెరిగింది. అధికారుల అంచనాలు తారుమారై 2.84 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. ఈ పరిస్థితుల్లో కనీసం రెండు లక్షల మెట్రిక్ టన్నులైనా కొనుగోలు చేయాలని కేంద్ర వ్యవసాయ మంత్రి రాధామోహన్‌సింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసినా ప్రయోజనం లేకపోయింది. అవకాశాలను అదునుగా చేసుకుని నల్గొండ జిల్లాల్లో దళారులు నిలువునా దోచుకుంటున్నారు. హాలియా, చండూరు, సూర్యాపేటలలో కొనుగోళ్లలో అనేక అవకతవకలు జరిగినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు ధ్రువీకరించారు. కొన్ని మార్కెట్లలో కొనుగోలు కేంద్రాలను ఎత్తేశారు. రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్, హాకా సంస్థల ద్వారా కొనుగోలు చేసిన కందుల్లో దాదాపు 30శాతం దళారుల నుంచే వచ్చినట్లు తెలుస్తోంది.

చెల్లింపుల ప్రక్రియలో ఆలస్యం

కందులు కొనుగోలు చేసిన వారంరోజుల్లో రైతులకు డబ్బులు చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం ప్రభుత్వం మాట నిలబెట్టులేకపోతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 15,270 మంది రైతులు సుమారు రెండు లక్షల క్వింటాళ్ళ కందులు విక్రయించారు. డబ్బులు చెల్లించడంలో జాప్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు రూ.100 కోట్లకుపైగా రైతులకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. రైతులకు వారంలో పంటసొమ్మును అందజేస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలు అమలుకు నోచుకోవడం లేదు.

కొండంత కొనుగోళ్ళు - గోరంత చెల్లింపులు

ఉమ్మడి జిల్లాలో ఇప్పటికి రూ.100 కోట్ల కందులు కొనుగోలు చేయగా, గోరంత చెల్లింపులు మాత్రమే చేశారు. పంట కొనుగోలు చేసిన వారం రోజుల్లో డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ మాట నిలబెట్టుకోలేకపోయింది. జనవరి 22న ఆదిలాబాద్‌తో పాటు నిర్మల్, కుమురంభీం జిల్లాల్లో కంది కొనుగోళ్ళు ప్రారంభమయ్యాయి. మంచిర్యాలలో ఇటీవల ప్రారంభమయ్యాయి. ఆదిలాబాద్‌లో ఆరు, నిర్మల్‌లో ఆరు, కుమురంభీంలో మూడు, మంచిర్యాలలో రెండు చొప్పున కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్‌లో మార్క్‌ఫెడ్ అధికంగా కొనుగోలు చేస్తుండగా, కొన్ని కేంద్రాల్లో డిసిఎంఎస్, పీఏసీఎస్‌లో కూడా కొనుగోలు చేస్తున్నాయి. నిర్మల్‌లో పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్, కుమురంభీంలో మార్క్‌ఫెడ్, పీఏసీఎస్, మంచిర్యాలలో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలోనే కొనుగోళ్ళు సాగుతున్నాయి.

బయట మార్కెట్‌లో కందులకు క్వింటాలుకు రూ.4వేల నుంచి రూ.4,500లోపే ఇస్తున్నారు. దీంతో రైతులు మద్దతు ధరతో ప్రభుత్వరంత సంస్థలకే విక్రయిస్తున్నారు. జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా అధికంగా కొనుగోళ్ళు జరుగుతున్నాయి. ఆదిలాబాద్‌లో 9,675 మంది రైతులు, కుమురంభీంలో 1,997, నిర్మల్‌లో 3,566, మంచిర్యాలలో 32 మంది రైతులు కంది పంటను విక్రయించారు. ఆదిలాబాద్ జిల్లాలోనే కందిపంట 19,447 హెక్టార్లలో సాగు కాగా, 2,43,090 క్వింటాళ్ళు దిగబడి అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లాలో 36,022 క్వింటాళ్ళ కంది కొనుగోళ్ళు జరిగాయి.

మిర్చి రైతునూ వెంటాడుతున్న కష్టాలు

మిర్చి రైతులను కూడా కష్టాలు వెంటాడుతున్నాయి. గత ఏడాది పెట్టుబడులు మీద పడడంతో ఈసారి సాగు సగానికి తగ్గించినా మార్కెట్ మాయాజాలంలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. పంటకు సోకిన రోగాలను అధిగమించి అమ్ముకునేందుకు సిద్ధమవుతుండగా, ప్రతికూల పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి.

గత సీజన్‌లో క్వింటాల్‌కు రూ.5వేల నుంచి రూ.1500లకు ధర పడిపోవడంతో చాలామంది రైతులు రవాణా ఛార్జీలు మీద పడతాయని పంటను కళ్ళాల్లోనే వదిలేశారు. కొందరు పంటను కాల్చి నిరసన తెలిపారు. తర్వాత కొద్ది రోజులకు వ్యాపారులు ధరను మళ్ళీ రూ.8వేలకు పెంచారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సగంమంది రైతులు సాగుకు దూరమయ్యారు. 15రోజుల క్రితం క్వింటాల్‌కు రూ.11,500 పలికిన ధర ఏకంగా రూ.1500లకు పడిపోవడంతో రైతులు ఆందోళనలో పడ్డారు.

వారం రోజులుగా మబ్బులు ఆవరిస్తున్నాయి. దీంతో పంట దెబ్బతింటుందని రైతులు భయపడుతున్నారు. పంట చివరి దశకు రావడంతో అనేక మంది రైతులు ఏరివేత ప్రారంభించారు. పంటను ఆరబెట్టారు. ఈ క్రమంలో వర్షం పడినా.. మబ్బులు చాలా రోజులు ఉన్నా.. కాయ దెబ్బ తింటుందని, దీంతో మార్కెట్ ధర పూర్తిగా రాకుండాపోయిందని వారు వాపోతున్నారు.

-రాజేష్ జైన్

ఐఐటీ హైదరాబాద్‌లో టింకరర్ ల్యాబ్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఐఐటీ హైదరాబాద్ విద్యార్థులు వారికి నచ్చిన పరిశోధనలు, ప్రయోగాలు చేయడం కోసం ప్రత్యేకంగా టింకరర్ ల్యాబ్‌ను క్యాంపస్‌లో ప్రారంభించారు. 1975 ఐఐటీ ముంబయి పూర్వ విద్యార్థులు రూపొందించిన ఈ టింకరర్‌ను అదే బ్యాచ్‌కి చెందిన డాక్టర్ హేమంత్ కనకియా గురువారం ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో ప్రారంభించారు. డు ఇట్ యువర్‌సెల్ఫ్(డిఐవై) పేరుతో విద్యార్థులు తమ సొంత ఐడియాలతో ఇక్కడ ప్రయోగాలను చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నారు. టింకరర్ ల్యాబ్ ప్రారంభం సందర్భంగా ఐఐటీ డైరక్టర్ ప్రొఫెసర్ యుబి దేశాయ్ మాట్లాడుతూ ఈ టింకరర్‌ను విద్యార్థులే స్వచ్ఛందంగా నిర్వహించుకుంటారని తెలిపారు. ఉపాధి పొందాలనుకునే విద్యార్థులకు టింకరర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్ (ఎస్‌టిఈఎం) పేరుతో దీనిని కొనసాగిస్తారని చెప్పారు. టింకరర్‌ను రూపొందించిన వారిలో ఒకరైన డాక్టర్ హేమంత్ మాట్లాడుతూ టింకరర్ ల్యాబ్‌ను 4 సంవత్సరాల క్రితమే ప్రారంభించామని తెలిపారు. ఈ ఏడాది దానిని ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ గాంధీనగర్‌లో ప్రారంభించామన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం డాక్టర్ హేమంత్ కొలంబియా క్యాపిటల్‌లో జనరల్ పార్టనర్‌గా వ్యవహరిస్తున్నారు.

హెచ్‌సీయూలో అతి పెద్ద ఇంక్యుబేటర్

హైదరాబాద్,ఆంధ్రప్రభ : హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అతి పెద్ద ఇంక్యుబేటర్‌ను ప్రారంభించారు. యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన 20వేల చదరపు అడుగుల ఇంక్యుబేటర్‌ను పద్మశ్రీ జి పద్మనాభన్ గురువారం ప్రారంభించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఆయన ప్రారంభించారు. స్టార్టప్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఇంక్యుబేటర్‌ను బయోఇంక్యూబేటర్ నేచురింగ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఫర్ స్కేలింగ్ టెక్నాలజీస్(బయో నెస్ట్)ను బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్(బిఐఆర్ఏసీ) సహకారంతో ప్రారంభించినట్టు తెలిపారు. దేశంలో ప్రారంభించిన వాటిలో బయోనెస్ట్ మంచి కార్యక్రమమన్నారు. ఇంక్యుబేటర్లను అన్ని ప్రభుత్వ సంస్థల్లోనూ ప్రారంభించాలని సూచించారు. తాను 5000 పరిశోధనలను పరిశీలించానని, వాటిలో 700 పరిశోధనలు 500 పరిశ్రమల్లో అమలు జరుగుతున్నాయన్నారు. వాటిలో 50 కమర్షియల్‌గా ఉన్నాయన్నారు.

వృద్ధ లాయర్లకు పెన్షన్

● అడ్వకేట్ జనరల్‌కు టీఏయూఎఫ్ వినతి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: 60 సంవత్సరాలు నిండిన అడ్వకేట్లకు పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని తెలంగాణ అడ్వకేట్స్ యునైటెడ్ ఫెడరేషన్ (టిఏయుఎఫ్) డిమాండ్ చేసింది. న్యాయవాదుల వెల్ఫేర్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి సంఘం కృతజ్ఞతలు తెలిపింది. అయితే వాటితోపాటు లాయర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించే దిశగా ప్రయత్నం చేయాలని కోరుతూ సంఘం అధ్యక్షురాలు జి శారదా గౌడ్ అడ్వకేట్ జనరల్‌కు విజ్ఞప్తి చేశారు. న్యాయవాదుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉన్నందుకు ధన్యవాదాలు తెలిపారు. న్యాయవాదులకు రూ. 2 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ ఇవ్వడం, రూ. 10 లక్షల ఆక్సిడెంట్ ఇన్సూరెన్స్ ఇవ్వడం సంతోషమన్నారు. వాటితోపాటు ప్రత్యేకంగా ఒక ఆసుపత్రిని ఏర్పాటు చేయాలన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలన్నారు. బస్సు, రైళ్లల్లో 50 శాతం సబ్సిడీని కేటాయించాలన్నారు. అడ్వకేట్ జనరల్‌ను కలిసిన వారిలో హైకోర్టు న్యాయవాదులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి, సుంకరి జనార్ధన్, రామారావు, శ్రీకాంత్ గౌడ్, నరేష్, గోపి, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ బంద్‌కు జేఏసీ మద్దతు

● కోదండరాంను కలిసిన మంద కృష్ణమాదిగ



హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు గాను మార్చి 13న తలపెట్టిన 24 గంటల తెలంగాణ బంద్‌కు టీజేఏసీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ సంఘం ఛైర్మన్ కోదండరామ్ హామీ ఇచ్చారు. గురువారం కోదండరామ్ నివాసానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ వర్గీకరణ డిమాండ్ న్యాయమైనదని, తాను మొదటి నుంచి మద్దతిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. బంద్‌లో టీజేఏసీ శ్రేణులు క్షేత్ర స్థాయిలో పాల్గొంటాయని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. వర్గీకరణకు మొదటి నుంచి సానుకూలంగా ఉన్నమని చెబుతున్న బీజేపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కోదండరామ్‌తో భేటీ అయిన సమయంలో టీజేఏసీ నాయకుడు ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తమ్, విద్యార్థి సంఘం నాయకుడు రుద్రవరం లింగస్వామి, కొమ్ము శేఖర్ తదితరులు ఉన్నారు.

రాజ్యసభ రాజకీయం



● అభ్యర్థుల వడపోతలో సీఎం ● ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న ఆశావహులు ● యాదవ స్థానానికి గట్టిపోటీ ● రాజకీయ లెక్కలు..భవిష్యత్ సమీకరణాలు పరిశీలిస్తున్న సీఎం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో టిఆర్‌ఎస్‌లో రాజకీయవేడి రగులుతోంది. తెలంగాణలో మూడుస్థానాల భర్తీకి ఎన్నిక జరుగుతుండగా, ఈ మూడింటిని అధికార టిఆర్‌ఎస్ కైవసం చేసుకోనుంది. ఈ పదవులు దక్కించుకునేందుకు నేతలు, ఆశావహులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక స్థానాన్ని టిఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జోగినిపల్లి సంతోష్‌కుమార్‌కు ఇవ్వడం ఖరారైనట్లేనని పార్టీ వర్గాలు చెబుతుండగా, ఒకస్థానాన్ని యాదవులకు ఇస్తానని సిఎం ఇదివరకే ప్రకటించారు. ఇపుడీ యాదవులలో సీటు కోసం పోటీపడుతున్న వారి సంఖ్య, ప్రయత్నాలు చేస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. యాదవ సామాజిక వర్గం నుండి తొలుత మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన జైపాల్ యాదవ్, నల్లగొండ జిల్లాకు చెందిన నోముల నర్సింహ్మయ్య, మెదక్ జిల్లాకు చెందిన మురళీ యాదవ్, కరీంనగర్‌కు చెందిన తుల ఉమల పేర్లు వినిపించగా.. తాజాగా మరికొన్ని పేర్లు తెరపైకి వచ్చాయి.

సంతోష్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వారు కాగా.. తుల ఉమ కూడా అదే జిల్లా వారు కూడా ఒకే ప్రాంతం నుండి రెండుసీట్లు ఇచ్చే అవకాశం లేదని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. పూర్వ పాలమూరు లేదా నల్లగొండ జిల్లాలకు ఖచ్చితంగా ఒక స్థానం కేటాయిస్తారని భావిస్తు న్నారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే సీనియర్ నేత జైపాల్ యాదవ్ పేరు బలంగా పరిశీలిస్తున్నారు. పాలమూరు నేతలనుండి కూడా తమకు రాజ్యసభసీటు ఇవ్వాలన్న డిమాండ్ ఉంది. జైపాల్‌యాదవ్‌కు ఈ బెర్త్ దక్కితే.. అక్కడ అసెంబ్లీటికెట్ సమస్య కూడా పరిష్కారం అవుతుంది. ఇక నల్లగొండ జిల్లాకు చెందిన సీనియర్ నేత నోముల నర్సింహ్మయ్య కూడా బలమైన అభ్యర్థిగా పార్టీ పరిశీలనలో ఉన్నారు. సిపిఎం నుండి టిఆర్‌ఎస్‌లోకి వచ్చిన ఆయన గత ఎన్నికలలో నాగార్జునసాగర్ నుండి పోటీ చేసి ఓడిపోయారు. తన అభ్యర్థిత్వానికి సహకరించమంటూ ఇటీవల మంత్రులందరినీ కలిసి ఆయన విజ్ఞప్తి చేశారు.



ఈ అభ్యర్థిత్వాన్ని కూడా సిఎం సీరియస్‌గానే పరిశీలిస్తున్నారు. గొర్రెలు, మేకల పంపిణీ, ఉత్పత్తులకు సంబంధించిన కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న రాజయ్య యాదవ్ కూడా రాజ్యసభ అభ్యర్థిత్వం కోసం బలంగా ప్రయత్నిస్తున్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్‌కు సన్నిహితుడైన రాజయ్య యాదవ్.. యాదవ సామాజికవర్గంలో బలమైన నేతగా గుర్తింపుపొందారు. అయితే ఇప్పటికే ఇతను కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్నారు.

యాదవులకు ఒక సీటు.. అని సిఎం ప్రకటించడంతో ఈ సామాజిక వర్గంలో సీటుకు గట్టిపోటీ నెలకొంది. ఆశావహులు ప్రధానంగా మంత్రులు హరీష్‌రావు, కెటిఆర్, కవితలతో పాటు ముఖ్యనేతల చుట్టూ తిరుగుతున్నారు. యాదవనేతలు మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ చుట్టూ కూడా ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉద్యమంలో పనిచేసిన యాదవనేతలకు రాజ్యసభ అవకాశం ఇవ్వాలని మంత్రి తలసానిని కలిసి ఆ సంఘం నేతలు విజ్ఞప్తిచేసినట్లు సమాచారం.

మూడో స్థానం రెడ్డి సామాజిక వర్గం లేదా మైనారిటీకి దక్కే అవకాశం ఉన్నట్లు తెలిసింది. తెలంగాణలోని బలమైన సామాజిక వర్గాల్లో ఒకటైన రెడ్లకు.. ఆరు స్థానాల్లో ప్రాతినిధ్యం లేకుంటే వేరే సంకేతాలు వెళ్తాయని, అందుకే రెడ్లకు ఓ స్థానం కేటాయించే అవకాశాలున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మంత్రివర్గంలో మార్పు చేయాలనుకుంటే నాయిని నర్సింహారెడ్డి పేరు పరిశీలించే అవకాశం ఉందని, ఆ జోలికి వెళ్ళొద్దనుకుంటే ఉమా మాధవరెడ్డి లేదా మరో నేత పేరును పరిగణనలోకి తీసుకోవచ్చని చెబుతున్నారు.

ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేరు కూడా తాజాగా వినిపిస్తోంది. స్పీకర్ మధుసూధనాచారి పేరు కూడా వినిపిస్తున్నా.. ఆయనను ఎంపిక చేస్తే మళ్ళీ కొత్త స్పీకర్‌ను ఎన్నుకోవాల్సి ఉన్నందున అందుకు సిఎం మొగ్గుచూపకపోవచ్చునని చెబుతున్నారు. తమ సామాజికవర్గానికి అవకాశం ఇవ్వాలని ఎస్సీలు కూడా విజ్ఞప్తులు చేస్తున్నారు. మొత్తంగా రాజ్యసభ ఎన్నికల వేడి టిఆర్‌ఎస్‌లో కాకపుట్టిస్తోంది. సామాజికసమీకరణాలు.. రాష్ట్రవ్యాప్తంగానో, జిల్లాల్లోనో వీరి నియామకం వల్ల కలిగే ప్రయోజనాలు, పార్టీకి చేసిన సేవలు అన్నింటినీ సిఎం పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేస్తారని పార్టీవర్గాలు భావిస్తున్నాయి. అనేక వడపోతలు చేసి.. సిఎం ఇప్పటికే అభ్యర్థిత్వాలపై అవగాహనకు వచ్చారని, ఎవరిని ఖరారుచేశారనే అంశం సిఎం వెల్లడిస్తేనే తెలుస్తుందని పార్టీ ముఖ్యులు చెబుతున్నారు. మార్చి 12వ తేదీవరకు నామినేషన్లకు గడువున్నందున మార్చిలోనే.. అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందని పార్టీలో చర్చ జరుగుతోంది.

యువనేతల వైపు చూపు..

రాజ్యసభస్థానం కోసం ప్రయత్నిస్తున్న యాదవనేతల్లో కొత్తవారి వైపు కూడా సిఎం చూస్తున్నారన్న చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో వరంగల్ జిల్లాకే చెందిన యువ విద్యావేత్త, విద్యాసంస్థల అధినేత సుందర్‌రాజు యాదవ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఇటీవల మంత్రి కెటిఆర్‌ను కలిసి పార్టీ కోసం తాను చేసిన సేవలు వివరించి తన అభ్యర్థిత్వం పరిశీలించమని సుందర్‌రాజు యాదవ్ విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. పార్టీ ఆవిర్భావం నుండి పనిచేసిన నేపథ్యం, విద్యాసంస్థల అధినేతగా ఉద్యమంలో కీలకంగా పనిచేయడం.. భవిష్యత్తులో పార్టీకి సుదీర్ఘకాలం సేవలందించే అవకాశం ఉండడం అభ్యర్థిత్వం పరిశీలనకు కలిసివచ్చిందని చెబుతున్నారు. హైదరాబాద్ నగరానికి చెందిన ఎడ్ల హరిబాబుయాదవ్ కూడా రాజ్యసభరేసులో నిలిచేందుకు గట్టిప్రయత్నాలు చేస్తున్నారు. ఆదినుండీ పార్టీకోసం పనిచేయడంతో పాటు యాదవమహాసభ కూడా ఆయనకు పదవి ఇవ్వమని తీర్మానించింది. ఈ నేపథ్యంలో ఆయన తన ప్రయత్నాలు తాను చేసుకుంటున్నారు. వీరితో పాటు యాదవ సామాజికవర్గానికి చెందిన దాదాపు వందమంది నేతలు అభ్యర్థిత్వాలు, బయోడేటాలతో నేతల వద్ద కు తిరుగుతున్నట్లు సమాచారం. ఎవరి అర్హతలు వారు పట్టుకుని రాజ్యసభస్థానం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

అమ్మ ఆశ్రమానికి భారీగా భక్తులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మాతా అమృతానందమయి దేవిని హైదరాబాద్‌లో రెండోరోజు గురువారం కూడా తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చారు. అమ్మ దీవెనల కోసం వచ్చిన వారిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె. జోషి, ఇల్లెందు నియోజకవర్గం శాసనసభ్యుడు కోరం కనకయ్య, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మాచర్ల ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

పోలీస్, ప్రెస్ అంటే కుదరదు!

తనిఖీల్లో పట్టుబడిన వారికి జరిమానాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పోలీసు, ప్రెస్ అంటూ ఫోజులిస్తూ చలానాల బారినుంచి తప్పించుకుంటున్న వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతున్నారు. వారం రోజుల వ్యవధిలో 892 మంది వాహన చోదకులను హెచ్చరించారు. రెండోసారి చిక్కితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. నగరం, శివారు ప్రాంతాల్లో కొందరు యువకులు, నేరస్తులు తనిఖీల నుంచి తప్పించుకునేందుకు పోలీస్ స్టిక్కర్లను అతికించుకుని ఆయా విభాగాలకు చెందిన వారిగా నటిస్తున్నారు. తాము విలేకరులమని, ఫలానా పత్రిక, ఛానెల్‌లో పనిచేస్తున్నామని చెబుతున్నారు. మరికొందరు ఆంగ్ల పత్రికల విలేకరులమంటూ సొంతంగా గుర్తింపు కార్డులను తయారు చేసుకుంటున్నారు. ట్రై కమిషనరేట్ పరిధుల్లో పదుల సంఖ్యలో ఐపీఎస్‌ల, పోలీస్ అధికారులు, విలేకరులు, సిబ్బంది విధులు నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్ పోలీసులు పూర్తిస్థాయిలో వీరి వాహనాలు తనిఖీలు చేయకుండా వదిలేస్తున్నారు. పాతబస్తీలో కొందరు నేరస్తులు కూడా ప్రెస్ స్టిక్క ర్లను వినియోగిస్తున్నారు. పగలు, రాత్రి నిరాటంకంగా వెళ్లేందుకు కొందరు ఉపయోగించుకుంటుండగా.. మరికొందరు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దన్నుగా వాడుకుంటున్నారు. ఇటీవల హవాలా రాకెట్ కేసులో పోలీసులకు పట్టుబడ్డ సోహన్‌లాల్ పత్రికా విలేకరిగా గుర్తింపు కార్డును సొంతంగా తయారుచేసుకోవడం గమనార్హం. ఈ విధంగా పోలీసు, ప్రెస్ స్టిక్క ర్లను దుర్వినియోగం చేస్తున్న వారిని పట్టుకునేందుకు నిర్వహించే ప్రత్యేక డ్రైవ్‌లో పట్టుబడ్డ వారి వాహనాల నెంబర్లను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ విషయంపై పోలీసు ఉన్నతా ధికారులు స్పందిస్తూ.. ఈ స్పెషల్ డ్రైవ్‌లో అనుమానం వచ్చిన వారిని ఆపి గుర్తింపు కార్డులు అడుగుతు న్నామన్నారు. ప్రభుత్వం గుర్తించిన అక్రిడిటేషన్ కార్డులు చూపిస్తే వదిలేస్తున్నామన్నారు.

అపోలో హాస్పిటల్స్‌కు సీఐఐ అవార్డు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సీఐఐ ఆధ్వర్యంలో నిర్వహించినసీఐఐ నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు సమావేశంలో అత్యున్నత సిగ్నిఫికెంట్ అచీవ్‌మెంట్ అవార్డు ఇన్ హెచ్‌ఆర్ ఎక్సలెన్స్‌ను అపోలో హైదరాబాద్ డిజిఎం-హెచ్‌ఆర్ సిహెచ్ సురేష్ రెడ్డి, హెచ్‌ఆర్ ఎల్అండ్‌డి కవిత సేథిలకు అందజేశారు. ఈ కార్యక్రమానికి సీఐఐ డిప్యూటి డైరెక్టర్ జనరల్ ఇంద్రాణి కర్ కూడా హాజరయ్యారు. హెచ్‌ఆర్ ఎక్సలెన్స్ అవార్డు గుర్తింపులో ఒక సంస్థలోని వివిధ విభాగాలకు చెందిన మానవ వనరుల పనితీరుకు సంబంధించి నాయకత్వం, అభ్యాసం, అభివృద్ధి, మానవ వనరుల వ్యూహం, ఉద్యోగ నిబద్ధత, మానవ వనరుల ప్రక్రియ వంటి అంశాలను కఠినమైన విశ్లేషణ విధానంతో మందిపు చేస్తూ పరిగణలోకి తీసుకుంటారు. మానవ వనరుల నిర్వహణలో ఉత్తమ పద్ధతులు, కార్యక్రమాలు, విధానాల అమలుకు గుర్తింపుగా ఈ అవార్డుకు విశిష్టసేవలు అందించిన సంస్థలకు అవార్డును ప్రదానం చేస్తారు.

రేజర్ పేద్వారా విమానం, రైల్వే టిక్కెట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రైలు, విమాన ప్రయాణీకులు టికెట్లను ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌పై రేజర్‌పే పేమెంట్ గేట్ ద్వారా బుక్ చేసుకోవచ్చునని ఈ సంస్థ సీఈవో హర్షిల్ మాథుర్ తెలిపారు. యుపిఐ ద్వారా వినియోగదారులు ఆన్‌లైన్ చెల్లింపులు చేసుకునే సదుపాయం కల్పించేందుకు తమ రెండు సంస్థలు ఈ మేరకు భాగస్వామ్యం కుదుర్చుకున్నాయని తెలిపారు. నెట్ బ్యాంకింగ్, వాలెట్స్, క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా కూడా చెల్లింపులు చేయవచ్చునని ఆయన చెప్పారు. మొబైల్ ఫోన్, బ్యాంకు ఖాతా కలిగిన ప్రయాణీకులు తమ రైలు, విమాన టిక్కెట్లను యుపిఐ ద్వారా చెల్లింపులు జరిపి ఎలాంటి క్లిష్టత లేకుండా బుక్ చేసుకోవచ్చునని తెలిపారు. ఇది కార్డు వివరాలు, నెట్ బ్యాంకింగ్, వాలెట్ పాస్‌వర్డ్ వివరాలు నమోదుచేసే అవసరం లేదని మాథుర్ తెలిపారు. విస్తృతమైన సాంకేతిక శక్తితో సురక్షితమైన ఫ్లాట్‌ఫామ్ కలిగిన రేజర్ పే పేమెంట్ గేట్‌వేకు బహుళ దశ సెక్యూరిటీ ఎన్‌క్రిప్షన్ ఉందని తెలిపారు. రేజర్‌పే గేట్‌వే ప్రతినెలా ఒక మిలియన్‌కుపైగా లావాదేవీలను ఐఆర్‌సిటిసి వెబ్‌సైట్, మొబైల్ యాప్‌పై ప్రాసెస్ చేయనున్నట్లు మాథుర్ వివరించారు.

లక్ష్య సాధన దిశగా సింగరేణి

● 7.2 శాతం వృద్ధితో బొగ్గు రవాణా
● 11 మాసాల వార్షిక లక్ష్యాల సాధన

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓవర్‌బర్డెన్ తొలగింపులో గత ఏడాది కన్నా మిన్నగా వృద్ధి రేటును సాధించి దూసుకువెళుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి 11మాసాల్లో 543లక్షల టన్నుల బొగ్గును సింగరేణి రవాణా చేయగా, ఈ ఏడాది అదే కాలానికి 582లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసి 7.2శాతం వృద్ధిరేటు నమోదు చేసింది. గత ఏడాది ఫిబ్రవరి వరకు కంపెనీ 541ఐదులక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయగా, ఈ ఏడాది అదే కాలానికి 546 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి ఒక శాతం వృద్ధితో ముందు నిలిచింది. ఓవర్‌బర్డెన్ తొలగింపులో గత ఏడాది మొదటి పదకొండు మాసాల్లో 286మిలియన్ క్యూబిక్ మీటర్లు తీసిన కంపెనీ ఈ ఏడాది ఇదే కాలానికి 357మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓబి తొలగించి 25శాతం వృద్ధిని నమోదుచేసింది.

ఫిబ్రవరి నెలలోనూ వృద్ధి

ఈ ఫిబ్రవరి నెలలో సింగరేణి గత ఏడాది ఫిబ్రవరి మాసం కన్నా సుమారు 5లక్షల టన్నుల బొగ్గును అధికంగా ఉత్పత్తి చేసి 7శాతం వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాది ఫిబ్రవరిలో 58.6లక్షలటన్నుల బొగ్గు ఉత్పత్తి చేసిన కంపెనీ ఈ ఫిబ్రవరిలో 62.6 టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయగలిగింది. అలాగే ఓబి తొలగింపులో గత ఫిబ్రవరిలో 312లక్షల క్యూబిక్ మీటర్ల ఓబి తీయగా, ఈ ఫిబ్రవరిలో 378లక్షల క్యూబిక్ మీటర్ల ఓబి తొలగించి ఇరవై ఒక్క శాతం వృద్ధిని నమోదు చేసింది. పదకొండుమాసాల్లో సింగరేణీయులు సాధించిన అభివృద్ధిపై సంస్థచైర్మన్ శ్రీధర్ అభినందనలు తెలిపారు.

దుమ్మురేపిన మార్చి 1 సాంగ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మహేష్ హీరోగా నటించిన దూకుడు సినిమాలో గురువారం మార్చి 1 సాంగ్ నేడు సోషల్ మీడియాను ఊపేసింది. ఆ పాట ప్రారంభంలోనే గురువారం మార్చి 1 అని స్టార్ట్ అవుతుంది. హోళీ పర్వదినం.. గురువారం మార్చి 1 కలిసి రావడంతో కుర్రకారు అందరూ ఈ విషయం చర్చించుకున్నారు. అంతేకాదు, కొంతమంది కుర్రకారు ఈ సాంగ్, డేట్ ప్రొఫైల్ పిక్చర్‌గా పెట్టుకున్నారు. ఐదేళ్ల క్రితం నాటి పాట నిజమైందని కుర్రోళ్లు సోషల్ మీడియా వేదికగా చర్చించుకోవడం గమనార్హం.



దాడిలో పట్టుబడిన విదేశీ నగదు

కోరుట్ల కేంద్రంగా హవాలా దందా!

● గల్ఫ్ వెళ్లిన కుటుంబాలే టార్గెట్ ● తేలిగ్గా తీసుకుంటున్న అధికారులు ● వెస్టర్న్ ముసుగులో వ్యవహారం

జగిత్యాల/కోరుట్ల, ప్రభ న్యూస్ : హవాల దందా... మొన్నటి వరకు సినిమాలలో విన్న మాటలు... నేడు మన ప్రాంతంలో నిజమవుతున్నాయి. నల్ల ధనాన్ని విదేశీ రూపాయలకు మార్చే ఈ దందా జిల్లాలో జోరుగా సాగుతోంది. అనుమతులు లేకుండా విదేశీ రూపాయలు కొనడం కాని అమ్మడం కాని ఆర్థిక నేరంగా భావించే ఈ దందాను గత 25 ఏళ్లుగా కొందరు అడ్డు అదుపు లేకుండా నడిపిస్తున్నారు. జగిత్యాల జిల్లాలో 18 మండలాలు ఉండగా సుమారు 10 లక్షల మంది జనాభా ఉన్నారు. జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన 2లక్షల మంది వరకు ఇతర దేశాలలో ఉపాధి కోసం వెళ్లిన వారున్నారు. ప్రతి నెల కొందరు ప్రభుత్వం ఆమోదించిన సంస్థల ద్వారా పంపడంతో పాటు బ్యాంకుల ద్వారా డబ్బు పంపుతుంటారు.

కాని కొందరు దళారులు అధికంగా డబ్బులు ఇప్పిస్తామని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ హవాల వ్యాపారాన్ని నడిపిస్తున్నారు. ఒక్కో దుబాయి దీరామ్ రూ.18 పలుకుతుండగా దళారులు రూ.15కే అక్రమంగా కొనుగోలు చేయడంతో ఇటు గల్ఫ్ వెళ్లి వచ్చిన వారితో పాటు ప్రభుత్వం నష్టపోతోంది. జిల్లాలోని మండల కేంద్రాలతో పాటు కోరుట్ల, జగిత్యాల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి ప్రాంతాలలో కొందరు ఏజంట్లు హైదరాబాద్, ముంబయి నగరాలతో సంబంధాలు పెట్టుకుని ప్రతి రోజు విదేశాల నుంచి వచ్చిన వారినే టార్గెట్ చేసుకుని వారి ఇంటికి వెళ్లి మరి విదేశీ నోట్లను ఖరీదు చేస్తున్నారు. పట్టణాలకు, అక్కడి నుంచి నగరాలకు పంపిస్తున్నారు. నిత్యం కోట్ల రూపాయలు జిల్లాలో వ్యాపారం సాగుతుండగా, కోరుట్లలో కేసు నమోదు కావడంతో ఒక్క సారిగా జిల్లాలో హవాల దందా బయటకు వచ్చింది.

రాయికల్ ఏజెంటే కీలకమా?

జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు చెందిన వ్యాపారులకు రాయికల్ మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతానికి చెందిన ఓ ఏజంటే కీలకమని సమాచారం. సదరు ఏజంటు రాయికల్, మల్లాపూర్, ఖానపూర్, సారంగపూర్, మేడిపల్లి, కోరుట్ల మండల గ్రామాలకు ప్రతి రోజు వెళ్లడం విదేశీ నోట్లను ఖరీదు చేయడంతో పాటు ఆ నోట్లను పట్టణాలలోని బడా హవాల వ్యాపారులకు అప్పజెప్పడం పరిపాటిగా మారింది. పల్లె ప్రాంతాలకు చెందిన గల్ఫ్ జీవులకు తమ వెంట తెచ్చుకున్న వీదేశీ డబ్బులను ఎక్కడ మార్చుకోవాలో తెలియక ఇంటికి



వెస్టర్న్ యూనియన్ శాఖ

వచ్చిన ఈ దళారికే తక్కువ రేటుకు మార్చుకోవడంతో ఈ దళారీ గత 20 ఏళ్లుగా కోట్ల రూపాయలు సంపాదించినట్లు సమాచారం. అయితే బుధవారం కోరుట్ల పట్టణంలో పోలీసులు దాడులు చేసి పట్టుకున్న చింతల సంతోష్ వద్ద దొరికిన విదేశీ దుబాయి డబ్బులలో సగం వరకు ఇతగాడు ముట్టజెప్పినట్లు విశ్వసనీయ సమాచారం.

తెర చాటున బాగోతాలెన్నో...

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కేవలం వెస్టర్న్ యూనియన్ లాంటి వాటిలో వచ్చిన డబ్బులను లబ్ధిదారులకు వారి గుర్తింపు కార్డులు తీసుకుని మాత్రమే చెల్లించాలి. కాని వాటి పేరుతో అనేక అక్రమ కలాపాలకు తెరలేపుతున్నారు. అమాయకులైన పల్లె వాసులకు కొందరు నకిలీ నోట్లను సైతం అంటగడుతున్నట్లు తెలిసింది. పాత నోట్లు రద్దు కాకముందు అనేక మంది ఇలాంటి నోట్లను తారుమారు చేశారని సమాచారం. ఇంత జరుగుతున్నా ఇప్పటి వరకు జగిత్యాల జిల్లాలో కోరుట్లలో మాత్రమే ఒక కేసు నమోదు మాత్రం జరిగింది. రూ. 5 రూపాయల గుట్కా అక్రమంగా తీసుకెళితేనే పట్టుకుని కేసులు నమోదు చేసే పోలీసులు రూ. లక్షల్లో జరుగుతున్న ఈ అక్రమ దందాను పట్టించుకోకపోవడం విడ్డూరం. జిల్లాలో కొందరు ఓ ముఠాగా ఏర్పడి ఈ దందా నడుపుతుండగా ఇప్పటికి పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. పెద్దనోట్ల రద్దు తర్వాత కొత్తనోట్లతో వ్యాపారం చేస్తున్న వీరు గ్రామీణ ప్రజలకు దొంగనోట్లను అంటగట్టె ప్రమాదం లేక పోలేదు.

నేటినుంచి థియేటర్ల బంద్

● దక్షిణాది రాష్ట్రాల చిత్ర పరిశ్రమ ఐక్య కార్యాచరణ సంఘం నిర్ణయం



హైదరాబాద్, ఆంధ్రప్రభ సినీబ్యూరో: దక్షిణాది ఐదు రాష్ట్రాల్లోని సినిమా థియేటర్‌లు శుక్రవారం నుంచి మూతపడనున్నాయి. ఈ మేరకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళ, కన్నడ, మలయాళ చిత్ర పరిశ్రమలు నిర్ణయం తీసుకున్నాయి.

ఈ ఐదు రాష్ట్రాల చిత్ర పరిశ్రమ ఐక్య కార్యాచరణ సంఘం కొన్ని రోజులుగా డిజిటల్ ప్రొవైడర్‌లతో జరుపుతున్న చర్చలు సఫలం కాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. సినిమా ప్రదర్శనలో డిజిటల్ ప్రొవైడర్‌ల పాత్ర కీలకంగా ఉన్న నేపథ్యంలో... సదరు కంపెనీలు ఇష్టానుసారం డబ్బులు వసూలు చేస్తూ నిర్మాతలు, ఎగ్జిబిటర్‌లను ఇబ్బందులు పెడుతున్నారని ఐకాస తెలిపింది. కొంతకాలంగా ఈ ధరలు తగ్గించమంటూ తాము చేసిన విజ్ఞప్తులను వాళ్లు పట్టించుకోకపోవడం వల్ల బంద్ అనివార్యమైందని గురువారం హైదరాబాద్ ఫిలిం ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సంఘ సభ్యులు స్పష్టం చేశారు.

సమ్మె వివరాలను సంఘ అధ్యక్షుడు డి.సురేష్ బాబు తెలియజేస్తూ... ''సినిమా రంగం ప్రారంభం నుంచీ ఎన్నో మార్పులు వస్తున్నాయి. అలా 2010 నుంచి డిజిటల్ వైపు మన సినిమా వెళ్లింది. ఆ సమయంలో క్యూబ్, యూఎఫ్‌వో వంటి డిజిటల్ ప్రొవైడర్‌లు పరిశ్రమకు వచ్చి మాతో కలిశాయి. తొలుత ఐదేళ్లకు మాత్రమే వర్చువల్ ప్రింట్ (ప్రదర్శనకు సినిమా ఫీడ్ పంపే ప్రక్రియ) ఫీజు తీసుకుంటామన్నారు. డిజిటల్ ప్రొవైడర్‌లు విదేశాల్లోనూ ఇలాగే చెప్పుకున్నారు. అక్కడ చెప్పినట్లుగా క్రమంగా తగ్గిస్తూ... ఇప్పుడు ఉచితంగా వీపీఎఫ్ చేస్తున్నారు. మన దగ్గర ఆంగ్ల చిత్రాలకు వీపీఎఫ్ లేదు. మన దేశంలో కూడా ఉత్తరాదిన ఒక ఫీజు ఉంది. దక్షిణాది అంతా ఒకలా ఉంది. ప్రస్తుతం సినిమా ప్రదర్శనకు నిర్మాత చెల్లిస్తున్న వర్చువల్ ప్రింట్ ఫీజులో పాతిక శాతం తగ్గించాలని మేము కోరాం. ఇప్పటికే మూడు సార్లు వాళ్లతో చర్చలు జరిపాం. ముందు చర్చలకే రాని వాళ్లు తర్వాత స్పందించారు. మేము కోరిన ప్రధాన కోర్కెలు.... ఒకటి వర్చువల్ ప్రింట్ ఫీజు పాతిక శాతం తగ్గించాలని, ట్రైలర్‌లను ఉచితంగా ప్రదర్శించాలని, సినిమా ప్రదర్శన సమయంలో ప్రకటనల నిడివి 8 నిమిషాలకు దాటకూడదని... ఈ మూడు ప్రధాన అంశాలతో చర్చలు జరిపాం. మిగతావి వదిలేసి... వీపీఎఫ్ దాదాపు ఇరవై శాతానికి తగ్గించడానికి డిజిటల్ ప్రొవైడర్‌లు సిద్ధమయ్యారు.

వాళ్ల నిర్ణయం మాకు సంతృప్తికరంగా లేక సమ్మెకు వెళ్తున్నాం. థియేటర్‌లు మూసివేయాలన్నది మా ఆలోచన కాదు.... ఇప్పుడు తగ్గబోయే ధరలు రేపటి నిర్మాతలకు ఉపయోగపడతాయి. మాలో కొంతమంది డిజిటల్ ప్రొవైడర్‌లతో కలిసి ఉంటున్నాం. వ్యక్తిగతంగా మా వ్యాపారం అది. అయితే పరిశ్రమ కోసం వాళ్లతో ఎలా సంప్రదింపులు జరపాలో అలా చేస్తాం'' అన్నారు. ఈ కార్యక్రమంలో పంపిణీదారులు సునీల్ నారంగ్, ముత్యాల రాందాస్, నిర్మాతలు సి.కళ్యాణ్, దాము తదితరులు పాల్గొన్నారు.

Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS

ద్రవ్యలోటు లక్ష్యం దాటినా
ప్రభుత్వ వ్యయంలో కోత లేదు

న్యూఢిల్లీ : ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యం దాటినా .. ప్రభుత్వం వ్యయంపై కోత విధించదని ఎక్స్‌పెండిచర్ (వ్యయ కార్యదర్శి) అజయ్ నారాయణ ఝా చెప్పారు. కాగా కేంద్రప్రభుత్వం 2017-18 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యో లోటును జీడీపీలో 3.5 శాతం లక్ష్యంగా నిర్ణయించింది. అయి తే ఇప్పటికే ఈ లక్ష్యం 113.7 శాతం దాటిపోయింది. ఝా సదస్సులో మాట్లాడుతూ.. ప్రభుత్వ విధా నం ప్రకారం ప్రభుత్వ వ్యయంలో ఎలాంటి కోత ఉండదని స్ప ష్టం చేశారు. సవరించిన ద్రవ్యలోటు లక్ష్యం 3.5 శాతాన్ని ఎలా అధిగమిస్తారని ప్రశ్నించగా.. పరోక్ష పన్నుల వసూ ళ్లు సవరిం చిన ల క్ష్యం ప్రకారం చేరాయన్నారు. కాగా ప్రభుత్వం జీఎస్టీలో మొ త్తం 12 నెలల వ్యయంలో కేవలం 11 నెలల పరిగణనలోకి తీసుకుంది. మార్చినెల జీఎస్టీ వసూళ్లు ఏప్రిల్ నుంచి అమ ల్లోకి వస్తాయన్నారు.కాగా జనవరి చివరి నాటికి ద్రవ్యలోటు రూ.6.77 లక్షల కోట్లుదాటిపోయింది. మొ త్తం ఏడాది లక్ష్యం లో 113.7 శాతానికి చేరింది. ప్రభుత్వం పెద్దమొత్తంలో వ్యయం చేయడమే దీనికి ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. కాగా ప్రభుత్వం ఇటీవల బడ్జెట్‌లో ద్రవ్య లోటును రూ.5.95 లక్షల కోట్లకు సవరించింది. జీడీ పీలో ఇది 3.5 శాతంగా ఉంటుంది. గతంలో ద్రవ్యలోటు లక్ష్యాన్ని 3.2 శాతం గా నిర్ధారించారు. అ న్నీ కీలకరంగాల్లో వృద్ధిరేటు పుంజుకుంటున్నాయన్న అంచనాతో ద్రవ్యలో టు లక్ష్యాన్ని 3.2 శాతంగా నిర్ణయించామని ఝా వివ రించారు. తమ అంచనా ప్రకారం రాబోయే రోజుల్లో ద్రవ్యలోటు మరింత పెరిగే అవకాశాలున్నాయని, దీంతో పా టు కొన్ని సర్దుబాట్లు చేయాల్సి వస్తుందని, అదే సమయంలో కొన్ని వసూళ్లపై దృష్టిపెట్టాల్సి వస్తుందన్నారు. ఆర్థిక సంవత్సరం ముగియడానికి ముందు చివరి రెండు నెలల్లో రెవెన్యూ పుం జుకుంటుంది కాబట్టి ద్రవ్య టలోటు లక్ష్యం అనుకున్న స్థాయిలో ఉంటుందని అన్నారు. గతేడాది బడ్జెట్‌ను ముందుకు జరపడం వల్ల వ్యయం జోరందుకుందని వివరిం చారు.

ఐఎన్ఎక్స్ మీడియా లంచం కేసు..
విచారణకు నేనే ఆదేశించా!



న్యూఢిల్లీ : మాజీ కేంద్ర ఆర్థికమంత్రి పి చిదంబరం కుమారుడు కార్తి చిదంబరాన్ని అవినీతి కేసులో సీబీఐ బుధవారం అరెస్టు చేసింది. కోర్టులో తన కుమా రుడి తరఫున చిదంబరం వాదన వినిపిస్తూ.. తానే ఐఎన్ఎక్స్ మీడియాపై విచారణకు ఆదేశిం చానని వాదించారు. కార్తి తండ్రి చిదంబరం ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడు ఐఎన్ఎక్స్ మీడి యా టెలివిజన్ కంపెనీకి విదేశీ పెట్టుబడులు ఆమోదం లభించింది. తమపై వచ్చిన ఆరోపణల ను తండ్రి కొడుకులు ఖండించారు. ఇవన్నీ రాజకీయ కుట్రలో భాగమని వారు అంటున్నారు. తాను ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడు 2013లో మొట్ట మొదటిసారి ఐఎన్ఎక్స్ గ్రూపుపై వస్తున్న తీవ్రమైన ఆరోపణలపై సీరియస్ ఫ్రాడ్ ఆఫీస్ ద్వారా విచారణకు ఆదేశించానని చిదంబరం తెలిపారు. సీబీ ఐ వాదన ఏమిటంటే కార్తి చిదంబరం ఆర్థి మంత్రిత్వశాఖపై ఒత్తిడి తెచ్చి ఐఎన్ఎక్స్ మీడియా సహాయం చేశారని కోర్టులో వాదించింది. అయితే విచారణ దారి తీసిని పరిస్థితుల విషయానికి వస్తే సీనియర్ జర్నలిస్టు వీర్ సింఘ్వీతో పాటు ఐఎన్ఎక్స్ మీడియాలో పనిచేస్తున్న పలువురు సీనియర్ జర్నలిస్టులు సమాచార ప్రసారశాఖమంత్రి ప్రియరంజన్‌దాస్‌కు ఫిర్యాదు చేయడం.. దాస్ దాన్ని చిదంబరానికి సిఫారసు చేయడం జరిగిపోయా యి. సీరియస్ ఫ్రాడ్స్ కార్యాలయంలో నవంబర్ 2013లో ఐఎన్ఎక్స్ గ్రూ పులో అవకతవకలు జరిగినట్లు నిర్ధారించి ప్రభుత్వానికి నివేదిక అం దజేసింది.ఇదిలా ఉండగా సీబీఐ ఆరోపణ విషయానికి వస్తే ఐఎన్ఎక్స్ మీ డి యా గ్రూపును స్థాపించిన ఇంద్రాణి, పీటర్ ముఖర్జియాలు ఆదాయపు ప న్ను శాఖ వీరిని ప్రశ్నించడానికి ప్రయత్నించినప్పుడు కార్తి వీరిద్దరికి సహాయపడ్డారని ఆరోపిస్తోంది. ప్రస్తుతం ఇంద్రాణి ముఖర్జీ కూతురు షీనా బోరాను హత్య చేసిన కేసులో 2015 నుంచి జైల్లో ఉన్నారు. ఇంద్రాణి ముఖ ర్జియా, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను కలిసి తాను పీటర్ ముఖర్జియాలు ఇ ద్దరం పి చిదంబరాన్ని కలిసి ఐఎన్ఎక్స్ మీడియాగ్రూపులో రూ.300 కోట్ల విదేశీ పెట్టుబడులకు ఆమోదం తెలపాలని కోరినట్లు చెప్పారు. ఇదే ప్రక టనను సీబీఐ తోపాటు మేజిస్ట్రేట్ ముందు రి కార్డు చేశారు. ఈ కేసులో కేం ద్ర ఆర్థికమంత్రి చిదంబరానికి ఆయన కుమారుడు కార్తికి ఇద్దరికి సంబం ధాలున్నాయని సీబీఐ ఆరోపిస్తోంది.

సీబీఐ కస్టడీకి కార్తి

- 14 రోజుల కస్టడీని కోరిన సీబీఐ
- ఐదు రోజులకే పరిమితం

పటియాలా హౌజ్ కోర్టు ప్రత్యేక సీబీఐ జడ్జి కార్తి చిదంబరాన్ని ఐదు రోజుల సీబీఐ కస్టడికి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా ఐఎన్ఎక్స్ మీడియా మనీలాండరింగ్ కేసుకు సంబం ధించి కార్తిని విచారించడానికి తమకు 14 రోజుల కస్టడి ఇవ్వాలని ప్రత్యేక కోర్టును సీబిఐ కోరింది. కాగా కార్తి చిదంబరాన్ని సీబీఐ బుధ వారం అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టడం, కోర్టు ఆయనను ఒక రోజు కస్టడికి పంప డం. ఒక రోజు కస్టడీ గురువారంతో ముగి యడంతో సీబీఐ తిరిగి కార్తిని సీబీఐ ప్రత్యే క జడ్జి సునీలారాణా ముందు ప్రవేశపెట్టింది. ప్రత్యేక జడ్జి వాదోపవాదాలు విన్న తర్వా త ఐదు కస్టడికి అనుమతించారు. ఇదిలా ఉండగా బుధవారం ఉదయం చెన్నైలో అరెస్టు చేసిన కార్తిని ఢిల్లీ తీసుకొచ్చారు. డ్యూటి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి విచారణ జరిపేందుకు 15 రోజుల కస్టడీ కోరింది. అయితే డ్యూటీ మేజిస్ట్రేట్ సుమీత్‌ఆనంద్ కేవలం ఒక రోజు కస్టడికి అనుమతించారు. కార్తిని గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు సీబీఐ ప్రత్యేకజడ్జి ముందు ప్రవేశపెట్టాలని ఆదేశించారు. ఇదిలా ఉండ గా గురువారం సా యంత్రం 6.48 గం టలకు ప్రత్యే క జడ్జి కార్తి చిదంబ రాన్ని ఐదు రోజు ల సీబీఐ కస్టడికి అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేశా రు. సీబీఐ ఆయ నకు వైద్య పరీక్షలు నిర్వహిం చింది. కాగా కోర్టు కార్తిని ఆయన తల్లిదండ్రు లు, పీ చిదంబరం, తల్లి నళినీ లతో కలవడానికి అనుమతించిం ది.కార్తి తరఫున వాదిస్తున్న అభి షేక్ మనుసింఘ్వీ సీబీ ఐ ప్రత్యేక కోర్టులో వాదిస్తూ.. సీబీఐ సమ న్లు జారీ చేయకుం డానే విచారణకు సహకరించలే దన డంలో అర్థం లేదన్నారు. అన్నీ డాక్యు మెంట్లు సీబీఐ వద్దనే ఉన్నా యని.. కార్తిని కస్టడిలోకి తీసుకుని విచారించడానికి బలమైన కారణాలు కనిపించడం లేదని సింఘ్వీ వాదించారు.సీబీఐ వాద న ఏమిటంటే కార్తి చిదం బరానికి పలు కంపెనీలతో సంబం ధాలు న్నట్లు పక్కా ఆధా రలున్నాయని, తమ వద్ద ఈ-మెయిల్స్‌తో పా టు ఇన్వాయి స్‌లున్నా యని, ఐఎన్ ఎక్స్ మీడియా లబ్ధి పొందనందుకు కార్తికి చెం దిన అ డ్వాం టేజ్ స్ట్రాటజీ కన్సెల్టెన్సీ ప్రైవేట్ లిమి టెడ్‌కు డ బ్బు అందిందని దీనికి తగ్గ సాక్ష్యాలు తమ వద్ద ఉన్నాయని సీబీఐ ప్రత్యేక జడ్జి ముందు వాదించింది. కార్తి తల్లి నళిని చి దంబరం కూడా సీనియర్ అడ్వకేటు, ఆమె కు మారుడి పక్కన కూర్చుంది. సీని యర్ అడ్వకేటు అభిషేక్ మను సింఘ్వీ తన అడ్వకేట్ల బృందంలో కార్తి తరఫున కోర్టు లో వా దనలు వినిపించారు. ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ కూడా కో ర్టుకు హాజరైంది. ఈడీ వాదన ఏమిటంటే కార్తి చిదం బ రంతో పాటు ఆయన చార్టర్డ్ అకౌంటెంట్ ఎస్ భాస్క రరా మన్‌ను ఇద్దరిని కలిసి విచారణ జరపాలని కోరుతోంది. ఇది లా ఉండగా కార్తి చిదంబరం చార్టర్డ్ అకౌం టెంట్ బెయిల్ పి టిషన్‌ను ఆర్డర్‌ను పటియాలా హౌజ్ కోర్టు రిజర్వులో పెట్టింది. ఆయన మార్చి 7వ తేదీ వరకు జైల్లో ఉండాల్సిందే.



శిరోజాల పెరుగుదలకు
నౌక్రిన్ టాబ్‌లెట్లు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మహిళల శిరోజాల పెరుగుదలకు గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్ కంపెనీ నౌక్రిన్ టాబ్‌లెట్లను మార్కెట్‌లోకి విడుదల చేసింది. శాస్త్రీయంగా నిరూపించిన ప్రోటీయోగ్లికాన్ రీప్లేస్‌మెంట్ ఫార్మ్యులా నౌక్రిన్ ఉమెన్‌ను ఆరు నెలలపాటు వినియోగిస్తే పూర్తి ఫలితం ఉంటుందని గ్లెన్‌మార్క్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ కపూర్ గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. నౌక్రిన్ టాబ్‌లెట్లను డెన్మార్క్ కేంద్రంగా కలిగిన ఫార్మా మెడికోతో ఉన్న లైసెన్సింగ్ ఒప్పందంలో భాగంగా భారత్‌లో మార్కెట్ చేసున్నామని ఆయన చెప్పారు. మహిళలకు మానసిక ఒత్తిడి, వైద్య సంబంధిత కారణాలు, ప్రసవ అనంతరం, కాలుష్యం, రసాయనాలతో కూడిన ఆహార పదార్థాల వినియోగంతో జుట్టురాలే సమస్య ఎదుర్కొంటున్నారని ఆయన చెప్పారు. దేశంలో 9 కోట్ల మహిళలు ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని మాథుర్ తెలిపారు. యుకే, యూరప్ దేశాల్లో నౌక్రిన్ టాబ్‌లెట్లు జుట్టు రాలడాన్ని నియంత్రించినట్లు అనేక అధ్యయనాలు వెల్లడించాయని ఆయన చెప్పారు. ఈ టాబ్‌లెట్లు 40 దేశాల్లో ప్రస్తుతం లభ్యమవుతోందని, చర్మవ్యాధి నిపుణుల అధ్యయనంలో కూడా సానుకూలత వచ్చిందని ఆయన చెప్పారు. నౌక్రిన్ టాబ్‌లెట్లను రోజుకు రెండుసార్లు ఆరు నెలలపాటు వినియోగిస్తే ఫలితం ఉంటుందని కపూర్ తెలిపారు. 30 టాబ్‌లెట్లు ఉండే నౌక్రిన్ ప్యాకెట్ రూ.1800 ఉంటుందని చెప్పారు. ఇది కేవలం న్యూట్రిషియన్ విలువలతో కూడిన టాబ్‌లెట్లుగానే పరిగణించాలని, ఇలాంటి ఎలాంటి కెమికల్స్ కలపడం లేదని స్పష్టంచేశారు. అయినప్పటికీ దీన్ని వైద్యుల సిఫారసు మేరకే రిటైల్ మెడికల్ స్టోర్స్‌లో విక్రయిస్తారని స్పష్టం చేశారు.

'సుభిక్షా' యజమాని అరెస్టు

చెన్నై : ఎఫ్ఎంసీజీ చెయిన్ సుభిక్షా ప్రమోటర్‌ను ఆర్ సుబ్రహ్మణ్యాన్ని చెన్నైలో ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మంగళవారం అర్ధరాత్రి అరెస్టు చేసింది. ఆయన రిటైల్ చెయిన్‌ను 1997 ప్రారంభించి అటు తర్వాత 2009లో మూసివేశారు. పీఎస్‌యు బ్యాంకు ఒకటి తమను రూ.70 కోట్లు మోసం చేశారన్న ఫిర్యాదు మేరకు ఈడీ సుభిక్షా ప్రమోటర్‌ను అరెస్టు చేసింది. సుబ్రహ్మణ్యం రిటైల్ వ్యాపారం కోసం బ్యాంకు నుంచి రుణం తీసుకొని ఇతర వ్యాపారాలకు బదలీ చేశారని బ్యాంకు ఆరోపించింది. కాగా సుబ్రహ్మణ్యం బ్యాంకుల కన్సార్టియం నుంచి సుభిక్షా రిటైల్ చెయిన్‌పేరుపై మొత్తం రూ.790 కోట్ల రుణం తీసుకొని రుణం చెల్లించలేదు. చెన్నైలోని డెబిట్ రికవరీ అప్పిలేట్ ట్రైబ్యునల్ వద్ద కేసు పెండింగ్‌లో ఉంది.

ఎఫ్‌ట్యాప్సీ ఎస్‌జీగా సంజయ్ కపూర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య (ఎఫ్‌ట్యాప్సీ) సెక్రటరీ జనరల్‌గా సంజయ్ కపూర్ గురువా రం బాధ్యతలు స్వీకరించారు. మెకానికల్ ఇంజనీర్‌గా వివిధ పారిశ్రామిక విభాగాల్లో విశేష అనుభవం గడించిన కపూర్ ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో కూడా ఎంతో ప్రావీణ్యం పొం దారు. నగర శివారులోని హైటెక్స్ ఎగ్జిబి షన్ సెంటర్‌లో ఈవెంట్స్ నిర్వహణ లో ఎంతో ప్రతిభ కనబరిచి ఆ సంస్థ లాభా లు గడించేలా సంజయ్ కపూర్ ఎంతో కృషి చేశారు. ఎఫ్‌ట్యాప్సీలో చేరక ముందు ఎల్అండ్‌టి మెట్రో రైల్ జన రల్ మేనేజర్‌గా బాధ్య తలు నిర్వ ర్తిం చి ఆ ప్రాజెక్టు ను విజయవం తం చేయడంలో ఎంతో కీలకంగా వ్యవ హరించారు.



10వేల ఔట్‌లెట్లకు విస్తరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రానున్న ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా 10వేల రిటైల్ ఔట్‌లెట్లను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సేంద్రీయ సమీకృత చర్మ సంరక్షణ ఉత్పత్తుల సంస్థ అజాఫ్రాన్ ఇన్నోవేషన్స్ వెల్లడించింది. దేశంలోని 20 లక్షలు, అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న అన్ని పట్టణాలు, నగరాలు, మెట్రోల్లోని అన్ని కీలక ఔట్‌లెట్లలో తమ ఉత్పత్తులను అందుబాటులో ఉంచాలని భావిస్తున్నట్లు కంపెనీ వ్యాపార విభాగం అధినేత టిఆర్ సురేష్ తెలిపారు.

బీఎండబ్ల్యు మోటోర్రాడ్ సఫారి

హైదరాబాద్ : బీఎండబ్ల్యు మోటోర్రాడ్ సఫారీను బీఎండబ్ల్యు ప్రకటించింది. బీఎండబ్ల్యు మోటార్‌సైకిల్ యజమానులు తమ ద్విచక్ర వాహనంతో సాహసోపేతమైన రైడింగ్‌తో వినూత్నమైన అనుభూతిని కలిగించబోతోంది. మొత్తం నాలుగు రకాల అడ్వెంచర్‌లను అందుబాటులోకి తెస్తోంది. వాటిలో డెక్కన్ సఫారి, డెసర్ట్ సఫారి, ఇంటర్నేషనల్ సఫారిలను ప్రతి ఏడాది నిర్వహిస్తుంటుంది. ఈ నెల 23-25 వరకు డెక్కన్ సఫారి బెంగళూరు నుంచి కబాని వరకు సాగుతుందని బీఎండబ్ల్యు గ్రూపు ఇండియా ప్రెసిడెంట్ విక్రం పవాహ్ తెలియజేశారు.బీఎండబ్ల్యు మో టోర్రాడ్ సఫారి సాధారణంగా 5నుంచి 7 రోజుల పాటు కొనసాగుతుంది. ఎక్కడి నుంచి ప్రారంభించారో అక్కడే ముగుస్తుంది. దారి పొడువునా నివాసంతో పాటు వినోదం,ఆహారం అందుబాటులో ఉంచుతామన్నారు.

బ్యాంకు లోన్లు మరింత భారం

- వడ్డీరేట్లు పెంచిన ఎస్‌బీఐ,పీఎన్‌బీ

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) గురువారం నాడు ఒక సంవత్సరం కాలపరిమితిపై మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత రుణాలు (ఎంసీఎ ల్ఆర్)పై వడ్డీరేటును 20 బేసిస్ పాయింట్లు పెంచి 8.15 శాతానికి సవరించింది. గతంలో ఇది 7.95 శాతంగా ఉంది. సవరించిన రేట్లను మార్చి 1, 2018 నుంచి అమల్లోకి తెచ్చింది. కాగా బుధవా రం నాడు ఎస్‌బీఐ డిపాజిట్లపై వడ్డీరేట్లు పెంచిన విష యం తెలిసిందే.ఒక సంవత్సరం ఎంసీఎల్ ఆర్‌ను సవరించడంతో గృహ రుణాల తీసుకొనే వారి ఆశలపై నీళ్లు జల్లినట్లవుతుంది. ఎంసీఎల్ ఆర్ వడ్డీరేటును పెంచితే నెలవారి సులభ వాయిదా లేదా (ఈఎంఐ) పెరుగుతుంది. ఎస్‌బీఐని చూసి మిగిలిన బ్యాంకులు బెంచ్‌మార్కు లెండింగ్ రేట్లను పెంచే అవకాశాలు ఉంటాయి. ఇదిలా ఉండగా గత నవంబర్‌లో ఎస్‌బీఐ ఎంసీఎల్ ఆర్‌ను ఐదు బేసిస్ పాయింట్లు తగ్గించి 7.95 శాతానికి కుదించింది. గృహ రుణాల విషయానికి వస్తే ఒక సంవత్సరం ఎంసీఎల్ఆర్ లేదా బెంచ్ మార్కు లెండింగ్ రేట్లు అమల్లోకి వస్తాయి.



పీఎన్‌బీ ఎంసీఎల్ఆర్ ను20 బిసెస్ పాయింది ఇదిలా ఉండగా ఎంసీఎల్ఆర్ వ్యవస్థను ఏప్రిల్ 2016 నుంచి బ్యాంకింగ్ రంగం అమలు చేస్తోంది. కాగా ఎస్‌బీఐ ఎంసీఎల్ఆర్‌ను పెంచడం ఇదే మొదటిసారి.

ఇదిలా ఉండగా ఎస్‌బీఐ ఎంసీఎ ల్ఆర్ వివి ధ రకాల కాలపరిమితులపై పెంచింది. ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ 7.70 శాతంనుంచి పది బేసిస్ పాయింట్లు పెంచి 7.80 శాతానికి, ఒక నెల నుంచి మూడు నెలల కాలానికి ఎలాంటి మార్పు లేదు. అయితే ఆరు నెలల కాలానికి మాత్రం పది బేసిస్ పాయింట్లు పెంచి ఎనిమిది శాతానికి సవ రించింది. సంవత్సరాల నుంచి మూడు సంవ త్సరాల కాలపరి మితిపై ఎంసీఎల్ఆర్‌ను 8.25 శాతం నుంచి 8.35 శాతానికి పెంచింది. ఎంసీఎ ల్ఆర్ వడ్డీరేట్ల విషయానికి వస్తే ఇవి పారదర్శకం గా ఉంటాయి. ముందుస్తుగా రుణ ఒ ప్పందం కుదర్చుకున్న తర్వాత వడ్డీరేట్లలో మా ర్పులు జరిగితే ఆటోమెటిక్ అవి మారిపోతాయి. కొత్త ఎంసీఎ ల్ఆర్ వడ్డీరేట్ల వ్యవస్థను గృహ రు ణాల తో పాటు కారు రుణాలు విద్యా, వ్యక్తిగత రు ణాలు ఏప్రిల్ 2016 తర్వాత తీసుకున్న వారికి వర్తిస్తోం ది. ఏప్రిల్ 1, 2016 నుంచి తర్వాత నుంచి మం జూరు రుణాలన్నీ ఎంసీఎల్ఆర్ కిందికి వ స్తాయి.

నీరవ్‌మోడీ మూడు విదేశీ ఖాతాలు జప్తు

పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.13వేల కోట్ల కుచ్చుటోపీ పెట్టి విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీకి ఎస్‌బీఐలో ఉన్న మూడు విదేశీ ఖాతాలను బ్యాంకు స్తంభింప జేసింది. అంతర్గతంగా చేసిన స్క్రూటినిలో విదేశీ బ్రాంచీల్లో నీరవ్‌మోడీకి మూడు ఖాతాలు ఉన్నట్లు కనుగొన్నట్లు బ్యాంకు అధికారులు తెలియజేశారు. విదేశీ బ్రాంచీల్లోని ఖాతాల విషయానికి వస్తే దుబాయి, బహ్రేన్, అంట్వెర్ప్ అని తెలిపారు. అయితే ఈ ఖాతాలు పీఎన్‌బీ మోసానికి సంబంధించినవి కావని అధికారులు స్పష్టం చేశారు. నీరవ్ ఖాతా జప్తుతో సీబీఐ, ఈడీ, ఐటి అధికారులతో పాటు ఇతర దర్యాప్తు ఏజెన్సీలకు విచారణకు సహకరిస్తుందని అధికారులు వివరించారు. ఇదిలా ఉండగా నీరవ్‌మోడీకి ఎస్‌బీఐ సుమారు 212 మిలియన్ డాలర్లు రుణం ఇచ్చింది. అయితే ఈ డబ్బు ఎస్‌బీఐ నేరుగా రుణం ఇవ్వలేదు. పీఎన్‌బీ జారీ చేసిన ఎల్ఓయును తీసుకొని ఎస్‌బీఐ రుణం ఇచ్చింది. ఈ డబ్బును పీఎన్‌బీ నుంచి వస్తుందన్న నమ్మకాన్ని ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్ వ్యక్తం చేశారు.

అమ్మకాల ఒత్తిడి...

- వెంటాడిన ద్రవ్యలోటు భయాలు
- లాభాల స్వీకరణ
- సెన్సెక్స్ 137 పాయింట్ల పతనం



ముంబై : స్టాక్ మార్కెట్లకు ద్రవ్యలోటు సెగ, ఫెడ్ వడ్డీరేట్లు పెంచుతుందన్న ఆందోళన వెంటాడింది. దీంతో దేశీయ మార్కెట్లతో పాటు గ్లోబల్ మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. ఈ వారం మార్కెట్‌కు చివరి ట్రేడింగ్ రోజైన గురువారం సెన్సెక్స్ 137 పాయింట్లు క్షీణించి 34,046.94 వద్ద ముగిసింది. ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులు భారీగా నష్టపోయాయి. బ్యాంకుల్లో పెరిగిపోతున్న మోసాలను దృష్టిలో ఉంచుకొని మదుపరులు తమ వద్ద ఉన్న షేర్లను విక్రయించుకున్నారు. ఫిబ్రవరిలో ఆటో అమ్మకాలు పుంజుకోవడంతో ఆటో షేర్లలో కొనుగోళ్లు కనిపించాయి. ఇక ట్రేడింగ్ సరళిని గమనిస్తే... క్యూ3 జీడీపీ గణాంకాలు ఆకర్షణీయంగా నమోదు కావడంతో సెన్సెక్స్ ప్రారంభంలో లాభాలతో 34,278.63 పాయింట్ల వద్ద మొదలైంది. అటు తర్వాత గ్లోబల్ మార్కెట్లో అమ్మకాలు ఒత్తిడి కొనసాగడంతో సూచి తిరిగి 34,015.79కి దిగివచ్చింది. మార్కెట్ ముగిసే సమయానికి సూచి 137.10 పాయింట్లు నష్టపోయి 34,046.94 వద్ద ముగిసింది. ఐసీఐసీఐ బ్యాంకు, ఎస్‌బీఐ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. నిఫ్టీ విషయానికి వస్తే 34.50 పాయింట్లు క్షీణించి 10,458.35 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 10,525.50 నుంచి 10,447.15 మధ్య తచ్చాడింది. ఈ వారం మొత్తానికి చూస్తే సెన్సెక్స్ 95.21 పాయింట్లు నష్టపోతే.. నిఫ్టీ 32.70 పాయింట్లు క్షీణించింది. మొత్తానికి గురువారం ట్రేడింగ్ మందకొడిగా కొనసాగిందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. గ్లోబల్ మార్కెట్లో ఒడిదుడుకుల పరిస్థితి కొనసాగడంతో మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడ్డారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అమెరికా ఫెడ్ చీఫ్ జెరోమి పావెల్ అమెరికా ఆర్థిక వ్యవస్థ మెరుగుపడిందని, భవిష్యత్తులో వడ్డీరేట్లు పెంచుతామని ప్రకటించడంతో ఆసియా మార్కెట్లతో పాటు, గ్లోబల్ మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి కనొసాగింది. బీఎస్ఈలో నష్టపోయిన సూచిలు ఇలా ఉన్నాయి. లోహ సూచి 0.95 శాతం, బ్యాంకెక్స్ 0.85 శాతం, రియల్టీ 0.77 శాతం, కన్స్యుమర్ డ్యూరబుల్స్ 0.71 శాతం, టెక్ 0.65 శాతం, హెల్త్‌కేర్ 0.58 శాతం, ఐటి 0.53 శాతం, పవర్ 0.48శాతం, పీఎస్‌యు 0.43 శాతం నష్టపోయాయి. ఐసీఐసీఐ బ్యాంకు అత్యధికంగా 2.63శాతం, ఎస్‌బీఐ 2.31 శాతం వరకు నష్టపోయాయి. నష్టపోయిన ఇతర కంపెనీల షేర్లు ఇలా ఉన్నాయి. ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐటీసీ, యాక్సిస్‌బ్యాంకు, రిల్, హీరోమోటోకార్ప్, ఎస్‌బ్యాంకు, ఎల్అండ్‌టి, డాక్టర్‌రెడ్డీస్, అదానీపోర్ట్స్, సన్‌ఫార్మా, ఎన్‌టీపీసీ, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్‌లు 1.19 శాతం వరకు నష్టపోయాయి. దీనికి వ్యతిరేకంగా కోల్ ఇండియా, ఇండస్‌ఇండ్‌బ్యాంకు, హిందుస్తాన్ యూనీలీవర్, ఎంఅండ్ఎం, కొటక్ బ్యాంకు, ఓఎన్‌జీసీ, టాటాస్టీల్, టాటామోటార్స్ లాభపడ్డ వాటిలో ఉన్నాయి. కాగా మారుతి సుజుకి షేరు కాస్తా పుంజుకొని మార్కెట్ మరింత పడిపోకుండా అడ్డుకుంది. హోలీ సందర్భంగా మార్కెట్లకు సెలవు : శుక్రవారం నాడు హోలీ సందర్భంగా అన్నీ హోల్‌సేల్ కమాడిటీ మార్కెట్లు, మెటల్, బులియన్ మార్కెట్లతో పాటు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ, ఫారెక్స్, కమాడిటీ ఫ్యూచర్ మార్కెట్లకు సెలవు.

మారుతి, మహీంద్రా, టాటామోటార్స్
టాప్ గేర్‌లో అమ్మకాలు!

న్యూఢిల్లీ : ఆటోరంగానికి ఫిబ్రవరి నెల బాగా కలిసొచ్చింది. పెద్ద కంపెనీలు మారుతి సుజుకి, మహీంద్రా అండ్ మహీంద్రా, టా టామోటార్స్ అమ్మకాలు దేశీయ మార్కెట్లో రెండంకెలకు చేరాయి. వివరాల్లోకి వెళితే మారుతి సుజుకి అమ్మకాలు 14.2 శాతం పెరిగి 1,37,900 యూనిట్లు విక్ర యించగా.. ఎంఅండ్ఎం విషయానికి వస్తే 20 శాతం వృద్ధితో 48,473 యూనిట్లు విక్రయిస్తే గతే డాది ఇదే నెలలో 40,256 యూనిట్లు విక్ర యించింది. టాటామోటార్స్ అమ్మకాల్లో 38 శాతం వృద్ధితో 58,993 యూనిట్లు విక్ర యించింది. వాణిజ్య వాహనాలతో పాటు ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు బాగా పెరిగాయి. వీటికి వ్యతిరేకంగా ఫోర్డ్ ఇం డియా అమ్మకాలు స్వల్పంగా తగ్గాయి. ఫిబ్ర వరి నెలలో 23,965 యూనిట్లు విక్ర యించింది. అయితే దేశీయ మార్కెట్లో అమ్మకా లు మా త్రం 8.43 శాతం పెరిగి 9,041 యూనిట్లు విక్రయిస్తే, క్రి తం ఏడాది ఇదే నెలలో 8, 338 యూనిట్లు విక్రయించింది. జపాన్‌కు చెందిన ఆటో దిగ్గజం టయోటా కిర్లో స్కర్ మోటార్ అమ్మకాల్లో మాత్రం మూడు శాతం వృద్ధితో 11, 864 యూనిట్లు విక్రయిం చింది.వాణిజ్య వాహనాల విషయానికి వస్తే హిందూజా గ్రూపనకు చెందిన అశోక్ లే లాండ్ అమ్మకా ల్లో 29 శాతం వృద్ధితో 18, 181 యూనిట్లు విక్రయించింది. మహీంద్రా వాణిజ్య వాహనాల్లో 28 శాతం వృద్ధితో 20,946 యూ నిట్లు విక్రయిస్తే క్రితం ఏడా ది ఇదే నెలలో 16,383 యూ నిట్లు విక్రయించింది. టాటామోటార్స్ వాణిజ్య వాహ నాల విషయానికి వస్తే 36 శాతం వృద్ధితో 41,222 యూ నిట్లు విక్రయిస్తే క్రితం ఏడాది ఇదే నెలలో 30,407 యూ నిట్లు విక్రయించింది.

ద్విచక్ర వాహనాలు

బజాజ్ ఆటో అమ్మకాల్లో 31 శాతం వృద్ధితో 3,57, 883 యూనిట్లు విక్ర యి స్తే క్రితం ఏడాది ఇదే నెలలో 2,73,513 యూనిట్లు విక్రయించిం ది. రాయల్ ఎన్ ఫీ ల్డ్ అమ్మకాల్లో 25 శాతం వృ ద్ధితో 73, 077 యూనిట్లు విక్రయించింది. క్రితం ఏడా ది ఇదే నలలో 58, 439 యూనిట్లు విక్రయించింది.



రెనో డస్టర్



రెనో డస్టర్ ధర రూ.లక్ష తగ్గింపు!

ఫ్రెంచి కార్ల తయారీ కంపెనీ రెనో.. కాంపాక్ట్ స్పోర్ట్ యుటిలిటి వాహనండస ర్‌పై రూ. 29,746 నుంచి రూ.1,00,761 వరకు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. కార్ల ను స్థానికంగా ఉత్పత్తి చేయడామే దీనికి ప్రధాన కారణమని వివరణ ఇచ్చింది. దిగుమతి చేసుకొనే కార్లపై పెద్ద మొత్తంలో సుంకాలను చెల్లించాల్సి వచ్చేదని, ప్రస్తు తం స్థానికంగా కార్లను ఉత్పత్తి చేయడంతో ధరలు తగ్గించామని రెనో ఒక ప్రక టనలో వివరణ ఇచ్చింది. ధరలు తగ్గించిన తర్వాత పెట్రోల్ మోడల్ ఎస్‌యూవీ ప్రారంభ ధర రూ.7.95 లక్షలవుతుంది, గతంలో దీని ధర రూ.8.5 లక్షలు. ఆటో మెటిక్ వెర్షన్ రూ.10.25 లక్షల నుంచి రూ.9.95 లక్షలకు సవరించింది డిజిల్ వెర్షన్ ఎస్ యూవీ ప్రారంభ ధర రూ.8.95 లక్షలు గతంలో ఇది రూ.9.46 లక్షలు, హైఎండ్ డిజిల్ ఎస్ యూవీ ధర గతంలో 13.8 లక్షల నుంచి రూ.12.79 లక్షలకు సవరించింది. కాగా 2012లో డస్టర్ దేశీయ మార్కెట్లో ఆవిష్కరించింది. ప్రా రంభించిన కొన్ని సంవత్సరాల్లో అనూహ్యా స్పందన లభించింది. ప్రస్తుతం ఈ సె గ్మెంట్‌లో పోటీ విపరీతంగా ఉంది. దీనికి పోటీ కంపెనీలైన హ్యుం దాయ్ క్రెటా, మారుతి ఎస్ క్రాస్, విటారా బ్రెజ్జాలు డస్టర్‌కు గట్టి పోటీ ఇస్తున్నాయి.

ఐఏఎస్, ఐపీఎస్ జాబితా రెడీ

- కీలక స్థానాలకు సీనియర్లు
- పదోన్నతులు పొందిన అధికారులకు ప్రముఖ శాఖలు
- ఇంచార్జీలతో ఇబ్బందులు
- జిల్లా పాలనపై ప్రభావం

ఆంధ్రప్రభ, హైదరాబాద్: కేసీఆర్ మార్క్ పరిపాలనా టీం సిద్ధమవుతోంది. ఈ దిశగా ఉన్నతస్థాయి అధికారుల బదలీలకు కార్యాచరణ సాగుతోంది. ఇందుకు సీఎంఓలోని కీలకమైన ఇద్దరు అధికారులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారని వినికిడి. సీఎం కేసీఆర్‌కు అనుకూల బాబితా పేరుతో రానున్న బదలీలకు సర్వం సిద్ధం చేస్తున్నారు. అయితే ఇప్పటికే రానున్న సాధారణ ఎన్నికలకు అనువైన అధికారులను కీలక శాఖల్లో నియమించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీవ్రమైంది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కూడా రాష్ట్రంలోనే కొనసాగేందుకు మొగ్గు చూపుతుండటం, కేంద్ర సర్వీసులకి వెళ్లేది లేదని ఖరాఖండిగా తెగేసి చెప్పడంతో ప్రభుత్వానికి ఈ పరిస్థితి మరింత సులువుగా మారింది. దీంతో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల బదలీలకు అవసరమైన పలువురు అధికారుల పేర్లను ప్రభుత్వం పరిశీలిస్తోంది. కాగా మార్చిలో పెద్ద ఎత్తున చేపట్టనున్న పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, మే నెలలో రైతాంగానికి అందజేయనున్న పంటకు పెట్టుబడి సాయం పథకాల అమలులో అధికారులే కీలకం కానున్నారు. ఆయా పథకాల్లో ఎటువంటి ఇబ్బందులు రాకుండా ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా అంకితభావంతో పనిచేసే అధికారులు అత్యంత ఆవశ్యకమని ప్రభుత్వం నమ్ముతోంది.

జనవరి బదలీల తర్వాత మరోసారి...

జనవరిలో 20మంది సీనియర్లను, ఐదుగురు కలెక్టర్లను బదలీ చేసిన ప్రభుత్వానికి ఇప్పుడు మరోసారి అధికారుల బదలీలు అనివార్యంగా మారింది. ఈ నేపథ్యంలో మరోసారి ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పోస్టింగ్‌లపై దృష్టిపెడుతోంది. కొన్ని జిల్లాల్లో జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి కూడా కలెక్టర్లపై ప్రభుత్వానికి వినతులు వస్తున్నాయి. జిల్లాల్లో తమ మాట చెల్లుబాటయ్యేలా కలెక్టర్లు, ఎస్పీలు ఉండాలని పలు జిల్లాలనుంచి ప్రభుత్వానికి ప్రజాప్రతినిధులు విజ్ఞప్తులు చేస్తున్నట్లుగా తెలిసింది. ఈ మేరకు సీఎంఓలో కీలకమైన అధికారికి మంత్రులు, ఎమ్మెల్యేలు జాబితాలను అందించి, పని జరిగేలా చూడాలని కోరుతున్నట్లుగా విశ్వసనీయంగా తెలిసింది. గతంలో కొన్ని జిల్లాల్లో కలెక్టర్లతో ఎమ్మెల్యేలు, మంత్రులకు ఇబ్బందులు తలెత్తిన సంగతిని వారు ఆయనకు వివరించినట్లు తెలిసింది. ఈ ఏడాది కీలకం కావడంతో తమ ప్రాబల్యంతోపాటు, తమను నమ్ముకున్న కార్యకర్తలకు అండగా నిల్చేలా అధికారుల సహకారం అవసరమని భావిస్తున్న నేతలు సదరు అధికారిని ఆశ్రయించినట్లుగా తెలుస్తోంది. ఇక పోలీస్ శాఖలో ఉన్నతస్థాయి పోస్టులో పదవీ విరమణ చేసిన అధికారి కూడా ప్రస్తుతం ప్రభుత్వ సలహాదారుగా ఉన్నారు. ఆయన కూడా పోలీస్ శాఖ పోస్టింగ్‌లపై కొంత సమాచారం సేకరించి ప్రభుత్వానికి నివేదించనున్నారని తెలిసింది.



కీలక జిల్లాల్లో పాలనపై ప్రభావం...

కీలక జిల్లాల్లో కలెక్టర్లు ఇంచార్జీ బాధ్యతల్లో పాలనపై దృష్టి పెట్టలేకపోతున్నారు. దీంతో జిల్లాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. ప్రభుత్వ పథకాలపై పర్యవేక్షణలో జాప్యం ఎదురవుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. సీఎంకు ప్రీతి పాత్రమైన ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం యాదాద్రి జిల్లా కలెక్టర్ అనితా రామచంద్రన్ జనగామ కలెక్టర్‌గా ఇంచార్జి బాధ్యతలను నిర్వహిస్తున్నారు. అదేవిధంగా మంచిర్యాల కలెక్టర్ కర్నన్ జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్‌గా ఇంచార్జి విధులు నిర్వహిస్తున్నారు. సంగారెడ్డి కలెక్టర్ మానిక్యరాజ్ కన్నన్ మెదక్ కలెక్టర్‌గా, ఖమ్మం కలెక్టర్ లోకేష్ కుమార్ మహబూబాబాద్ కలెక్టర్‌గా అదనపు బాధ్యతల్లో ఉన్నారు. సీఎం ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి మహిళా శిశు సంక్షేమ శాఖతోపాటు వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శిగా ఇంచార్జి విధులను ఏక కాలంలో నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది. పర్యాటకశాఖ కార్యదర్శిగా ఉన్న బి వెంకటేశం బిసి సంక్షేమ శాఖ కార్యదర్శిగా, రెవెన్యూ, వాణిజ్య పన్నుల ముఖ్య కార్యదర్శి సోమేష్ కుమార్ ఆబ్కారీ కమిషనర్‌గా, జలమండలి ఎండీ దానకిషోర్ మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా రెండేసి బాధ్యతల్లో నిమగ్నమయ్యారు. ఇది ఎన్నికల ఏడాది కావడంతో సంక్షేమ శాఖలపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఒక్కో సంక్షేమ శాఖకు ఒక్కో సీనియర్ అధికారిని కమిషనర్, కార్యదర్శులుగా నియమించాలనే ప్రతిపాదన మేందేసుకుని ఆ దిశగా ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు సీనియర్ ఐపీఎస్ అధికారులు కూడా కొరత ఉండటంతో ఆబ్కారీ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న అకున్ సబర్వాల్‌ను పోలీస్ శాఖ వెనక్కు పిలుస్తోంది.

ఇంటలిజెన్స్‌లో ఇతర రాష్ట్రాలతో మావోలపై సంప్రదింపులకు ఆయన సేవలను వినియోగించాలని చూస్తున్నారు. ఎన్నికల ఏడాదిలో తమకు అనువైన పోలీస్ అధికారులను జిల్లా బాస్‌లుగా నియమించుకోవాలని ప్రభుత్వం కూడా యోచిస్తోంది. ఇందుకు సమర్థత, ఇప్పటి పనితీరును పరిగణలోకి తీసుకుని కీలక పోస్టింగ్‌ల జాబితా సిద్ధం చేస్తున్నారు. 2002 బ్యాచ్‌కు చెందిన కార్యదర్శులుగా పదోన్నతిని పొందిన నలుగురు ఐఏఎస్‌లకు కీలక పోస్టింగ్‌లు దక్కనున్నట్లుగా సమాచారం. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్‌రావు, జ్యోతి బుద్ధప్రకాశ్, హెచ్‌ఎండీఏ కమిషనర్ చింజీవులు, కేంద్ర రక్షణశాఖలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న సుదర్శన్‌రెడ్డిలకు ఈ దఫా బదలీల్లో వీరికి కీలక స్థానాలు దక్కే అవకాశం ఉన్నట్లు తెలిసింది. రఘునందన్‌రావుకు కీలక కార్యదర్శి పోస్టుతోపాటు, హెచ్ఎండీఏ కమిషనర్‌గా ఉన్న చిరంజీవులుకు ఆబ్కారీ శాఖ కమిషనర్‌గా పోస్టింగ్ దక్కనున్నట్లు తెలిసింది. అదేవిధంగా ఆబ్కారీ ముఖ్య కార్యదర్శిగా ఉన్న సోమేష్ కుమార్‌ను మరో శాఖకు పంపే అవకాశాలున్నాయని సాధారణ పరిపాలనా శాఖ వర్గాలు స్పష్టం చేశాయి.

అమరుల కుటుంబానికే రాజ్యసభ సీటివ్వాలి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రం నుంచి ఖాళీ అయ్యే మూడు రాజ్యసభ సీట్లలో ఒకటి తెలంగాణ అమరవీరుల కుటుంబానికి ఇవ్వాలని కాంగ్రెస్ నేత, కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి టీఆర్ఎస్‌కు డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని బట్టి టీఆర్ఎస్ పార్టీ రెండు గెలుచుకుంటుందని, మూడోది ఫిరాయింపు ఎమ్మెల్యేలతో గెలిచే అవకాశం ఉందన్నారు. కనీసం ఆ మూడో సీటునైనా అమరుల కుటుంబాల్లో ఒకరికి ఇవ్వాలన్నారు. అమరుల కుటుంబాలకు కేసీఆర్ అవకాశం ఇవ్వకపోతే.. కాంగ్రెస్ పార్టీ తరపున బరిలోకి దింపుతామన్నారు. ఈ విషయంపై పార్టీలోనూ చర్చిస్తున్నట్లు రేవంత్ తెలిపారు. గురువారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

బలిపీఠమెక్కిన రైతు కుటుంబం



(ఫైల్ ఫొటో)

మంచిర్యాల, ప్రభన్యూస్ : మంచిర్యాల జిల్లా, బెల్లంపల్లి మండలం కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చొప్పరిపల్లి గ్రామంలో బుధవారం రాత్రి ఓ రైతు కుటుంబం ఆర్థిక ఇబ్బందులు తాళలేక మూకుమ్మడిగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల్లోకి వెళ్తే చొప్పరిపల్లి గ్రామానికి చెందిన కొండగొర్ల తిరుపతి వ్యవసాయంలో నష్టపోవడంతో ఆర్థికంగా చితికిపోయి అప్పుల పాలయ్యాడు. చేతిలో చిల్లి గవ్వ లేకపోవడంతో ప్రభుత్వం నుంచి రుణం తీసుకోవాలని అప్పు లు చెల్లించాలనే ఉద్దేశంతో రుణం కోసం ప్రభుత్వాధికారులను ఆశ్రయించగా వారు రూ.20వేల లంచం అడుగడంతో మనస్తాపానికి గురై మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు కొండగొర్ల తిరుపతి ముందస్తు పథకం ప్రకారమే భార్యకు శీతల పానీయంలో ఎలుకల మందును కలిపి ఇచ్చాడని, పిల్లలకు శీతల పానీయంలో నిద్రమాత్రలు కలిపాడని, వారి అరుపులు విన్న చుట్టుపక్కల వారు వచ్చి చూసే సరికి తిరుపతి(38) ఉరి వేసుకొని మృతి చెంది ఉన్నట్లు, భార్య భూదేవి(35)లు నోటి నుంచి రక్తం కక్కుకొని మృతి చెంది ఉన్నట్లు, కుమారుడు శ్రీశాంత్(12), కుమార్తె కీర్తన (15)లు అపస్మారక స్థితిలో ఉండటంతో వెంటనే వారిని చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించినట్లు సమాచారం. మృతుడు చనిపోయే ముందు సూసైడ్ నోట్ రాశాడని కాసిపేట పోలీసులు తెలిపారు.

సాగర్ కుడి కాల్వకు నీటి విడుదల

- 5రోజులపాటు 2వేల క్యూసెక్కుల నీరు



నాగార్జునసాగర్, ప్రభన్యూస్ : బుధవారం జరిగిన రెండు తెలుగు రాష్ట్రాల నీటి పారుదలశాఖ అధికారులు జల రగడతో ఎట్టకేలకు ఏపీ ప్రభుత్వం అధికారులు గట్టిగా పట్టుబట్టి తమ పంతాన్ని నెగ్గించుకున్నారు. రోజుకు 2వేల క్యూసెక్కుల చొప్పున ఐదురోజుల పాటు విడుదుల చేయనున్నట్లు కృష్ణా రివర్‌బోర్డు ఆదేశాల ద్వారా తెలంగాణ నీటి పారుదలశాఖ అధికారులకు ఉత్తర్వులు అందాయి. కాగా గురువారం ఉదయం కుడి కాల్వకు 2వేల క్యూసెక్కుల నీటిని తెలంగాణ నీటిపారుదలశాఖ అధికారులు విడుదల చేశారు. కాగా గతంలో నీటి విడుదల కోసం ఏపీ ప్రభుత్వం తెలంగాణ నీటిపారుదలశాఖ అధికారులతో గొడవలకు దిగడంతో ఎట్టకేలకు వారు అనుకున్నది సాధించుకుని నీటి విడుదులను కొనసాగించుకుంటున్నారు.

ఇకపై రేషన్ దుకాణాల్లో కందిపప్పు

అమరావతి, ఆంధ్రప్రభ: నిత్యవసర సరుకుల్లో ప్రధానమైన కందిపప్పు, పచ్చి శనగపప్పులను సబ్సిడీతో ఇకపై రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు వెల్లడించారు. సబ్సిడీపై కందిపప్పు పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఆయన గుంటూరులో అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఈనెల నుంచి కేవలం రూ.40 ధరతో కందిపప్పును రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి 29 వేల చౌక దుకాణాల ద్వారా ఈ పంపిణీ జరగుతుందని, దీనితో 1.42 కోట్ల తెల్లకార్డుదారులకు లబ్ధి చేకూరనుందని తెలిపారు. నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం కల్పించిన ఈ బ్రహత్తర అవకాశాన్ని ప్రతి తెల్లకార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని, పంపిణీ చేస్తున్న సరుకుల్లో నాణ్యత లోపిస్తే 1100 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా ఫిర్యాదు చేస్తే తక్షణ చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా ప్రతి నెల 1 నుంచి 15వ తేదీ వరకు నిర్దేశించిన సమయంలో రేషన్ దుకాణాలను తెరచి ఉంచాలని డీలర్‌కు సూచించారు. సమయ పాలన పాటించని డీలర్‌లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతోందని తెలిపారు. ఒక్క రోజు దుకాణం తెరవకపోతే రూ.1,000, రెండు రోజులు తెరవకపోతే రూ1,500, మూడు రోజులు వరుసగా తెరువకపోతే విచారణ చేపట్టి డీలర్‌షిప్‌ను కూడా రద్దు చేసే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.

మైనర్ల డ్రైవింగ్... పేరెంట్స్‌కు జైలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మైనర్ డ్రైవింగ్ కేసులపై కోర్టు విచారణ నిర్వహించింది. మైనర్లకు వాహనాలు ఇచ్చిన పదిమంది పేరెంట్స్‌ను బాధ్యులను చేస్తూ వారికి ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. ఫలక్‌నుమా పీఎస్‌లో నమోదైన పదికేసులకు సంబంధించి ఈ తీర్పు వెలువడింది.

ఏసీబీ కస్టడీకి శ్రీనివాస్ రెడ్డి

- అనుమతించిన ప్రత్యేక కోర్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హెచ్‌ఎండిఎ ప్రణాళికా విభాగం డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి బావమరిది శ్రీనివాస్‌రెడ్డి కస్టడీ విచారణకు ఎసిబి ప్రత్యేక కోర్టు అనుమతించింది. పురుషోత్తంరెడ్డికి శ్రీనివాస్‌రెడ్డి బినామీ అని, ఆయన అక్రమార్జనలో కీలక భూమికను పోషించారని ఎసిబి అనుమానిస్తోంది. ఇప్పటికే వందల కోట్ల రూపాయల అక్రమాస్తులను గుర్తించిన ఎసిబి శ్రీనివాస్‌రెడ్డిని విచారిస్తే మరింత సమాచారం వస్తుందని అధికారులు భావిస్తున్నారు. గత నెల 2వ తేదీన పురుషోత్తంరెడ్డి ఆక్రమాస్తులపై ఎసిబి అధికారులు దాడులు నిర్వహించినప్పటి నుంచి తప్పించుకు తిరిగిన శ్రీనివాస్‌రెడ్డి చివరకు కోర్టు ఆదేశాలతో లొంగిపోయిన విషయం తెలిసిందే. పురుషోత్తంరెడ్డి ఆస్తులపై దాడుల విషయం తెలుసుకున్న వెంటనే అప్రమత్తమైన శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లోని విలువైన డాక్యుమెంట్లు, వస్తువులను దాచేశారన్న అనుమానాన్ని ఎసిబి వ్యక్తం చేస్తోంది. దాచిన వాటి వివరాలను కస్టడీ విచారణలో రాబట్టాలని అధికారులు భావిస్తున్నారు. పురుషోత్తంరెడ్డితో పాటు బినామీలు ఇషాంత్‌రెడ్డి తదితరులను విచారించిన అధికారులు శ్రీనివాస్‌రెడ్డిని భిన్న కోణాలలో ప్రశ్నించి సమాచారాన్ని రాబట్టాలని భావిస్తున్నారు. ఈ నెల 6 వ తేదీ వరకు కస్టడీ విచారణ అనంతరం తిరిగి కోర్టులో హాజరు పరచనున్నారు.

విద్యాశాఖ ఉద్యోగికి జైలు

- తీర్పు వెలువరించిన ఏసీబీ ప్రత్యేక కోర్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉన్నత విద్యా శాఖలో జరిగిన అవినీతి కేసులో ఎసిబి ప్రత్యేక కోర్టు 14 సంవత్సరాల తర్వాత తీర్పు వెలువరించింది. ఉన్నత విద్యాశాఖలో లైజనింగ్ అధికారిగా పని చేస్తున్న పుల్లారెడ్డి మరో ఇద్దరితో కలిసి జాతీయ పొదుపు పథకానికి సంబంధించిన రూ. 83 లక్షలను అక్రమంగా కాజేసినట్లు గుర్తించిన అధికారులు పోలీసులకు పిర్యాదు చేశారు. దీంతో 2004 సంవత్సరంలో కేసును నమోదు చేసుకున్న సిఐడి దర్యాప్తు జరిపి ఎసిబి ప్రత్యేక కోర్టులో ఎఫ్ఐఆర్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన కోర్టు గురువారం తీర్పు వెలువరించింది. నిధులను గోల్‌మాల్ చేసిన పుల్లారెడ్డికి రూ. 10 లక్షల జరిమానాతో పాటు అయిదేళ్ళ జైలు శిక్షను విధిస్తూ తీర్పు వెలువరించింది. పుల్లారెడ్డితో పాటు ఈ గోల్‌మాల్‌తో సంబంధం ఉందని పేర్కొన్న మరో ఇద్దరిని కోర్టు నిర్ధోషులుగా ప్రకటించింది.

హైకోర్టులో విధులు బహిష్కరించిన లాయర్లు

- న్యాయమూర్తుల ఖాళీలు భర్తీ చేయండి
- సీఆర్‌పీసీ సెక్షన్-41ఎ సవరించాలి



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఉమ్మడి హైకోర్టులో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులు భర్తీ , సీఆర్‌పీసీ సెక్షన్ 41 -ఎ ను సవరించాలని, హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు గురువారం హైకోర్టులో విధులు బహిష్కరించారు. ఉదయం కోర్టులు ప్రారంభమైన వెంటనే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల సంఘాల అధ్యక్షులు జల్లి కనకయ్య, చల్లా ధనుంజయ్ ఇతర నేతల నేతృత్వంలో న్యాయవాదులు కోర్టుల విచారణ సందర్భంగా విధులు బహిష్కరించాలని న్యాయవాదులను కోరారు. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, జస్టిస్ కె విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం వ్యాజ్యాలను విచారిస్తున్న సందర్భంగా న్యాయవాదులు ఫస్ట్ కోర్టు హాలులోకి వచ్చారు. తాము విధులను బహిష్కరిస్తున్నట్లు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఇందుకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ, న్యాయవాదులు కేసులను విచారించమని కోరితే విచారణ జరుపుతామని, లేకపోతే వారు విచారణకు హాజరుకాకపోతే వ్యాజ్యాలను వాయిదా వేస్తామన్నారు. అలాగని కేసులను కొట్టివేయబోమని హామీ ఇచ్చారు. తదనంతరం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. అనంతరం పెద్ద సంఖ్యలో న్యాయవాదులు హైకోర్టు నుంచి చార్‌మినార్ వరకు ఉన్న గుల్జార్ హౌజ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ కొంత సేపు బైఠాయించారు. తమ డిమాండ్లతో కూడిన ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. 2012 కి ముందు కేసులను పరిష్కరించాలంటూ జారీ చేసిన సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని,ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. న్యాయవాద సమస్యలపై ఎపి, తెలంగాణకు చెందిన న్యాయవాద సంఘాలు రెండు రోజుల పాటు కోర్టులు బహిష్కరించాలని పిలుపునిచ్చాయి. తొలిరోజు విధుల బహిష్కరణ కార్యక్రమం విజయవంతమైంది. శుక్రవారం కూడా విధుల బహిష్కరణకు న్యాయవాద సంఘాలు పిలుపునిచ్చాయి.

కమనీయంగా శ్రీవారి తెప్పోత్సవం



తిరుమల, ప్రభ న్యూస్: తిరుమలలో శ్రీవారి తెప్పోత్సవాలు ఐదో రోజు అంగరంగ వైభవంగా ముగిశాయి. శ్రీమలయప్పస్వామి సతీసమేతంగా తెప్పపై విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తూ కటాక్షించారు. ఐదురోజుల పాటు ఈ తెప్పోత్సవాలు కన్నుల పండువగా సాగాయి. ఐదో రోజైన గురువారం రోజు రాత్రి మలయప్పస్వామివారు సతీసమేతంగా పుష్కరిణిలో ఏడుమార్లు విహరిస్తూ ప్రదక్షిణగా తిరిగారు. తెప్పపై అర్చకులు ఉత్సవమూర్తులకు పచ్చకర్పూర హారతులివ్వగా మరో వైపు భక్తులు సైతం హారతులు పట్టారు. శ్రీవారి పుష్కరిణిలో భక్తుల గోవిందనామస్మరణ మధ్య ఈ తెప్పోత్సవాలు ఎంతో వేడుకగా కొనసాగుతూ స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఐదురోజుల పాటు తిరుమలలో మంగళవాయిద్యాలు, పండితుల వేదఘోష, అన్నమాచార్య సంకీర్తను మార్మోగాయి. ఈ తెప్పోత్సవాల సందర్భంగా అర్జిత సేవలైన వసంతోత్సవం, సహస్రదీపాలంకారసేవలను పూర్తిగా రద్దు చేశారు. శ్రీవారి పుష్కరిణితో పాటు, ఆలయానికి దేదీప్యమానంగా విద్యుత్ దీపాలతో, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. కోనేటి ప్రాంతంలో దేవతామూర్తుల విద్యుత్‌దీప కటౌట్లలో తిరుమల భక్తులకు చూడముచ్చటగా అనిపించింది. ఈ తెప్పోత్సవాలలో భాగంగా చివరిరోజు తెప్పోత్సవాలలో టీటీడీ ఈవో అనిల్‌కుమార్‌సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు, ఆలయ డిప్యూటి ఈవో హరీంద్రనాథ్, చిన్నజీయర్‌స్వామి, అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

9న ఎంటర్‌ప్రెన్యూర్ వర్క్‌షాప్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వివిధ రంగాల్లో వృత్తినైపుణ్యతను పెంచుకునేందుకు దిఎంటర్ ప్రెన్యూర్స్ వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నట్లు ఎంటర్ ప్రెన్యూర్స్ సంస్థ వెల్లడించింది. మార్చి 9 హోటల్ మారిగోల్డ్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో 17రకాల అంశాలపై శిక్షణలో మార్షల్ గోల్డ్ స్మిత్ ఇడి శ్రీహర్షతోపాటు పలువు రు నిపుణులు పాల్గొంటారని ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొంది.ఈ కార్యక్రమంలో నిపుణుల ఇష్టాగోష్టి ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

- మరో ముగ్గురికి తీవ్రగాయాలు



అశ్వాపురం, ప్రభ న్యూస్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండలం మిట్టగూడెం గ్రామం వద్ద గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో ముగ్గురు దుర్మ రణం పాలయ్యారు. అశ్వాపురం పోలీసుల కథనం ప్రకారం.. మణుగూరు సింగ రేణి కాలరీస్ లో ప్లంబర్ గా పనిచేస్తున్న కుడిపూడి నాగేశ్వరరావు (55), అతని భార్య మంగలక్ష్మీ (50) తూర్పుగోదావరి జిల్లా, అమలాపురానికి చెందిన సోదరుని భార్య కుడిపూడి లక్ష్మీ (45) మృతి చెందారు. మృతులు కొత్తగూడెం నుంచి కారులో (టీయస్ 04 ఈయన్ 1816) మణుగూరుకు వస్తున్నారు. ఈ క్రమంలో మిట్టగూడెం వద్ద ఆగి ఉన్న లారీని ఎదురుగా ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సంఘటనా స్థలాన్ని సీ.ఐ అల్లం నరేందర్ సందర్శించి ప్రమాద వివరాలను మృతుల వివరాలను సేకరించారు. గాయ పడిన వెంకటేశ్వరరావు, డ్రైవర్ చైతన్య, పండు లను 108 ద్వారా భద్రాచలం ఏరియా హాస్పటల్‌కు తరలించారు.

ఫాంహౌస్‌లో యువతులతో చిందులు

- పట్టుబడ్డ 14మంది అధికార పార్టీ నేతలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఫాంహౌస్‌లో యువతులతో చిందులు, పేకాట ఆడుతూ టీఆర్ నేతలు పోలీసులకు పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే.. రంగారెడ్డి జిల్లా కందు తకూరు వద్ద ఫాంహౌస్‌లో ఎస్‌వోటీ పోలీసులు సోదాలు నిర్వహించగా యువతులతో టీఆర్ఎస్ నేతలు చిందులు వేస్తూ, పేకాటాడుతూ పోలీసులకు దొరికిపోయారు. ఈ దాడిలో 14 మంది టీఆర్ఎస్ నేతలను ఎస్‌వోటీ పోలీసులకు దొరికిపోయారు. వారి వద్ద నుంచి రూ.2.50 లక్షల నగదు,సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌వోటీ పోలీ సులకు పట్టుబడిన వారిలో టీఆర్ఎస్ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు వనం శ్రీరాంరెడ్డి, ఇతర అధికార పార్టీ నేతలు ఉన్నారు.

28 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : షామీర్‌పేట మండలం అలియాబాద్ విలేజ్ అవుట్ స్కర్ట్సులో గ్లోబల్ వాలి ఫాంహౌస్‌పై సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు గురువారం సాయంత్రం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 28మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి రూ.6,90,000 నగదు, 30సెల్‌ఫోన్‌లు, ఐదుకార్లను స్వాధీనం చేసుకున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులపై చీటింగ్ కేసు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులపై చీటింగ్ కేసు నమోదైంది. తప్పుడు వైద్యబిల్లులతో ఇద్దరు జలసౌధ ఉద్యోగులు మోసానికి తెగబడ్డారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు నమోదు చేసుకున్న పంజాగుట్ట పోలీసులు ఉద్యోగులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపారు.

చిన్నారిపై అత్యాచారం

- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

మంచిర్యాల, ప్రభన్యూస్ : మంచిర్యాల జిల్లా, జైపూర్ మండలం ముదిగుంట గ్రామంలో ఓ కామాంధుడు ఏడేళ్ల మైనర్ బాలికలపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 19న 3వ తరగతి చదివుతున్న బాలికపై అదే గ్రామానికి చెందిన 40 సంవత్సరాల వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. గ్రామంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు కార్యక్రమాన్ని చూసేందుకు రావడంతో ఒక విద్యార్థినిని ఇంటి సమీపంలోని చెట్లపొదల్లోకి తీసుకువెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అనంతరం సదరు వ్యక్తి ఆ బాలికను చంపేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని పరిశీలించిన గ్రామంలోని మరో వ్యక్తి బాలికను అతని వద్ద నుంచి విడిపించి కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో బాలికను మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలిక ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు తెలిసింది. అయితే ఈ విషయం బయటకు రాకుండా ఈ అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తి అధికారి పార్టీకి చెందిన వాడు కావడంతో గ్రామంలోని రాజకీయ నాయకులు కుటుంబసభ్యులతో బాలిక శీలానికి వెల కట్టి రూ.50వేలు ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది.

విద్యార్థుల్లో హైపర్ టెన్షన్

- ఊబకాయంతోనే సమస్యలు
- వ్యాయమాలకు దూరం
- స్మార్ట్ ఫోన్లు, జంక్ ఫుడ్‌కు అలవాటు
- ఆరోగ్య సమస్యలపై అవగాహన లేమి
- పట్టించుకోని తల్లిదండ్రులు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: విద్యార్థులు మానసిక ఒత్తిడి, ఊబకాయంతో హైపర్‌టెన్షన్‌కు గురవుతున్నారు. విద్యార్థులు వ్యాయామాలకు దూరంగా ఉంటున్నారు. లేచిన దగ్గర నుంచి పడుకొనే వరకు స్మార్ట్‌ఫోన్లు, జంక్‌ఫుడ్‌తో కాలక్షేపం చేస్తూ కాలం గడుపుతున్నారు. 5 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల పిల్లల్లో 80 శాతానికి పైగా సరైన ఆహారపు అలవాట్లే లేవు. విద్యార్థులకు కలిగే ఆరోగ్య సమస్యలపై వారికి అవగాహన ఉండటం లేదు... తల్లిదండ్రులు వాటి గురించి పట్టించుకోవడం లేదు. దీంతో విద్యార్థులు ఊబకాయులుగా మారుతున్నారు. తద్వారా బీపీతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. కొందరు అమ్మాయిల్లోనైతే హైపర్‌టెన్షన్ లక్షణాలు కూడా కనిపిస్తున్నాయి. ఎదుగుతున్న పిల్లల్లోని 90 శాతం మందిలో ఎత్తుకు తగ్గ బరువు కాకుండా అధిక బరువుతో ఉంటున్నారు. వారిలో ఎక్కువ మంది మానసిక సమస్యలతోపాటు, ఇతర ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం ఒక స్వచ్ఛంద సంస్థ విద్యార్థుల్లో మానసిక సమస్యలు, పెరుగుదలపై ప్రత్యేక అధ్యయనం చేసింది. అధ్యయనంలో పలు అంశాలు బహిర్గతం అయ్యాయి. వాటిలో ప్రధానంగా 5 సంవత్సరాలలోపు పిల్లల్లో ఎక్కువ బరువు ఉన్నవారు చాలా తక్కువ మంది ఉన్నారు. కేవలం 2.3 శాతం మందిలో మాత్రమే ఉండాల్సిన బరువు కంటే ఎక్కువ బరువు ఉన్నారు. అదే 5 సంవత్సరాల నుంచి 18



సంవత్సరాల మధ్య విద్యార్థుల్లో అధిక బరువు ఉన్నవారు 31 శాతం మంది ఉన్నారు. ఈ వయస్సులోని వారిలో 19 శాతం మంది ఊబకాయంతో అవస్థలు పడుతున్నారు.

5 నుంచి 18 సంవత్సరాల వయస్సులో ఉండాల్సినంత బరువు కంటే తక్కువ బరువు ఉన్నవారు 1 శాతం మంది ఉన్నారు. స్వచ్ఛంధ సంస్థ జరిపిన సర్వేలో వివరాలను బట్టి చూస్తే. వీటికి కారణాలను పరిశీలిస్తే విద్యార్థులుగానీ పిల్లలు గానీ శారీరక శ్రమ చేయడం లేదు. స్మార్ట్‌ఫోన్లు, చేతిగడియారాలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను ఎక్కువగా ఉపయోగించడం. సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం. ఎక్కువ క్యాలరీలు ఉండే జంక్‌ఫుడ్, ఎక్కువ శక్తి ఉన్న పానీయాలను తీసుకోవడం. విద్యార్థులు, పిల్లల ఆహారపు అలవాట్ల మూలంగా పెద్దవారయ్యాక హైపర్‌టెన్షన్‌తోపాటు, గుండెసంబంధిత వ్యాధులకు దారీ అవకాశం ఉటుందని వైద్యులు చెబుతున్నారు. విద్యార్థులకు శారీరక శ్రమతోపాటు, కొంత మేరకు వ్యాయామాలు చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. దాంతోపాటు విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు, పిల్లలతోపాటు వారి తల్లిదండ్రులకు కూడా వీటిపై సరైన అవగాహన తప్పకుండా కల్పించాలని స్పష్టం చేస్తున్నారు. తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడంతో తమ పిల్లలకు 5 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల లోపు వారికి ఏమి సమస్యలు ఉండవులే... అనుకుంటూ వారి పిల్లలకు ఉన్న ఆరోగ్య సమస్యలను పట్టించుకోవడం లేదని... ఉన్నప్పటికీ వారిని వైద్యులకు చూపించడం లేదని డాక్టర్లు చెబుతున్నారు. ప్రధానంగా విద్యార్థులు, పిల్లలకు మానసిక ఆరోగ్యం తప్పనిసరి అంటున్నారు. సర్వే నిర్వహించిన వారు పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య సమస్యలపై, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. అలాగే వారి తల్లిదండ్రులకు అవగాహన ఇప్పించాల్సిన అవసరం ఉందంటున్నారు. పాఠశాలల్లోని ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ గురించి బోధించాల్సిన అవసరం ఉందన్నారు.

బాలికలపై వృద్ధుడి లైంగిక దాడి

హైదరాబాద్/గోషామహల్, ఆంధ్రప్రభ : పేదల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకున్న కామాంధుడు తన మనవరాలి వయసు ఉన్న పలువురు బాలికలపై లైంగిక దాడికి పాల్పడ్డ నీచ సంఘటన హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగుచూసింది. ప్రస్తుతం ఓ 13 ఏళ్ల బాలిక ఏడు నెలల గర్భిణీ కావడంతో ఈ కామాంధుడి లీలలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మల్లేపల్లి ఆగాపురాలో నివసించే అబ్దుల్ వహాబ్(76) ఐదేళ్ల క్రితం సౌదీలో పనిచేసి నగరానికి తిరిగివచ్చాడు. ఇతడిది 5గురు కూతుళ్లు, ఐదుగురు కొడుకులతో కలిసి మొత్తం 25 మంది కుటుంబం. ఇదిలా ఉండగా, తన ఇంటి చుట్టుపక్కల ఉండే చిన్నారులను వారి కుటుంబ ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని ఇతడు బాలికలను తన ఆటవస్తువులుగా మార్చుకున్నాడు. ఇదిలా ఉండగా ఓ బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదుతో ఇతడి లీలలు బయటకు వచ్చాయి. తన ఇంటి సమీపంలో ఓ ఎనిమిదో తరగతి చదివే బాలిక ఏడు నెలల గర్భిణీ అని తెలియడంతో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు.

మిత్ర భేదానికి సంధి కుదిరేనా?

- తెగేదాకా లాగుతున్న రాష్ట్ర నేతలు
- రాజీకోసం ఢిల్లీ పెద్దల మంతనాలు
- అమిత్‌షాతో రామ్మోహన్‌నాయుడు, కుటుంబరావు సమావేశం
- నేడు టీడీపీ పార్లమెంటరీ పార్టీ భేటీలో తదుపరి కార్యాచరణ ఖరారు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : బద్ధ శత్రువులను తలపించేలా ఆంధ్రప్రదేశ్‌లో పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలతో రెచ్చిపోయిన తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీల్లో ఏ ఒక్కరూ బెట్టు వీడేలా లేరు. కేంద్ర ప్రభుత్వం ఏమీ ఇవ్వడం లేదని ఒకరంటే, ఇచ్చిన సొమ్ముకే లెక్కలు లేవంటూ మరొకరు, ఇలా ఒకరి పరువును ఒకరు బజారుకీడ్చుకుంటున్నారు. రెండు పార్టీల తగవులాట కారణంగా మూడో పార్టీ లాభపడుతుందని ఆందోళన చెందుతున్న ఢిల్లీ పెద్దలు కొందరు రాజీ యత్నాలు చేస్తున్నప్పటికీ పెద్దగా ఫలితం కనిపించడం లేదు. కేంద్ర బడ్జెట్ కేటాయింపులతో మొదలైన మిత్రభేదం నానాటికీ పెరిగి, తెగేదాకా లాగే దిశగా ముందుకు సాగుతోంది. దీంతో సంధి ప్రయత్నాలు ఎన్ని చేసినా పెద్దగా ఫలితం కనిపించడం లేదు. అన్ని పార్టీల ఎంపీలూ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో నిరసనలు, ఆందోళనలతో హోరెత్తించారు. అయినా సరే కేంద్ర ప్రభుత్వంలో ఎటువంటి చలనం కనిపించ లేదు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఉభయ సభల్లో చేసిన ప్రకటనల్లోనూ కొత్త విషయమేమీ లేకపోవడంతో తెలుగుదేశం నేతలు తీవ్ర అసహనంతో ఉన్నారు. తొలి విడత బడ్జెట్ సమావేశాలు ముగిసి, మూడు వారాలు గడిచినా కూడా బీజేపీ నాయకత్వం నుంచి ఎలాంటి బుజ్జగింపు ప్రయత్నాలు జరగకపోగా, తెలుగుదేశం నేతలు చేస్తున్న ఆరోపణలకు బదులుగా కొన్ని గణాంకాలు విడుదల చేస్తూ ప్రత్యారోపణలు చేశారు. ఒకరు కేంద్రం సహకరించడం లేదని చెబుతుంటే, మరొకరు ఏ రాష్ట్రానికి ఇవ్వనంత సహాయం చేస్తున్నామని చెబుతున్నారు. దీంతో ఎవరి మాటలు నమ్మాలో అర్థంకాక, జనసేన పార్టీ నిజ నిర్ధారణ కమిటీని సైతం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ సంగతెలా ఉన్నా, తెలుగుదేశం, బీజేపీ మధ్య రోజు రోజుకీ దూరం పెరుగుతున్నట్టుగానే పరిస్థితి నెలకొంది.

తగవులాటతో తంటాలే

రెండు పిల్లుల తగవులాటలో కోతి లాభపడినట్టు మిత్రపక్షాల కీచులాటలో రాజకీయ ప్రత్యర్థులు లాభపడతారని కొందరు ఢిల్లీ పెద్దలు ఇరువురికీ సర్దిచెప్పే ప్రయత్నాలు చేశారు. బీజేపీని తూలనాడుతూ ఎన్డీయే కూటమి నుంచి బయటికొస్తే, రాజకీయంగా ప్రయోజనం ఉంటుందని తెలుగుదేశం నేతలు భావిస్తున్నారు. అయితే ఈ వ్యూహం బెడిసికొట్టి రాజకీయ ప్రత్యర్థి వైకాపా లాభపడే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ఢిల్లీ పెద్దలు అంటున్నారు. ఇదే విషయాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు చెప్పి బుజ్జగించే ప్రయత్నాలు చేశారు. ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు స్వయంగా బాబుతో మాట్లాడారని తెలుస్తోంది. దీనిపై బాబు కొంత సానుకూలంగానే స్పందించినప్పటికీ, ప్రజల్లో భావోద్వేగపూరిత అంశంగా మారిన ప్రత్యేక హోదా, రైల్వే జోన్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు పట్టుబట్టినట్టు తెలుస్తోంది. అయితే ఈ విషయాలపై వెంకయ్య నాయుడు వెంటనే ప్రధాన మంత్రి కార్యాలయం సీనియర్ అధికారి నృపేంద్ర మిశ్రాతో ఫోన్లో మాట్లాడారని సమాచారం. ప్రధాని దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి పరిష్కారం లభించే దిశగా ప్రయత్నించాలని ఉపరాష్ట్రపతి ఆయనకు సూచించినట్టు తెలుస్తోంది.

అమిత్ షాతో గురువారం కీలక భేటీ
వెంకయ్య నివాసంలోనే మంతనాలు

ఓవైపు తెలుగుదేశం, బీజేపీ మధ్య సంధి కుదిర్చే ప్రయత్నాలు కొనసాగుతుండగా, గురువారం ఉపరాష్ట్రపతి నివాసంలో బీజేపీ అధినేత అమిత్ షాతో తెలుగుదేశం ఎంపీ రామ్మోహన్ నాయుడు, ఆంధ్రప్రదేశ్ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబ రావు సమావేశమయ్యారు. దాదాపు గంట పాటు జరిగిన ఈ భేటీలో విభజన హామీల గురించే ప్రధానంగా చర్చ జరిగినట్టు తెలుస్తోంది. విభజన హామీల అమలు విషయంపై తెలుగుదేశం పార్టీ, ఏపీ ప్రభుత్వం సహా వైకాపా, జనసేన తదితర పార్టీలు ఇప్పటికే కేంద్రానికి డెడ్ లైన్ పెట్టిన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రత్యేక హోదా ఏలాగూ ఇవ్వలేదు, దానికి బదులుగా ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ విషయంలోనూ ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని రామ్మోహన్ నాయుడు బృందం అమిత్ షాకు వివరించినట్టు తెలుస్తోంది. అలాగే రైల్వే జోన్, కడప స్టీల్ ఫ్యాక్టరీ, వెనుకబడ్డ జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ అంశాలపై కూడా అమిత్ షా దగ్గర చర్చించినట్టు తెలుస్తోంది. ఈ చర్చలో తెలుగుదేశం పార్టీ వ్యవహరిస్తున్న తీరుపై అమిత్ షా కూడా అసహనం వ్యక్తం చేశారని తెలిసింది. ప్రజాక్షేత్రంలో బీజేపీని తూలనాడుతూ, నిందారోపణలు చేస్తూ రాజకీయంగా దెబ్బతీసేలా తెలుగుదేశం పార్టీ వ్యవహారశైలి ఉందని ఆయన వ్యాఖ్యానించినట్టు సమాచారం. అయితే ఈ భేటీలో ఆర్థిక శాఖకు సంబంధించిన విషయాలపై ఫోన్ ద్వారా వివరాలు కనుక్కుని, రామ్మోహన్ నాయుడు, కుటుంబ రావులకు వాటిని వెల్లడించినట్టు తెలుస్తోంది. మొత్తమ్మీద గంటపాటు జరిగిన ఈ భేటీ సారాంశం పూర్తిగా బయటకు రాలేదు. సమావేశ వివరాలను రామ్మోహన్ నాయుడు బృందం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో చర్చించిన తర్వాత తెలుగుదేశం పార్టీ తదుపరి కార్యాచరణ ఏంటన్నది నిర్ణయించుకునే అవకాశం ఉంది. నేడు (శుక్రవారం) ముఖ్యమంత్రి నివాసంలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ భేటీ జరగనున్న నేపథ్యంలో, ఈ భేటీలో తదుపరి కార్యాచరణపై చర్చించి ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

రాజ్యసభ ఎన్నికల వేళ పేచీలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఖాళీ అవుతున్న 3 రాజ్యసభ సభ్యుల పదవులకు ఇదే నెలలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ సమయంలో మిత్రపక్షాలతో పేచీలు, తగవులాటల కారణంగా 3వ అభ్యర్థిని గెలిపించుకోవడం సాధ్యపడకపోవచ్చు. టీడీపీ 3వ అభ్యర్థిని బరిలోకి దించే పక్షంలో, తమ మిత్రపక్షమైన బీజేపీ 4 ఓట్లతో పాటు వైకాపా నుంచి కూడా మరికొందరిని తమవైపునకు లాక్కోవాల్సి ఉంటుంది. ఈ సమయంలో తగవులాట తెగే వరకు లాగితే 3వ అభ్యర్థి గెలుపు కష్టంగా మారుతుంది. అందుకే తెలుగుదేశం పార్టీ తెగదెంపులు చేసుకోవాలా లేక, మరికొన్నాళ్లు వేచి చూడాలా అన్న విషయం తేల్చుకోలేని సందిగ్ధావస్థలో ఉంది. మరోవైపు ఏ పార్టీతోనూ పొత్తు లేకుండా బీజేపీ ఒక్క అభ్యర్థినైనా గెలిపించుకునే సత్తా లేదని ఆ పార్టీ నేతలకూ తెలుసు. అయితే సోము వీర్రాజు వంటి ఒకరిద్దరు నేతలు దూకుడుగా తెలుగుదేశం పార్టీపై విమర్శలు చేస్తున్నా, ఢిల్లీ పెద్దలు మాత్రం తెగదెంపులతో లాభం లేదని, కలసి సాగడమే మేలని సూచిస్తున్నారు. దీంతో మిత్రభేదానికి సంధి అనివార్యంగా కనిపిస్తోంది. ఒకట్రెండు రోజుల్లో ఈ సంధిపై స్పష్టత వచ్చే అవకాశముంది.

ఏపీ భవన్‌లో కులాల కుంపట్లు


- మరోసారి బయటపడ్డ ఉద్యోగుల మధ్య విభేదాలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో కుల విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. ఏపీ భవన్‌లో కేవలం గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబు కులస్తులకు మాత్రమే ప్రభుత్వోద్యోగాల్లో న్యాయం చేస్తున్నారని దళిత ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. వెనుకబడిన సామాజిక వర్గానికి చెందిన తమకెప్పుడూ అన్యాయమే జరుగుతోందని భవన్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కందుల ఆనందరావు గురువారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ భవన్‌లోని ఉన్నతోద్యోగులు దళిత ఉద్యోగుల విషయంలో మొదట్నుంచీ వివక్ష చూపిస్తున్నారని ఆయన చెప్పుకొచ్చారు. 2008 నుండి 2017 వరకు మొత్తం 43 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయగా, వారిలో 9 మందికి తిరిగి ఉద్యోగాలు కల్పించారు. వారందరిలో ఒకే ఒక్క దళితుడికి తిరిగి ఉద్యోగవకాశం కల్పించారని ఆనందరావు వివరించారు. 2018లో కూడా పదవీ విరమణ పొందిన అగ్ర కులస్తులకు మళ్లీ అవే ఉద్యోగాలు ఇస్తూ దళిత ఉద్యోగులను సాగనపడం అన్యాయమని ఆయన మండిపడ్డారు.

ఉద్దేశపూర్వకంగానే కొందరు ఉన్నతాధికారులు దళిత ఉద్యోగులు ఉన్నత హోదాలకు ఎదగకుండా అడ్డు పడుతున్నారని ఆనందరావు అన్నారు. గతేడాది డిసెంబర్‌లో కూడా ఏపీ భవన్ ఉద్యోగులు, అధికారుల మధ్య వాట్సప్ గ్రూపులో సంవాదం తలెత్తింది. డిప్యూటీ రెసిడెంట్ కమిషనర్ సూర్యనారాయణ దళితులను రాక్షసులతో పోల్చారని ఆవేదన వ్యక్తం చేస్తూ ఉద్యోగులు పోలీస్ కేసుల వరకూ వెళ్లారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవడం అప్పుడా వివాదం సద్దుమణిగింది. మళ్లీ రెండు నెలలు తిరిగేసరికి రిటైర్ అయిన ఉద్యోగస్తులకు తిరిగి ఉపాధి అవకాశాలు కల్పించడంపై విభేదాలు తలెత్తాయి. ఈసారి ఈ వివాదం ఎక్కడికి దారి తీస్తుందోనని ఏపీ, తెలంగాణా భవన్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీదేవి కోసం అమితాబ్ లేఖ



న్యూఢిల్లీ : అందాల రాశి శ్రీదేవి మరణం తారాలోకాన్ని, అభిమానులను ఎంతగానో కలిచివేసింది. బుధవారం సాయంత్రం బంధువులు, అభిమానుల మధ్య ఆమె అంత్యక్రియలు పూర్తయ్యాయి. బిగ్‌బీ అమితాబ్ అయితే ఆమె ఈ లోకాన్ని విడిచి వెళ్లిన దగ్గరి నుంచి ఎంతో విచారంగా ఉంటున్నారు. ప్రపంచానికి శ్రీదేవి మరణ వార్త తెలియడానికి ముందే నా మనసెంతో కలవరంగా ఉంది అని ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే. అయితే బుధవారం అంత్యక్రియల సమయంలో ఆమె మరణాన్ని స్మరించుకుంటూ అమితాబ్ రెండులైన్ల కవితను ట్వీట్ చేశారు. ఈ ప్రపంచంలో ఎవరూ శాశ్వతంగా ఉండిపోరు. అలా అని నీలా ఇంత తొందరగా లోకాన్ని విడిచి వెళ్లిపోరు అనేది ఆ కవిత సారాంశం. 1964లో బాలీవుడ్ నటుడు గురుదత్ మరణం సందర్భంగా కైఫీ అజ్మీ అనే కవి ఈ కవితను రాసి అతడికి అంకితం ఇచ్చారు.

ఆఖరి పయనంలోనూ రికార్డు?

న్యూఢిల్లీ : అర్ధ శతాబ్దం పాటు తమను అలరించిన అందాల నటి శ్రీదేవి ఆఖరి పయనం ముంబైని జనసంద్రంగా మార్చింది. అశ్రునయనాల మధ్య లక్షల్లో తరలివచ్చిన ఆమె అభిమానులు కడసారి చూపుకోసం కి.మీ కొద్దీ బారులు తీరారు. వెండి తెరపై శ్రీదేవికి నీరాజనాలు పలికిన జనం అంతిమయాత్రలోనూ లక్షలాదిగా తరలివచ్చారు. ఇసుకేస్తే రాలనంత జనంతో శ్రీదేవి అంతిమయాత్ర ఒక విధంగా రికార్డు అనే అంటున్నారు. రాజకీయేతర వ్యక్తుల్లో ఇంతలా నీరాజనాలు అందుకున్న అతి కొద్ది మంది వ్యక్తుల్లో ఒకరిగా శ్రీదేవి నిలిచిపోయారు. ముంబైలో రాజకీయేతర ప్రముఖుల అంతిమయాత్రల్లో అలనాటి గాయకుడు మహమ్మద్ రఫీదే ఆల్‌టైమ్ రికార్డు అని చెబుతుంటారు. తన గాత్రంతో దేశంలోని అన్ని వర్గాలకు దగ్గరైన రఫీ కోసం.. ఆయన అంతిమయాత్ర (జులై, 1980)కు దాదాపు 10 లక్షల పైచిలుకు జనం తరలివచ్చినట్లు చెబుతారు. భారతీయ మొట్టమొదటి వెండితెర సూపర్‌స్టార్ రాజేశ్‌ఖన్నా (జులై, 2012) అంతిమయాత్రకు మళ్లీ ఆ స్థాయిలోజనం తరలివచ్చారు. రఫీ, రాజేశ్‌ఖన్నా, రాజ్‌కపూర్, వినోద్‌ఖన్నాల తర్వాత.. శ్రీదేవి అంతిమ యాత్రలోనే జనం ఆ స్థాయిలో తరలివచ్చారు. బహుభాషల్లో నటించిన నటిగానూ, తన అందంతోనూ దక్షిణాది, ఉత్తరాది ప్రేక్షకులకు దగ్గరవడంతో ఆమెను భారతీయ మొట్టమొదటి మహిళా సూపర్‌స్టార్ అని మీడియా కొనియాడుతున్న సంగతి తెలిసిందే.

నా జీవితాన్ని నాకు వదిలేయండి

- సినీనటి అమల భావోద్వేగపు ట్వీట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సినీ నటి శ్రీదేవి మృతిపై భారతీయ మీడియాలో, సోషల్ మీడియాలో రకరకాల కథనాలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయంపై పలువురు సినీ ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలనాటి సినీ నటి అమలకూడా ఈ విషయంపై స్పందించి, చనిపోయినవారికి గౌరవం ఇవ్వండని ఫేస్‌బుక్‌లో కోరారు. ఇక నా జీవితాన్ని నాకు వదిలేయండి. వ్యక్తిగత స్వేచ్ఛను ఇవ్వండి. నిజం, లక్ష్యం వంటి అంశాల మధ్య బతికేందుకు అనుమతినివ్వండి అంటూ భావోద్వేగ పూరితంగా పేర్కొన్నారు. తనను ఎందుకు అలిసిపోయావని, ఎందుకు బరువు పెరిగావని అడగకుండా తనను ప్రశాంతంగా కాలం గడపనిస్తారా? అని ప్రశ్నించారు. తన కంటి కింద నలుపు రీడింగ్ గ్లాస్ పెట్టుకోవడం వచ్చిందని, ముడతలు వయసును బట్టి వస్తాయని, సైజ్ జీరో లాంటివి గుర్తు చేయకుండా తనను ప్రశాంతంగా కోరుకున్న దుస్తులు వేసుకోనిస్తారా? అని ఆమె అడిగారు. నాకెంత జుట్టు ఉందన్న విషయం గురించేపట్టించుకుంటారు కానీ, నాకున్న జ్ఞానాన్ని గుర్తించరు. కెమెరాలు ఓ మనిషి వ్యక్తిత్వాన్ని కచ్చితంగా చూపించగలుగుతాయా? నేను ఎలా వంట చేస్తాను? వంటి విషయాలు అడగకుండా నన్ను ప్రశాంతంగా అర్థవంతమైన విషయాలపై చర్చించనిస్తారా? అని ఆమె ప్రశ్నించారు. మార్పు వచ్చేలా ఏదన్నా విభిన్నంగా చేయాలని తాను ఆలోచిస్తున్నట్లు, భౌతికంగా తాను వెళ్లిపోయేలోపు పూర్తి చేయని విషయాలు పూర్తి చేయాలనుకుంటానని చెప్పారు. ప్రశాంతంగా తనను తన దారిలో నడవనివ్వరా? అని అమల ప్రశ్నించారు. తన జీవితంలో ఓ మిషన్‌ను పూర్తి చేయాలనుకుంటున్నానని, కానీ, ఇతరులు కలగజేసుకోవాలనుకున్నప్పుడు ఆ మిషన్‌ను పూర్తి చేయలేనని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో లైకులు, కామెంట్లు, టీఆర్పీ రేటింగ్స్, బాక్సాఫీస్ పిచ్చి నుంచి తనను విముక్తురాలిని చేస్తారా? అని ఆమె ఫేస్‌బుక్‌లో రాసుకొచ్చారు.

ఎల్‌ఈడీ బల్బులను 'అలర్ట్'కు అనుసంధానించాలి

- ఏపీ మంత్రి నారా లోకేష్

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ బల్బులను అలర్ట్‌మేనేజ్‌మెట్ వ్యవస్థకు అనుసంధానం చేయాలని పంచాయితీరాజ్, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఈ విధానం వలన బల్బులు పని చేయని పక్షంలో సకాలంలో అప్రమత్తం చేయడం ద్వారా సంబంధిత సిబ్బందికి సమాచారం అందుతుందన్నారు. గురువారం గ్రామీణ ప్రాంతాల్లో ఎల్‌ఈడీ బల్బుల ఏర్పాటు, ఉపాధి హామీ పథకంపై పంచాయితీరాజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ సకాలంలో సమస్యను పరిష్కరించిన తర్వాత యాప్ ద్వారా తిరిగి సమాచారం డాష్‌బోర్డుకు వచ్చేలా అనుసంధానం చేయాలన్నారు. ఈఈఎస్ఎల్ ద్వారా తూర్పుగోదావరి, చిత్తూరు, అనంతపురం, కడప, విజయనగరం జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ఎల్‌ఈడీ బల్బులను ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 2,39,105 ఎల్ఈడీ లైట్లను అమర్చిన ఈఈఎస్ఎల్ సంస్థ రానున్న రోజుల్లో 5237 గ్రామాల్లో ఎల్‌ఈడీ బల్బులను ఏర్పాటు చేయనుందని చెప్పారు.

మూడు రోజులు.. ఆరు సభలు

- పూర్వపు రెండు జిల్లాల్లో కొనసాగిన కాంగ్రెస్ ప్రజా చైతన్య బస్సు యాత్ర
- ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నదంటున్న నేతలు
- కేడర్‌లో నూతనోత్తేజం



రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో బస్సుయాత్ర (ఫైల్ ఫొటో)

హైదరాబాద్, ఆంధ్రప్రభ : టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేపట్టిన ప్రజా చైతన్య బస్సుయాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ పార్టీకి సెంటిమెంట్‌గా భావించే రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నుంచి ప్రారంభించిన చైతన్యయాత్ర ఈ మూడు రోజుల్లో ఆరు సభలు నిర్వహించారు. ప్రతి సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున రావడంతో కాంగ్రెస్‌లో నూతనోత్తేజం కనిపిస్తోందని అంటున్నారు. ఈ చైతన్యయాత్ర ప్రారంభం రోజున పార్టీకి చెందిన సీనియర్లందరూ హాజరుకావడం విశేషం. ముఖ్యనేతల మధ్య చిన్న చిన్న విభేదాలు ఉన్నప్పటికీ.. పార్టీ అధిష్టానం సూచన మేరకే నాయకులందరూ కలిసి వచ్చారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందనే ఆరోపణలు చేస్తూనే.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే కార్యక్రమాలను ఉత్తమ్‌తో పాటు కాంగ్రెస్ నేతలు వివరిస్తున్నారు. ప్రధానంగా రైతు రుణమాఫీ ఏకకాలంలో రూ. 2 లక్షలు చేస్తామన్న హామీపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. దీంతో పాటు రైతు ఉత్పత్తి చేసిన పంటలక గిట్టుబాటు ధర, డ్వాక్రా సంఘాలను ఆకట్టుకునే విధంగా ఒక్కో సంఘానికి రూ. 10 లక్షల రుణాలు ఇవ్వడం, వడ్డీని పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని హామీలు ఇస్తున్నారు.

ఇదిలా ఉండగా ప్రజా చైతన్య యాత్రలో భాగంగా నిర్వహించిన ఆరు సభల ప్రాంతాల్లో పార్టీ నేతల మధ్య పెద్దగా గ్రూప్ తగదాలు లేని నియోజక వర్గాలనే ఉత్తమ్ ఎంచుకున్నారని చర్చ జరుగుతోంది. చేవెళ్ల నియోజక వర్గంలో మాజీ హోం మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్ని తానై నడిపించారు. ఇక వికారాబాద్ విషయంలో మాజీ మంత్రులు ఏ. చంద్రశేఖర్, గడ్డం ప్రసాద్ వర్గాలు ఉన్నప్పటికి పెద్దగా గొడవలు లేకుండానే సభ సజావుగా సాగింది. రెండో రోజు జరిగిన తాండూర్, సంగారెడ్డిలో నిర్వహించిన సభలు విజయవంతం కావడంపైన కాంగ్రెస్ వర్గాల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

సంగారెడ్డిలో ప్రభుత్వ మాజీ విఫ్ తూర్పు జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు పెద్ద ఎత్తున స్పందన వచ్చిందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ఇక మూడో రోజు కూడా ఉమ్మడి మెదక్‌లోని నారాయణఖేడ్, జహీరాబాద్‌లో నిర్వహించిన సభలకు కూడా జనం నుంచి మంచి స్పందనే వచ్చిందని అంటున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో నారాయణఖేడ్ నుంచి కిష్టారెడ్డి, జహీరాబాద్ నుంచి గీతారెడ్డిలు విజయం సాధించిన విషయం తెలిసిందే. నారాయణఖేడ్ ఎమ్మెల్యే కిష్టారెడ్డి హఠాన్మరంతో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయింది. అక్కడ టీఆర్ఎస్ పార్టీకి చెందిన అభ్యర్థి భారీ మెజార్టీతో విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే కాంగ్రెస్ నుంచి కిష్టారెడ్డి తనయుడు బరిలో నిలిచినప్పటికి కనీసం సానుభూతిని కూడా పని చేయకపోవడంపైన కాంగ్రెస్ వర్గాల్లో అప్పట్లోనే కలవరం మొదలైంది. కాగా ఉత్తమ్ చేపట్టిన బస్సుయాత్రకు ఇప్పుడు మంచి స్పందన రావడంపైన కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనొత్తేజం కనిపిస్తున్నదని అంటున్నారు. దళిత ముఖ్యమంత్రి హామీ, దళితులకు మూడు ఎకరాల భూ పంపిణి, రెండు పడుకగదుల ఇళ్ల నిర్మాణం, ఎస్టీ మైనార్టీలకు సంబంధించి రిజర్వేషన్ల పెంపు హామీలపై కాంగ్రెస్ నేతలు ప్రభుత్వంపై విమర్శలు పెంచుతున్నారు.

కాగా మార్చి 11 వరకు మొదటి విడతగా చేపట్టే ప్రజా చైతన్య యాత్రకు గురు, శుక్ర, శనివారాల్లో విరామం ఇచ్చారు. హోలీ పండుగ సందర్భంగా మూడు రోజులు విరామం ఇచ్చి ఆదివారం నుంచి తిరిగి బోధన్ నుంచి ప్రజా చైతన్యయాత్రను ప్రారంభించనున్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

జయంతి వెంకటేశ్వర్లు

నెల్లూరు, ప్రభన్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి వెయ్యి కోట్ల రూపాయల నిధులను విడుదల చేయాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గురువారం నెల్లూరులోని హోటల్ అభిరామ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ న్యాయబద్ధమైన 9 డిమాండ్లను తీర్చాలని, హక్కుల సాధన కోసం పోరాట మార్గాన్ని ఎంచుకోక తప్పడం లేదన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుతోపాటు ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్య విద్యార్థులకు విద్య, ఉద్యోగాలలో 3 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆర్యవైశ్యులచే నిర్వహింపబడుతున్న కళ్యాణ మండపాలు, ఇతర భవనాలను ఆస్తి పన్ను నుండి మినహాయింపు ఇవ్వాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 నియోజక వర్గాల్లో గెలుపు ఓటములను నిర్దేశించే స్థితిలో ఆర్యవైశ్యులు ఉన్నారని ఆ నియోజక వర్గాలను ఆర్యవైశ్యులకే కేటాయించాలన్నారు.

శ్రీదేవిని చంపింది భారత్ మీడియానే!

- దుబాయ్ మీడియా మండిపాటు



న్యూఢిల్లీ : ప్రముఖ సినీ నటి శ్రీదేవి మృతిపై భారతీయ మీడియా వ్యవహరించిన తీరుపై ఆగ్రహం పెల్లుబుకుతోంది. దుబాయ్ మీడియా భారత మీడియాపై తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తోంది. దుబాయ్‌కు చెందిన ప్రముఖ మీడియా సంస్థ ఖలీజ్ టైమ్స్ భారతీయ మీడియాపై దుమ్మెత్తిపోసింది. శ్రీదేవి మృతిపై భారతీయ మీడియా ప్రదర్శించిన తీరును తప్పు పడుతూ ఖలీజ్ మీడియా గురువారం ఓ వార్తా కథనాన్నే ప్రచురించింది. శ్రీదేవిని హత్య చేసింది భారతదేశం మీడియానే అని ఖలీజ్ టైమ్స్ తీవ్రంగా వ్యాఖ్యానించింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రజాదరణ ఉన్న ఓ వ్యక్తి మరణంపై వాస్తవాలు తెలుసుకోకుండా అత్యుత్సాహం ప్రదర్శించిందని, అసత్య కథనాలను ప్రసారం చేసిందని భారతీయ మీడియాపై విరుచుకుపడింది. శ్రీదేవి మరణంపై మీడియా వార్తా కథనాలు తప్పు పడుతూ భారతీయుల పరువును కూడా ఖలీజ్ టైమ్స్ బజారుకు ఈడ్చింది. భారతదేశంలోని చాలా మంది ఇళ్లలో బాత్ టబ్‌లు ఉండవని, వాటి గురించి వారికి తెలియదని అవహేళన చేసింది. శ్రీదేవి గుండెపోటుతో మరణించినట్లు తొలుత వార్తలు వచ్చాయి. గుండెపోటుతో కాకుండా స్పృహ కోల్పోయి ఆమె మరణించినట్లు తర్వాత వార్తలు వచ్చాయి. తన హోటల్ గదిలోని బాత్ టబ్‌లో ప్రమాదవశాత్తు పడిపోవడం వల్ల చనిపోయిందని, దాని వెనక ఏ విధమైన నేరపూరిత కారణం లేదని దుబాయ్ పోలీసులు తేల్చారు.

అయితే ఈ సంఘటనపై వాస్తవం ఏమిటో తెలుసుకోకుండానే శ్రీదేవి డెత్ మిస్టరీ అంటూ కథనాలు ప్రసారం చేయడాన్ని, బాత్‌టబ్‌లో సన్నివేశాలను చూపుతూ కథనాలు ప్రసారం చేయడాన్ని ఖలీజ్ టైమ్స్ తీవ్రంగా విమర్శించింది. దాదాపు అన్ని టీవీ చానెళ్లు తమ సృజనాత్మకతకు పదును పెట్టి బాత్‌టబ్‌లో సీన్స్‌ను చిత్రీకరిస్తూ శ్రీదేవి మరణంపై వార్తా కథనాలు ప్రసారం చేయడం పట్ల ఖలీజ్ టైమ్స్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. సంఘటన జరిగినప్పటినుంచి తమ సంస్థ ప్రతినిధులు వాస్తవ సమాచారాన్ని అందించేందుకు ప్రయత్నించారని, కానీ భారతీయ మీడియా తమ సమాచారాన్ని కూడా వక్రీకరిస్తూ తమకిష్టమైన రీతిలో కథనాలను ప్రసారం చేసిందని ఖలీజ్ టైమ్స్ అన్నది. దుబాయ్‌లో శ్రీదేవి ప్రమాదవశాత్తు మరణించిందని స్పష్టంగా తేలినా కూడా కొంతమంది జర్నలిస్టులు ఆమె మృతి వెనుక రహస్యమంటూ కాస్మోటిక్ సర్జరీలు, శరీరంలో ఆల్కహాలు ఉన్నాయని కథలు అల్లడం తమకు ఆశ్చర్యాన్ని కలిగించినట్లు ఖలీజ్ మీడియా తెలిపింది. కొన్ని న్యూస్ ఛానెళ్లు శ్రీదేవి మరణం విషయంలో చేసిన ప్రసారాలు వెర్రితలలు వేసిందని అభిప్రాయపడింది.

హోదాయే సంజీవని

- నాలుగేళ్లుగా జగన్ ఉద్యమం
- 5న జంతర్ మంతర్ వద్ద ధర్నా
- ఏప్రిల్ 6న రాజీనామాలు : విజయసాయి

విశాఖపట్నం, ప్రభ న్యూస్: ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల సాధన కోసం వైకాపా ఎంపీలు ఏప్రిల్ 6న రాజీనామాలు చేసి ప్రజా పోరాటానికి సిద్ధం అవుతారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్య సభ సభ్యులు విజయసాయి రెడ్డి వెల్లడించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు గురువారం 13 జిల్లాల్లోనూ ప్రత్యేక హోదా సాధనకోసం మహా ధర్నాలను నిర్వహిస్తున్నామని, 5న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద తాడోపేడో ప్రదర్శన చేస్తామన్నారు. అప్పటికీ కేంద్రం దిగిరాకపోతే, ప్రత్యేక హోదాతో పాటూ ప్రత్యేక రైల్వే జోన్ ప్రకటన, విభజన చట్టంలోని అంశాల అమలు నిర్ణయం ప్రకటన చేసి తీరాలన్నారు. అలా జరగకపోతే ఏప్రిల్ 6న తమ పార్టీల ఎంపీల చేత రాజీనామాలను చేయించి ప్రజా ప్రయోజనాల కోసం సిద్ధం అవుతున్నారని పేర్కొన్నారు. విశాఖపట్నం గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఎదురుగా ఉన్న మహాత్మ గాంధి విగ్రహం వద్ద వైకాపా నేతలు ప్రత్యేక హోదా కేంద్రం ఇవ్వాలని పట్టుబడుతూ నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన తెలిపారు. ఆ తరువాత కలెక్టర్ కార్యాలయం వరకూ పాదయాత్రగా వెళ్లారు. వినతిపత్రం సమర్పించారు. నిన్నటి వరకూ ప్రత్యేక ప్యాకేజీయే ముఖ్యమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు మాట మార్చి జగన్ బాటలోనే పయణిస్తూ, మళ్లీ ఆయన కూడా ప్రత్యేక హోదా పాట పాడుతున్నారని గుర్తు చేశారు. గత నాలుగేళ్లుగా వైకాపా అధినేత జగన్ నిరంతరాయంగా ప్రత్యేక హోదా అవసరాన్ని నవ్యాంధ్ర ప్రజల ప్రయోజనాల్ని ముందుచూపుతో ఆలోచించి ఉద్యమిస్తూ వస్తున్న ఏకైక నాయకుడిగా ఆయన అభినందించారు. ఈ సందర్భంగా రాజ్య సభ సభ్యులు విజయ సాయిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కు ప్రత్యేక హోదా అన్నారు. పార్లమెంట్‌లో ఏ ప్రభుత్వం చట్టం చేసినా, ఆ తరువాత వచ్చే ప్రభుత్వాలు మారిపోయినా, అమలు చేసి తీరాలన్నారు. రాష్ట్రవిభజనకుముందు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ నష్టపోయిన ఆంధ్రాకు అయిదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామంటే, నేడు అధికారంలోకి వచ్చిన భాజపా ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్లు కావాల్సి ఉందని చెప్పలేదా? నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు 15 ఏళ్లు కావాలని అడగలేదా? అని నిలదీసారు. వీటిల్లో ఏదీ ఇవ్వకపోగా, రాష్ట్రప్రయోజనాలను పూర్తిగా నాశనం చేయడం ఎంత వరకూ సమంజసం అన్నారు.

ఏపీలో 238 అన్‌ఎయిడెడ్ కాలేజీల జాడ గల్లంతు!

- అడ్రసు ఒకచోట, నిర్వహణ మరెక్కడో...
- విచారణకు ఐదుగురు సభ్యులతో కమిటీ
- ఉన్నత విద్యా మండలికి త్వరలో నివేదిక
- కొన్ని ప్రైవేట్ కళాశాలలకు నోటీసులు?

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ లో కొన్ని ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తుండడంతో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఈ విషయంలో సీరియస్‌గా ఉంది. అసలు వాటి స్థితి గతులు, వాటి సంపూర్ణ వివరాలు తెలుసుకునేందుకు తాజాగా ఒక ఉన్నత స్థాయిలో సర్వేను నిర్వహించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉన్నతాధికారులు నిర్ణయించారు. వాస్తవానికి వీటిలో కొన్నింటి ఆచూకీ కనిపించక పోవడంతో వీటిపై సర్వే నిర్వహించి, సకాలంలో నివేదిక అందజేసేందుకు ఉన్నత విద్యా మండలి నిర్దేశిత కమిటీని నిర్మాణం చేసింది. అసలు రాష్ట్రంలో పాతవి ఎన్ని ఉన్నాయి. ఎక్కడ ఉన్నాయి. ఏ పోజిషన్‌లో ఉన్నాయి. కొత్తగా ప్రైవేట్ అన్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలా ? లేదా అనే విషయంపై ఈ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు గాను ఉన్నత విద్యా మండలి అయిదుగురు సభ్యులతో ఒక నిపుణుల కమిటీని కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఉన్నత స్థాయిలో కమిటీలో ప్రొఫెసర్ కె.రామారావు (రిటైర్డ్ ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ,రావులపాలెం, ప్రొఫెసర్ కె. హేమచంద్రా రెడ్డి (మాజీ రిజిస్ట్రార్ జేఎన్‌టీయు), సుదేశ్ ఆనంద్ (ఉన్నత విద్యా మండలి లీగల్ కన్సల్టెంట్, ప్రొఫెసర్ టీవీ కృష్ణమూర్తి (డిప్యూటీడైరెక్టర్, రాష్ట్రఉన్నత విద్యామండలి), బీఎస్ సెలినా (ఉన్నత విద్యా మండలి అకడమిక్ సెల్ లెక్చరర్)లు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ప్రతి సంవత్సరం కొత్త విద్యా సంవత్సరం ప్రారంభంలో ఉన్నత విద్యా మండలి ఈ విధమైన సర్వేకు పూనుకుంటుంది. ఏ ప్రాంతంలో కొత్త ప్రైవేట్ అన్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు అవసరం ఉందో ఈ కమిటీ ద్వారానే నివేదిక తెప్పించుకుని అందుకనుగుణంగా కొత్త అన్‌ఎయిడెడ్ కళాశాలలకు అనుమతిని మంజూరు చేస్తుంటుంది.

ఈ క్రమంలోనే ఈ విద్యా సంవత్సరం కూడా ఉన్నత విద్యామండలి ఇందు కోసం కమిటీని ఏర్పాటు చేసిందంటున్నారు. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగానే 2018 -19 విద్యా సంవత్సరానికి కొత్తగా నోటిఫికేషన్ ఇవ్వాలా? లేదా అనే నిర్ణయానికి వస్తారు. రాష్ట్రంలో కొత్తగా అన్‌ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలకు అనుమతి ఇవ్వాలంటే యూజీసీ యాక్ట్ నిబంధనలను అనుసరించాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న కాలేజీలు,కోర్సులు, మంజూరైన సీట్లు, ఫస్టియర్‌లో ప్రవేశాలు ,2016లో ఫైనల్ ఇయర్ పరీక్షలకు హాజరైన వారి వివరాలు, 2017లో ఖాళీగా ఉన్న సీట్లు సమాచారంతో పాటు ఎన్నింటికి సొంత భవనాలున్నాయి. ఎక్కడెక్కడ సొంత భవనాలు లేవు.ఎన్నేళ్లుగా అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.అనుమతి తీసుకున్న చోటనే కళాశాలలను నిర్వహిస్తున్నాయా ? లేదా ? అనే తదితర విషయాలను కూడా ఈ కమిటీ సేకరించి, ఉన్నత విద్యా మండలికి నివేదిస్తుంది. అదే విధంగా 2016లో సెకండియర్‌లో పాసైన వారి వివరాలు, ప్రస్తుతం ఉన్న పాఠశాలలు, పదో తరగతిలో మొత్తం సీట్లు, విద్యార్థుల ప్రవేశాలు తదితర సమాచారం సేకరించి, ఉన్నత విద్యా మండలికి కమిటీ నివేదిస్తుంది.అనంతరం ఉన్నత విద్యా మండలి అధికారులు నివేదికపై చర్చించి, తుదపరి కార్యాచరణను రూపొందిస్తారు.

మహారాష్ట్రతో కలసి పనిచేస్తాం: ఆగాఖాన్



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాలలో మహారాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్దంగా ఉన్నామని అగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ ప్రకటించింది. శుక్రవారం ముంబైలో మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావుతో షియా ఇస్మాయిలీ ముస్లిం ఆధ్యాత్మిక వేత్త అగాఖాన్ భేటీ అయ్యారు. డైమండ్ జూబ్లీ పర్యటనలో భాగంగా గవర్నర్ తో భేటీ అయిన సందర్భంగా అగాఖాన్ మాట్లాడుతూ, గిరిజనాభివృద్ధికై మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అభినందించారు. అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు తమ సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.

అగాఖాన్ ఇస్లాం సందేశాన్ని చాటాలి - గవర్నర్

ఆధ్యాత్మిక వేత్త అగాఖాన్ ప్రపంచానికి ఇస్లాం సందేశం అందించాలని గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్ రావు కోరారు. మానవతా దృక్పథంతో అగాఖాన్ ప్రపంచ వ్యాప్తంగా అందిస్తున్న సేవలను గవర్నర్ ప్రశంసించారు. దేశంలోని రైతుల ఆదాయాన్ని 2012 నాటికి రెట్టింపు చేయాలన్న లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. మహారాష్ట్రలో వ్యవసాయం ఇతర రంగాల్లో సహకరించేందుకు ముందుకు వచ్చినందుకు అగాఖాన్‌కు గవర్నర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

మత్తిచ్చి దోచేశారు

యశ్వంతపూర్ రైల్లో దోపిడీ

- 13 మంది ప్రయాణికుల సెల్‌ఫోన్లు, నగదు అపహరణ
- గూడూరు ఏరియా ఆస్పత్రిలో బాధితులకు చికిత్స
- ఆర్థిక సహాయమందించిన పోలీసులు

గూడూరు, ప్రభ న్యూస్ : చెన్నై నుంచి యశ్వంత్‌పూర్, లక్నోకు వెళ్తున్న రైలులో గురువారం తెల్లవారు జామున గూడూరు సమీపంలో కొంత మంది దోపిడీ దారులు ప్రయాణికుల మాదిరిగానే రైల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులతో మాటామాటా కలిపి మేము వ్యాపారస్తులమని మాయ మాటలు చెప్పి ప్రయాణికులకు మత్తుమందు కలిపిన బిస్కెట్లు, శీతల పానీయాలను ఇవ్వడంతో నమ్మి వాటిని తీసుకున్న ప్రయాణికులు స్పృహ కోల్పోయి పడిపోవడంతో ప్రయాణికులు వద్దనున్న సెల్ ఫోన్లు, నగదు నగలను దుండగులు దోచుకెళ్లారు. రైల్వేలో వున్న సీఆర్‌ఎఫ్ పోలీసులు స్పృహ తప్పి పడిపోయిన వారిని గుర్తించి గూడూరులో స్టాపింగ్ లేకున్నా చైన్ లాగి గూడూరు రైల్వే స్టేషన్‌లో రైలును నిలిపి వేశారు. వెంటనే రైల్వే సిబ్బంది గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. వీరిలో ఏడుగురు ప్రయాణికులు అపస్మారకస్థితిలో ఉన్నారని రైల్వే పోలీసులు తెలిపారు. వెంటనే రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రైల్వేలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడంతో రైల్వే శాఖ అధికారులు అప్రమత్తమై కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని గాలింపు చర్యలు చేపట్టినా కూడా దుండగులు పరారయ్యారు. ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు బాధితులకు మెరుగైన చికిత్సలను అందించారు.





బాధితులకు పోలీసుల చేయూత

యశ్వంత్ పూర్, లక్నో ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఆహార పదార్థాల్లో మత్తు మందు కలిపి ఇచ్చి వారి వద్ద నుండి నగదు, ల్యాప్ టాప్‌లను అపహరించుకొని వెళ్లిన వారిని పట్టుకునేందుకు గూడూరు రూరల్ సీఐ అక్కేశ్వరరావు, జీఆర్‌పీ సీఐ దశరథరామారావుతో పాటు జీఆర్‌పీ, లోకల్ పోలీసులతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి నిందితులను పట్టుకునేందుకు పంపించామని గూడూరు డీఎస్పీ రాంబాబు తెలిపారు. గూడూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైల్వే ప్రయాణికలను డీఎస్పీ రాంబాబు పరామర్శించి ఆసుపత్రిలోని వైద్యులతో వారి ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకుని రైల్వే ప్రయాణికులకు కావాల్సిన అన్ని వసతులను సమకూర్చి వారికి ఆహార పొట్లాలతో పాటు వారు ఊరికి వెళ్లేందుకు ఖర్చులను డీఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఫిబ్రవరి 28న యశ్వంత్ పూర్ నుండి లక్నోకి బయలు దేరిన రైల్లో జనరల్ బోగిలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు కొంత మంది దుండగులు మత్తు మందు కలిపి ఆహారం ఇచ్చి వారు అపస్మారక స్థితులో చేరుకొన్న అనంతరం వారి వద్ద నున్న నగదు, ల్యాప్‌టాప్‌లు, విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు దోచుకు వెళ్లినట్లు బాధితుల ద్వారా తెలిసిందన్నారు. ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకొని పటిష్ట చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈయన వెంట రూరల్ సీఐ అక్కేశ్వరరావు, పట్టణ సీఐ సుబ్బారావు, రైల్వే సీఐ దశరథరామారావు, ఎస్సై నరేష్, రైల్వే ఎస్సైలు బాలకృష్ణ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

ఆసరా బడ్జెట్ విడుదల చేయాలి

సీఎం కేసీఆర్‌కు ఆర్ కృష్ణయ్య విజ్ఞప్తి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: వృద్ధులు, ఇతర వర్గాల వారికి గత మూడు నెలలుగా పెన్షన్లు రాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు ఆసరా పెన్షన్లకు ఇవ్వాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. నెల నెలా వచ్చే పెన్షన్లపై రాష్ట్ర వ్యాప్తంగా 35 లక్షల మంది వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, వికలాంగులు, నేత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు, బీడికార్మికులు ఉన్నారని ఆర్ కృష్ణయ్య గుర్తు చేశారు. గత మూడు నెలలుగా రాకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తోందని, అప్పులు దొరకని వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ ఆయన సీఎంకు లేఖ రాశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పెన్షన్‌ను రూ. 1000 నుంచి రూ. 2000 పెంచాలన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పెన్షన్లు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో పెన్షన్లకు నిధులను పెంచాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

అమరావతి, ఆంధ్రప్రభ: మహిళా సంక్షేమానికి కట్టుబడిన టీడీపీ ప్రభుత్వం పురుషులతో సమానంగా వారికి అన్ని రంగాల్లో అవకాశాలను కల్పించడం జరుగుతోందని టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ తెలియజేశారు. గురువారం మహిళా సాధికారత, లింగ సమానత్వంపై డీడ్స్, ఎస్ వుయ్ కెన్, వినిక్ సంస్థల ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సదస్సును గుంటూరులో నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జయదేవ్ మాట్లాడుతూ పురుషుడు విద్యావంతుడైతే వ్యక్తిగతంగా అభివృద్ధి చెందుతాడని, అదే మహిళ విద్యావంతురాలైతే ఆమెతోపాటు కుటుంబం, సమాజం కూడా అభివృద్ధి చెందుతాయని చెప్పారు. గత ఏడాది దేశంలోనే తొలిసారిగా మహిళా సాధికారత జాతీయ సదస్సును ప్రజా రాజధాని అమరావతిలో టీడీపీ ప్రభుత్వం నిర్వహించిందని గుర్తు చేశారు. విదేశాలతో పోలిస్తే మన దేశంలో ఇంకా కొన్ని రంగాల్లో మహిళలు వెనుకబడి ఉన్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా అభివృద్ధి వైపు అడుగులు వేయాలన్నారు.

18 నుంచి 22 దాకా విలంబి పూజలు

యావత్ జనావళి సుఖ శాంతులకోసం
పరిపూర్ణానంద స్వామి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: విలంబి నామ సంవత్సరంలో అందరికీ మేలు చేకూరాలన్న సంకల్పంతో ఉగాది పర్వదినం మార్చి 18 నుంచి 22 వ తేదీ వరకు శ్రీపీఠం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానందస్వామి మాట్లాడుతూ, నిజాం కళాశాల మైదానంలో ప్రతి రోజూ సాయంత్రం అయిదున్నర గంటల నుంచి తొమ్మిది గంటల వరకు కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు. విలంబి నామ సంవత్సరంలో రెండు తెలుగు రాష్ట్రా లు, దేశంలోని 126 కోట్ల ప్రజలు, యావత్ ప్రపంచంలోని వారంతా సుఖశాంతులతో విరాజిల్లాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు స్వామీజీ తెలియజేశారు. 18 వ తేదీ ఆదివారం ఉగా ది రోజున శ్రీ వేంకటేశ్వరస్వామి తిరుమంజనము, శ్రీభూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కళ్యాణం, లక్ష తులసీ గళార్జన (భజన), విష్ణు సహస్రనామ పారాయణ గరుడ వాహన సేవ ఉంటుందన్నారు. 19 వ తేదీ సోమవారం అమ్మవారి కుంకుమార్చన, శివ పార్వతుల కళ్యాణం, కళ్యాణాంగపూజ, శ్రీలలితా సహస్రనామస్తోత్ర పారాయణంతో మంది వాహన సేవ, 20 వ తేదీ మంగళవారం శ్రీలక్ష్మీదేవికి క్షీరాభిషేకము, హనుమాన్



చాలీసా పఠనం, శ్రీహనుమాన్ భజన, 21 వ తేదీ బుధవారం శ్రీగణపతి అభిషేకము, లక్ష భిల్వార్చన, దుర్వార అర్చన, ఘణపతి భజన, సిద్ధిబుద్ధి సమేత గణపతి కళ్యాణము, గజ వాహనసేవ, 22 వ తేదీ గురువారం షిర్డీ సాయినాథుని అభిషేకం, గురు చరిత్ర పారాయణం హయగ్రీవ వేదవ్యాస, ఆది శంకరాచార్య, అవతార్‌బాబా, గురు పాదుకాపూజతో కార్యక్రమానికి ముగింపు పలుకుతామన్నారు. ఈ అయిదు రోజుల కార్యక్రమంలో భక్తులందరికీ ఉచిత ప్రవేశమని, అందరూ పూజాది కార్యక్రమాలలో పాల్గొనేందుకు వీలు కల్పించామన్నారు.

ప్రముఖ రచయిత నాయని కన్నుమూత

తిరుపతి , ప్రభన్యూస్ బ్యూరో: చిత్తూరు జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత, పరిశోధకుడు నాయని కృష్ణమూర్తి(69) గురువారం ఉదయం బెంగుళూరులో కన్నుమూశారు. జిల్లాలోని చౌడేపల్లిలో నేడు కృష్ణమూర్తి అంత్యక్రియలు జరగనున్నాయి. చిత్తూరు జిల్లా గుర్రంకొండ మండలం నడించర్లలో 1951లో జన్మించిన నాయుని కృష్ణమూర్తి తొలినుంచి తెలుగుభాషపై ఉన్న మక్కువతో సాహితీ పరమైన కృషి చేస్తూ వచ్చారు. అనతికాలంలోనే ఎన్నో పుస్తకాలను, గేయాలను రచించిన కృష్ణమూర్తి ప్రముఖ తెలుగు రచయితగా, సాహితీ పరిశోధకుడుగా గుర్తింపు పొందారు. జిల్లాలోని చౌడేపల్లిలో విజయవాణి విద్యాసంస్థలను స్థాపించి విద్యారంగానికి సేవలందిస్తూనే తన సాహితీ యజ్ఞాన్ని కొనసాగించారు. 7వతరగతి, 10వతరగతి పాఠ్యాంశాలతో ఆయన నేతృత్వంలో రూపొందిన మాబడి, పాఠశాల పుస్తకాలు తెలుగునాట బహుళ ప్రాచుర్యం పొందాయి. జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత సాధించడానికి ప్రభుత్వం అమలు చేసిన అక్షర తపస్మాన్ కార్యక్రమాన్ని కృష్ణమూర్తి 1989 నుంచి 2000 వరకు సారథ్యం వహించారు. ప్రముఖ దర్శకుడు వంశీ దర్శకత్వంలో వచ్చిన మహర్షి సినిమాలో ఆయన రచించిన సుమం.. ప్రతి సుమం.. వనం.. ప్రతి వనం అనే చరణంతో



రచించిన పాట విశేష ప్రాచుర్యం పొందింది. నిత్య అధ్యయనశీలి అయిన కృష్ణమూర్తి తన 23వ ఏట 'యామినీ కుంతలాలు' అనే పేరుతో ఒక గొప్ప నవలను రాసి ప్రశంసలు అందుకున్నారు. 19 74 లో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక నిర్వహించిన ఉగాది నవలల పోటీలో బహుమతి పొం దింది. ఇటీవలి కాలంలో మహా భారత కావ్యాన్ని విభిన్న కోణంలో ఆవిష్కరిస్తూ జయ మ్ పేరుతో రచించిన నవల బహుళ ప్రాచుర్యం పొందింది. ఆయన రచనలకు లండన్ ముద్రణాసంస్థల గుర్తింపు కూడా లభించడం చెప్పుకోదగిన విశేషం. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణమూర్తి బెంగుళూరులో చికిత్స పొందుతూ గురువారం ఉదయం 7 గంటలకు కన్నుమూశారు. ఈరోజు చౌడేపల్లిలో నాయుని కృష్ణమూర్తి అంత్యక్రియలు జరుగుతాయని విజయవాణి సంస్థల ప్రతినిధి నాయుని సుధాకర్ తెలిపారు. రాష్ట్రమంత్రి ఎన్ అమరనాథ్ రెడ్డి గురువారం ప్రగాఢ సంతాపం తెలిపారు. కృష్ణమూర్తితో తమకుఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన మర ణంతో జిల్లా నుంచి సాహితీవేత్తను, తెలుగుభాషాభిమానిని, రచయితను కోల్పోయిందని తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

మండుతున్న ఎండలు

హీట్‌వేవ్ జోన్ల జాబితాలో తెలుగు రాష్ట్రాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: నిన్న మొన్నటిదాక చలి గజగజ వణికించింది. ఇప్పుడేమో ఎండలు మండిపోతున్నాయి. ఒక్క తెలంగాణాలోనే కాదు దేశంలోని చాలా ప్రాంతాల్లో ఎండలు మండిపోతున్నాయి. వివిధ రాష్ట్రాల్లో సాధారణ ఉష్ణోగ్రతలకంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. మార్చి ప్రారంభంలోనే ఈ విధంగా ఉంటే ఇక పోను పోను ఎండల తీవ్రత మరెంత అధికంగా ఉంటుందో అన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. మార్చి నుంచి మే మధ్య కాలంలో సగటు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే పైనే ఉంటాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. సాధారణం కంటే రెండు డిగ్రీల మేరకు ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించింది. జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిషా, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర , చత్తిస్ గడ్ , ఉత్తరప్రదేశ్, బీహార్ , మరత్వాడ, విదర్భ లాంటి ప్రాంతాల్లో అసాధారణంగా ఎండలు పెరగనున్నాయని హెచ్చరిక చేసింది. హీట్ వేవ్ జోన్ల జాబీతాలో తెలంగాణ , కోస్టల్ ఆంధ్ర, రాయల సీమ ప్రాంతాలు ఉన్నాయి. ఇక కేరళ, తమిళనాడు, రాయల సీమ, దక్షిణ కర్నాటక ప్రాంతాల్లో సాధారణ స్థాయికంటే 0.5 డిగ్రీల మేరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. ఢిల్లీ, హరియాణా, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కూడా సాధారణం కంటే 1.5 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనావేస్తున్నారు. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో సాధారణం కంటే 2.3 డిగ్రీలవరక ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

పొత్తు విచ్ఛిన్నం..!

- ఒంటరి పోరుకు కమల దళం సన్నద్ధం
- టీడీపీతో చెలిమికి బీజేపీ రాంరాం
- చేరికలకు లైన్ క్లియర్ అంటున్న నేతలు
- కాంగ్రెస్‌తో జతకట్టేందుకు వామపక్షాలు ఆలోచనలు!

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న టిడిపితో చెలి మికి బిజెపి రాంరాం చెప్పింది. నిన్నటి వరకు మేం పొత్తులతో వెళ్ళమని కమల దళా ధిపతులు అంటే తాజాగా టిడిపి అధినేత చం ద్రబాబునాయుడు దూరమయ్యామని నేతలకు తేల్చి చెప్పడంతో వచ్చే ఎన్నికల్లో బిజెపి ఒంటరి అవుతుందన్న విషయం స్పష్టమైంది. కాంగ్రెస్‌తో కలిసేందుకు వామపక్షాలు, కొన్ని ఇతర పార్టీలు కొంత ఆలోచనలు చేస్తున్నాయి. మరో పక్క టిఆర్‌ఎస్‌తో కలిసేందుకు సిద్దంగా ఉండాలని చంద్రబాబు తెలంగాణ కార్య కర్తలకు చెప్పకనే చెప్పడం చూస్తుంటే బిజెపి మాత్రమే ఎవరితో కలిసేందుకు సిద్దంగా లేదన్న విషయం స్పష్టమవుతోంది. దాదాపు రెండు దశాబ్దాల పాటు రాష్ట్రంలో టిడిపి, బిజెపి చెలిమి కొనసాగింది. మారుతున్న సమీకరణల వల్ల టిడిపి దాదాపు తెలంగాణలో ఉనికి కోసం పాకులాడాల్సిన పరిస్థితికి చేరింది. తెలంగాణకు టిడిపియే ఇంతకాలం అడ్డుపడిందన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా నాటుకు పోవడంతో గత ఎన్నికల్లో ఆ పార్టీ 12 అసెంబ్లీ స్థానాలకు మాత్రమే పరి మితమైంది. మా వల్లే తెలంగాణ సాకారమైందని, పార్లమెంట్‌లో బిజెపి మద్ద తివ్వడం వల్లే ప్రత్యేక రాష్ట్రం వచ్చిందని చెప్పుకున్న బిజెపికి కేవలం అయిదు స్థా నాలు మాత్రమే దక్కాయి. ఎన్నికల అనంతరం టిఆర్‌ఎస్ అధికారంలోకి రావ డం, అధికార పార్టీలోకి టిడిపి ఎంఎల్‌ఎలు ఒక్కొక్కరు చేరడంతో ఆ పార్టీ పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది.

గ్రేటర్ మునిసిపల్ ఎన్నికల్లో కేవలం ఒక్క స్థానానికి దిగజారడంతో టిడిపి పని అయిపోయిందని భావించిన బిజెపి నేతలు 2019లో ఒంటరిగానే పోటీ చేస్తామని, టిడిపి తెలంగాణలో లేనేలేదని ఇంతకాలం చెప్పు కొచ్చారు.



హైదరాబాద్ పరిధిలో పార్టీకి కొంత ఆధరణ లభిం చినప్పటికీ గ్రామీణ ప్రాంతాలలో పార్టీని ఆదరించక పోవడానికి కారణం టిడిపితో పొత్తే కారణమని పలు సందర్భాలలో పార్టీ నేతలు చెప్పారు. అయినప్పటికీ అధిష్టానం టిడిపితో కలిసి పొమ్మంటుందని కార్యకర్తలు ఇంత కాలం అను కుంటున్నప్పటికీ అదేం లేదని, బిజెపితో తెగతెంపులేనని చంద్రబాబు చెప్పడంతో బిజెపి నేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒంటరిపోరుకు సన్నద్ధమవుతున్న తరుణంలో ఇంతకాలం పార్టీ శ్రేణుల్లో ఉన్న సందేహాలను చంద్రబాబు ప్రకటనతో తీరినట్లైందని వారు అంటున్నారు.

2014లో నష్టపోయిన టీడీపీ

టిడిపితో పొత్తు వల్లే 2014 ఎన్నికల్లో పార్టీ తీవ్రంగా నష్ట పోయిందని, ఒంటరిపోరు వల్ల పార్టీకి మరింత మేలు చేకూరుతుందని నేతలు అంటున్నారు. అధికార టిఆర్‌ఎస్ పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, దీన్ని పార్టీకి అనుకూలంగా మలచుకునే పనిని మరింత ముమ్మరం చేసి టిడిపి, టిఆర్‌ఎస్ కూటమికి సత్తా ఏంటన్నది చూపిస్తామని నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో హైదరాబాద్ తరహాలోనే జిల్లాలలోనూ పార్టీకి అసెంబ్లీ స్థానాలు దక్కుతాయన్న దీమాను నేతలు వ్యక్తం చేస్తున్నారు. టిడిపితో పొత్తుపై స్పష్టత వచ్చిన నేపథ్యంలో పార్టీలో చేరేందుకు ఇంతకాలం సంశయంలో ఉన్న వారు ఏదో ఒక నిర్ణయానికి రావచ్చని కూడా నేతలు అంటున్నారు.



విభజన హామీల అమలుపై నేడు జెఎఫ్‌సీ నివేదిక

హైదరాబాద్, ఆంధ్రప్రభ: విభజన హామీల అమలుపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటైన నిజనిర్ధారణ కమిటీ (జెఎఫ్‌సి) నివేదికను జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ శుక్రవారం విడుదల చేయనున్నారు. ఈ కమిటీలోని ముగ్గురు సభ్యులు గురువారం తమ నివేదికను పవన్‌కు అందజేశారు. పవన్ అధ్యక్షతన గురువారం సమావేశమైన కమిటీ ఈ నివేదికపై సమీక్షించింది. ఈ సమావేశంలో కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి పద్మనాభయ్య, లోక్‌సత్తా జాతీయ అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ్, ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు, లోక్‌సభ మాజీ సభ్యుడు ఉండవల్లి అరుణ్ కుమార్, ఐఏఎస్ మాజీ అధికారి తోట చంద్రశేఖర్, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. కమిటీ నివేదిక రూపకల్పనపై చర్చలు జరిపారు. ఈనెల 3న ప్రజల ముందు నివేదిక ఉంచాలని నిర్ణయించారు. ఇలా ఉండగా, రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించే విషయంపై పవన్ కళ్యాణ్ ఉద్యమాన్ని చేపట్టేందుకు వివిధ రాజకీయ పార్టీల నేతలు, విద్యావంతులతో ఇటీవల సమావేశాలు నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్రానికి ఎంతో చేశామంటూ కేంద్రం చెప్పడం, తమకు ఎలాంటి సహాయం అందలేదని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడంతో వాస్తవాలు తెలుసుకునేందుకు ముగ్గురు సభ్యులతో నిజనిర్ధారణ కమిటీని నియమించారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కంభంపాటి హరిబాబు విడుదల చేసిన 27 పేజీల నివేదిక, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సమాచారాన్ని క్రోడీకరించి ఈ కమిటీ ఈ మేరకు నివేదికను రూపొందించింది. ఈ నివేదికను గురువారం పవన్ కళ్యాణ్‌కు అందించగా, దాన్ని ప్రజల ముందు ఉంచాలని నిర్ణయించారు.

సుబ్బారాయుడు, హరీశ్వర్‌రెడ్డికి ఏపీ సీఎం చంద్రబాబు పరామర్శ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: అపోలో ఆసుప్రతిలో చికిత్స పొందు తున్న మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ శాస నసభ్యుడు కె.హరీశ్వర్‌రెడ్డిలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు గురువారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న వారి బంధువులతో కొద్దిసేపు చంద్రబాబు మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.తనను పరామర్శించేందుకు రావడంపట్ల హరీశ్వర్‌రెడ్డి సంతోషం వ్యక్తంచేస్తూ చంద్రబాబును దగ్గరకు పిలిచి చేయి పట్టుకుని కంటతడి పెట్టుకున్నారు. ఈ దశలో చంద్రబాబు ధైర్యంగా ఉండాలంటూ ఆయనను సముదాయించారు.



అనంతపురం జిల్లా తెదేపా సీనియర్ నాయకుడు వై సుబ్రహ్మణ్యం కుమారుడి వివాహం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు హాజరై వధూవరులను ఆశీర్వదించారు



కాకినాడలో ఉప ముఖ్యమంత్రి చిన రాజప్ప కుమారుడు రంగనాగ్ వివాహం జరిగింది. ఈ కార్య క్రమానికి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు.


కడలిపై డ్రాగన్ పంజా



- అణు విమానవాహక నౌక నిర్మాణం
- సాగర జలాల్లో సుదూర లక్ష్యాలపై చైనా కన్ను
- ప్రపంచంలోనే శక్తివంతమైన నావికాదళం
- 2025 నాటికి రంగంలోకి విమానవాహకనౌక


బీజింగ్: చైనా తొలిసారిగా అణు శక్తితో పనిచేసే విమానవాహక నౌకను తన అమ్ములపొదిలో చేర్చుకోవడానికి సన్నాహాలు చేస్తున్నదని ప్రభుత్వ మీడియా పేర్కొంది. వ్యూహాత్మక ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడు అంతకంతకు పెరిగిపోతున్న నేపథ్యంలో పిఎల్ఏ నావికా దళాన్ని ఒక శక్తివంతమైన భారీ నావికా దళంగా తయారు చేయడంలో భాగంగా సన్నాహాలు జరుగుతున్నాయి. 2012లో ఉక్రెయిన్ నుంచి కొనుగోలు చేసిన సోవియట్ నౌకకు లియోనింగ్ అని నామకరణం చేయడం ద్వారా చైనా మొట్టమొదటి విమానవాహక నౌకను సాగర జలాల్లోకి పంపించింది. ఇక రెండవ నౌకా మొట్టమొదటిసారిగా దేశీయంగా నిర్మితమైన టైప్ 001ఎ నౌకను గతేడాది ఏప్రిల్ మాసంలో జాతికి అంకితం చేసింది. మూడవ విమానవాహక నౌక టైప్ 002 షాంఘై జియాంగ్నాన్ షిప్‌యార్డ్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్మితమవుతున్నది. అయితే దీని అధికారులు నిర్ధారించాల్సి ఉంది. చైనా భారీ విమానవాహక నౌక అణుశక్తిని సంతరించుకోనుంది. ఈ మేరకు ప్రభుత్వానికి చెందిన ఒక రక్షణ కంపెనీ తన అజెండాలో ఈ రంగంపై పరిశోధనలను గుర్తించిందని ది గ్లోబల్ టైమ్స్ పేర్కొంది. చైనా నౌకానిర్మాణ పరిశ్రమ కార్పొరేషన్(సిఎస్ఐసి) ఇదే అంశంపై మంగళవారం ఒక ప్రకటన చేసింది. అణు శక్తిని సంతరించుకున్న విమానవాహక నౌకలు, కొత్త రకం అణు జలాంతర్గాములు, జలాంతర్గాములు, నావికా సమరానికి చెందిన ఎలక్ట్రానిక్ సమాచార వ్యవస్థలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించాలనే ప్రక్రియను వేగవంతం చేసే ప్రణాళికల్లో తాను ఉన్నట్లు సిఎస్ఐసి వెల్లడించింది. ప్రభుత్వానికి చెందిన ఒక రక్షణ కంపెనీ తన అజెండాలో అణుశక్తిని సంతరించుకున్న విమానవాహక నౌకలను గుర్తించడం ఇదే తొలిసారి అని పాలక చైనా కమ్యూనిస్టు పార్టీ పత్రిక పీపుల్స్ డైలీ అనుబంధ టాబ్లాయిడ్ పేర్కొంది. అణుశక్తితో కూడిన విమానవాహక నౌక 2025 నాటికి తన కార్యకలాపాలను ప్రారంభిస్తుందని హాంగ్‌కాంగ్‌కు చెందిన సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ సైతం వెల్లడించింది. మిలటరీ నిపుణులు సైతం దీనితో ఏకీభవిస్తున్నారని ది గ్లోబల్ టైమ్స్ వార్తా కథనం పేర్కొంది. అణు శక్తితో భారీ నౌకను నడిపించే దిశగా చైనా కీలకమైన అడుగులు వేస్తున్నదని చెప్పవచ్చు అని చైనా నావికా నిపుణుడు లి జిని ది గ్లోబల్ టైమ్స్ ఉటంకించింది. చైనాకు ఎలాంటి విమానవాహక నౌకకైనా రూపకల్పన చేసి నిర్మించే సామర్థ్యం ఉందని సిఎస్ఐసి బోర్డు ఛైర్మన్ హు వెన్‌మింగ్ గతేడాది వెల్లడించారు. చైనా డీజిల్, గ్యాస్ లేదా అణు విద్యుత్‌తో పనిచేసే విమానవాహక నౌకలను నిర్మించగలదని హు ప్రసంగం సూచిస్తున్నదని లి తెలిపారు. భవిష్యత్తులో చైనా దేశ ప్రయోజనాలు విదేశాలకు విస్తరించడం కొనసాగుతుంది. అణు విద్యుత్తుతో పనిచేసే అతిపెద్ద నౌకలు లేకుండా చైనా నావికాదళం సుదూరంలో సాగర జలాల్లోకి చొచ్చుకుపోలేదు అని లి అన్నారు. చైనా తనదిగా చెప్పుకుంటున్న వ్యూహాత్మక దక్షిణ చైనా సాగరం సర్వస్వతంత్రమైనదనే భావన కలిగించడం కోసం అమెరికా మిలటరీ నిర్ణీత కాలవ్యవధుల్లో దక్షిణ చైనా సాగరంపైన యుద్ధనౌకలు, వైమానికదళ జెట్ విమానాలను పంపిస్తున్నది. అయితే దక్షిణ చైనా సాగరంపై చైనా ఆధిపత్యాన్ని వియత్నాం, ఫిలిప్పైన్స్, మలేసియా, బ్రూనై, తైవాన్ తిప్పికొడుతున్నాయి. చైనా తూర్పు చైనా సముద్రంపై జపాన్‌తో కూడా సాగర వివాదాన్ని కలిగి ఉంది.

గాంధీజీ ఉత్తరం ...రూ.50 వేల డాలర్లు!



న్యూఢిల్లీ: ఏసుక్రీస్తు ఉనికిపై మహాత్మాగాంధీ 1926 లో రాసిన ఉత్తరం వేలంలో రూ. 50 వేల డాలర్లకు అమ్ముడైంది. గుజరాత్‌లోని సబర్మతి ఆశ్రమం నుంచి ఏప్రిల్ 6, 1926 న గాంధీజీ ఈ ఉత్తరాన్ని రాశారు. గత కొన్ని దశాబ్దాలుగా అనేకమంది సంగ్రహకర్తల చేతులు మారిన ఈ ఉత్తరం పెన్సిల్వేనియా కు చెందిన నాథన్ రాబ్ చేతికి చేరింది. రాబ్ కలెక్షన్ సంస్థ ప్రిన్సిపాల్ అయిన నాథన్ రాబ్ ఈ చారిత్రక ఉత్తరాన్ని విక్రయించారు. ఏసుక్రీస్తు మానవాళికి గురువుగా గాంధీ భావించినట్టు ఆ ఉత్తరంలో వెల్లడైందని ఆయన తెలిపారు. జీసస్‌పై మహాత్మగాంధీ రాసిన ఉత్తరమేదీ ఇంతవరకు జనబాహుళ్యంలోకి రాలేదని ...మతంపై గాంధీజీ రాసిన అత్యుత్తమ లేఖ తాను విక్రయించినదేనని రాబ్ పత్రికా సమావేశంలో చెప్పారు. ప్రపంచంలోని అన్ని మతాల మధ్య శాంతి నెలకొనాలని గాంధీజీ తన అభిలాషగా ఆ లేఖలో పేర్కొన్నారని తెలిపారు. అమెరికా లోని క్రైస్తవమత గురువు మిల్టన్ న్యూబెర్రీ ఫ్రాంజ్ కు గాంధీజి ఈ లేఖ రాసినట్టు రాబ్ తెలిపారు

ఆర్థిక ప్రగతితోనే.. సాయుధ దళాలకు చేయూత



న్యూఢిల్లీ: దేశం ఆర్థికంగా ప్రగతి సాధించినప్పుడే సాయుధ దళాల ఆధునికీకరణ సాధ్యమవుతుందని భారత ఆర్మీ ఛీఫ్ బిపిన్ రావత్ అన్నారు. ఢిల్లీలోన గురువారం జరిగిన ఒక సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ, దేశం సురక్షితంగా వున్నప్పుడే దేశ ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని చెప్పారు. సాయుధ దళాల బడ్జెట్ కేటాయింపులను సమర్థిస్తూ, సరిహద్దులలో నెలకొని వున్న పరిస్థితులకు భారత్ లో విదేశీ పెట్టుబడులకు లింకు వుందని ఆయన అన్నారు. దేశ సరిహద్దులు సురక్షితంగా వున్నాయని, అంతర్గత భద్రత అదుపులోనే వుందని విదేశీ పెట్టుబడిదారులకు నమ్మకం కలిగించాల్సిన బాధ్యత తమపై వుందన్నారు. సాయుధ దళాల ఆధునికీకరణ దేశ ఆర్థిక అభివృద్ధితో ముడిపడి వుందన్నారు. గత మూడేళ్లలో సుమారు 4 లక్షల కోట్ల రూపాయలు సాయుధ దళాల ఆదునికీకరణకు వ్యయం చేసినట్టు మేజర్ జనరల్ రావత్ వెల్లడించారు.


కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ అధ్యక్షుడిగా మిస్త్రీ



న్యూఢిల్లీ: సీనియర్ కాంగ్రెస్ నేత మధుసూదన్ మిస్త్రీని కాంగ్రెస్ అధిష్ఠానం రానున్న కర్ణాటక ఎన్నికల ను దృష్టిలో ఉంచుకుని స్క్రీనింగ్ కమిటీ అధ్యక్షుడిగా నియమించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ గురువారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కమిటీలో మిస్త్రీతో పాటు ఎంపీలు తామ్రద్వాజ్ సాహు, గౌరవ్ గోగోయి సభ్యులుగా ఉంటారు. వీరితోపాటు కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.పరమేశ్వర ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారు. కాగా కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం కర్ణాటక. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి కేంద్రంలో అధికారం చేపట్టాలంటే కర్ణాటకలో కాంగ్రెస్ ఏవిధంగానైనా అధికారం నిలుపుకోవలసిన క్లిష్ట పరిస్థితుల్లో కాంగ్రెస్ అధిష్ఠానం ఉంది. మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కారు కర్ణాటకలో తిరిగి విజయం సాధించి దక్షిణాది రాష్ట్రాల్లో పట్టు నిలుపుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. దక్షిణాదిలో ప్రాంతీయ పార్టీలదే పైచేయిగా ఉన్న తరుణంలో జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ఇక్కడ అధికారం చేజిక్కించుకునేందుకు తీవ్రస్థాయిలో పోరాడుతున్నాయి. ఇరుపార్టీలు కర్ణాటక ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పావులు కదుపుతున్నాయి. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ స్వయంగా రంగంలోకి దిగి పోటాపోటీగా ప్రచారం చేస్తుండటంతో దేశవ్యాప్తంగా కర్ణాటక ఎన్నికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇప్పటికే రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కర్ణాటకలో రెండుసార్లు పర్యటించారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్, మేలో జరగనున్నాయి.

ట్రంప్‌కు ఎదురుదెబ్బ

- కమ్యూనికేషన్ చీఫ్ హోప్ హిక్స్ రాజీనామా
- అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యంపై విచారణే కారణం!
- హిక్స్‌ను 8గంటలు విచారించిన హౌస్
- వైట్‌హౌస్ పాలనలో హోప్ తనదైన ముద్ర
- హిక్స్ లోటును భర్తీ చేయలేం ట్రంప్



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఎంతో నమ్మకస్తురాలు, వైట్‌హౌస్ కమ్యూనికేషన్ చీఫ్ హోప్ హిక్స్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ విషయాన్ని హోప్ అధికారికంగా ప్రకటించారు. ఆయన అత్యున్నత పదవికి రాజీనామా చేయడంపై పలువురు అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 2016లో అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యంపై హౌస్ ప్యానెల్ విచారించిన మరుసటి రోజే ఆమె రాజీనామా చేశారు. 29 ఏళ్ల మాజీ మోడల్ హోప్ హిక్స్ ఎల్లప్పుడూ ట్రంప్‌కు వెన్నుదన్నుగా ఉంటూ కీలక నిర్ణయాల్లో ప్రత్యేక పాత్ర పోషిస్తూ ఉండేవారు. సుమారు 8 గంటల పాటు హౌస్ కమిటీ ఆమెను విచారించింది. విచారణలో తన ఉద్యోగ బాధ్యతలు మాత్రమే నెరవేర్చానని చెప్పుకొచ్చింది. ఎన్నికల ప్రచారంలో రష్యా పాత్రపై మాత్రం ఆమె ఎన్నటికీ అబద్ధం చెప్పబోదని అమెరికా మీడియా చెప్పుకొచ్చింది. మూడేళ్ల పాటు సాధారణ జీవితాన్ని గడిపింది. ట్రంప్‌తో అత్యంత సన్నిహితంగా హోప్ ఉండటంతో రాబర్ట్ ముల్లర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌన్సిల్ కూడా ఆమెను సుదీర్ఘంగా విచారించినట్టు తెలుస్తున్నది. మూడేళ్ల పాటు వైట్‌హౌస్‌లో కీలక నిర్ణయాలు తీసుకుంటూ తనదైన శైలిలో ముద్ర వేసుకున్నారు. 2017, జనవరి 20న అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు స్వీకరిస్తున్న సమయంలో హోప్ కీలక బాధ్యతల్లో ఉన్నారు. ట్రంప్ తనపై చూపిన ప్రేమను మాటల్లో చెప్పలేను. ఇప్పటికీ నేను కోరుకునేది ఒకటే... దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలి అని హోప్ ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ట్రంప్ కూడా ఆమె రాజీనామాపై స్పందించారు. నేను అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సమయం నుంచి హోప్ ఎంతో బాగా పని చేశారు. చాలా తెలివితేటలు కలిగిన అమ్మాయి. తన లోటును ఎవరూ భర్తీ చేయలేరు. తనకు ఎప్పుడు ఎలాంటి సహాయ సహకారాలు అవసరం ఉన్నా ప్రభుత్వంతో పాటు తానూ ముందంజలో ఉంటాను. భవిష్యత్తులో ఇద్దరు కలిసి పని చేస్తామని భావిస్తున్నాను అని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఎప్పుడు ఆమె అధికారికంగా వైట్‌హౌస్‌ను శాశ్వతంగా వదిలివెళ్తారో తేదీ నిర్ణయించలేదని పరిపాలనా విభాగం అధికారులు వెల్లడించారు. దీనిపై స్పందించిన హోప్స్ మరికొన్ని వారాల్లో వైట్‌హౌస్‌ను వదిలివెళ్తానని చెప్పారు. ట్రంప్ కుటుంబానికి హోప్స్ చాలా సన్నిహితంగా ఉంటూ వచ్చారు. ఇవాంకతో చాలా దగ్గరి పరిచయం ఉంది. అదేవిధంగా వ్యక్తిగత సహాయకురాలిగా కూడా హోప్స్ ఆరేళ్లపాటు బాధ్యతలు నిర్వర్తించింది. రాబర్ట్ ముల్లర్ ఆధ్వర్యంలోని ప్రత్యేక కౌన్సిల్ సుదీర్ఘ ప్రశ్నల అనంతరమే ఆమె చాలా కలత చెంది రాజీనామా చేసినట్టు తెలుస్తున్నది. వైట్‌హౌస్ కోసం ట్రంప్ క్యాంపెయిన్ నిర్వహించిన సమయంలో హోప్స్ చేరినప్పుడు ఆమెకు ఎలాంటి రాజకీయ పరిజ్ఞానం లేదు. ముందుగా ప్రెస్ సెక్రెటరీగా బాధ్యతలు నిర్వర్తించిన హిక్స్, తరువాత అత్యున్నత స్థానమైన కమ్యూనికేషన్ డైరెక్టర్ బాధ్యతలు చేపట్టారు. పరిపాలనాపరమైన అంశాల్లో హిక్స్ చాలా వ్యూహాత్మకంగా వ్యవహరించేది. ప్రధాన పరిపాలనాధికారులు, అధ్యక్షుడు ట్రంప్‌కు హిక్స్ చాలా అమూల్యమైన సలహాలు, సూచనలు చేసేవారని వైట్‌హౌస్ వర్గాలు చెబుతున్నాయి. హోప్ హిక్స్ పనితనం ఎంతో బాగుండేది. ఎలాంటి సందర్భాల్లో అయినా సమస్యలకు సులువుగా పరిష్కారం చెప్పేది. వైట్‌హౌస్‌లోని ప్రతీ ఒక్కరూ ఆమెను ఎంతో గౌరవంగా చూసుకునేవారు. ఆమెను చాలా మిస్ అవుతాను అని ఇవాంక ట్విట్టర్ వేదికగా తన అభిప్రాయం తెలియజేశారు.

కూల్ కార్తీ కూల్..!

- కోర్టులో ఫ్యామిలీ డ్రామా
- తల్లిదండ్రుల ఎదుట తీర్పు
- చిరునవ్వుల చిదంబరం
- కార్తీతో తల్లిదండ్రుల సంభాషణం



న్యూఢిల్లీ: కార్తీ చిదంబరం గురువారం మీడియాతో మాట్లాడనప్పటికీ ఢిల్లీ కోర్టులో తన తల్లిదండ్రుల సమక్షంలో ఎంతో ఊరట పొందినట్టుగా కనిపించారు. మూడు గంటలకు పైగా జరిగిన వాదోపవాదాల ఫలితం కార్తీని ఐదు రోజుల సిబిఐ కస్టడీకి పంపించింది.కార్తీని సిబిఐ అధికారులు పటిష్ఠమైన భద్రత మధ్య ప్రత్యేక జడ్జీ సునీల్ రానాకు చెందిన కోర్టు రూమ్‌కు తీసుకువచ్చారు. కార్తీ వచ్చే సమయానికి లాయర్లు, మీడియా ప్రతినిధులు అక్కడికి వచ్చి ఉన్నారు. స్వతహాగా సీనియర్ అడ్వకేట్ అయిన కార్తీ మాతృమూర్తి నళిని చిదంబరం కుమారుడు కోర్టు రూమ్‌కు చేరుకున్న 15 నిముషాల తర్వాత అక్కడకు చేరుకున్నారు. తనయుడితో కాసేపు మాట్లాడారు. అదే సమయంలో ఈడీ అరెస్టు చేసిన కార్తీ చార్టెర్డ్ అకౌంటెంట్ ఎస్.భాస్కరరామన్ బెయిల్ అభ్యర్థనపై వాదోపవాదాలను జడ్జీ వింటున్నారు.

కాసేపటి తర్వాత కార్తీ తండ్రి పి.చిదంబరం కోర్టులోకి అడుగుపెట్టారు. తండ్రిని చూడగానే కార్తీ హాయిగా నవ్వారు. కాస్త ఊరట చెందినట్టు కనిపించారు. సరిగ్గా కుమారుడి కేసుపై వాదోపవాదాలు మొదలవుతుండగానే చిదంబరం కోర్టులోకి ప్రవేశించారు. కార్తీతో కొద్దిసేపు మాట్లాడారు. ఆ తర్వాత ముందు వరుసలోని ఒక సీట్లో కూర్చున్నారు. పాల నురుగ లాంటి తెల్ల రంగు చొక్కా, ధోతీ ధరించిన చిదంబరం తన ఎదురు వరుసలో కూర్చొని లాయర్లతో మాట్లాడుతున్న కార్తీని చూసి అనేకసార్లు నవ్వారు. ముదురు ఆకుపచ్చ రంగు జాకెట్, గళ్ళ చొక్కా, నల్ల ప్యాంట్ ధరించిన 46 ఏళ్ళ కార్తీని సిబిఐ అధికారుల బృందం మధ్యాహ్నం 2.02 గంటలకు కోర్టు రూమ్‌లోకి తీసుకువచ్చింది. బుధవారం తరహాలో పాటియాలా హౌస్ కోర్టుల కాంప్లెక్స్ పెద్ద ఎత్తున భద్రతా బలగాలు, బారికేడ్లతో నిండిపోయింది. కార్తీ మీడియా ప్రతినిధులతో మాట్లాడకుండానే కోర్టులోకి వెళ్ళిపోయారు. ఆర్డర్ రాయడం కోసమని జడ్జీ తన చాంబర్‌కు వెళ్ళిపోగానే ఆ 45 నిముషాల విరామాన్ని చిదంబరం కుటుంబం పరస్పరం మాట్లాడుకోవడానికి వినియోగించుకుంది. అదే సమయంలో సీనియర్ అడ్వకేట్ దయన్ కృష్ణన్‌తో కూడిన లాయర్ల బృందంతో కూడా చిదంబరం మాట్లాడారు.చిదంబరం పార్టీ సహచరుడు, సీనియర్ అడ్వకేట్ అభిషేక్ మను సింఘ్వీ కేసు వాదించిన అనంతరం కార్తీ తల్లిదండ్రులను పలకరించిన అనంతరం కోర్టు రూమ్ నుంచి నిష్క్రమించారు.

ఇద్దరు పాక్ సైనికుల హతం

జమ్ము: పూంచ్ సెక్టార్‌లో భారత సైనిక దళాలు జరిపిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు పాక్ సైనికులు హతమయ్యారు. గత రెండు రోజులుగా జమ్మూ కాశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి ఇరుదేశాల నడుమ ఉద్రిక్తత నెలకొంది. ఈ తరుణంలో బుధవార పాక్ సైన్యం కాల్పులకు దిగటంతో భారత సైన్యం దీటుగా స్పందించి ఎదురుదాడికి దిగింది. ఈ ఘటనలో పూంచ్ జిల్లాలో పిర్ పంజాల్ రేంజ్‌లో ఇద్దరు పాక్ సైనికులు హతమయ్యారని ఆర్మీ అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని పాక్ అధికారులు సైతం ధ్రువీకరించారు. పాకిస్థాన్ సైన్య ప్రచారవిభాగం ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పిఆర్) చనిపోయిన సైనికులు మునీర్ చోహాన్(32), అమీర్ హుస్సేన్(28)గా తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. భారత సైనికాధికారులు మాట్లాడుతూ పాకిస్థాన్ గురువారం ఉదయం సైతంమళ్లీ కాల్పులకు తెగబడిందని పేర్కొన్నారు. బీజీ సెక్టార్లో పాక్ సైన్యం ఆటోమెటిక్ ఆయుధాలు, మోర్టార్లతో విచక్షణ రహితంగా గురువారం ఉదయం 8.45 నుంచి దాడికి దిగిందన్నారు. దీంతో ఇండియన్ ఆర్మీ దీటైన సమాధానం ఇచ్చిందని అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ దేవేందర్ ఆనంద్ వెల్లడించారు.

కార్తీ అరెస్ట్ వెనుక రాజకీయ కుట్ర : కాంగ్రెస్

న్యూఢిల్లీ:కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం ను సిబిఐ అరెస్టు చేయడం వెనుక రాజకీయ కుట్ర వుందని ఆయన కుటుంబ సభ్యులు,కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మోదీ ప్రభుత్వం చేతిలో సిబిఐ ఒక కీలుబొమ్మ లా తయారైందని వారు విమర్శించారు.

లండన్‌లో ఒక సమావేశంలో ప్రసంగించడానికి మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం వెళ్ళిన కొన్ని గంటలకే సిబిఐ కార్తీ ని అరెస్టు చేయడంతో ఆయన తన పర్యటనను రద్దుచేసుకుని ఇండియాకు తిరుగు ప్రయాణమయ్యారని వారు తెలిపారు. గత పది రోజుల్లో దేశాన్ని కుదిపేసిన సుమారు రూ.31 వేల కోట్ల కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్ళించడానికే కేంద్రప్రభుత్వం ఈ కుట్రకు పాల్పడిందని వారన్నారు. ఈ కుట్రకు తాము బెదిరి పోయేది లేదని మరిన్ని వాస్తవాలు వెలుగులోకి తీసుకు వస్తామని కాంగ్రెస్ సమాచార ముఖ్య ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా పేర్కొన్నారు.

ఛత్తీస్‌గఢ్ సీఎంకు తప్పిన ముప్పు

రాయపూర్: ఛత్తీస్‌గఢ్ ముఖ్య మంత్రి రమణసింగ్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ గురు వారం గాల్లోకి ఎగిరిన కొద్ది నిముషాల్లోనే కిందకు దిగింది. హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో పైలెట్లు వెంటనే కిందకు దింపేశారు. రమణసింగ్, ఆయన కుమారుడు, ఎంపీ అభిషేక్ సింగ్, మరో ఇద్దరితో కూడిన హెలికాప్టర్ ఇక్కడి పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద హెలిపాడ్ నుంచి సాయంత్రం దాదాపు 4.30 గంటలకు గాల్లోకి ఎగిరిందని ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. అయితే 10 నిముషాల తర్వాత సాంకేతిక సమస్య తలెత్తడంతో పైలెట్ హెలికాప్టర్‌ను రాయపూర్‌లోని మన విమానాశ్రయంలో దించారు. ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారని సదరు అధికారి తెలిపారు. ముఖ్యమంత్రి హోలీ వేడుకల్లో పాల్గొనే నిమిత్తం తన స్వస్థలం కవర్ధాకు వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది.

కాల్పుల్లో పాక్ జవాన్లు హతం

ఇస్లామాబాద్: భారత్ బలగాలు తాజాగా జరిపిన కాల్పుల్లో ఇద్దరు పాక్ సైనికులు చనిపోయారని పాకిస్తాన్ సైన్యం పేర్కొంది. నియంత్రణ రేఖ(ఎల్‌ఓసి) వెంబడి ఎలాంటి కవ్వింపు చర్యలు లేకుండానే భారత్ జరిపిన కాల్పుల్లో ఈ ఘటన చోటు చేసుకుందని ఆరోపించింది. భారత్ బలగాలు ఎల్ఓసి బుధవారం జరిపిన కాల్పుల్లో భీమ్‌బెర్ గ్రామానికి సమీపంలో పాకిస్తానీ సైనిక శిబిరాలు దెబ్బ తిన్నాయి. పాక్ బలగాలు జరిపిన ఎదురు కాల్పుల్లో భారత్ సైనిక శిబిరాలు తీవ్రంగా ధ్వంసమైపోయాయని పాకిస్తాన్ సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. అయితే భారత్ వైపున మరణాలు చోటు చేసుకున్నదీ లేనిదీ స్పష్టం కాలేదు. ఎల్ఓసి వద్ద గురువారం పరిస్థితి ఉద్రిక్తంగానే ఉంది.

పేదరాలి పిత్తాశయంలో 99రాళ్లు



బెంగళూరు: తీవ్రమైన కడుపునెప్పితో బాధపడుతున్న 45 సంవత్సరాల మహిళ పిత్తాశయం నుంచి 99 రాళ్ళను తొలగించినట్టు వైద్యులు గురువారం తెలిపారు. ఈ ఘటన తుమకూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చోటు చేసుకుంది. ఆ మహిళ పిత్తాశయంలో అనేక రాళ్ళు ఉండటాన్ని వైద్యులు స్కానింగ్ చేసి గుర్తించారు. ఆమె హెర్నియా, పిత్తాశయంలో రాళ్ళు, మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం, హృద్రోగం లాంటి అనేక సమస్యలతో బాధపడుతున్నది. ఆమె శస్త్ర చికిత్స కోసం తిరగని చోటు లేదు. కానీ పేదరికం అందుకు అడ్డుగా నిలిచింది. ఆమెను ఎవ్వరూ ఆదుకోలేదు అని ఆస్పత్రి సీనియర్ సర్జన్ డాక్టర్ వసీమ్ ఇమ్రాన్ తెలిపారు. ఆమె భర్త దినసరి కార్మికుడు. పేదరికం కారణంగా బెంగళూరులో ప్రతిష్ఠాత్మక ఆస్పత్రుల్లో ఆమె శస్త్రచికిత్స చేయించుకోలేకపోయింది. బుధ వారం దాదాపు రెండున్నర గంటలపాటు శస్త్రచికిత్స చేసి పిత్తాశయ రాళ్ళను తొలగించారు. హెర్నియాకు సైతం శస్త్రచికిత్స చేశారు. మూడు రాళ్ళు 12 మి.మీ.ల సైజులో ఉండగా, మిగిలినవి నాలుగు నుంచి ఐదు మి.మీ.ల మధ్య సైజులో ఉన్నాయని వైద్యులు తెలిపారు.

జనసేనాని వ్యూహాత్మక అడుగులు!

- పార్టీ పటిష్టత, బలోపేతానికి కసరత్తు
- 14న గుంటూరులో భారీ బహిరంగ సభ

అమరావతి, ఆంధ్రప్రభ: ఇప్పుడు అందరి దృష్టిజనసేన పార్టీ వైపే ఉంది. పవన్‌కల్యాణ్ పైకి కామ్‌గా ఉంటూనే అంతర్లీనంగా పార్టీ పటిష్ట, బలోపేతానికి పెద్ద ఎత్తున కసరత్తు చేస్తున్నారని అంటున్నారు. ఆయనలోని నిశబ్దమే మిగతా పార్టీ నేతల వెన్నులో వణుకు పుట్టిస్తోం దంటున్నారు. ఆయన ఎప్పుడూ కూడా చేసేదే చెబుతుంటారు. మొదటి నుంచి ఆయనలోని నైజమిది. దేని గురించైనా హామీ ఇచ్చారంటే దాన్ని సాధించేంతవరకు వెంటబడి సాధించడం పవన్‌కల్యాణ్ నైజం. ఉద్దానం విషయంలో కూడా ఇదే జరిగింది. వారి బాధలను స్వయంగా చూసి, చలించి పోయిన జనసేనాని అనంతరం ప్రభుత్వంతో ప్రత్యేకించి, సంప్రదింపులు జరపడంతో పాటు విదేశాల్లో సైతం ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్యపై అధ్యయనం చేయించిన ఘనుడు ఆయన. ఒక వైపు సుశిక్షితులైన నేతలను, కార్యకర్తలను తయారు చేసుకుంటూ ఇంకో వైపు పార్టీ అభివృద్ధికి బాటలు వేస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారు.చెప్పింది చేసి చూపించడమే లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్న జనసేనాని తాజాగా ఒకడుగు ముందుకేసి విభజన సమస్యలపై పోరు సల్పేందుకు జేఎఫ్‌సీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈనెల 4న ఢిల్లీకి వెళ్లే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం నెలకొన్న తరుణంలో జనసేనాని కూడా ఆ దిశగా గుమ్మనంగా పార్టీ విస్తరణకు పావులు కదుపుతున్నారు. అందులో భాగంగానే జేఎఫ్‌సీ ఏర్పాటు, తెలుగు రాష్ట్రాల్లో పర్యటనలు, ఇత్యాధి కార్యాచరణకు శ్రీకారం చుట్టారంటున్నారు.

ఘనంగా జయేంద్ర సరస్వతి బృందావన ప్రవేశం



న్యూఢిల్లీ: కంచి మఠం జయేంద్ర సరస్వతి బృందావన ప్రవేశం ఆయన వారసుడు విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో భక్తజన సందోహం నడుమ ఘనంగా నిర్వహించారు. కాంచీపురంలోని కంచి శంకరమఠం ప్రాంగణంలోనే కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈ క్రతువు నిర్వహించారు. జయేంద్ర సరస్వతిని చివరిసారి దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. జయేంద్ర సరస్వతి కుటుంబ సభ్యులు కూడా మఠానికి చేరుకుని ఆయన తుది దర్శనం చేసుకున్నారు. జయేంద్ర సరస్వతి బృందావన ప్రవేశానికి ముందు ఆయనకు పాలు, తేనె తదితర వాటిని ఉపయోగించి అభిషేకం నిర్వహించారు. మఠంలోని ప్రధాన మండపంలో వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ఆయనకు అభిషేక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన పార్థివదేహాన్ని బృందావనంలోనికి ప్రవేశపెట్టారు. ఈ సందర్భం గా మఠానికి చెందిన అధికారి ఒకరు విలేఖరులతో మాట్లాడుతూ పీఠాధిపతుల అంత్యక్రియలను బృందావన ప్రవేశంగా పిలుస్తారన్నారు. జయేంద్ర సరస్వతికి ముందు మఠం అధిపతిగా వ్యవహరించిన చంద్రశేఖరేంద్ర సరస్వతి సరసనే ఆయనకు తుది సంస్కరణలు చేశామన్నారు. కాగా చంద్రశేఖరేంద్ర సరస్వతి 1993లో పరమపదించి బృందావన ప్రవేశం చేశారు. తమిళనాడు గవర్నర్ బన్వర్‌లాల్ పురోహిత్ ఈ కార్యక్రమంలో పాల్గొని దివంగత పీఠాధిపతికి నివాళి అర్పించారు. కాగా ఆధ్యాత్మికంగా కంచి శంకరమఠం పీఠాధిపతి జయేంద్రసరస్వతిని అత్యంత ప్రభావశీలిగా పరిగణించేవారు. అయితే ఆయన ఒకహత్య కేసులో ఇరుక్కోవటం అప్పట్లో పెను సంచలనం సృష్టించిన సంగతి విదితమే.

ఈ సంతృప్తి చాలు

విశాఖ శారదాపీఠం ప్రతినిధులు

విశాఖపట్నం, ప్రభ న్యూస్: కంచికామకోఠి పీఠాధిపతులు శ్రీ జయేంద్ర సరస్వతి మహా స్వామి సందర్శనం అద్వితీయమైన అనుభూతిగా విశాఖ శ్రీ శారదా పీఠం ప్రతినిధులు పేర్కొన్నారు. కంచికామ కోఠి పీఠాధీశులు జయేంద్ర సరస్వతి శివైక్యం పొందిన నేపథ్యంలో శ్రీ శారదాపీఠం అధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి ఆదేశాల మేరకు పీఠంలోని ముఖ్యగణం, ఉత్తరాధికారి బాల స్వామి, ధర్మాధికారి జి. కామేశ్వర శర్మ కంచి పీఠాధపతి పార్థీవాన్ని దర్శించుకున్నారు. మంగళాపరమైన జయేంద్ర సరస్వతి స్వామి ధూళిభరిత సామీప్యతే ఎంతో ప్రాశస్త్యమైనదిగా వీరు భావించారు. పీఠ నియమావళి ప్రకారం జయేంద్ర సరస్వతి పార్థీవ దర్శనం పాపహరణంగా భావిస్తున్నామని వీరు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి తన నిష్ఠాగరిష్టధ్యాన దృశ్య సమీక్షలో జయేంద్రసరస్వతి స్వామి ఆధ్యాత్మిక సంపత్తికి ప్రశంసలు అందజేశారని వెల్లడించారు.



ఉగ్రవాదంపైనే యుద్ధం మతాలపై కాదు..

ముస్లిం యువత ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- ఒకచేత్తో ఖురాన్..ఇంకోచేత్తో కంప్యూటర్ పట్టుకోవాలి
- మతం పేరుతో దాడులు..వారి పతనానికే చేటు
- అన్ని మతాలకు భారత్ ఊయల వంటిది: ప్రధాని నరేంద్ర మోడీ
- ఉగ్రయుద్ధం..ముస్లింలపై కాదు..అర్థం చేసుకోండి
- విద్వేష సిద్ధాంతాలను వ్యతిరేకించాలి : జోర్డాన్ రాజు

న్యూఢిల్లీ: ఉగ్రవాదంపై యుద్ధం.. ఏ మతానికి వ్యతిరేకంగా కాదని, యువతను తప్పుదారి పట్టించేవారిపైనే అని ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి స్పష్టంచేశారు. సామా జిక వ్యతిరేక శక్తుల అణచివేత చర్యలు మాత్రమేనని చెప్పారు. యువతను రెచ్చగొడుతూ, అమాయకులపై దాడు లకు పాల్పడుతున్న విష సంస్కృతిని అంతమొందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి మతం మానవ విలువలను పెంచుతుంది. ముస్లిం యువత మత సాంప్రదాయాలను పాటించడంతోపాటు ఆధునిక సాంకేతికతను అంది పుచ్చుకోవాలి. ప్రతి ముస్లిం యువకుడు ఓ చేత్తో ఖురాన్, మరో చేత్తో కంప్యూటర్ పట్టుకోవాలి అని మోడీ పిలుపు నిచ్చారు. ఇస్లామిక్ వారసత్వం: అవగాహన, ఆధునికత అంశంపై జరిగిన సదస్సులో ప్రధాని పాల్గొని ప్రసంగిం చారు. ఈ సదస్సులో జోర్డాన్ రాజు అబ్దుల్లా -2 కూడా పాల్గొన్నారు.

ముస్లిం యువత ఒక చేత్తో ఖురాన్, మరొక చేత్తో కంప్యూటర్ పట్టుకున్నప్పుడే సంపూర్ణ సంక్షేమం, సమ్మిళిత అభివృద్ధి సాధ్యమవుతుందని మోడీ పిలుపునిచ్చారు. 'మతం పేరుతో మానవాళిపై దాడిచేస్తున్న వారు, తమ మతానికి కీడు చేస్తున్నామన్న విషయాన్ని గ్రహించడం లేదన్నారు. మతం పేరుతో చేస్తున్న విద్వేష దాడుల వల్ల ఎక్కు వగా నష్టపోతున్నది వారి మతమేనని అర్థం చేసుకోవడం లేదన్నారు. మతం గురించి తన అభిప్రాయాలను వెల్లడిస్తూ, నమ్మకమే మానవాళిని కలసికట్టుగా ఉంచుతుందని చెప్పారు. 'ఇస్లాం లేదా మరే ఇతర మతాల పేరుతో తప్పు దారి పట్టించే సంస్థలను గుర్తించి, వాటిని తిరస్కరించాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా అంతర్జాలం వేదికగా మనోభావాలను పంచుకోవాలి. బాంబులు, తీవ్రవాదం చర్యలతో మన ప్రపంచాన్ని బాధితురాల్ని చేసిన వారు, అజ్ఞానం, అబద్దాలతోనూ విద్వేషం చిమ్ముతున్నారని మోడీ తెలిపారు. ప్రపంచంలోని అన్ని ప్రధాన మతాలకు భారత్ ఊయల వంటిదని అన్నారు. భారత ప్రజాస్వామ్యం సనాతన బహుళత్వానికి వేదికని గుర్తుచేశారు. ర్యాడికలిజం అంతానికి భారతీయ సమాజం మీతో కలిసి నడవాలని కోరుకుంటున్నదని చెప్పారు. తీవ్రవాద నిర్మూలన దిశగా జోర్డాన్ చేపడుతున్న చర్యలను ప్రధాని ఈ సందర్భంగా ప్రశంసించారు.

ఈ యుద్ధం ముస్లింలపై కాదు..

ఉగ్రవాదంపై ప్రపంచం చేస్తున్న పోరాటం హింసపై, ద్వేషంపై చేస్తున్న పోరాటం మాత్రమే తప్ప ఏ ఒక్క మతంపైనో లేక ముస్లిం వర్గంపైనో కాదని జోర్డాన్ రాజు అబ్దుల్లా 2 అన్నారు. మహ్మద్ ప్రవక్త ప్రపంచమంతా మానవత్వం, దయ, జాలివంటివి వెల్లి విరియాలని ప్రచారం చేశారే తప్ప హింసకు పాల్పడాలని ఎక్కడా చెప్పలేదని అన్నా రు. 'ఇది నా విశ్వాసం.. ఈ విశ్వాసం నేను నా బిడ్డలకు చెబుతాను. ఇదే విశ్వాసాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 1.8బిలి యన్ల ముస్లింలు పంచుకోండి' అని అబ్దుల్లా విజ్ఞప్తి చేశారు. కొన్ని వర్గాలు కావాలని తప్పుడు ప్రచారం చేస్తూ మనల్ని తప్పుదారి పట్టిస్తున్నాయి' అని అబ్దుల్లా అన్నారు. భారత్, జోర్డాన్ సంయుక్త ఆధ్వ ర్యంలో ఉగ్రవాదం, జాతి విద్వేషంపై పోరాటానికి శంఖం పూరించిన సంద ర్భంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. శక్తివంతమైన, విజయవంతమైన దేశాల నిర్మాణానికి పరస్పర సహ కారమే మార్గమని జోర్డాన్ రాజు అబ్దుల్లా పేర్కొన్నారు. అన్ని మతాల వాళ్లు భారత్‌లో ఉన్నారని, భిన్న త్వానికి భారత ప్రజాస్వామ్యం నిదర్శనమని అన్నా రు. మతం పేరుతో ద్వేషాన్ని వ్యాపింపజేస్తున్నవారిని వ్యతి రేకించాలని జోర్డాన్ రాజు అబ్దుల్లా స్పష్టంచేశారు. అందరినీ కలుపు కుంటూ వెళ్లడమే ఈ అతిపెద్ద సమస్యకు పరిష్కారమని అన్నారు. ముస్లింలు, ముస్లిమేతరులు కలిసి నడవా లని పిలు పునిచ్చారు. విద్వేష సిద్ధాంతాలు దైవం అనే భావా న్నే ధ్వం సం చేస్తాయని, మత మంటే మానవాళిని కలిపి ఉంచే దని, సహాయ పడ వలసిన కర్తవ్యం ప్రతి ముస్లింపై ఉందని అబ్దుల్లా సందేశమిచ్చారు.



12 ఒప్పందాలపై సంతకాలు

ద్వైపాక్షిక, రక్షణ, ప్రాంతీయ అంశాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ- జోర్డాన్ రాజు అబ్దుల్లా కీలక చర్చలు జరిపారు. రక్షణ, కౌంటర్ టెర్రరిజం అంశాలకు సంబంధించి 12 ఒప్పందాలపై వీరిద్దరు సంతకాలు చేశారు. రక్షణ ఒప్పం దాలతో పాటు, దౌత్య, అధికారిక పాస్‌పోర్టు దారులకు వీసా మినహాయింపు ఒప్పందానికి ఉభయ దేశాలు అంగీకరించాయి. సంప్రదా యబద్ధమైన సహజ సంబంధాల బలోపేతానికి ఇరు దేశాలు నిర్మాణాత్మక చర్యలకు సంసిద్ధత వ్యక్తంచేశాయని విదేశాంగ మంత్రిత్వశాఖ రవీశ్ కుమార్ చెప్పారు. రక్షణ ఒప్పందాల్లో భాగంగా, సైనిక శిక్షణ, రక్షణ పరిశ్రమ, కౌంటర్ టెర్రరిజం, మిలటరీ స్టడీస్, సైబర్ సెక్యూరిటీ, మిలటరీ మెడికల్ సేవలు, శాంతి పరిరక్షణ తదితర అంశాల్లో పరస్పర సహకారంపై రెండు దేశాల మధ్య ఒప్పందాలు జరిగాయని చెప్పారు. ఆరోగ్యం, ఔషధాలు, జోర్డాన్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రం ఏర్పాటు, పాస్ఫేట్ గుళికలు, ఎరువులు దీర్ఘకాలిక ఎగు మతులు, కస్టమ్స్ సహ కారం అంశాలపైనా వేర్వే రు ఒప్పందాలపై సం తకాలు చేసినటు రవీశ్ కుమా ర్ వెల్లడించారు.



జోర్డాన్‌తో కౌంటర్ టెర్రరిజంపై ఒప్పందాలపై సంతకాలు చేసిన అనంతరం ఫైళ్లను మార్చుకుంటున్న ఇరుదేశాల విదేశాంగ శాఖ మంత్రులు.



క్రికెట్ ఆడిన కరుణానిధి

- బౌలర్‌గా తాత..బ్యాట్స్‌మెన్‌గా మనువడు

చెన్నై: ఐదు సార్లు తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న కరుణానిధి క్రికెట్ ఆడారు. ఆటలో బౌలర్ పాత్ర పోషించారు. ఎక్కడో మైదానంలో కాదండి... వారి ఇంట్లోనే.. బౌలర్ పాత్రలో కరుణానిధి ఉండగా, బ్యాట్ పట్టుకుని అతని రెండేళ్ల మనువడు (కరుణానిధి కుమారుడైన అరుల్‌నిధి కుమారుడు)తో క్రికెట్ ఆడారు. ఈ వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమంలో హల్‌చల్ చేస్తున్నది. క్రికెట్ ఆడుతున్న సమయంలో కొందరు కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు. కరుణానిధి కుమార్తె సెల్వీ బౌలింగ్ వేయడంలో తండ్రికి సాయం చేస్తున్నట్టు వీడియోలో కనిపిస్తున్నది. ఇటు బ్యాటింగ్ చేస్తున్న సమయంలో సెల్వీ భర్త కరుణానిధి మనవడికి సాయం చేస్తున్నారు. 95 ఏళ్ల కరుణానిధి పలుమార్లు బౌలింగ్ వేస్తూ కనిపించారు. తాత వేసిన బౌలింగ్‌కు ధీటుగానే మనువడు సమాధానం చెప్పడం వీడియోలో చూడొచ్చు. స్పిన్ బౌలింగ్‌తో మనువడితో సంతోషంగా గడిపారు. కొన్ని రోజులుగా కరుణానిధి ఆరోగ్యంగా లేరనే వదంతులకు ఈ వీడియోతో తెరపడినట్టయింది.

చర్చిఫాదర్ దారుణహత్య



కోచి : ప్రసిద్ధిగాంచిన మలయట్టూర్ క్యాథలిక్ చర్చికు చెందిన మత గురువు గ్జావియర్ థెలాక్కట్‌పై అదే చర్చిలో పని చేసి మానేసిన ఓ వ్యక్తి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో థెలాక్కట్ (52) మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపి వివరాల ప్రకారం.. మధ్యాహ్న సమయంలో థెలాక్కట్ మలయట్టూర్‌లోని కురిసి ముడి ఎక్కుతున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. చర్చిలో పనిచేసి మానేసిన జానీ అనే వ్యక్తి పదునైన కత్తితో థెలాక్కట్‌పై దాడి చేశాడు. అనంతరం అక్కడి నుంచి సమీపంలోని అటవీలోకి పారిపోయాడు. జానీని మూడు నెలల క్రితం విధుల నుంచి తొలగించారు. థెలాక్కట్‌ను చికిత్స నిమిత్తం అంగమలైలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.పరిస్థితి విషమించడంతో థెలాక్కట్ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు.

ఈజిప్టులో రెండు రైళ్లు ఢీ..15 మంది మృతి

కైరో: ఈజిప్టులో రెండు రైళ్లు ఢీకొన్న ఘటనలో 15మంది మృతి చెందగా, సుమారు 40మందికి గాయాలయ్యాయి. రైళ్లు ఢీకొన్న ఘటనపై రవాణా మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి స్పందిస్తూ బుధవారం బెహిరియాలోని నార్త్ ప్రావిన్స్ వద్ద ఈ ప్రమాదం జరిగిందన్నారు. రెండు పాసింజర్ రైళ్లు వేరుపడేదశలో ఒక రైలు మరో కార్గో రైలును ఢీకొట్టిందన్నారు. ఈజిప్ట్ ప్రధానమంత్రి షరీఫ్ ఇస్మాయిల్ మంత్రిని సంఘటన స్థలాన్ని సందర్శించి ప్రమాదంపై విచారణ జరపాలని ఆదేశించారు.

రూ.1,217 కోట్ల చోక్సీ ఆస్తులు జప్తు



పీఎన్‌బీ కుంభకోణం దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్ మెంట్ జప్తు చేసిన ఆస్తులివే

- పీఎన్‌బీ ఎండీని విచారించిన ఈడీ

న్యూఢిల్లీ: పిఎన్‌బి కుంభకోణానికి సంబంధించి మనీ ల్యాండరింగ్ దర్యాప్తులో భాగంగా గీతాంజలి జెమ్స్ గ్రూప్, దాని ప్రమోటర్ మెహుల్ చోక్సీకి చెందిన రూ.1, 217.2 కోట్ల విలువైన 41 ఆస్తులను జప్తు చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) గురువారం తెలిపింది. జప్తు చేసినవాటిలో ముంబైలో 15 ఫ్లాట్‌లు, 17 కార్యాలయ ప్రాంగణాలు, కోల్‌కతాలో ఒక మాల్, అలిబాగ్‌లో నాలుగె కరాల ఫామ్ హౌస్, నాసిక్, నాగపూర్, పన్వేల్, తమిళ నాడులో విల్లిపురం లాంటి చోట్ల 231 ఎకరాల భూమి ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాలో హైదరాబాద్‌లో రూ.500 కోట్లకు పైగా విలువచేసే 170 ఎకరాల పార్కును కూడా జప్తు చేసినట్టు ఈడీ తెలిపింది. ముంబైకి చెందిన బోరివలి(ఈస్ట్)లో నాలుగు ఫ్లాట్‌లు, శాంతాక్రజ్(ఈస్ట్)లో ఖెము టవర్స్‌లో తొమ్మిది ఫ్లాట్‌లు జప్తు చేసినవాటిలో ఉన్నాయి. చోక్సీ అధీనంలో ఉండగా జప్తు చేసిన 41 ఆస్తుల మొత్తం విలువ రూ.1,217.2 కోట్లు ఉంటుంది అని వెల్లడించింది.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ సునీల్ మెహతాను ముంబైలోని ఈడీ జోనల్ కార్యాల యం లో అధి కారులు గురువారం విచారించారు. ఈడీ ఈ వారం మొదట్లో పిఎన్‌బి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.వి.బ్రహ్మాజీ రావును సైతం విచారించింది. కుంభకోణాన్ని వెలికితీసిన వైనం, ఇతర బ్యాం కింగ్ విధా నాల ను అర్థం చేసు కోవ డానికి విచా రిం చినట్టు అధికారులు తెలి పారు.

అమెరికాలో దివాలా పిటిషన్ దాఖలు చేసిన నీరవ్ మోడీకి చెందిన ఫైర్‌స్టార్ డైమండ్ కంపెనీ పట్ల కొను గోలు దారులు ముందుగానే ఆసక్తి ప్రదర్శి ంచారు. వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ పిఎన్‌బి కుంభకోణంలో నింది తుడు. స్కామ్ వెలుగులోకి వచ్చిన తర్వాత అమెరికాలో ఫైర్‌స్టార్ డైమం డ్ కంపెనీ ఈ నెల 26న దివాలా పిటిషన్ దాఖలు చేసింది. నీరవ్ మోడీ, ఆయన మేనమామ, గీతాంజలి జెమ్స్ లిమి టెడ్ యజమాని మెహుల్ చోక్సీ స్కామ్ వెలుగులోకి రాక మునుపే జనవరిలో భారత్‌ను వీడి వెళ్ళారు. కానీ తాము అమాయకులమని లేఖలు, ప్రకట నల్లో పేర్కొన్నారు. దర్యాప్తు అధికా రులు నీరవ్ మోడీ, ఆయ న కంపెనీలను స్వాధీనం లేదా జప్తు చేశా రు. పోలీస్ ఫిర్యా దులో ఫైర్‌స్టార్ డైమండ్ కంపెనీ పేరు లేదు. బాకీ దారుల కొంత లేదా మొత్తం వాణిజ్య కార్యకలాపాల కొనుగోలుకు ముం దుగానే పటిష్టమైన ఆసక్తి వ్యక్తీకరణలు వచ్చాయి అని ఫైర్‌స్టార్ డైమండ్ బుధవారంనాటి కోర్టు ఫైలింగ్‌లో పేర్కొంది. ఫైర్‌స్టార్ డైమండ్, దాని అనుబంధ కంపెనీలకు వార్షికంగా దాదాపు 90 మిలియన్ డాలర్ల విలువైన విక్రయాలను కలిగి ఉన్నాయని తెలిపింది. కోస్ట్‌కో హోల్‌సేల్, మేసీ, జెసి పెన్ని కో ఇన్‌క్ లాంటి క్లయింట్లను కలిగి ఉన్నాయని వెల్లడించింది. స్వాధీ నం చేసుకున్న ఆస్తులు, మూతబడిన వ్యాపారాల్లో భారత్‌లోని ఫ్యాక్ట రీలు ఉన్నాయి. సదరు ఫ్యాక్ట రీలు బాకీదారులు వారి ఖాతాదారులకు విక్ర యించిన నాణ్యమైన ఆభ రణాలను ఉత్పత్తి చేశా యని ఫైర్‌స్టార్ కోర్టు ఫైలిం గ్‌లో పేర్కొంది. సర ఫ రా చైన్, బ్యాక్ ఆఫీస్ మద్ద తు లో ఆకస్మిక నష్టం బాకీ దా రుల కార్య కలాపాలపై స్వల్ప కాలంలోనే నాటకీయ ప్రభావం చూపిందని వెల్ల డించింది.

పిహెచ్‌డిసిసిఐ ప్రెసిడెంట్ ఖైతాన్ ఆందోళన

పిఎన్‌బి స్కామ్ అనంతరం బ్యాంకింగ్ పరి శ్రమలో తలెత్తిన సంక్షోభంపై పారిశ్రామిక రంగానికి చెందిన పిహెచ్‌డిసిసిఐ ప్రెసిడెంట్ అనిల్ ఖైతాన్ ఆందోళన వెలిబుచ్చారు. ప్రస్తుత పరిస్థితి బ్యాంకుల నుంచి మూలధన సేకరణకు సంబంధించి విధి, విధానాలను అనవసరంగా కఠినతరం చేయడానికి దారి తీస్తుందని గురువారం ఇక్కడ విలేకరులతో ఖైతాన్ అన్నారు. రుణగ్రహీతలకు అక్రమంగా రుణాల మంజూరుకు దారి తీసిన లావాదేవీల్లో అవకతవకలను గుర్తించడంలో బ్యాంకుల అంతర్గత ఆడిట్ వ్యవస్థ ఎలా విఫలమైంది అని తాను విస్తుపోయినట్టు తెలిపారు. ప్రస్తుత పరిస్థితి బ్యాంకుల నుంచి మూలధన సేకరణ విధి, విధానాల అనవసర కఠినతరానికి దారి తీస్తుందని భారతీయ పారి శ్రామిక రంగం కలత చెందు తున్నదని ఖైతాన్ చెప్పా రు. ఇది సులభతర వాణిజ్యం నుంచి ఉద్భవించిన సానుకూల సెంటిమెంట్‌ను దెబ్బ తీస్తుందని, విధానంపై గణనీయమైన చెడు ప్రభావం చూపిస్తుందని తెలిపారు.

పీఎన్‌బీ రిటైర్డ్ అధికారి అరెస్ట్

పిఎన్‌బి కుంభకోణానికి సంబంధించి బ్యాంక్ రిటైర్డ్ అధికారిని సిబిఐ గురువారం అరెస్టు చేసింది. 2011-2015 మధ్య కాలంలో పిఎన్‌బి బ్రాడీ హౌస్ శాఖ వద్ద ఆడిట్‌కు బాధ్యులైన రిటైర్డ్ ఇంటర్నల్ చీఫ్ ఆడిటర్ బిష్ణుబ్రత మిశ్రాను అరెస్టు చేసినట్టు ఏజెన్సీ తెలిపింది. మిశ్రా పిఎన్‌బి శాఖలో విధానాలు, రివాజులను ఆడిట్ చేసి వాటిని రిపోర్ట్ చేస్తుండేవారని చెప్పారు. కస్టడీలో ఉన్న వారికి అదనంగా మరో 13 మందిని సిబిఐ గు రు వారం ప్రశ్నించిందని తెలిపారు.

కాలువలో క్యాషియర్ మృతదేహం

బలరామ్‌పూర్, ఉత్తరప్రదేశ్: జిల్లాలోని మంకాపూర్ రోడ్డు వెంబడి కల్వర్టులో జాతీయ బ్యాంకు ఉద్యోగి మృతదేహం గురువారం నీటిలో తేలియాడుతూ కనిపించిందని పోలీసులు తెలిపారు. మృతుని పంజాబ్ నేషనల్ బ్యాంకుకు చెందిన పెహర్ శాఖలో హెడ్ క్యాషియర్ రోహిత్ శ్రీవాస్తవ(28)గా గుర్తించినట్టు చెప్పారు. రోహిత్ స్వస్థలం లక్నో. మృత దేహాన్ని శవపరీక్షకు పంపించారు. కేసులో దర్యాప్తు కొనసాగుతున్నదని పోలీసులు తెలిపారు.

నీరవ్ ఇంట్లో పత్రాలు స్వాధీనం

న్యూఢిల్లీ: పిఎన్‌బి కుంభకోణానికి సంబంధించి చేపట్టిన సోదాల్లో కీలకమైన పత్రాలను సిబిఐ స్వాధీనం చేసు కుంది. అరెస్టయిన నిందితులు, తదితరుల నుంచి రాబ ట్టిన సమాచారంతో ముంబైలోని వడాలాలో ఒక చాల్ (అపార్ట్‌మెంట్)లో గురువారం సోదాలు జరిపినట్టు అధి కారులు తెలిపారు. సదరు చాల్‌లో, ఒక చిన్నగదిలో రహ స్యంగా ఉంచిన లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్(ఎల్ఒయు)కు చెందిన పత్రాలను స్వాధీనంచేసుకున్నట్టు వెల్లడించారు. సిబిఐ తొలి సారిగా పిఎన్‌బి అంతర్గత ముఖ్య ఆడిటర్ ఎం. కె. శర్మను అరెస్టు చేసింది. కుంభకోణం చోటు చేసుకున్న పిఎన్‌బి బ్రాడీ హౌస్ బ్రాంచ్‌లో ఒక స్కేల్ 4 అధి కారిగా లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్ జారీ చేసే బాధ్యత శర్మ దని అధి కారులు తెలిపారు.వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ వాణిజ్య కార్యకలాపాలు చూపుతూ సిబిఐ ఎదుట విచారణకు హాజరుకావడానికి నిరాకరిస్తున్నాడు. నీరవ్ వైఖరికి విసిగి పోయిన సిబిఐ అతడికి ఘాటుగా ఒక లేఖ రాసింది. ఏ దేశంలో ఉన్నారో అక్కడి భారత రాయ బార కార్యాలయాన్ని ఆశ్రయించిన పక్షంలో తక్షణం భార త్‌కు రావ డా నికి ఖర్చులను భరిస్తుందని సదరు లేఖలో ఆదేశిం చింది.



ముంబై: హోలీ వేడుకల్లో భాగంగా పీఎన్‌బీ స్కాం నిందితుడు నీరవ్‌మోడీ 58 అడుగుల ప్రతిమను రూపొందించి దహనం చేయడానికి సిద్ధం చేస్తున్న అవినీతి నిరోధక సంఘం యువకులు

హోలీ కానుక తగ్గిన గ్యాస్ ధరలు

- సబ్సిడీపై సుమారు రూ. 2. 50 తగ్గింపు
- నాన్ సబ్సిడీపై రూ. 47 మైనస్
- స్వల్పంగా పెరిగిన పెట్రో, డీజిల్ ధరలు

ఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం హోలీ కానుక అందజేసింది. పేదోడికి ఊరట కల్గించేలా గ్యాస్ సిలిండర్ ధరను తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. నాన్ సబ్సిడీపై గత నెలతో పోలిస్తే... సుమారు రూ.47 తగ్గిస్తున్నట్టు నిర్ణయం తీసుకుంది. ఇది మార్చి 1, 2018 నుండి అమల్లోకి రానుంది. సబ్సిడీ, నాన్ సబ్సిడీ ధరలను తగ్గించింది. ఢిల్లీ, కోల్‌కత్తా, ముంబై, చెన్నై మెట్రో నగరవాసులకు లబ్ది చేకూరనుంది. గత ఏడాది కాలంలో సిలిండర్ల ధరలు గురువారంతో కలిపి మూడోసారి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తెలిపిన వివరాల ప్రకారం.. 2018లో సబ్సిడీ సిలిండర్ ధరతో పోలిస్తే.. ఢిల్లీలో రూ.2.6 తగ్గింది. అదేవిధంగా కోల్‌కత్తాలో రూ.2.36, ముంబైలో రూ.2.58, చెన్నైలో రూ.2.48 తగ్గింది. హైదరాబాద్‌లో ప్రస్తుతం సబ్సిడీ సిలిండర్ ధర రూ.489.50 ఉండగా, నాన్ సబ్సిడీ ధర రూ.786.50గా నిర్ధారించబడింది. నాన్ సబ్సిడీ ధరల్లో గత నెలతో పోలిస్తే.. ఢిల్లీలో రూ.47 తగ్గింది. అదే విధంగా కోల్‌కత్తాలో రూ.45.5, ముంబైలో రూ.47, చెన్నైలో రూ.46.5 తగ్గిస్తూ.. నిర్ణయం తీసుకుంది. ఏడాది కాలంలో చూస్తే నాన్ సబ్సిడీ ధర బాగానే తగ్గింది. ఢిల్లీ, ముంబై మెట్రో నగరాల్లో నాన్ సబ్సిడీ సిలిండర్ ధర సుమారు రూ.58 తగ్గింది. కోల్‌కత్తాలో రూ.54.5, చెన్నైలో రూ.56.5 తగ్గింది. పైన తెలిపిన ధరల్లోనే సదరు డీలర్ నుండి సిలిండర్లు పొందొచ్చు.

దేశవ్యాప్తంగా ఉన్న ఒక్కో లబ్దిదారుడికి సంవత్సరానికి 14.2 కిలోల 12 సబ్సిడీ సిలిండర్ అందజేస్తారు. ఒకవేళ కోటా దాటిపోతే మాత్రం నాన్ సబ్సిడీ ధరతో సిలిండర్లను అందజేస్తారు.

14.2 కిలోల సబ్సిడీ సిలిండర్ ధరలు చూస్తే...

నగరం	సబ్సిడీ ధరలు 1 మార్చి	1 ఫిబ్రవరి	1 డిసెంబర్	నాన్ సబ్సిడీ ధరలు 1 మార్చి	1 ఫిబ్రవరి	1డిసెంబర్
ఢిల్లీ	493.09	495.63	495.69	689	736	747
కోల్‌కత్తా	496.07	498.6	498.43	711.05	757	766
ముంబై	490.8	493.37	493.38	661	708	719
చెన్నై	481.21	483.77	483.69	699.5	746	756



గురువారం ఎల్‌పీజీ సిలిండర్ల ధరలు తగ్గిస్తూ నిర్ణయం తీసుకోగా, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. తాజా లెక్కల ప్రకారం.. ఢిల్లీలో లీటర్ పెట్రోల్ రూ.71.57గా ఉంది. ముంబైలో రూ.79.45, కోల్‌కత్తాలో రూ.74.32, చెన్నైలో రూ. 74.21గా ఉంది. అదేవిధంగా డీజిల్ ధరలు చూస్తే.. ఢిల్లీలో రూ.62.25 ఉండగా, ముంబైలో రూ.66.30, కోల్‌కత్తాలో రూ.64.94, చెన్నైలో లీటర్ డీజిల్ ధర రూ.65.63గా నిర్ధారించబడింది. పెట్రోలు, డీజిల్‌పై సుమారు నాలుగు మెట్రో పట్టణాల్లో సుమారు 6 నుంచి 11 పైసలు పెరిగింది.



అలిరాజ్‌పూర్ : సంప్రదాయ వస్త్రధారణతో 'భగోరియా' ఉత్సవాలకు జీపుపై ప్రమాదకరంగా తరలివెళ్తున్న యువతీ, యువకులు

క్రీడాప్రభ

కామన్వెల్త్ గేమ్స్ ట్రయల్స్‌లో తన్వర్ విజయం



న్యూఢిల్లీ: ప్రపంచ యూత్ బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం గెలిచిన నమన్ తన్వర్ గురువారం కామన్వెల్త్ గేమ్స్ ఎంపికకోసం నిర్వహించిన ట్రయల్స్ పోటీల్లో భాగంగా హెవీవెయిట్ 91 కేజీల విభాగం లో సుమిత్ సంగావాన్‌పై విజయం సాధించాడు. ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో నమన్ అసమాన ప్రతిభను చూపాడు. బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(బీఎఫ్ఐ) 91కేజీలు, 52 కేజీల విభాగాల్లో మాత్రమే ట్రయల్స్ నిర్వహించింది. మిగతా ఆరుగురు పురుష బాక్సర్లను గత ఏడాది జాతీయ ఛాంపియన్‌షిప్ పోటీల్లో సాధించిన పాయింట్లను అనుస రించి బీఎఫ్ఐ ఎంపికచేసింది. జనవరిలో నిర్వహించిన ఇండి యా ఓపెన్ పోటీల్లో నమన్, సంగావాన్‌లిద్దరూ కాంస్య పతకా లు సాధించారు. కజకిస్తాన్‌లో జరిగిన గ్యాలిం జారిల్‌గ్యాపోవ్ టోర్నీలో నమన్ స్వర్ణాన్ని గెలుచుకున్నాడు. నమన్ తన్వర్ ఈ ట్రయల్ పోటీలో గెలిచినప్పటికి... కామన్వెల్త్ క్రీడల్లో అతడి బెర్త్ ఖరారు కాలేదు. భారత్‌లో జరిగే వరల్డ్ సిరీస్ ఆఫ్ బాక్సింగ్(డబ్ల్యుఎస్‌బి)లో భాగంగా రష్యాతో నేడు జరుగ నున్న పోటీల్లో భారత్ గెలిస్తేనే నమన్‌కు అవకాశం దొరుకు తుంది. ఇందుకు కారణం.. డబ్ల్యుఎస్‌బిలో పాల్గొంటున్న సంజీత్ బరిలో ఉన్నాడు. ఒకవేళ సంజీత్ గెలిస్తే.. అతడే కామన్వెల్త్ గేమ్స్‌లోకి అడుగిడతాడు. సంజీత్ ఇండియా ఓపెన్‌లో స్వర్ణ పతకాన్ని గెలుచుకోవడంతో సంజీత్‌క ు అనకూ లంగా మారింది. కామన్వెల్త్ క్రీడలు ఏప్రిల్ 4 నుంచి 15 వరకు ఆస్ట్రేలియాలోని గోల్డ్ కోస్ట్ తీరంలో జరుగనున్నాయి. మార్చి 5లోగా ఈ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంది.

ప్రపంచ కప్ క్వాలిఫైయింగ్ పోటీలకు

గెట్ రెడీ

- ఆదివారం నుంచి మ్యాచ్‌లు ప్రారంభం
- చిరు జట్లతో పోటీలో వెస్టిండీస్
- బరిలో మొత్తం10 జట్లు



హరారే: ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌లో వెస్టిండీస్ పేరెత్తితేనే ప్రత్యర్థి జట్లు వణికిపోయేవి. అలాంటి అరవీరభయంకరమైన చరిత్ర కలిగిన వెస్టిండీస్ జట్టు ప్రస్తుతం తన ఉనికికే ముప్పు తెచ్చు కుంది. 2019 ప్రపంచ కప్‌లో పాల్గొనాలంటే క్వాలిఫైయింగ్ టోర్నమెంట్‌లో నెగ్గాల్సిన పరిస్థితికి దిగజారింది. క్వాలిఫైయిం గ్ టోర్నీ ఆదివారం నుంచి జింబాబ్వేలో ప్రారంభం కానుంది. 1975, 1979 ప్రపంచ కప్ టోర్నీల్లో విజేతగా నిలిచిన వెస్టిండీస్‌క ు వచ్చే ప్రపంచకప్‌లో పాల్గొనే దేశాల సంఖ్యను 10కి పరిమితం చేస్తూ ఐసీసీ తీసుకున్న నిర్ణయం ప్రతికూలంగా మారింది. ఐసీసీ నిర్ణయంతో ఒకప్పటి జగత్ విజేత వెస్టిండీస్ క్రికెట్‌లో ఇప్పుడి ప్పుడే ఓనమాలు నేర్చుకుంటున్న దేశాలతో క్వాలిఫై యింగ్ టోర్నీలో ఆడాల్సి న పరిస్థితి ఏర్పడింది.

2019 ప్రపంచకప్‌లో ప్రతీ జట్టు కనీసం 9 మ్యాచులాడుతుంది

2007 ప్రపంచ కప్ పోటీల్లో 16 జట్లు పాల్గొనగా, 2011, 2015 టోర్నీల్లో ఈ సంఖ్య 14కు తగ్గింది. క్రికెట్ కు ఆర్థిక శక్తి కేంద్రంగా మారిన భారత్, 2007 ప్రపంచ కప్‌లో మూడు మ్యాచ్‌ల ను మాత్ర మే ఆడగలిగింది. సూపర్ 8 దశకు కూడా చేరుకోలేకపో యింది. ఇది అశేష భారత అభిమాను లను, వ్యాపార స్తులను నిరాశ పర్చిం ది. రానున్న టోర్నీలో ఈ పరిస్థితిని నివారించేందుకు ఐసీసీ చర్యలను తీసుకుంది. 2019, 2023 ప్రపంచకప్ పోటీల్లో ప్రతీ జట్టు కనీసం తొ వి ్మ ద వ్యాచులాడేవిధంగా పోటీల ఫార్మాట్‌ను మార్చనుంది. 2019 ప్రపంచ కప్ పోటీలు మే 30 నుంచి 15 జూలై వరకు ఇంగ్లండ్, వేల్స్‌లో జరుగనున్నాయి.

టాప్ 8 దేశాలకు నేరుగా ప్రవేశం

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో తొలి ఎనిమిది ర్యాంకుల్లో నిలిచిన దేశాల జట్లకే 2019 ప్రపంచ కప్ పోటీల్లోకి నేరుగా ప్రవేశిస్తాయి. ఇందుకు కటాఫ్ తేదీగా 30 సెప్టెంబర్ 2017ను ఐసీసీ నిర్ణయిం చింది. ఈ నిబంధన ప్రకారం ఈ పోటీలకు ఆతిథ్యమిస్తున్న ఇంగ్లండ్ దేశంతోపాటు, ఆస్ట్రేలి యా, దక్షిణాఫ్రికా, న్యూజి లాండ్, ఇండియా, పాకి స్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంకలు టోర్నీకి నేరుగా అర్హత పొందగా, మిగతా రెండు దేశాలు క్వాలిఫైయింగ్ పోటీల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఎంపికవుతా యి. ఈ నేపథ్యంలో వెస్టిండీస్ కటాఫ్ తేదీ నాటికి టాప్ 10లో లేకపోవడం తో క్వాలిఫైయింగ్ దశలో తప్పనిసరి పాల్గొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. వెస్టిండీస్‌కు దిగువన ఆఫ్ఘనిస్తాన్, ఐర్లండ్, జిబాంబ్వేలున్నాయి. క్వాలిఫైయింగ్‌కు అర్హత పొందిన దేశాల్లో స్కాట్లాండ్, హాంగ్ కాంగ్, పపువా న్యూగి నియా, నెదర్లాండ్స్, యుఏఈ, నేపాల్ దేశాలు ఉన్నాయి. మూడు వారాలపాటు సాగే ఈ క్వాలిఫైయింగ్ పోటీల్లో సూపర్ సిక్స్ దశకు చేరి ఫైనల్లో నిలిచి న దేశాలు మాత్రమే 2019 కప్‌కు అర్హత పొందుతాయి.

క్రిస్ గేల్ సిద్ధం



'యూనివర్స్ బాస్'గా తనను తాను అభివర్ణిం చుకుంటున్న వెస్టిం డీస్ అరవీర భయంకర బ్యాట్స్‌మన్ క్రిస్ గేల్ యువజట్టుతో కలిసి క్వాలిఫైయింగ్ పోటీల్లోకి బరిలోకి దిగనున్నాడు. ఐపీఎల్‌లో వీర బాదుడుతో దేశంలో అశేష అభిమానులను సం పాదించుకున్న గేల్.. ఆదాయాన్ని కూడా పెంచుకు న్నాడు. నిజానికి క్రికెట్‌కు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ లభిస్తుండటంతో క్రికెట్ ఆట గాళ్ల ఆదాయాలు అమాంతం పెరిగిపోయాయి. గేల్ కూడా మంచి ఆదా యాన్ని పొందుతూ మల్టీ మిలియనీర్‌గా పరిణితి చెందా డు. గేల్ వార్షిక ఆదాయం ఏడాదికి 7.5 మిలియన్ డాలర్లకు చేరుకుందని అంచనా.

ఐసీసీ నిర్ణయం క్రికెట్‌లో వెనకడుగు



2019 టోర్నీలో ఆడే దేశాల సంఖ్యను 10కే పరిమితం చేయడం పట్ల పలు దేశా ల్లో అభి మానులు అసం తృప్తిని వ్యక్తం చేశారు. ఐసీసీ మూ డేళ్ల క్రితం ఈ నిర్ణయం ప్రకటిం చిన తర్వాత, భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఈ నిర్ణయా న్ని 'క్రికెట్‌లో వెనకడుగు'గా అభి వర్ణించాడు. ప్రపం చకప్‌లో కనీసం 25 దేశాలు పాల్గొ నేం దుకు అవకాశ మివ్వాలని సూచించాడు.

సూపర్ సిక్స్ ఫైనల్‌కు చేరిన జట్లకే అవకాశం

క్వాలిఫైయింగ్ పోటీలు ఆదివారం ప్రారంభమై మార్చి 25 వరకు కొనసాగుతాయి. ఈ పోటీల్లో భాగంగా 10 జట్లను ఐదేసి జట్లుగా రెండు గ్రూపులుగా విభజించారు. ప్రతీ గ్రూప్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లను సూపర్ సిక్స్‌కు అనుమతిస్తారు. ఈ సూపర్ సిక్స్‌లో ఫైనల్‌కు చేరి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు 2019 ప్రపంచకప్‌కు అర్హతను పొందుతాయి.



ఊపుమీదున్న ఆఫ్ఘనిస్తాన్

క్రిస్ గేల్, మార్లోన్ సామ్యూల్‌లతో వెస్టిండీస్ క్రికెట్ బోర్డుతో సాగిన వివాదం ఎట్టకేలకు ఒక కొలిక్కి రావటంతో వారు తిరిగి బరిలోకి దిగనున్నారు. ఆల్‌రౌండర్లు కెయిరన్ పొల్లార్డ్, అండ్రీ రస్సేల్, స్పిన్నర్ సునీల్ నరేన్, బ్యాట్స్‌మన్ డారెన్ బ్రేవోలు పాకిస్తాన్‌లో జరుగనున్న సూపర్ లీగ్ టీ20లో పాల్గొనాలని నిర్ణయించుకోవటంతో విండీస్ టీంలో టీనేజ్ యువకులకు ప్రవేశం దొరికింది. ఆఫ్ఘనిస్తాన్ జట్టు విషయానికి వస్తే.. లెగ్ స్పిన్నర్ వైస్ కెప్టెన్ రషీద్ ఖాన్, అతని సహచరుడు మణికట్టు స్పిన్నర్ ముజీబ్ ఉర్ రహమాన్‌లపైనే ఆ జట్టు ఆధారపడనుంది. ఇటీవల ఆఫ్ఘనిస్తాన్ జింబాబ్వేను 4-1 తేడాతో ఓడిం చింది. అదేవిధంగా ఐర్లండ్‌పై 2-1 తేడాతో విజ యం సాధించింది. ఈ విజయాలతో ఊపు మీదున్న ఆఫ్ఘనిస్తాన్ సూపర్ సిక్స్ ఫైనల్‌కు చేరుకోవడానికి మంచి ఉరక లేస్తోంది. కాగా ఐరిష్ జట్టు 2007లో పాక్ ను, 2011లో ఇంగ్లండ్‌ను ఓడించింది. ఈ టోర్నీలో ఏవిధంగా రాణిస్తుందో చూడాల్సి ఉంది. ఇక నేపాల్ జట్టు విషయా నికి వస్తే.. ఆ జట్టు భారమంతా 17 ఏళ్ల లెగ్ స్పి న్నర్ సందీప్ లామిచా న్నె పై ఆధారప డి వుం ది. ఐపీఎ ల్‌లో ఆడు తున్న నేపాల్ తొలి క్రికెటర్ సందీప్.

కరాచీ: వచ్చే నెల్లో పాకిస్తాన్ ఆతిథ్యమిస్తున్న ఆసియా ఎమర్జింగ్ నేషన్స్ కప్‌కు జట్టును పంపించమని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బీసీసీఐ) ప్రకటించడంతో ఈ టోర్నీ నిర్వహణ సందిగ్ధంలో పడింది. గురువారం పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అధికారి ఒకరు ఈ అంశంపై ఒక ప్రకటన చేస్తూ భారత్ ఈ టోర్నీకి జట్టును పంపించడంలేదని.. ఈ నేపథ్యంలో టోర్నీ వేదిక శ్రీలంక లేదా బంగ్లాదేశ్‌కు మారే అవకాశముందని



భారత్ గైర్హాజరితో.. ఆసియా ఎమర్జింగ్ నేషన్స్ కప్ నిర్వహణ సందిగ్ధం

ఆయన అన్నారు. అన్ని దేశాలు పాల్గొంటే ఈ టోర్నీని ఏప్రిల్‌లో నిర్వహించేందుక ు తాము సిద్ధంగా ఉన్నామని గతంలో ప్రకటించాము అని పాక్ అధికారి తెలిపారు. పీసీబీ ఛైర్మన్ నజమ్ సేథి దుబాయ్‌లో మీడియాతో మాట్లాడుతూ... ఆసియన్ క్రికెట్ కౌన్సిల్ అధిపతిగా తాను త్వరలోనే కొలంబోలో ఏసీసీ సమావేశం జరిపి ఈ టోర్నీ విషయంతోపాటు భారత్‌లో సెప్టెంబర్‌లో జరుగనున్న ఆసియా కప్‌పై తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించాడు. భారత్‌లో జరిగే ఆసియా కప్‌లో క ూడా పాకిస్తాన్ పాల్గొనడంపై కూడా అభ్యంతరాలున్నాయని సేథి పేర్కొన్నాడు. 2008 ఉగ్ర దాడుల అనంతరం భారత్, పాకిస్తాన్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లలో ఆడటం నిలిపివేసింది. ఐసీసీ, ఏసీసీ సమావేశాల్లో కూడా భారత్ తన నిరసనను స్పష్టం చేసింది. కాగా ఏప్రిల్‌లో కోల్‌కతాలో జరుగనున్న ఐసీసీ బోర్డు సమావేశాల్లో తాను హాజరయ్యేది ఐసీసీ వీసా జారీ చేస్తేనే జరుగుతుందని సేథి తెలిపారు. 'నాకు భారత్‌క ు వెళ్లాలని ఇష్టం లేదు. ఒక వేళ భారత అధికారులు వీసాను జారీచేస్తే వెళతాను లేకపోతే ఐసీసీ ఈ వ్యవహారం చూడాల్సి ఉంటుంది' అని సేథి అన్నారు.

పారా స్విమ్మర్ ప్రశాంత కర్మాకర్‌పై మూడేళ్ల నిషేధం




న్యూఢిల్లీ: పారా స్విమ్మర్ ప్రశాంత కర్మాకర్ మూడేళ్ల పాటు నిషేధానికి గురైనాడు. గురువారం పారా ఒలింపిక్ కమిటీ ఆఫ్ ఇండి యా(పీసీఐ) ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. గత ఏడాది జైపూర్ వేదికగా జరిగిన జాతీయ ఛాంపియన్ పోటీల్లో తన సహచర క్రీడాకారిణుల అవయవాలను వీడియో రికార్డింగ్ చేశాడని.. ప్రశాం త కర్మాకర్‌పై నిషేధాన్ని విధిస్తున్న ట్లు పీసీఐ తెలిపింది. ఈ మేరకు ప్రశాంతకు వ్యతిరేకంగా లిఖితపూ ర్వకమైన ఫిర్యాదు తమకు అందిందని పీసీఐ వెల్లడించింది. ఈ పోటీలు జరుగుతున్నపుడు ప్రశాం త, మహిళా స్విమ్మర్స్ ఈవెంట్‌ను వీడియో తీయాలని తన సహచరు డు పికె దబాస్‌ను కోరాడు. ఆమె తల్లిదండ్రులు వద్దన్నప్పటికి తాము వీడియో తీశామని దబాస్ పీసీఐ ముందు ఒప్పుకున్నాడు. ప్రశాంత కూడా వీడియో తీస్తూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడని పీసీఐ వాదిస్తోంది. ఈ ఘటన జరిగిన సమయంలో పీసీఐ ఛైర్మన్ ప్రశాంతను వివరణను కోరగా ప్రశాంత ఆగ్రహంగా మాట్లాడుతూ.. తన మనిషి వీడియో తీస్తే ఎందుకు ఆపుతున్నారని ఆఫీస్ బేరర్లను, ఛైర్మన్‌ను ప్రశ్నించాడు. అధికారులు బదులిస్తూ.. మహిళా స్విమ్మర్ల తల్లిదండ్రులు వద్దంటున్నారని తెలుపగా.. అయితే అది రాత పూర్వకంగా ఇవ్వాలని ప్రశాంత కోరాడు. వెంటనే పేరెంట్స్ లిఖిత రూపంలో తమ ఫిర్యాదును సమర్పించారు. తాను అర్జున అవార్డు గ్రహీతనని వీడియోలను తొలగించడానికి ప్రశాంత నిరాకరించాడని పీసీఐ పేర్కొంది. 37 ఏళ్ల ప్రశాంతను పోలీసులు కస్టడీలోకి తీసుకుని అనంతరం వీడియోలను తొలగిస్తానన్న హామీపై విడిచి పెట్టారు. ప్రశాంత 2003 ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని పతకం గెలిచిన తొలి భారత స్విమ్మర్. 2010 కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్య పతకంను గెలిచుకున్న ప్రశాంత 16 సార్లు వరసగా జాతీయ ఛాంపియన్‌గా నిలిచాడు. 2016 రియో పారా ఒలింపిక్స్ పాల్గొన్న స్విమ్మింగ్ జట్టుకు కోచ్‌గా పనిచేశాడు.

మెక్సికో ఓపెన్‌లో క్వార్టర్స్‌లోకి డొమ్నిక్

అకాప్యుల్కో(మెక్సికో): మూడో సీడెడ్‌గా బరిలోకి దిగిన ఆస్ట్రియన్ ఆటగాడు డొమ్నిక్ థెయిం మెక్సికో ఓపెన్ టెన్నిస్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. గురువారం జరిగిన మ్యాచ్‌లో డొమ్నిక్, కెనడాకు చెందిన డెనిస్ షపావలోవ్‌పై 6-2, 6-3 తేడాతో విజయం సాధించాడు. 2016లో డొమ్నిక్ ఈ టోర్నీ విజేతగా నిలిచాడు. నేటి మ్యాచ్‌లో గెలవడానికి డొమ్నిక్ దాదాపుగా గంట ముప్పై నిమిషాల సమయాన్ని తీసుకున్నాడు.

పాండ్యా బ్యాటింగ్‌లో రాటుదేలాలి

మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్



మొనాకో: ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా తన బ్యాటింగ్‌ను మరింత మెరుగు పర్చుకోవాల్సి ఉందని మాజీ భారత కెప్టెన్ కపిల్ దేవ్ అన్నాడు. ఆల్ రౌండర్‌గా పాండ్యా బాగా రాణిస్తున్నాడని... బ్యాటింగ్‌లో మరింత రాటుదేలాల్సి ఉందని గురువారం కపిల్ ఇక్కడ జరిగిన లారెస్ ప్రపంచ క్రీడా అవార్డుల సదస్సుల్లో పాల్గొన్న అనంతరం మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యానిం చాడు. దక్షిణాఫ్రికాతో ఆడిన తొలి టెస్టులో 93 పరుగులు చేసిన పాం డ్యా ఆ తర్వాత అన్ని ఫార్మాట్లలో కనీసం అర్ధసెంచరీ చేయలేక పో యాడ ని కపిల్ పేర్కొన్నా డు. పాండ్యా ఒత్తిడిని జయించి ఆడాలని సూచిం చా డు. ఆల్ రౌండర్ అంటే రెండు రంగాల్లో తన ప్రతిభను చాటాల్సి ఉందని కపిల్ తెలిపాడు. 'పాండ్యా తన స్థైర్యాన్ని చూపాడు. అతనిలో సామర్థ్యం,ప్రతిభ ఉంది. తన నిజమైన ఆటను ప్రదర్శిస్తే చూడాలని ఉంది' అని కపిల్ అన్నాడు. పాండ్యా బ్యాట్స్‌మన్‌గా లేదా బౌలర్‌గా జట్టులో ఉండాలని కోరుకుంటున్నాను. అతను ఆల్‌రౌండర్ కాబట్టి బ్యాటింగ్‌లో కొంచెం మెరుగు పడాల్సి ఉంది. బ్యా టింగ్‌లో స్వల్పంగా మెరుగు పడితే.. బౌలింగ్ తేలికగా చేయగలుగుతాడు అని కపిల్ చెప్పాడు. పాండ్యా ఇంకా యువకుడిగా ఉన్నాడు. అందరూ అతని స్థాయిని మించి ఆశిస్తున్నా రని.. జట్టులో ఉత్తమ ఆటగాడని పాండ్యాను కపిల్ ప్రశంసించాడు. వచ్చే ప్రపంచకప్‌లో దూకుడు వైఖరిని ప్రదర్శించే విరాట్ కోహ్లీ, ప్రశాంతంగా ఉండే ధోనిల ద్వయం భారత్‌కు కప్‌ను తీసుకొస్తుం దని కపిల్ అన్నాడు. వీరిద్దరు జట్టు లో ఉండటం తప్పుకాదు. ఫీల్డ్‌లో ఆటను అర్థం చేసుకుం టూ వ్యూహర చనకు సలహాలు ఇవ్వడా నికి ప్రశాంతంగా ఉండే ఆటగాడిని, నిర్ణయాలను కఠినంగా అమలుచేసి మరొక ఆటగాడిని జట్టు కల్గి ఉండాలి అని కపిల్ చెప్పారు.


డీఎస్పీ హర్మన్‌ప్రీత్‌కౌర్



చండీగఢ్: భారత మహిళా టీ20 జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ పంజాబ్ పోలీస్ విభాగంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా(డీఎస్పీ)గా గురువారం బాధ్యతలను చేపట్టాడు. పంజాబ్ ముఖ్య మంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్, డిప్యూటి జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ) సురేష్ అరోరా ఆమె యూనిఫామ్‌పై హోదాకు సంబంధించిన స్టార్స్‌ను పిన్ చేశారు. ఈ సంద ర్భంగా సీఎం అమరీందర్ సింగ్, కౌర్‌ను ప్రశంసిస్తూ ట్వీట్ చేశాడు. 'క్రీడల్లో మన దేశం తలెత్తుకునేలా కౌర్ తన బాధ్యతను నిర్వహించింది. డీఎస్పీగా కూడా ఆమె అదేవిధంగా విజయవంతం అవుతుందని నేను అనుకుంటున్నా ను. ఆమెకు నా శుభాకాంక్షలు' అని ట్వీట్ చేశాడు. కౌర్ ఇప్పటికే భారత రైల్వేలో సేవలను అందించింది. డీఎస్పీగా బాధ్యత ను చేపట్టాలంటే.. ఆమెను రైల్వే శాఖ రిలీవ్ చేయాల్సి ఉంది. ఇందుకు సీఎం అమరీంద ర్ సహకరించి రైల్వే శాఖకిచ్చిన సర్వీస్ కాంట్రాక్టును రద్దు అయ్యేందుకు సహకరిం చాడు. 2017 మహిళా క్రికెట్ ప్రపంచ కప్‌లో కౌర్ అసమాన ప్రతిభకు మెచ్చి సీఎం అమరీందర్ సింగ్ ఆమెకు డీఎస్పీ పదవిని ఇస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

సఫారీలతో ఆసీస్ తొలి టెస్టు ప్రారంభం

తొలి రోజు ఆటలో ఆసీస్ 5/225



డర్బన్: దక్షిణాఫ్రికాలో పర్యటనలో భాగంగా ఆస్ట్రేలియా జట్టు ఆతిథ్య జట్టుతో ఆడుతున్న తొలి టెస్టు తొలిరోజులో ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్లు డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్ అర్ధ శతకాలు చేసినప్పటికి దక్షిణా బౌలర్లపై పైచేయి సాధించలేకపోయారు. ఆస్ట్రేలియా టాస్ గెలిచి బ్యాటింగ్‌ను ఎంచుకుంది. వెళుతురు సరిగా లేకపోవడంతో నిర్ణీత సమయంకంటే ముందే ఆటను ముగించేసరికి ఆస్ట్రేలియా ఐదు వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా చక్కటి బౌలింగ్‌తో ఆసీస్ బ్యాట్స్‌మన్లను పరుగులు తీయకుండా నియంత్రించారు. మూడో వికెట్ భాగస్వామ్యానికి డేవిడ్ వార్నర్(51), స్మిత్(56)లు 92 బంతుల్లో 56 పరుగులు జోడించారు. ఫిలాండర్ 36 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశాడు. స్పిన్నర్ కేశవ్ మహారాజ్ 69 పరుగులకు 2 వికెట్లు తీశాడు. స్మిత్ వరుసగా ఐదో అర్ధ శతకాన్ని తన ఖాతాలో నమోదు చేసుకున్నాడు. వార్నర్ 79 బంతులు ఎదుర్కొని ఆరు ఫోర్లు కొట్టి 51 పరుగులు చేశాడు.తొలిరోజు ఆట ముగిసే సమయానికి ఎం మార్ష్ 32 పరుగులు, టి పెయినే 21 పరుగులతో నాటౌట్‌గా ఉన్నారు.

ఆసీస్ స్కోరు వివరాలు: 5/225(76 ఓవర్లు) ఎక్స్ట్రాలు 6(వార్నర్ 51, స్మిత్ 56, ఎస్. మార్ష్ 40)

బౌలింగ్: ఫిలాండర్ 2/36, మహారాజ్ 2/69, రబాడా 1/58,

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

మెదడు వ్యాధులకు ఆయనంటే దడ!



దేశం గర్వించదగ్గ న్యూరో సర్జన్లలో ఆయన ఒకరు. డాక్టర్ రంగనాథం హస్తవాసికి దేశవ్యాప్తంగా పేరుంది. సంక్లిష్టమైన కేసులను సైతం ఆయన సునాయసంగా సక్సెస్ చేసిన సందర్భాలు అనేకం. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 20 వేల సర్జరీలను విజయవంతంగా చేశారాయన. బ్రెయిన్ ఆపరేషన్లలో రిస్క్ ఎక్కువ. చక్కగా నడుచుకుంటూ వచ్చిన వ్యక్తి...ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్లి ప్రాణాలతో వస్తాడనే నమ్మకం తక్కువ. అలాంటిది డాక్టర్ రంగనాథం చేయి పడింది అంటే ఆపరేషన్ విజయవంతం కావాల్సిందే... ఆయుష్షు పెరిగి తీరాల్సిందే. క్షణం తీరిక లేకుండా రోగుల సేవలో తరిస్తున్న డాక్టర్ రంగనాథంను ఆంధ్రప్రభ లైఫ్ పలకరించింది. ఆ వివరాలు మీ కోసం..

న్యూరోసర్జన్ డాక్టర్ పి.రంగనాథం

శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం కింతల గ్రామానికి చెందిన డాక్టర్ రంగనాథం బాల్యం అంతా కష్టాల కడలిలోనే సాగింది. తల్లిదండ్రులు నిరక్షరాస్యులు. అరకొర సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం గడిచింది. అప్పట్లో స్కూల్‌లో బ్లాక్ బోర్డు తప్పితే ఎటువంటి సదుపాయాలు ఉండేవి కావు. కూర్చోడానికి కనీసం టేబుళ్లు, బెంచ్‌లు కూడా ఉండేవి కాదు. నేలమీదే కూర్చుని చదువుకోవాల్సిన పరిస్థితి.

'మా ఇంటి నుంచి స్కూలు నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉండేది. స్కూల్లో కానీ ఇంట్లోకానీ గడియారం కూడా ఉండేది కాదు. అయినా స్కూలుకు వెళ్లే సమయాలను ఖచ్చితంగా పాటించేవాళ్లం. మా అందరికీ గోడనీడే గడియారం. సూర్యుడు ఉదయించినప్పటి నుంచి అస్తమించేవరకు మా ఇంటి గోడ మీది నుంచి పడే నీడ ఆధారంగా సమయాన్ని లెక్క కట్టేవాళ్లం. మా గ్రామస్తులే కాదు చుట్టు పక్కల ఉన్న గ్రామస్థులు కూడా అదే స్కూలుకు వచ్చేవారు' అంటూ ఆనాటి రోజులను గుర్తు చేసుకున్నారు డాక్టర్ రంగనాథం.

ఏకసంథాగ్రాహి...స్కాలర్‌షిప్‌తో ఇంటర్ చదువు

స్కూల్లో బ్లాక్ బోర్డు మీద రాసిన పాఠాన్ని టీచర్ చెరిపేసినప్పటికీ రంగనాథం మెదడు పొరల్లో నిక్షిప్తమై పోయి ఉండేది. దీంతో ఒకసారి విన్న పాఠాలను ఆయన అక్షరం పొల్లుపోకుండా తిరిగి అప్పచెప్పేవారు. జ్ఞాపకశక్తి బాగా ఉండటం వల్ల చదువుల్లో చక్కగా రాణించారు.

లాంతరు వెలుగులోనే చదువుకునేవారు. అప్పట్లో కరెంటు సౌకర్యం ఉండేది కాదు. వెనకబడిన జిల్లా కావడంతో పేదరికం తాండవించేది. రంగనాథం తండ్రికి వ్యవసాయమే దిక్కు. ఆదాయం అంతంత మాత్రమే. పిల్లలకు చదువులు చెప్పించేస్థోమత ఉండేది కాదు ఆయనకి. అమ్మ తండ్రికి చేదోడు వాదోడుగా ఉండేవారు. ఇల్లు గడవడం కూడా కష్టంగా ఉండేది. ఐదుగురు సంతానంలో రంగనాథం చివరివారు. ఆయన అన్న మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. ఆయనకు పొరుగూరిలోనే గవర్నమెంట్ టీచర్ ఉద్యోగం వచ్చింది. రంగనాథం పదవతరగతిలో స్కూల్ ఫస్ట్ మాత్రమే కాదు... రాష్ట్ర స్థాయిలోనే మూడో ర్యాంకు సాధించారు.

ఆ తరువాత తన అన్న మిత్రుడు ఇచ్చిన సలహా మేరకు మొట్టమొదటిసారిగా బొగ్గు రైలు ఎక్కి విజయవాడ చేరారు. ఆంధ్రా లయోలా కాలేజిలో ప్రవేశం పొందారు. స్కాలర్‌షిప్‌తో ఇంటర్మీడియట్ పూర్తిచేశారు.

తెలుగుమీడియంతోనే రాణించి...

'డాక్టరు కావాలనేది చిన్ననాటి కోరిక కాదు కానీ... మా గ్రామంలో ప్రాథమిక చికిత్సా కేంద్రం కూడా ఉండేది కాదు. రోగమొచ్చినా నొప్పి వచ్చినా కిలోమీటర్ల దూరం వరకు వెళ్లాల్సి వచ్చేది. అదృష్టం ఉంటే బతికి బట్టకట్టే పరిస్థితి ఆ రోజుల్లో. దీంతో నాలో కొద్దికొద్దిగా డాక్టరు కావాలన్న కోరిక పెరగసాగింది. పదవతరగతి వరకు తెలుగు మీడియం చదివితే ఇంటర్మీడియట్ కూడా తెలుగు మీడియంలో చదవాలన్న నిబంధన ఆంధ్రా లయోలా కాలేజిలో ఉండేది. అయితే మెడికల్ ఎంట్రెన్స్ మాత్రం ఇంగ్లీషులో రాయాలి. ఇది నాకు పెద్ద సమస్యగా ఉండేది. ఇంటర్మీడియట్‌లోనే తెలుగు పదాలను ఇంగ్లీషులో తర్జుమా చేసుకుంటూనే చదివేవాడిని. అలా నిదానంగా ఇంగ్లీషు మీద పట్టు పెంచుకోగలిగాను. ఇంగ్లీషు మీడియం విద్యార్థులకంటే ఎక్కువ మార్కులు సాధించాను. ఆంధ్రా మెడికల్ కాలేజిలో ఎంబిబిఎస్ సీటు వచ్చింది. అది 1972వ సంవత్సరం...నేను కాలేజిలో చేరే సమయం నాటికి జై ఆంధ్రా ఉద్యమం నడుస్తోంది. వెంకయ్య నాయుడుగారు కూడా ఈ ఉద్యమంలో ఉన్నారు. ఎంబిబిఎస్ మొదటి సంవత్సరంలో అడ్డంకులు ఏర్పడ్డాయి. అధ్యాపకులు కాలేజీకి రాలేకపోయేవారు. ఎలాగైతేనేం ఎంబిబిఎస్ పూర్తయ్యింది. ఇప్పట్లో మాదిరిగా ఐదేళ్లు కాకుండా ఆరేళ్లు ఎంబిబిఎస్ ఉండేది' అంటూ తన చదువుగురించి చెప్పారాయన.

న్యూరో సర్జరీలో ఒకే ఒక్కసీటు...

'అప్పట్లో ప్రయివేటు కాలేజీలు ఉండేవి కాదు. కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజీ తప్పితే ఏ ఒక్క ప్రయివేటు కాలేజీ లేదు. ఆంధ్రా యూనివర్శిటీ పరిధిలో ఆంధ్రా మెడికల్ కాలేజీ , గుంటూరు మెడికల్ కాలేజీ, తిరుపతి మెడికల్ కాలేజీ , కర్నూలు మెడికల్ కాలేజీలు ఉండేవి. తెలంగాణలో ఉస్మానియా, గాంధీ, కాకతీయ మెడికల్ కాలేజీలు ఉండేవి. ఎంబిబిఎస్ పూర్తయిన తర్వాత ఎంఎస్ చేయాలి. ఢిల్లీలోని ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో సీటురావాలన్న కోరిక చాలామందికి ఉంటుంది. అలాంటి సమయంలో నేను రెండో ఆప్షన్ పెట్టకుండానే న్యూరో సర్జరీ కోసం ఎంట్రెన్స్ రాసాను. దేశవ్యాప్తంగా పోటీ ఉంది. న్యూరో సర్జరీలో ఒకే ఒక్క సీటు ఉంది. అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకున్నాను. సీటు రాకపోతే మరోసారి ట్రై చేద్దాంలే అని సమాధానపడ్డాను. ఆ ఒక్క సీటు నన్నే వరించింది. నా ఆనందానికి అవధుల్లేకుండా పోయింది" అంటూ డాక్టర్ రంగనాథం నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

ఢిల్లీలో హాస్టల్ గదిలో కాపురం...

'నా తోటి విద్యార్థులు, స్నేహితులు న్యూరో సర్జరీ అంటే పెద్దగా శ్రద్ధ చూపలేదు. ఎందుకంటే అప్పట్లో సాంకేతికత అంతగా లేదు. బ్రెయిన్ సర్జరీ అంటే చావు తథ్యం అనే అభిప్రాయం ఉండేది. కోమాలో ఉన్న వ్యక్తికి బ్రెయిన్ సర్జరీ చేసి మామూలు స్థితికి తీసుకురావచ్చు... అని నేను ఎంబిబిఎస్ చదివే సమయంలో తెలుసుకోగలిగాను. న్యూరో సర్జరీ చేసే సమయంలో ఎయిమ్స్ వాళ్లు వివాహం అయిన జంటకు హాస్టల్ వసతి కల్పించారు. కానీ నేను చదువుకునే ప్రాంతానికి హాస్టల్ చాలా దూరంగా ఉండేది. కాబట్టి ఎయిమ్స్ ప్రాంగణంలోనే బ్యాచిలర్స్‌కు ఇచ్చే చిన్నపాటి హాస్టల్ గదిలోనే నేను నా భార్య ఉండేవాళ్లం. మాది ఆరేంజ్‌డ్ మ్యారేజ్. ఈ రోజుల్లో మాదిరిగా డాక్టరు మరో డాక్టరును పెళ్లి చేసుకోవాలన్న అభిప్రాయం ఉండేది కాదు. హిందీలో నాకు కొద్దో గొప్పో ప్రవేశం ఉండేది. హిందీ పండిట్, విద్వాన్ వంటి పరీక్షలు రాసిన అనుభవం నాకు ఉంది. కానీ ఆమెకు హిందీ అంటే అస్సలు తెలియని భాష. ఢిల్లీలో హిందీరాకుండా జీవనాన్ని కొనసాగించడం పెద్ద పరీక్షే అయ్యింది' అంటూ చెప్పుకొచ్చారు డాక్టర్ రంగనాథం.



నక్సలైట్‌గా ముద్ర వేశారు

'నక్సల్బరీ ఉద్యమానికి శ్రీకాకుళం జిల్లా పుట్టిల్లు. ఈ కారణంగానే నేను ఆంధ్రా లయోలాకాలేజిలో చేరినప్పుడు కొంత సమస్య ఎదురైంది. నా మీద నక్సలైట్ ముద్ర కూడా పడింది. నక్సలైట్ రంగనాథం అని పిలిచేవారు. నిజానికి నక్సల్బరీ ఉద్యమానికి నాకు ఎటువంటి సంబంధం లేదు. అయినా నిందలు వేశారు... వేధించారు.

ఎయిమ్స్ పట్టాతో హైదరాబాద్‌కి..

ఎయిమ్స్ నుంచి పట్టా తీసుకుని హైదరాబాద్ వచ్చేశాను. నిమ్స్‌లో అసిస్టెంట్ న్యూరో సర్జన్‌గా ఉద్యోగం సంపాదించాను. చిన్నప్పుడు దారిద్ర్యాన్ని అతి దగ్గరి నుంచి చూసిన నేను ఎలాగైనా ఉన్నతస్థితికి చేరుకోవాలన్న నిర్ణయానికి వచ్చాను. ఈ కారణంగానే ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి 26 ఏళ్ల క్రితం యశోదా హాస్పిటల్‌లో చేరాను. నాటి నుంచి నేటివరకు కొనసాగుతూనే ఉన్నాను. మా అబ్బాయి కూడా డాక్టరే. అయితే కార్డియాలజీ తీసుకున్నాడు. తనని న్యూరో సర్జన్ చేయమని ఏనాడూ బలవంత పెట్టలేదు. అందరం న్యూరో సర్జన్‌లమే అయితే మన శరీరంలోని అవయవాలన్నింటికీ డాక్టర్లు దొరుకుతారా?' అన్నారాయన.

జ్యోతిష్యం నమ్ముతాను...దేవుని ప్రార్థించాకే ఆపరేషన్

'నేను డాక్టర్ అయినప్పటికీ జ్యోతిష్యాన్ని నమ్ముతాను. శుభ కార్యాలు ప్రారంభించే ముందు ముహూర్తాలు చూసుకునే సంప్రదాయం ఉంది. అలాగే నేను కూడా సర్జరీ చేసే ముందు ముహూర్తాన్ని ఖరారు చేసుకున్నాకే ఆపరేషన్ మొదలు పెడతాను' అన్నారు డాక్టర్ రంగనాథం. మహిళలకు రుతుక్రమం సమయంలో ఆపరేషన్ చేయరు. శాస్త్రీయంగా కూడా ఇదే కరెక్టంటారు ఆయన. 'ఈ సమయంలో బ్లీడింగ్ టెండెన్సీ ఎక్కువగా ఉంటుంది. బాగా చికాకుగా ఉంటారు' అంటూ కారణం చెప్పారు. ఎమర్జెన్సీకేసుల్లో మాత్రం ఇలాంటి నమ్మకాలకు దూరంగా ఉంటారు. 'ఇన్నేళ్ల అనుభవంలో సర్జరీ అంటే ఏనాడూ భయపడలేదు. అయితే చింత మాత్రం ఉంటుంది. భగవంతుడి మీద భారం వదిలేస్తాను. నేను నమ్ముకున్న శ్రీవెంకటేశ్వరుడిని తలచుకుంటాను. ఈ ఆపరేషన్ విజయవంతం చేయాలని కోరుకుంటాను. మీరు చూస్తున్నారు కదా... నా ఛాంబర్ నిండా శ్రీవెంకటేశ్వర స్వామి ఫోటోలు. తల మీద కత్తి పెట్టినప్పుడే భగవంతుడిని ప్రార్థిస్తాను. నా వద్దకు వచ్చే పేషెంట్లకు పూర్తి నమ్మకం ఉంటుంది. ఈ నమ్మకాన్ని వమ్ము చేయకూడదన్నది నా తాపత్రయం. దేవుడిని ప్రత్యక్షంగా చూడకపోయినా పరోక్షంగా డాక్టరు రూపంలో కనిపిస్తాడు. కాబట్టి బ్రెయిన్ సర్జరీలు చేసే సమయంలో దేవుడిని తలచుకుంటూనే ఉంటాను" అన్నారు డాక్టర్ రంగనాథం.

నిరాడంబరంగా... పేషంట్‌కి స్నేహితుడిలా...

డాక్టర్ రంగనాథం అతి నిరాడంబరంగా కనిపిస్తారు. నుదుటిపై తిలకం ఎప్పుడూ ఉంటుంది. అలాగే పెదవులపై చెరగని చిరుహాసం. తన కోసం పేషెంట్లు ఎదురుచూడటం ఏ మాత్రం ఆయనకు ఇష్టం ఉండదు. ఈ ఇంటర్వ్యూ కొనసాగుతున్న సమయంలోనూ ఆయన పేషెంట్లను పిలిపించుకున్నారు. వారిని రోగానికి సంబంధించిన ప్రశ్నలు అడగటం కంటే యోగక్షేమాలే ఎక్కువగా అడిగారు. ఆప్యాయంగా పలకరించారు. ఆత్మీయత చూపించారు. మహబూబ్ నగర్ జిల్లా నవాబుపేట నుంచి ఒక వృద్ధ దంపతుల జంట ఆయన దగ్గరికి వచ్చారు. సిటీ స్కాన్ రిపోర్టు తీసి చూశారు. 'రిపోర్ట్ నార్మల్ గానే ఉంది. కానీ ఇందులో ఒక సమస్య ఉంది. గతంలో మీకు బ్రెయిన్ సర్జరీ అయింది కాబట్టి మెటల్ క్లిప్ అందులోనే ఉంటుంది. ఎంఆర్ఐ పరీక్ష చేస్తే ప్రాణానికే ముప్పు' అని డాక్టర్ రంగనాథం వివరించారు. బీపీ, షుగర్ ఉన్న దృష్ట్యా ఈ పరీక్షకు సిఫారసు చేయలేనని చెబుతూనే వారికి పూర్తి భరోసా ఇచ్చారు. మీ ప్రాణాలకు ఎటువంటి ఢోకాలేదని.. ఈ మందులు కొన్ని రోజుల పాటు వాడితే మూతివంకర, కంటి నుంచి నీరు కారడం తగ్గుతుందని వివరించారు. వారిద్దరిని కొద్దిసేపు నవ్వించారు. ఇలా ఆయన ప్రతీ పేషెంట్‌ను పలకరించడం ఎంతో ముచ్చటగా అనిపించింది.

సీటీ స్కాన్ ప్రభంజనం

'మేం చదువుకునే రోజుల్లో న్యూరో సర్జరీ అంటే అవగాహన ఉండేది కాదు. మోర్టాలిటీ (మరణాల సంఖ్య) ఎక్కువగా ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. సీటీ స్కాన్ వచ్చిన తర్వాత న్యూరో సర్జరీ విభాగానికి అది ఆయువుపట్టు అయ్యింది. ఈ పరీక్ష చేయడం వల్ల మెదడులోని వెంట్రుకమందంలో ఉండే రక్తనాళాల్లో కూడా ఎక్కడెక్కడ అడ్డంకులు ఉన్నాయో తెలుసుకోగలుగుతున్నాం. పెద్ద ట్యూమర్లే కాదు అతి చిన్న ట్యూమర్లను సైతం కరిగించే టెక్నాలజీ వచ్చింది. మెదడులో ఏ భాగంలో సమస్య ఉందో కచ్చితంగా తెలుసుకోవడానికి ఈ పరీక్ష దోహదపడింది. ఎంఆర్ఐ, మైక్రోస్కోప్ పరీక్షల ద్వారా కూడా మెదడులోని అతి చిన్న లోపాలను సైతం కనిపెట్టగలుగుతున్నాం. ప్రస్తుతం రోబోటిక్ సర్జరీలు వస్తున్నాయి. మనదేశంలో ఈ టెక్నాలజీ ఇంకా రాలేదు. ఇంకా సమయం పడుతుంది. మనిషి ప్రమేయం తగ్గించి యంత్రం ప్రమేయం పెంచే రోబోటిక్ సర్జరీ వల్ల అత్యుత్తమ ఫలితాలు వస్తున్నాయి' అంటూ వివరించారు డాక్టర్ రంగనాథం.

పుట్టిన గడ్డకు సేవ....ఉచిత వైద్యం

పేద కుటుంబంలో పుట్టటం వలన చిన్నతనం నుండే గ్రామీణుల కష్టాలను దగ్గర గా చూశారు. పేదరికానికి దగ్గరగా, అభివృద్ధికి దూరంగా ఉండే అలాంటి గ్రామాల్లో ఆధునిక వైద్య సేవలు అందడం అనేది అత్యాశే అవుతుంది. అలాంటి గ్రామీణులు చికిత్స కోసం వేచి చూస్తున్నప్పుడు... అనారోగ్యంతో కుంగిపోతున్నప్పుడు తనకు బాధగా ఉంటుందని, వారికోసం ఏదైనా చేయాలనే తపన ఉంటుందని ఆయన అన్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చిన రోగులకు డాక్టర్ రంగనాథం ఉచితంగా వైద్యం చేస్తున్నారు. సర్జరీ ఖర్చులు తప్పితే డాక్టరు ఫీజు లేకుండా సేవలందిస్తున్నారు.

-శ్రీనివాసాచారి. బి

పండుగొచ్చింది!



సహజ హోలీ రంగుల తయారీలో అత్యాచార బాధిత మహిళలు

హోలీ అంటే రంగుల పండుగ. జీవితంలోని చింతలు, దు:ఖాలను పారదోలి ఆనందోత్సాహాలు, సుఖసంతోషాలను ఆహ్వానించేందుకు సంకేతంగా కూడా ఈ పండుగను జరుపుకుంటారు. ఈ పండుగకు సహజరంగులను తయారుచేస్తూ ఉపాధిని పొందుతున్నారు... ఢిల్లీకి సమీపంలోని గుర్గావ్ పాలం విహార్ ప్రాంతానికి చెందిన నలురుగు మహిళలు. వీరు అత్యంత బాధాకరమైన పరిస్థితుల్లోంచి బయటపడి నూతన జీవితాన్ని సృష్టించుకుంటున్నవారు. వీరంతా అత్యాచార బాధితులు... వేశ్యా గృహాల నుంచి బయటపడ్డవారు. బతికి ఉండగానే నరకాన్ని చూసి... చేయని తప్పుకు సమాజం నుంచి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నవారు. ఈ హోలీ సందర్భంగా ఎలాంటి రసాయనాలు కలపని సహజరంగులను తయారు చేస్తూ...ఉపాధిని పొందుతున్నారు. రీతూ శర్మ అనే ఓ శివసేన కార్యకర్త ఈ మహిళలను చేరదీసి వారి బతుకుతెరువుకోసం కొత్త దారి చూపించారు. కుట్టుపని, క్యాండిల్స్ రాఖీల తయారీలో శిక్షణ ఇప్పించారు. దాంతో ఈ మహిళల జీవితాల్లో కొత్త ఆశలు చిగురించాయి. ఎవరి ఆసరా లేకుండా తమ కాళ్ల మీద తాము నిలబడగలమనే ధైర్యం వచ్చింది. ఏ పండుగ సమయంలో దానికి సంబంధించిన వస్తువులను సీజన్‌ల వారీగా తయారు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఆర్థిక స్వావలంబనతో తమ గత జీవితాన్ని మర్చిపోతున్నారు. ప్రస్తుతం హోలీ సీజన్ కావడంతో ఆయుర్వేద పదార్థాలతో పర్యావరణహితమైన సహజ రంగులు తయారు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఈ నలుగురు మహిళలు కలిసి 7 వందల కిలోల సహజ గులాల్ తయారు చేశారు. వీరు తయారు చేసిన ఆయుర్వేద రంగులకు మంచి డిమాండ్ ఉందని వీరికి సహాయ సహకారాలు అందిస్తున్న రాంబాబు శర్మ చెప్తున్నారు. ఆయన అనాథలైన రెండువందల మంది పిల్లలను చేరదీసి వారి ఆలనా పాలనా చూస్తున్నారు. రాంబాబు శర్మ తమకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తున్నారని ఈ మహిళలు చెబుతున్నారు.



ప్రజా సమస్యలకు వైద్యం!



భువనగిరి ఎంపీ బూర నర్సయ్య గౌడ్

ల్యాప్రోస్కోపీ సర్జరీని కార్పొరేట్ స్థాయి నుంచి కామన్ మ్యాన్ చెంతకు తెచ్చిన ఘనత... 20 వేలకు పైగా ల్యాప్రోస్కోపీ ఆపరేషన్లు చేసిన నైపుణ్యం, అంకితభావం.... కేంద్ర ప్రభుత్వం నుంచి స్పెషల్ సర్జికల్ స్కిల్ అవార్డుతో పాటు బెస్ట్ సర్జన్ అవార్డు... తన రచనల ద్వారా సామాజిక, ఆర్థిక, వైద్య రంగాల్లోని ఎన్నో కొత్త విషయాలు పాఠకుల ముందుకు... కుంచె పట్టి అద్భుత చిత్రాల ఆవిష్కరణ....ఇవన్నీ ఒకే వ్యక్తి సాధించిన విజయాలు, ఒకే అర్హతలు...ఆయనే భువనగిరి నియోజకవర్గం నుంచి తెలంగాణ రాష్ట్ర సమితి తరఫున లోక్‌సభకు ఎన్నికైన ఎంపీ బూర నర్సయ్య గౌడ్. నేడు ఆయన పుట్టినరోజు సందర్భంగా... ఆంధ్రప్రభ ఢిల్లీ ప్రతినిధి ఆయనతో ప్రత్యేకంగా జరిపిన సంభాషణ మీకోసం-

★ ఎంపీగా రాజకీయ జీవితం ఎలా ఉంది?

సంతృప్తిగా ఉంది. సర్జన్‌గా కత్తితోనే పనిచేయ గలను. కలంపట్టి నా సంతకం ద్వారా.. లక్షలాది మంది జీవితాలను మార్చే అవకాశం ఉంటుంది. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, నియోజకవర్గ అభివృద్ధి, సామాజిక సమ న్యాయం కోసం రాజకీయాల్లోకి అడుగు పెట్టాను. ఈ మూడు అంశాల ఎజెండా నా రాజకీయ ప్రవేశానికి కారణం కాబట్టి మూడింట్లో విజయవంతంగా పయనిస్తున్నందుకు సంతృప్తిగా ఉంది.

★ మీ రాజకీయ జీవితం, ప్రస్థానం ఎలా మొదలైంది?

ప్రత్యక్ష రాజకీయాల్లోకి అనుకుని రాలేదు. కాలేజీలో ఉన్నప్పుడు విద్యార్థి నాయకుడిగా జూనియర్ డాక్టర్స్ ప్రెసిడెంట్‌గా ఉన్నాను. వైద్య విద్యార్థుల ఉద్యమాల్లో పాల్గొన్నాను. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్నప్పుడు కూడా హెల్త్ ఆర్గనైజేషన్‌కు సెక్రటరీగా ఉన్నాను. తెలంగాణ ఉద్యమంలో మొదట పరోక్షంగా తర్వాత ప్రత్యక్షంగా పాల్గొన్నాను. రాజకీయాలకు దూరంగా ఉండి వాటిని విమర్శించడం అవివేకం. చదువుకున్న వాళ్లు, విద్యావంతులు, వృత్తి నిపుణులు రాజకీయాల్లో దిగి రాజకీయాలను ప్రక్షాళన చేయాలి. అందుకే రాజకీయాల్లోకి వచ్చాను.

★ వైద్య రంగం, రాజకీయం రెండింటినీ ఎలా బ్యాలన్స్ చేస్తున్నారు..?

నేను ఇప్పటికీ రోజూ ఆరునుండి తొమ్మిది గంటల వరకు వైద్య వృత్తిలోనే ఉంటాను. ఇప్పటికీ నా హస్తివాసిని నమ్మే పేషెంట్లు ఎంతో మంది ఉన్నారు. ఓవైపు షెడ్యూల్‌ని బట్టి ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొంటూ, మరోవైపు హైదరా బాద్‌లో పేషెంట్లకు ఆపరేషన్లు చేస్తూ రెండు రంగాలకు సమన్యాయం చేస్తున్నాను.

★ మీ వృత్తి అనుభవం, పరిజ్ఞానం రాజకీయాల్లో ఉపయోగపడుతున్నదా?

ఒక డాక్టర్‌గా హెల్త్ కేర్ సిస్టంను అతి తక్కువ ఖర్చుతో ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలన్నది నా తపన. ఎయిమ్స్ కోసం మొదటి నుంచి కొట్లాడుతున్నాను. నా నియోజక వర్గంలో, రాష్ట్రంలో బెస్ట్ పాజిబుల్ వైద్యం అందించాలన్న అంశంపై ఒక హెల్త్ బ్లూ ప్రింట్‌ను సీఎం కేసీఆర్ గారికి ఎప్పుడో ఇచ్చాను. అంచెలంచెలుగా మండలానికి 30 పడకల ఆస్పత్రి, నియోజకవర్గానికి 100 పడకల ఆస్పత్రి, జిల్లా కేంద్రంలో స్పెషాలిటీ ఆసుపత్రి ఉండాలి. స్మార్ట్ హెల్త్ కార్డ్, ఆన్ లైన్, డిజిటలైజేషన్ ఆఫ్ హెల్త్ కేర్, మనిషి హెల్త్ ప్రొఫైల్ ఆధార్ తరహాలో ఆన్ టేబుల్ ఉండాలి. దేనికెంత బడ్జెట్ పెట్టాలి... ఉన్న బడ్జెట్‌ను ఎంత సద్వినియోగం చేసుకోవాలి అనే దానిపై నాకు స్పష్టత ఉంది. రోడ్డు రైళ్ల వంటి సౌకర్యాలు ఉన్నాయి కాబట్టి రాష్ట్ర నలుమూలల కు వైద్య నిపుణుల ను పంపవచ్చు. ఇంట ర్నెట్ ఉపయోగిం చుకుని టెలీ మెడిసి న్ ఎలా ఇవ్వాలి..? తక్కువ ఖర్చుతో ఎక్కువ వైద్యం ఎలా అందించాలన్న దానిపై నాకు ఐడియా ఉంది.

★ వైద్య రంగం, రాజకీయ రంగం మీకు రెండింట్లో ఏది ఎక్కువ సంతృప్తినిచ్చింది..?

ఇవి సరిపోల్చేవి కావు. నేను వైద్యుడిగా చాలా సంతోషంగా, సంతృప్తిగా ఉన్నాను. పినాకిల్ రీచ్ అయ్యాను. భారతదేశంలోకెల్లా అత్యంత ఎక్కువ ల్యాప్రోస్కోపిక్ ఆపరేషన్లు చేసిన వైద్యుణ్ని. ల్యాప్రోస్కోపీని సామాన్యుడి చెంతకు తీసుకురాగలిగాను. ఆక్సిజన్ సిలిండర్ లేని మహబూబ్ నగర్ జిల్లా, ఆమనగల్‌లోని ప్రైమరీ సెంటర్‌లో వందలాది మందికి మేజర్ ఆపరేషన్లు చేశాను. నేనే సర్జన్, నేనే గైనకాలజిస్ట్, నేనే అన్నీ. మినిమం సదుపాయాలున్న చోట కూడా డాక్టర్ ఎలా పనిచేయవచ్చో నిరూపించి నేషనల్ అవార్డు తీసుకున్నాను. అక్కణ్ణుంచి రోబోటిక్ సర్జరీలో ప్రపంచంలో అత్యంత అధునాతనమైన సదుపాయాలున్న ఆసుపత్రిలో రోబోటిక్ సర్జరీ కూడా చేసిన వ్యక్తిని. గవర్నమెంట్ సర్వీసులో నాలుగేళ్లు నిద్రాహారాలు లేకుండా పనిచేసిన డాక్టర్‌ను. తర్వాత కార్పొరేట్ రంగంలో పనిచేశాను. తొలిసారి ఎంపీ అయినప్పటికీ.. నా కృషి ఫలితంగా తెలంగాణాకు ఎయిమ్స్ ప్రకటన వచ్చింది. నా నియోజకవర్గంలో 3 నుంచి 4 వేల కోట్ల నేషనల్ హైవేస్ తెప్పించుకున్నాను. కేంద్ర మంత్రి డాక్టర్ హర్షవర్ధన్‌తో నాకున్న వృత్తిగత పరిచయం కారణంగా కాళేశ్వరం ఫేజ్1, ఫేజ్2 అనుమతుల విషయంలో... నీటిపారుదల శాఖా మంత్రి హరీష్ రావుతో కలిసి పనిచేశాను. కుల వృత్తుల కోసం నీరా-తాడి ఉత్పత్తుల పరిశోధన కేంద్రం తీసుకొచ్చాను. పెంబర్తి క్లస్టర్‌ను 2 కోట్లతో ఆధునీకరిస్తున్నాం. ఇవన్నీ సంతృప్తినిచ్చేవే. సామాజిక న్యాయపరంగా చూస్తే 24 ఏళ్లుగా పెండింగ్ ఉన్న బీసీ కమిషన్ రాజ్యాంగ బద్ధత కోసం నేను కొట్లాడినంతగా ఈ మూడున్నరేళ్లలో ఏ పార్టీ ఎంపీ కూడా కొట్లాడలేదు. 2 వేల లెటర్లు రాశాను. 34 సార్లు ప్రధాన మంత్రిని వ్యక్తిగతంగా, బృందంగా కలిశాను. అనేకసార్లు పార్లమెంటులో నిలదీశాను. అంతిమంగా బిల్లు వచ్చింది. లోక్ సభలో పాసైంది. ఇలాంటివి నేను ఒక డాక్టర్‌గా చేయలేనివి. నేను నిర్ణయం తీసుకునే స్టేజిలో లేకున్నా కనీసం ఆ నిర్ణయాన్ని ప్రభావితం చేసే స్టేజిలో ఉన్నాను.

-స్వరూప పొట్లపల్లి, న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

తెలిసీ తెలియని ప్రశ్నలు



(గత సంచిక తరువాయి భాగం)

28-6-47

భగవాన్ వెంటనే బదులీయక మౌనం వహించారు.
వారు కొంచెమాగి 'జవాబు చెప్పేవరకూ వేచి ఉండమంటారా స్వామీ?' అని అన్నారు. 'ఈ అడిగేదెవరూ' అన్నారు స్వామి. 'జీవుడు' అన్నారు వారు. ఆ జీవుడెవరు? ఎలా ఉంటాడు? ఎక్కడ పుడతాడు? ఎక్కడ లయిస్తాడు అని విచారించి తెలుసుకుంటే జీవుడని చెప్పబడే వాడే దేవుడవుతాడు. అప్పుడా దేవునికి కలిగే దుఃఖం దేవునికి అంటునో లేదో తెలుస్తుంది. తెలిస్తే ఏదీ బాధించదు' అన్నారు భగవాన్. 'అదే తెలియటం లేదే' అన్నారు వారు. తన్ను తెలుసుకోవటానికి ప్రయత్నం అనవసరం. నిద్రలో నీవు లేవు కాని ఈ దృశ్యమంతా అణగి ఉంది. లేస్తావు. అన్నీ వస్తవి. నీవు మాత్రం అప్పుడూ ఉన్నావు ఇప్పుడూ ఉన్నావు. ఈ పైన వచ్చిందే తోసివేయాలి అన్నారు భగవాన్. ఎలా తోసివేయటం అన్నారు వారు. తాను ఉన్నట్లుంటే అదే పోతుంది. ఉండుటే తన స్వభావం. ఉన్నది ఉన్నట్లు చూస్తే లేనిది లేనట్లుపోతుంది అన్నారు భగవాన్. అలా చూచేందుకు మార్గమేది? అన్నారు వారు. తానెవరో తన యదార్థస్థితి ఏదో విచారించుటేనన్నారు భగవాన్. ఆ విచారణ ఎలా కలుగుతుంది అన్నారు వారు. భగవాన్ ఊ, ఊ అంటూ ఊరుకున్నారు. వారు రవంత ఎదురు చూచి. 'సరే ఇదే మార్గం' అంటూ సమీపస్తులెంత వారించినా ఆగక భగవాన్ పాదాలు తాకి వైశ్య సంఘంతో సహా వెళ్లారు. వారిని పోనిచ్చి సమీపవర్తులతో 'వారికి తెలియకనా? మనల్ని పరీక్షిద్దామని అడుగుతారు. పాదాలు తాక గానే పని తీరిందని వెళ్లారు. ఇంకేం కావాలి' అన్నారు భగవాన్.

నెల్లూరు నుంచి వచ్చిన ధనవంతుడు రెడ్డి ఒకరు స్వామీ ఆనందమే ఆత్మ అంటారే. ఆనందమంటే దుఃఖ రహితమైనదే కదా? అయితే జీవుడా ఆనందాన్ని పొందినప్పుడు దుఃఖం తెలియకుండా ఉంటుందా? ఇది దుఃఖమని తెలిస్తే కదా, అది ఆనందం అని తెలియటానికి. దుఃఖం తెలియనప్పుడు ఆనందం మాత్రం ఎలా తెలుస్తుంది. తెలుసుకునే వాడు ఉన్నంతవరకూ రెండూ ఉండేవే. వస్తువు సుఖ దుఃఖాతీతం. అయితే వస్తువుకు సుఖమనే పేరు. ఏమంటే సదసత్తుల కతీతం సత్తు. జ్ఞానాజ్ఞనాతీతం జ్ఞానం. విద్యావిద్యాతీతం విద్య. ఇదే విధంగా ఎన్నో చెబుతారు. మీకు చెప్పేందుకేమున్నది అన్నారు భగవాన్. ఉన్నది నలువదిలోని భగవత్ వచనం చూడు: అజ్ఞానము లేక జ్ఞానము లేదు. జ్ఞానము లేక అజ్ఞానము లేదు. ఆ జ్ఞానాజ్ఞానాలు ఎవరికని అమ్మొదలైన తన్నుదా దెలియు జ్ఞానమే జ్ఞానమగును.

పూల పూజ

30-6-47

ఈ మధ్య రమణపురంలో ఉండే ఒక సంపన్నురాలు తమ తోటలో పూసిన బొడ్డు మల్లెపూలు నిత్యం పూల బుట్టతో తెచ్చి, సువాసినులందరికీ హాలులో ఇస్తూ వచ్చింది. భగవాన్ నాలుగైదు రోజులు చూస్తూ ఊరుకున్నారు. ఆమె మానలేదు. ఒక దినం, పూల బుట్ట కుర్చీ పీట మీద పెట్టి, నమస్కరించి లేచింది. భగవాన్ సమీపవర్తులను చూచి, 'ఆమె ఏవో తెచ్చిందే. పూలు కాబోలు. ఎందుకవి? అన్నారు. ఆమె జంకుతూ భగవానుకు కాదు, సువాసినులకని అందరికీ ఇవ్వటం ప్రారంభించింది. 'సరిపోయింది. ఇవ్వదలచుకుంటే ఇంటి వద్దనే ఇచ్చుకునేది. ఇక్కడెందుకు? ఒక్కరివ్వగానే అందరూ ఆరంభిస్తారు.

(తరువాయి భాగం రేపటి సంచికలో)

- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దినఫలాలు

మేష రాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ప్రయాణాల విషయంలో అనుకూలత ఉంటుంది. విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. వ్యాపార కార్యాలలో ఆనందకర సంఘటనలు చోటు చేసుకుంటాయి. గృహ విషయాల్లో ఇబ్బందులు పరిష్కరింపబడతాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. కోర్టు వ్యవహారాల్లో ప్రత్యర్థులు బలహీనపడతారు. ఆదాయంలో అనువైన మార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: కోర్టు వ్యవహారాలు, ప్రక్రియలు ప్రతికూలతను కలిగిస్తాయి. ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. ఆర్థిక లావాదేవీల విషయంలోమ జాగ్రత్తలు పాటించాలి. ప్రయాణాల ద్వారా ప్రయోజనాలు పొందుతారు. శారీరక రుగ్మతలుంటాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. ఉద్యోగ వ్యవహారాల్లో చిరు సమస్యలను ఎదుర్కొంటారు. ఆదాయం పర్వాలేదు.

మిథున రాశి: దూర ప్రయాణాలు అనుకూలం. ఆర్థిక ప్రయత్నాలు పర్వాలేదు. మానసిక రుగ్మతలు పెరుగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. అధిక ప్రయత్నాలతో అనుకూల పరిస్థితులు ఆర్థికంగా ఉంటాయి.

కర్కాటకరాశి: ఆర్థిక లావాదేవీలు, ప్రక్రియలు ఉపకరిస్తాయి. పనుల్లో ఒత్తిడులు పెరుగుతాయి. ఆరోగ్య ఖర్చులు కొనసాగుతాయి. మిత్రుల ప్రోత్సాహం లోపిస్తుంది. ఆదాయంలో అసహన పరిస్థితులు పెరుగుతాయి.

సింహ రాశి: స్థిరాస్తి నిర్ణయాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ ఉంటుంది. ఋణ ఒత్తిడులు తగ్గుతాయి. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది వ్యాపార విజయాలు దగ్గరవుతాయి. ఆదాయంలో అసహన పరిస్థితులు అధిగమించగలుగుతారు.

కన్య రాశి: విదేశీ లావాదేవీలు అనుకూలం. స్వతంత్ర నిర్ణయాలు లాభిస్తాయి. వ్యయం పెరుగుతుంది. ఆరోగ్యంలో అనుకూల మార్పులు ఉంటాయి. పనులలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అనుకూల మార్పులు ఉంటాయి.

తుల రాశి: వాహన కొనుగోళ్లు లాభిస్తాయి. వృత్తిలో ప్రోత్సాహక పరిస్థితులు కొనసాగుతాయి. శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. అసహన పరిస్థితులు అర్థికంగా ఉంటాయి. ఆదాయం పెంచుకునే మార్గాలు కూడా సులభతరమవుతాయి.

వృశ్చిక రాశి: ఉద్యోగ ప్రయత్నాలలో విజయాలు సాధించగలుగుతారు. అసంతృప్తి సంఘటనలు అన్ని రంగాల వారికి కొనసాగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. అసహన పరిస్థితులు పరిష్కరించుకోలేకపోతారు. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: గృహ కార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి. ఆకస్మిక ఖర్చులు లేకపోలేదు. ఆరోగ్యంలో మంచి మార్పులు చేకూరుతాయి. గతంలోని పొరపాట్లు వెలుగు చూస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: ఋణ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఆకస్మిక ఖర్చులు పెరుగుతాయి. ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి. వ్యాపారంలో అవమానకర సంఘటనలు ఎదురవుతాయి. ఆదాయ మార్గాలు ఇబ్బందులు పెడతాయి.

కుంభ రాశి: ఒత్తిడులు ఉద్యోగపరంగా పెరుగుతాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో రుగ్మతలు తగ్గుతాయి. చేపట్టే కార్యక్రమాలలో అలసత్వం పెరుగుతుంది. ఆదాయం పర్వాలేదు.

మీన రాశి: విద్యా ప్రయత్నాలు కలసి వస్తాయి. నూతన కార్యాలలో ప్రోత్సాహం ఉంటుంది. ఉద్యోగ వ్యవహారాల్లో విజయాలు ఉంటాయి. ఆరోగ్యంలో మెరుగైన మార్పులు ఉంటాయి. ముఖ్య కార్యక్రమాలు సగంలో ఆగిపోతాయి కాబట్టి జాగ్రత్తలు తప్పనసరి. ఆదాయాన్ని ఆశించినంతగా పొందలేక పోతారు.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com



పురాణకాల పర్వం హోలీ

ఉత్తరభారతంలో హోలీని రెండు రోజుల పండగగా చేసుకుంటారు. మొదటి రోజును హోలికా దహన్ లేదా చోటీ హోలీ అని రెండో రోజును రంగ్ వాలీ హోలీ. ధులేటి, ధుళంది, ధూళి వందన్ వంటి పేర్లతో పిలుస్తారు. వీరు రెండో రోజుకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. దీనిని విభేదాలను మరిచి స్నేహం పెంపొందించుకునే సమయంగా కూడా భావిస్తారు. ఈ రోజు రంగులు చల్లుకోవడంలో తెలిసినవారు, కొత్తవారు అనే భేదం లేకుండా అందరినీ వర్ణ ప్లావితం చేయడం జరుగుతుంది.

హోలీ లేదా రంగుల పండుగగా మనం జరుపుకునే పండగ అసలు పేరు హోళికా పూర్ణిమ. ఇది రెండు రోజుల పండగ అయినందున కొన్ని ప్రాంతాల్లో మొదటి రోజు కొన్ని ప్రాంతాల్లో రెండో రోజు చేస్తారు. ఇది ఈనాడు రంగులు చల్లుకునే ఉత్సవంగానే మారిపోయింది గాని ఈ రోజున ఆచరించాల్సిన వేరే విధి విధానాలూ ఉన్నాయి, ఉదయాన్నే కట్టెలు, పిడకలు రాశిగా పోసి నిప్పును రాజేసి దానిపైకి హోళికా అనే శక్తిని అవహింపజేసి 'శ్రీ హోళికాయైనమః' అని పూజించి మూడు సార్లు అగ్నికి ప్రదక్షిణం చేస్తూ 'వందితాసి సురేంద్రేణ బ్రాహ్మణాశంకరేణ చ, అతస్త్వాం పాహినో దేవి భూతే భూతి ప్రదో భవ' అనే శ్లోకం చదవాలని పెద్దలు చెబుతారు. ఆ తర్వాతే రంగులను చల్లడం, రంగునీటితో ఉత్సవం జరుపుకోవడం చేయాలని శాస్త్ర వచనం.
హోలీ పండగకు సంబంధించి పలు కథలు ప్రచారంలో ఉన్నాయి. హిరణ్యాకశిపుడు ప్రహ్లాదుని నిప్పుల్లో పడేసి కాల్చాలనుకోవడం అందుకు ప్రహ్లాదుని అత్త హోళిక పూనుకోవడం ప్రహ్లాదునితో బాటు అగ్నిలో దూకడం కథ అందరికీ తెలిసిందే. అయితే ఆమె కూడా పునీతురాలైంది కనుక హోలీ రోజు ఉదయాన్నే అగ్నిని రగిల్చి ఆమెను ఆవాహన చేయడం, హోళికాయైనమః అని స్మరించే ఆచారం వచ్చిందని అంటారు. మరో పక్క హోళిక మరణించిన తిథి ఇదే అయినందున ఈ రోజు హోలీ పండగ చేసుకుంటారని అంటారు. ఈ మంటనే చెడుపై మంచి విజయంగా కొందరు అభివర్ణిస్తారు. హోళిక చెడుకు సంకేతమని అగ్ని జ్ఞానాగ్ని అని వారి భావన.
ఉత్తర భారతంలో కృష్ణుడు పెరిగిన ప్రదేశంగా భావించే వ్రజ భూమిలో మరో కథ ప్రచారంలో ఉంది. కృష్ణుడు నల్లగా ఉండడం, రాధ ఇతరులు తెల్లగా ఉండడం చూసి వారిని ఈ ఒక్క రోజు రంగులుల పూసుకుని నల్లగా మారాలని కోరాడని భావిస్తారు. ఈ ప్రాంతాల్లో హోలీని రెండు రోజుల పండగగా చేసుకుంటారు. మొదటి రోజును హోలికా దహన్ లేదా చోటీ హోలీ అని



రెండో రోజును రంగ్ వాలీ హోలీ. ధులేటి, ధుళంది, ధూళి వందన్ వంటి పేర్లతో పిలుస్తారు. వీరు రెండో రోజుకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. దీనిని విభేదాలను మరిచి స్నేహం పెంపొందించుకునే సమయంగా కూడా భావిస్తారు. ఈ రోజు రంగులు చల్లుకోవడంలో తెలిసినవారు, కొత్తవారు అనే భేదం లేకుండా అందరినీ వర్ణప్లావితం చేయడం జరుగుతుంది. ఈ రంగులు, రంగు నీరు చల్లుకోవడంతో బాటు నృత్యగానాదులతో ఊరేగింపులు నిర్వహించడం, దీనిలో పానీయాలు అందించడం కూడా జరుగుతూంటుంది. కొన్ని ప్రాంతాల్లో భంగు కలిపిన పానీయాలు తాగి మైమరచిపోతుంటారు. హిందువుల ప్రాచీన పండగ అయిన హోలీని దక్షిణాసియాలోని చాలా ప్రాంతాల్లో హిందుయేతరులు సరదా పండగగా కూడా చేసుకుంటూంటారు.
ముఖ్యంగా భారత్, నేపాల్, ప్రపంచంలోని వేర్వేరు ప్రాంతాల్లో హిందువులు ఉన్న తావుల్లో జరుపుకోవడం జరుగుతోంది. ఇటీవలి కాలంలో ఈ పండగను యూరప్, అమెరికాల్లో సైతం నిర్వహిస్తున్నారు. అక్కడ ఈ పండగను వసంత రుతువులో వచ్చే రంగుల పండగగా అక్కడి భారతీయులు భావిస్తారు. అంతేకాక ఈ రోజు ఇతర దేశాల వారి పండగలు ఉండడంతో ఇది వాటితో కలిసి అంతర్జాతీయ పండగగా పేరు పొందింది.

లక్ష్మీ జయంతి

ఈ రోజును లక్ష్మీ జయంతిగా పరిగణిస్తారు. లక్ష్మీదేవి ఈ రోజే క్షీర సాగరం నుంచి ఆవిర్భవించిందని చెబుతారు. ఈ రోజు లక్ష్మీదేవిని షోడషోపచారాలతో పూజించి లక్ష్మీ అష్టోత్తర శత నామాలు, కనకధారా స్తవం వంటివి పారాయణ చేయడం వల్ల సమస్త సంపదలు సిద్ధిస్తాయని అంటారు.

డోలోత్సవం

ఈ రోజు డోలోత్సవం చేస్తారు. ఈ రోజు బాలకృష్ణుని లేదా రాధాకృష్ణులను ఊయలలో ఉంచి ఆరాధించాలి. దీనివల్ల వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని చెబుతారు.


మదన పూర్ణిమ

ఈ రోజునే మదన పూర్ణిమ అని కూడా చెబుతారు. శివుడు మన్మధుణ్ని దగ్ధం చేయగా అతని భార్య తపస్సు చేసి శివుని అనుగ్రహంతో తన భర్తను అనంగునిగా పొందిందని కథ. అది జరిగింది ఈ రోజునేనని దానిని పురస్కరించుకుని ఈ రోజును మదన పూర్ణిమగా పేర్కొంటారని చెబుతారు.

-సేకరణ : జిపి

జంతువులకూ సాధుత్వ ఉపదేశం

అరిషడ్వర్గాలు ప్రకోపిస్తే మానవుడు మృగమే అవుతాడు. అటువంటివారిని తిరిగి మానవులుగా మారుస్తారు సత్పురుషులు. జంతువులు అన్నీ సాధువులుగా ఉండవు. అటువంటి జంతువులను సైతం సాధుత్వంలోనికి తెస్తారు మహనీయులు. గోవింద్ బువాకు చక్కని హరిదాసు అనే పేరు ఉంది. కాని అతని గుర్రమంటే అందరికీ భయమే. ఆ గుర్రం పొగరు కలది. అందరినీ తన్నడం, కరవడం చేసేది. ఉన్న చోట ఉండేది కాదు. అతి చంచలమైనది. అది నడుస్తూ నడుస్తూ గెంతేది. తలను ఎగరేసి తనపై అధిరోహించే వారిని కిందపడేసేది. ప్రజలందరు దానిని అమ్మివేయమని సలహా ఇచ్చేవారే. అయితే కొనే నాథుడే లేకపోయాడు. ఎవరూ దానిని కొనేందుకు సాహసించేవారు కాదు.
ఒకసారి గోవింద్ బువా పని మీద షేగాం వచ్చాడు. రాత్రి అయింది. గుర్రాన్ని కట్టివేసే ఇనుప గొలుసులకు తాళం మరచివచ్చాడు. దైవంపై భారం వేసి దానిని తాటితో కట్టి తాను చెట్టు కింద నిదురించసాగాడు. నిద్ర మధ్యలో మెళకువ వచ్చింది. గుర్రం శబ్దం చేయటం లేదు. అనుమానం వచ్చి లేచి గుర్రాన్ని చూచాడు. దాని కాళ్ళ మధ్య గజానన్ మహరాజ్ శయనించి, 'గంగం గణాంత బోతే' అని పాడుతున్నాడు. గుర్రం కదలక మేత మేస్తూ ఉంది. అది శాంతమూర్తిలా కనిపించింది. కారణం ఊహించాడు గోవింద్ బువా.
అంతలో గజానన్ మహరాజ్ లేచి, గుర్రంతో, 'ఓయీ! నీవు అల్లరి మాను. ఎద్దువలె ఉండి అల్లరి పెట్టకు' అన్నారు. గజానన్ మహరాజ్‌కు గోవింద్ బువా నమస్కరించాడు. ఆ క్షణం నుంచి ఆ గుర్రం సాధువైంది. అందరకూ వింత గొలిపింది.
ఉద్ధవేశ్ బువాకు ఆధ్యాత్మికత అంటే ఎంతో ఇష్టం. అందుకోనం మార్గదర్శకుడైన గురువు కోసం తీవ్రంగా అన్వేషిస్తున్నాడు. ఆయనకు ఎవరో షిరిడీలోని సాయిబాబా గురించి తెలియజేశారు. ఆయనకూ ఒక గుర్రం ఉంది. అదీ పొగరుబోతు. ఆ గుర్రం మీదే షిరిడీ గ్రామం చేరాడు. పొలిమేరలో గుర్రాన్ని కట్టేశాడు ఉద్ధవేశ్. దారిన ఒకరు పోతుంటే 'ఇక్కడొక గొప్ప ఫకీరున్నాడుగదా! ఎక్కడున్నాడు?' అని ప్రశ్నించాడు. ఆ వ్యక్తి ఉద్ధవేశ్ బువాను చెప్పరాని తిట్లు తిట్టి వెళ్ళిపోయాడు. ఉద్ధవేశ్ బువా ఆ తిట్లకు నొచ్చుకున్నాడు. ద్వారకామాయి మసీదు దగ్గరలో ఒక ముసలి అవ్వ కనిపిస్తే, 'ఈ గ్రామంలో గొప్ప సాధువు ఎక్కడుంటాడు? అని అడిగాడు. 'ఎక్కడెక్కడో తిరుగుతుంటాడు' అని చెప్పింది అవ్వ. ఉద్ధవేశ్ బువాకు ఎందుకో అనుమానం వచ్చి, తనను దూషించిన వ్యక్తి గురించి ఆమెకు చెప్పాడు. ఆ వ్యక్తే సాయి అని నిర్ధారించుకుని ఆయన కోసం అన్వేషణ మొదలుపెట్టాడు.
ఇందాక తాను చూసిన వ్యక్తే గుర్రం దగ్గర నిలబడి, ఒక చెయ్యి దాని నోట్లో దొప్పించి, వేరొక చేతితో దానిని నిమురుతున్నాడు. అలా నిమురుతూ దాని చెవిలో ఏదో చెబుతున్నాడు. ఆ గుర్రం శ్రద్ధగా వింటోంది. ఆ క్షణం నుంచి అది సాధు జంతువయింది. ఆయనే సాయి అని గుర్తించి సాష్టాంగ నమస్కారం చేశాడు ఉద్ధవేశ్. ఇక గుర్రం గురించి సమస్యే లేదు ఉద్ధవేశ్‌కు.
ఫ్రాన్సిస్ ఇటలీలోని అసీస్సిలో ఒక ధనిక కుటుంబంలో పుట్టాడు. విలాసవంతమైన జీవితాన్ని గడపసాగాడు. ఒక బిచ్చగాడు అతనిని ధర్మం అడిగాడు. అతని దీనాలాపం గుండెను కరిగించింది. ఉన్నదంతా అతనికి ఇచ్చివేశాడు. మనసు నిర్మలమయింది. తాను ఐచ్ఛిక దారిద్ర్య ప్రతిజ్ఞ తీసుకున్నాడు. ఇల్లు విడిచాడు. ఆత్మ జ్ఞాని అయ్యాడు. ఒక సారి ఫ్రాన్సిస్ గుబ్బియో అనే ప్రదేశం చేరాడు. అక్కడ అందరూ విచారంగా ఉన్నారు. కారణం అడిగాడు. ఒక తోడేలు వచ్చి అందరినీ భయ భ్రాంతుల్ని చేస్తోందని, పశువులను, మనుషులను పొట్టన పెట్టుకుంటోందని చెప్పాడు. ఆ గ్రామయంలోని వారిపై సానుభూతి కలిగిందాయనకు. ఆయన అక్కడకు దగ్గరలోనే తోడేలు ఉండే కొండపైకి నడవసాగాడు. కొంతమంది ఆయనను అనుసరించారు. కాని కొంత దూరం వెళ్లి తోడేలు భయంతో వెనుదిరిగారు. ఫ్రాన్సిస్ ఒక్కడే తోడేలు దగ్గరకు వెళ్లాడు. గాలిలో శిలువ ఆకారాన్ని గీసాడు. తోడేలును తన దగ్గరకు రమ్మన్నాడు. అది పెంపుడు కుక్క వలె వచ్చి ఆయన పాదాల వద్ద కూర్చుంది. 'సోదరా!



తోడేలా అందరూ నిన్ను నిందిస్తున్నారు, శాపనార్థాలు పెడుతున్నారు. సోదరా! నీకు వారికి మధ్య శాంతి ఒప్పందం చేస్తాను' అన్నాడు ఫ్రాన్సిస్ తోడేలుతో. తోడేలును వెంటబెట్టుకుని గ్రామంలో ప్రవేశించాడు. ప్రజలందరూ వచ్చారు. తోడేలు అకలితో క్రూరంగా ప్రవర్తిస్తోందని, దాని ఆహారానికి ఆ ఊరి ప్రజలతో ఒప్పందం కుదర్చాడు. అప్పటి నుంచి జంతువుల, మనుషుల జోలికి పోలేదు తోడేలు. ఎంతటి దుష్ట జంతువుకైనా మహాత్ముల సాంగత్యంలో దుష్టత్వం పోతుంది. సాధుత్వం వస్తుంది. దుష్టత్వాన్ని అంతరింపజేసి సాధుత్వాన్ని ప్రసాదించటమే మహనీయుల పని. అది జంతువుల విషయంలోనైనా, మానవుల విషయంలోనైనా.

ముళ్ళపూడి పాండురంగ సాయినాథ్
మున్నలూరి బోస్

భగవద్గీత



ఇంద్రియ కర్మల నుంచి విడివడటమే యోగ స్థితి

అధ్యాయం 8
శ్లోకం 12

సర్వద్వారాణి సంయమ్య
మనో హృది నిరుధ్య చ ।
మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణమ్
ఆస్థితో యోగధారణామ్ ॥

తాత్పర్యం

ఇంద్రియ కర్మల నుండి విడివడి ఉండటమే యోగస్థితి అనబడుతుంది. సర్వేంద్రియ ద్వారములను మూసివేసి, మనస్సును హృదయము నందు స్థిరము చేసి, ప్రాణవాయువును శ్రీర్షాగ్రమునందు నిలిపిన వాడు యోగమునందు స్థితుడు కాగలడు.

భాష్యం

ఇక్కడ చెప్పిన యోగపద్ధతిని పాటించాలంటే మొట్టమొదట అన్ని రకాల ఇంద్రియ భోగాలకు దారులను మూసివేయవలసి ఉంటుంది. దీనినే ప్రత్యాహారము అని అంటారు. అనగా ఇంద్రియాలను ఇంద్రియార్థముల నుండి దూరము చేయడం. జ్ఞానేంద్రియాలైన కళ్లు, చెవులు, ముక్కు, నాలుక, స్పర్శను పూర్తిగా నిగ్రహించి, స్వీయ తృప్తికి ఉపయోగించకుండా కట్టడి చేయాలి. ఈవిధంగా ఆరవ అధ్యాయంలో వివరించినట్లు మనస్సును హృదయములోని పరమాత్మపై నిలిపి, ప్రాణవాయువును శిరస్సుకు ఉద్ధరించాలి. ఇంతకు ముందే చర్చించినట్లు ఇటువంటి యోగాభ్యాసము నేడు దుస్సాధ్యము కావున కృష్ణ భక్తి ద్వారా మనస్సును కృష్ణునిపై లగ్నము చేసినట్లయితే సమాధి సులభ సాధ్యం కాగలదు.

....పరమపూజ్యశ్రీ శ్రీమత్ ఎ సి భక్తి వేదాంత స్వామి ప్రభుపాదుల వారి 'భగవద్గీత యథాతథం' నుంచి ఇస్కాన్ హైదరాబాద్ వారి సౌజన్యంతో .....

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

Google play | iOS iTunes





బీమా పాలసీకి 'నామినీ'లేకపోతే..?

ప్రముఖ సినీ నటి శ్రీదేవి ఆకస్మిక మృతి తర్వాత ఆమె పేరిట ఉన్న రూ 100 కోట్ల ఇన్సూరెన్స్ ఎవరికి చెందుతుంది అనే ఊహాగానాలు వస్తున్నాయి. సాధారణంగా అగ్రశ్రేణి ఫిల్మ్ సెలబ్రిటీలకు వందలకోట్ల రూపాయల ఇన్సురెన్స్ ఉంటుంది. కానీ శ్రీదేవి విషయంలో రూ 100 కోట్లు పెద్ద విషయమేమి కాదు. ఆమె భారతీయ సినీజగత్తులో ఎన్నో విజయాలను సాధించారు.

శ్రీదేవి రూ 100 కోట్ల ఇన్సూరెన్స్, ఇతర ఆస్తులకు ఎవరు నామినీ అన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది.

జీవిత బీమా పాలసీ అత్యంత ముఖ్యమైన ఆర్థిక నిర్ణయాలలో ఒకటి. మీ తర్వాత మీ కుటుంబ సభ్యులను ఆదుకోవడానికి బాగా దోహదపడుతుంది. మీరు ఎప్పుడైతే జీవిత బీమా పాలసీ తీసుకుంటారో అప్పుడు అత్యంత ముఖ్యమైన విషయాలలో నామినీ పేరు ఒకటి. ఇన్సూరెన్స్ ఉన్న వ్యక్తి చనిపోతే నామినీకి ఈ ఇన్సూరెన్స్ డబ్బు చెందుతుంది. ఇన్సురెన్స్ కంపెనీ నామినీకి మాత్రమే ఇన్సురెన్స్ డబ్బు ఇస్తుంది. లేదా నామినీ పేరు లేని పక్షంలో వారసులకు ఈ డబ్బును అందజేస్తారు. వారసులు ఎంఆర్ఓ కార్యాలయానికి వెళ్లి సర్టిఫికేట్ తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఈ సర్టిఫికేట్ కీలకంగా మారుతుంది.

భవిష్యత్ లక్ష్యాల కోసం పొదుపు, మదుపు చేస్తాం. కుటుంబ ఆర్థిక రక్షణ కోసం బీమా పాలసీలు తీసుకుంటాం. ఇంతటితో మన బాధ్యత తీరిపోతుందా? అవసరమైనప్పుడు మన పెట్టుబడులు, బీమా, బ్యాంకులలో ఉన్న డబ్బు తదితరాలన్నీ మనవారికిసక్రమంగా.. ఏ ఇబ్బంది లేకుండా చేరాలి కదా! మరి అందుకోసం మీ వంతుగా అన్ని ఏర్పాట్లూ చేశారా?

శ్రీదేవి విషయంలో రూ 100 కోట్ల ఇన్సురెన్స్ నామినీ భర్త బోనీకపూర్ పేరు మీద ఉందా? లేదా ఇద్దరు కూతుళ్లపేర్ల మీద ఉందా అన్న విషయం తేలాల్సి ఉంది.

నామినీ పేరు పేర్కొనకపోతే పిల్లలు, భర్త వారసులవుతారు. మన దేశంలో ఇన్సురెన్స్ ఉన్న వ్యక్తి నామినీ పేరు రాయకపోవడం, వారసులెవరూ



ఖాతాల్లోని సొమ్ము తీసుకోవడానికి రాకపోవడం.. బీమా పాలసీలను క్లెయిం చేసుకోకపోవడం ఇలా రకరకాల కారణాలతో కొన్ని వేల కోట్ల రూపాయలు బ్యాంకులు, బీమా సంస్థల దగ్గర ప్రత్యేక ఖాతాల్లో మగ్గుతున్నాయి. భవిష్యత్తులో మన డబ్బు ఆ జాబితాలోకి చేరకుండా చూసుకోవాల్సింది మనమే.

వివాహం కాకముందు పెట్టుబడులు, ఈపీఎఫ్ లాంటి వాటికి తల్లిదండ్రులపేరును నామినీగా చేరుస్తుంటారు. వివాహం అయిన తర్వాత జీవిత భాగస్వామి పేరును నమోదు చేయాల్సి ఉంటుంది. చాలామంది ఈ విషయంలో అశ్రద్ధ వహిస్తుంటారు. ఇది ఏ మాత్రం మంచిది కాదు. ఒక్కోసారి నామినీగా పేర్కొన్న వ్యక్తులు ఈ లోకంలో ఉండకపోవచ్చు. ఇలాంటప్పుడు మరీ ఇబ్బంది. వారసత్వ ధ్రువీకరణ పత్రాలు, కుటుంబ ధ్రువీకరణ పత్రాల్లాంటివి ఎన్నో అవసరం అవుతాయి. వీటిని సాధించడం ఎంతో శ్రమతో కూడుకున్నదే.

వీలునామా

పెట్టుబడులు పెట్టినప్పుడు నామినీ పేరు పేర్కొనడం ఒక్కటే సరిపోదు. మీరు పెట్టిన పెట్టుబడులు ఏమిటి? తీసుకున్న జీవిత బీమాపాలసీలేమిటి? మీకు సంబంధించిన ఆస్తులు, అప్పులు ఇలా అన్ని వివరాలతోనూ ఒక కుటుంబ పత్రం తయారు చేయాలి. అత్యవసరాల్లో ఎవరిని సంప్రదించాలి లాంటి విషయాలను పేర్కొనాలి. మీ తదనంతరం ఎవరికి ఏమేమి చెందాలో వీలునామా రాయడం. తెల్లకాగితం మీద రాసినా వీలునామాగానే పరిగణిస్తారు. అవసరాన్ని బట్టీ దానికి ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులు చేసుకోవడం మంచిది.



నామినీ ఎవరుండాలి

♦పెళ్లికి ముందు తల్లిదండ్రులు, తోబుట్టువుల పేరున నామనిర్దేశనం చేసి ఉండొచ్చు. వివాహం అయిన వెంటనే జీవిత భాగస్వామి పేరే అన్ని చోట్లా నామినీగా ఉండాలి.

♦మీరు ఇదివరలో నామినేట్ చేసిన వ్యక్తి మరణించినా వారితో సంబంధాలు తెగిపోయినా వెంటనే నామినీ పేరు మార్పించండి.

♦ పిల్లల పేరును నామినీలుగా పేర్కొంటే... సంరక్షకుని పేరు, హోదా, చిరునామాల వంటివన్నీ స్పష్టంగా పేర్కొనండి.

♦ నామినీల పూర్తిపేరు, వారికి మీతోగల సంబంధం పుట్టిన తేదీ, చిరునామా లాంటి వివరాలన్నీ నామినేషన్ పత్రంలో వెల్లడించండి.

♦పెట్టుబడులకు ఎవరి పేరునైనా నామినీగా పేర్కొనే అధికారం ఉంటుంది. కానీ జీవిత భాగస్వామి మొదటి ఎంపిక కావాలి.

♦ కొత్త పాలసీలను తీసుకున్నప్పుడు... ఇప్పటికే ఉన్న జీవిత బీమా పాలసీలనూ ఎలక్ట్రానిక్ రూపంలోకి మార్పించేందుకు ఇన్సూరెన్స్ రిపాజిటరీ ఖాతాను ప్రారంభించవచ్చు. ఈ ఖాతాలో మీ దగ్గరున్న పాలసీలన్నింటినీ ఎలక్ట్రానిక్ రూపంలోకి మార్చుకోవచ్చు. మీరు తీసుకున్న పాలసీలకు వేర్వేరు వ్యక్తులను నామినీగా పేర్కొన్నారనుకుందాం.. ఈ రిపాజిటరీ ఖాతాను తీసుకునేప్పుడు నామినీగా కొత్త పేరును పేర్కొని, అన్ని బీమా పాలసీలకూ అతను/ ఆమెనే నామినీగా ఉండాలని సూచిస్తే వెంటనే అన్ని బీమా పాలసీల్లోనూ నామిని పేరు మారిపోతుంది. మీరు పనిగట్టుకొని ప్రతి బీమా పాలసీలోనూ పేరు మార్పించాల్సిన అవసరం లేదు. జీవిత బీమా పాలసీలకు నామినీగా ఎవరు ఉన్నా.. ఆ సొమ్ము వాస్తవానికి వారసులదే. నామినీ పని.. బీమా పాలసీ నుంచి సొమ్ము తీసుకొని, అసలైన వారసులకు అప్పగించడమే.

♦ఒకవేళ మీ పాలసీలు ఎలక్ట్రానిక్ రూపంలో లేకపోతే.. మీ జీవిత బీమా కార్యాలయాన్ని సంప్రదించి కొత్తనామినీ పేరును మార్పించాలి. ఆరోగ్య. వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీలకూ నామినీగా ఎవరున్నారో ఒకసారి తనిఖీ చేసుకోండి.



గూడా వెంకటేశ్వరరావు
న్యాయవాది

బడ్జెట్ దాటొద్దు

మీ ఖర్చులను క్రమపద్ధతిలో మార్చుకోవాలంటే మొదటగా చేయాల్సిన పని బడ్జెట్ పరిధిని దాటనీయొద్దు. మీరు నెలకు ఎంత ఖర్చుపెడుతున్నారనే విషయం తెలియకుండా ఎంత ఆదా చేయగలరనే అంశంపై అవగాహన కష్టమైన విషయం. ఏ అంశానికి ఎంత ఖర్చు చేస్తున్నారనే అంశం తెలిసేందుకు కూడా బడ్జెట్ వేసుకోవడం ఉపయోగపడుతుంది. ఒకవేళ మీరు షాపింగ్ విపరీతంగా ఇష్టపడే వ్యక్తి అయితే, దీనిపై ఎంత ఖర్చు అవుతుందో తెలిసినపుడు అందుకు తగిన చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. ఒక భాగస్వామి ఖర్చులను లెక్కించే బాధ్యత తీసుకోవడం సబబుగా ఉంటుంది. ప్రస్తుత రోజుల్లో ఇలా ఖర్చులను పట్టిక వేసుకునేందుకు అనేక ఆన్‌లైన్ అప్లికేషన్స్ అందుబాటులో ఉన్నాయి.



ఒకవేళ భార్య భర్తలు ఇద్దరూ సంపాదనపరులైతే ఆయా ఖర్చులను సమంగా పంచుకుని, మిగిలిన మొత్తాన్ని ఇద్దరి పేరుపైనా విడివిడిగా పెట్టుబడులు చేయండి.

భాగస్వామితో చర్చించండి

ఏదైనా పాలసీ డాక్యుమెంట్/ స్టేట్‌మెంట్ పత్రాలు ఇంటికి వచ్చిన తర్వాత మాత్రమే.. తన భర్త ఆ పాలసీ తీసుకున్నాడనే విషయం భార్యకు తెలియడం వంటి సంఘటనలు అనేకమార్లు కనిపిస్తాయి. తమ భాగస్వామి నిర్ణయ సామర్థ్యం నమ్మకం లేకపోవడం వంటి వాటి కారణంగా ఇలాంటి సమాచార లోపాలు సంభవిస్తుంటాయి. నిజానికి ఆర్థిక అంశాలలో నిర్ణయం తీసుకోవడం మహిళలకు సమర్థత ఎక్కువ అనే అంశం నిరూపితమైంది. ప్రధానమైన ఆర్థిక నిర్ణయాలను తీసుకునేందుకు ముందు భార్యతో సంప్రదింపులు జరపడం ద్వారా వాస్తవ అవసరాలను గురించి అంశాలపై అవగాహనను పెంచుకోవచ్చు. ఇలా చేయడం ద్వారా ఇంటిలోని వ్యక్తులతో సమాచారం పంచుకునే అవకాశం ఏర్పడుతుంది. ఆరోగ్యకరమైన వాతావరణం కూడా ఏర్పాటు అవుతుంది. ఆర్థికపరమైన అంశాలు, ఆయా ఉత్పత్తుల కొనుగోళ్లపై ఉమ్మడి నిర్ణయాల కారణంగా ఆ జంట మధ్య సరైన అవగాహన ఏర్పడుతుంది. ఒకవేళ మీరు ఎవరికైనా సలహాదారులుగా ఉన్నట్లయితే, ఆ సమయంలో భార్యభర్తలు ఇద్దరు ఉన్నారని ధృవీకరించుకోండి.

పెట్టుబడి పెట్టండి

వివాహితులు సహజంగా తమకు పిల్లలు పుట్టిన తర్వాత కానీ లేదా 30 దాటిపోతున్న పరిస్థితుల్లో కానీ పెట్టుబడులు చేస్తుంటారు. కానీ పెళ్లి అయిన మొదటి ఏడాది నుంచే పెట్టుబడులు ప్రారంభించడం సరైన పని. ఇలా చేస్తే ఆయా అవసరాలకు తగినట్టుగా పెద్ద మొత్తంలో కార్పస్‌ను సృష్టించేందుకు అవకాశం ఉంటుంది. వెకేషన్ సమయంలో క్రెడిట్ కార్డులు ఉపయోగించడం కాకుండా రికరింగ్ డిపాజిట్ వంటివి ద్వారా ఏటా ప్లాన్ చేసుకోవచ్చు. ఆర్థిక లక్ష్యాలను అందుకునేందుకు మ్యూచువల్ ఫండ్స్‌లో ఎస్ఐపి ప్రారంభించడం తగిన పని. ఎస్ఐపి అయినా ఆర్‌డీ అయినా నేరుగా బ్యాంక్ నుంచి నిధులు కట్ అయ్యేలా ఈసీఎస్ ఆదేశాలు ఇస్తే పెట్టుబడులు పోనూ మిగిలిన మొత్తాన్నే ఖర్చు చేసుకునేలా ప్లాన్ చేసుకోవడం కుదురుతుంది.

ఆర్థిక ప్రణాళికకు 50 ఏళ్ళు

జీవితంలో 50 ఏళ్లు వచ్చాయంటే అదొక మైలురాయిగా భావిస్తాం. వయసు పెరుగుతుందని, రిటైర్‌మెంట్‌కు దగ్గరవుతున్నామన్న ఆలోచన పెరుగుతోంది. తన తదనంతరం తన భార్యకు, పిల్లల అవసరాలకు సరిపడా సంపాదన సమకూర్చుకోలేదా అన్న ఆలోచన మొదలవుతుంది. ఆందోళన ప్రారంభమవుతుంది. ఆర్థిక క్రమశిక్షణ కోసం జీవన విధానం మార్చుకోవాల్సి ఉంటుంది. ఆర్థిక భారం లేకుండా ఆనందంగా బతకాలి.



50 ఏళ్లు వచ్చేసరికి ప్రతి ఒక్కరి జీవితంలో ఆర్థిక భద్రతపై ఆసక్తి పెరగుతుంది. అది తప్పనిసరి కూడా. రానున్న సంవత్సరాల్లో అతని సంపాదనను బట్టే వృద్ధాప్య జీవితం ఆధారపడి ఉంటుంది. నాలుగురాళ్లు కూడబెట్టుకునే సమయం అది. ప్రభుత్వ ఉద్యోగులు అయితే సినియారిటీ బట్టి ఎక్కువ జీతాలు ఆర్జిస్తారు. అయితే సాధారణ ప్రయివేటు ఉద్యోగాల్లో అభద్రతా భయం ఎక్కువగా ఉంటుంది. శేష జీవితానికి సరిపడా తాను సంపాదించినది సరిపోతుందా లేదన్నా భయం పట్టుకుంటుంది. స్థిర నివాసం, ఇంటి ఖర్చులు, పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఆసుపత్రి ఖర్చులు వెంటాడుతూ ఉంటాయి. ఇవిగాక అనుకోని విధంగా వచ్చే ఖర్చులు బెంబేలెత్తిస్తుంటాయి. వయసులో ఉన్నప్పుడు ఇవన్నీ ఆలోచించరు. పొదుపు, మదుపు విషయంలో అంతగా శ్రద్ధ చూపరు. అయితే 40 ఏళ్లు పై బడుతుంటే మాత్రం తప్పక ఆర్థిక అంశాలపై దృష్టి సారించాలి. అవేంటో ఓసారి చూద్దాం.

రిస్క్ తక్కువగా తీసుకోవాలి

పెట్టుబడుల విషయంలో 50 ఏళ్లు పైబడిన వారు తక్కువ రిస్క్ తీసుకోవడం మంచిది. ఉదాహరణకు ఒక యువకుడు స్టాక్ మార్కెట్‌లోకి 25 ఏళ్ల ప్రాయంలో పెట్టుబడులు ప్రారంభించాడనుకుందాం. ఒకవేళ భారీమొత్తంలో నష్టం వచ్చినా తర్వాతికాలంలో నిలదొక్కుకునే అవకాశం ఉంటుంది. అయితే 50 ఏళ్లు దాటినవారు ప్రయోగాలు చేస్తే తీవ్రంగా నష్టపోతారు. తాను జీవితకాలంలో సంపాదించిన కష్టార్జితం అంతా నష్టపోతే కోలుకునే పరిస్థితి ఉండదు. ఆ వయస్సులో అప్పులపాలై జీవించడం తీవ్ర ఒత్తిడికి గురిచేసి ఆరోగ్యాన్ని పాడు చేస్తుంది. అందుకే ఈ వయస్సులో స్టాక్ మార్కెట్లో సాహసాలు చేయకుండా ఇండెక్స్ ఫండ్, మ్యూచువల్ ఫండ్స్ అలాగే అనుభవమున్న స్టాక్ బ్రోకర్స్ ద్వారానే ఇన్వెస్ట్ చేయాలి. ఎక్కువ లాభం రాక పోయినా కాస్త లాభంతో సంతృప్తి పడే విధంగా ఉండాలి. బ్యాంక్ డిపాజిట్లు, పోస్టాఫీస్ సేవింగ్స్, చిన్న మొత్తాల పొదుపు పథకాలవైపు దృష్టిసారించాలి.

అప్పులు లేకుండా చూసుకోండి

50 ఏళ్ల తర్వాత అప్పులు తగ్గించుకోవడం ఎంతో అవసరం. వచ్చే జీతం, రాబడి మధ్య సమతౌల్యం ఉండాలి. వయస్సులో ఎడా పెడా ఖర్చులు చేసేస్తాం. క్రెడిట్ కార్డును విరివిగా వాడతాం. అయితే ఆ అలవాట్లు తగ్గించుకోవాలి. ఆదాయానికి మించిన ఖర్చులు చేయడం మానేయాలి. ఎక్కడైతే ఎక్కువ వడ్డీ కట్టాల్సి వస్తుందో అలాంటి లగ్జరీ ఉత్పత్తుల జోలికి వెళ్లకుండా వుండాలి. చాలా మంది మధ్య తరగతి

ప్రజలు ఇలాంటి అప్పులు

చేసి వడ్డీల మీద వడ్డీలు కడుతూ ఆర్థిక భారాన్ని మోస్తూ ఉంటారు. పిల్లలు అడిగారని లగ్జరీకార్లు, బైక్స్, గృహోపకరణ ఉత్పత్తులు కొనడం తగ్గించాలి. చాలామందిని చూస్తూ ఉంటాం. బోనస్ వస్తే ఒక్క రోజులోనే హుష్ కాకి అయిపోతుంది. మళ్లీ అప్పులు చేసే పరిస్థితి వస్తుంది. మరికొంతమంది విపరీతంగా వ్యక్తిగత రుణాలు తీసుకుంటారు. ఇదీ మంచిది కాదు. ఉద్యోగం వచ్చిన కొత్తలో మొదలైన ఈ అలవాటు లేటు వయసు వరకూ కొనసాగుతూనే ఉంటుంది. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు విచ్చలవిడిగా ఇచ్చే వ్యక్తిగత రుణాలవైపు అవసరమైతే తప్ప కన్నెత్తి చూడకూడదన్న నియమం పెట్టుకోవాలి. చాలామందికి బడాయిగా ఎక్కువ క్రెడిట్ కార్డులు కలిగి ఉండే అలవాటు వుంటుంది. క్రెడిట్ కార్డుతో చెల్లింపులు మొదట్లో సరదాగా అనిపించినా సకాలంలో చెల్లించకపోతే తడిసి మోపెడు అవుతాయన్నది యదార్థం. క్రెడిట్ కార్డుల సంఖ్య తగ్గించుకోండి. స్నేహితులకు బంధువులను పదే పదే అప్పులకోసం విసిగించకండి. దానివల్ల మీ పట్ల వారికి విశ్వాసం పోతుంది. అత్యవసర పరిస్థితుల్లో తప్ప అప్పు చేయకూడదన్న కఠిన నిర్ణయం తీసుకోవాలి.

భాగస్వామితో ఆదాయ అంశాలు

చాలామంది ఉద్యోగులు తమ ఆదాయ వివరాలను సహధర్మచారిణికి వివరించరు. అలా చెప్పడం నామూషి అనుకుంటారు. భాగస్వామికి ఆదాయం, పొదుపు, సంపద వివరాలు పంచుకోవడం మంచి పద్ధతి. ఇల్లాలితో ఇవి చర్చించడం ద్వారా కుటుంబానికి కావాల్సిన దీర్ఘకాలిక అవసరాలను చక్కగా ప్లాన్ చేసుకోవచ్చు. ఇందుకు భాగస్వామి సహకారం ఎంతో అవసరం అని గుర్తించాలి. ఇంట్లో పిల్లలకు ద్రవ్య వినియోగంపై కొంత అవగాహన కల్పించాలి. నేటి పిల్లల్లో ఖర్చు పెట్టే నైజం పెరుగుతుంది. వారికి డబ్బు విలువ తెలిసే చూడాలి. మీ కష్టార్జితం వారు విచ్చలవిడిగా ఖర్చు బెట్టకుండా వుండేందుకు మనీ మేనేజ్‌మెంట్ నేర్పాలి.

దీర్ఘకాలిక ప్రణాళికలే ప్రాధాన్యం ఇవ్వాలి

ముందుగా చెప్పుకున్నట్లే యాభై పదుల వయస్సులో తీసుకునే నిర్ణయాలు పరిమితి చెంది వుండాలి. ఆర్థిక ప్రణాళిక స్పష్టంగా ఉండాలి. లేకపోతే వృద్ధాప్యం కోసం దాచిపెట్టుకున్న డబ్బంతా ముందే ఖర్చుపెట్టాల్సి వుంటుంది. ఫలితంగా పదవి విరమణ తర్వాత ఆర్థిక ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంటుంది. స్వల్పకాల ఆడంబరానికి స్వస్తి చెప్పాల్సిన వయసు ఇది.



మీ స్నేహితులతో పోల్చుకోవద్దు

ఓ వయస్సు వచ్చిన తర్వాత తమ జీవితాలను స్నేహితులు, ఇరుగుపొరుగువారితో పోల్చుకుంటూ వుంటారు. ఇందువల్ల నష్టం తప్ప లాభం లేదు. వారివారి స్థితిగతులను బట్టి వారి జీవన విధానం ఉంటుంది. ఎవరో ఫ్రెండ్ టాప్ మోడల్ కారు కొన్నాడనో, లగ్జరీ విల్లా కొనుక్కునాడనో పోటీ పడకూడదు. కృంగిపోకూడదు. జీవితంలో తమకు ఏం అవసరమో వాటి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి తప్ప ఈ వయసులో ఇతరులతో పోటీపడటం మంచిది కాదు.

వారితో నిన్ను పోల్చి చూసుకోవడం మానుకోవాలి. జీవితం దేవుడిచ్చిన వరం. ఆ అరుదైన బహుమానాన్ని ఆస్వాదించాలే తప్ప ఇతరులతో పోల్చుకుంటూ ఆర్థిక నష్టాలను కొనితెచ్చుకోకూడదు. ఈ వయస్సులో ఇన్వెస్ట్‌మెంట్ ప్రణాళిక చక్కగా ఉంటే మలి జీవితం ఎంతో సాఫీగా సాగిపోతుంది. 50 ఏళ్ల నుంచి సేవింగ్స్ 40శాతం అన్నా ఉండేలా చూసుకోవాలి.



- స్టెర్జి రాజన్ బందెల
ఆర్థిక విశ్లేషకులు


రవితేజ

అయినను.. కొత్త సినిమా చేయాల్సిందే..!

సినిమా ఆడితే మరో సినిమా చేస్తాం, ఆడకున్నా కొత్త సినిమా ప్రారంభిస్తాం అంటారు పరిశ్రమ వాసులు. మనకు తెలిసింది ఇదొక్కటే కాబట్టి ఏదైనా ఇక్కడే తేల్చుకుంటాం అన్నది వాళ్ల నిశ్చితాభిప్రాయం. పరిశ్రమలో వరుసగా సినిమాలు అపజయాల పాలవుతున్న కథానాయకులు, గొప్ప హిట్ చిత్రాలను చూస్తున్న హీరోలూ ఎప్పుడూ ఉంటారు. జయాపజయాలు మర్చిపోయి వీళ్లంతా వెంటనే చేసే పని కొత్త చిత్రాన్ని ప్రారంభించడం. అలా తమ కొత్త చిత్రాల్ని మొదలుపెడుతున్నారు కొందరు కథానాయకులు. వాళ్ల చిత్రాల వివరాలన్నీ ఓసారి చూస్తే....


రామ్

మరో మిరపకాయ్ కోసం..

రవితేజను ఉత్సాహానికి మారుపేరుగా చెబుతుంటారు. ఆయన పాత్రల్లోని ఉత్తేజం ప్రేక్షకులకు వినోదాన్ని అందిస్తుంది. అన్ని ప్రాంతాల ప్రేక్షకులకు చేరుతుంది ఈ కథానాయకుడి సినిమా. రాజా ది గ్రేట్ చిత్రంతో విజయాల బాటలోకి వచ్చిన రవితేజ...తాజా చిత్రం టచ్ చేసి చూడుతో కిందకి దిగాడు. ఇదంతా సహజమే అని మర్చిపోయి కొత్త చిత్రాలు ప్రారంభించాడు. దర్శకులు శ్రీనువైట్ల, కళ్యాణ్ కృష్ణతో సినిమాలు చేస్తున్న ఈ హీరో....మరోసారి తన స్నేహితుడు దర్శకుడు హరీష్ శంకర్‌తో సినిమా ఒప్పుకున్నట్లు సమాచారం. గతంలో వీళ్లు కలిసి షాక్, మిరపకాయ్ లాంటి చిత్రాలు చేశారు. ఇప్పుడు మరో మిరపకాయ్ లాంటి కథతో వచ్చేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

అదే నాయికతో కొత్త చిత్రం..

రామ్, అనుపమా పరమేశ్వరన్ కలిసి నటించిన తాజా చిత్రం ఉన్నది ఒకటే జిందగీ. ఈ సినిమా ఫలితం గు రించి వదిలేస్తే....స్నేహ బంధం గురించి ఓ మంచి కథను చెప్పే ప్రయత్నం చేశారు. కథానాయకులకు హిట్ అనేదే కావాలి కాబట్టి ...రామ్‌కు కలిసిరాని సినిమా అనే చెప్పాలి. ఈ కథానాయకుడు అనుపమాతో మరో కొత్త చిత్రంలో నటించబోతున్నారు. నేను లోకల్ దర్శకుడు నక్కిన శ్రీనాథ రావు రూపకల్పనలో ఓ సి నిమాలో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని దిల్‌రాజు నిర్మించనున్నారు. త్వరలో ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది.


విజయ్ దేవరకొండ

గీత మార్చిన ఒక్క సూపర్‌హిట్..

కహోనా ప్యార్ హై సినిమా ఘన విజయంతో బాలీవుడ్‌లో హృతిక్‌రోషన్ ఒక్క రాత్రిలో అగ్ర కథానాయకుడు అయ్యారు. ఈ ఒక్క సినిమా తర్వాత అతనికి పదేళ్ల వరకు చేయగలిగే అవకాశాలు వచ్చాయి. అర్జున్ రెడ్డి చిత్రం విజయంతో ఇలాంటి క్రేజ్ తెచ్చుకున్నారు విజయ్ దేవరకొండ. ఈ యువ హీరోకు ఇప్పుడు దాదాపు 20 సినిమాలు వరుసలో ఉన్నాయి. త్వరలో ఏ మంత్రం వేశావే చిత్రంతో తెరపైకి రాబోతున్న విజయ్..భరత్ అనే దర్శకుడితో నూతన చిత్రాన్ని ప్రారంభిస్తున్నారు.

ఇవన్నీ సహజమే కదా..

వరుస అపజయాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు మెగా కుటుంబ కథా నాయకుడు సాయి ధరమ్ తేజ్. నట ప్రయాణంలో ఇవన్నీ సహజమే కదా అన్నది తేజ్ దృక్పథం. అందుకే జయాపజయాలకు అతీతంగా సినిమాలు చే స్తూ వెళ్తున్నారు. ప్రస్తుతం కరుణాకరన్ దర్శకత్వంలో ఓ చిత్రంలో నటిస్తున్న సాయి ధరమ్ తేజ్...మరో రెండు చిత్రాలకు సన్నాహాలు చేసు కుంటున్నారు. వీటిలో ఒకటి మైత్రీ మూవీస్ నిర్మా ణంలో దర్శకుడు కిషోర్ తిరుమలతో ఉండ గా.... గోపీచంద్ మలినేని దర్శకత్వంలో భ గవాన్ పుల్లారావు నిర్మాణంలో ఉండబోతోంది.


ధరమ్ తేజ్

నేనోరకం దర్శకుడితో..

ఎల్టీటీఈ నాయకుడిగా ఒక్కడు మిగిలాడు చిత్రంలో నటించిన మంచు మనో జ్‌కు ఆశించిన విజయం దక్కలేదు. ఇటీవల తరుణ్ ఇది నా లవ్ స్టోరీ చిత్రంలో అతిథిగా కనిపించారు. శ్రీకాంత్ కొత్త చిత్రంలోనూ ప్రత్యేక పాత్రలో నటిస్తున్నారు. కథానాయకుడిగా మరో కొత్త చిత్రాన్ని ప్రారంభించబోతున్నారు. నేనోరకం చిత్ర దర్శకుడు సుదర్శన్ ఈ సినిమాను రూపొందిస్తారు. త్వరలో వివరాలు తెలియనున్నాయి.

మరో సినిమాకు గ్రీన్‌సిగ్నల్

హీరోగా నాని నటించిన తొలి చిత్రం అష్టాచమ్మా. ఇందులో అవసరాల శ్రీనివాస్ మరో క్యారెక్టర్ చేశారు. ఆయనకు కూడా ఇది తొలి చిత్రమే. తొలిచిత్రంతోనే ఇద్దరికీ మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వా త హీరోగా నానికి పలు అవకాశాలు రావడం, అవి విజయం సాధించడంతో స్టార్ రేంజ్‌కు చేరుకున్నాడు. క్యారెక్టర్ నటుడిగా పాత్రలకే పరిమితమైన అవసరాల దర్శకుడిగా మారా రు. ఊహలు గుసగుసలాడే సినిమాకు దర్శకత్వం వహిం చారు. ఒకే సారి కెరీర్ మొదలుపెట్టిన నాని, అవసరాల మరోసారి కలిసి పనిచేయబో తున్నా రని సమాచారం. ఈసారి నాని హీరోగా అవ ్ ర రాల దర్శకుడిగా సినిమా ఉంటుం దని తెలిసింది. ఇప్పటికే కథ సిద్ధమైందని, ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నట్టుగా వినిపి స్తోంది. వారాహి సంస్థ నిర్మి స్తుం దని అంటున్నారు. దీనిపై అధికా రికంగా ఇంకా ఎలాంటి ప్రక ట న రాలేదు. వరుస విజ యాలతో దూసు కు పోతున్న నాని ప్రస్తు తం కృష్ణా ర్జున యుద్ధం చి త్రంలో నటిస్తూ బిజీగా ఉన్నారు.


నాని


మంచు మనోజ్

కీలక సన్నివేశాల్లో నా పేరు సూర్య

అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం నా పేరు సూర్య (నా ఇల్లు ఇండియా). అను ఇమ్మాన్యుయేల్ కథానాయిక. వక్కంతం వంశీ దర్శకుడు. కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మి సినీ క్రియేషన్స్ పతాకంపై శిరీష శ్రీధర్ నిర్మిస్తున్న ఈ చిత్రం చిత్రీకరణ చాలామటుకు పూర్తయింది. కాగా గురువారం నుంచి హైదరాబాద్‌లో కీలక సన్నవేశాలను చిత్రీకరిస్తున్నారు. రామోజీ ఫిలింసిటీతో పాటు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఈ సన్నివేశాల షూటింగ్ జరుగుతోంది. ఈ షెడ్యూల్లో అల్లు అర్జున్‌తో పాటు ముఖ్య తారాగణం పాల్గొంటున్నారు. ఈ నెల 14 వరకు ఈ ముఖ్యమైన షెడ్యూల్ కొనసాగుతుందని, హోళీ సందర్భంగా పోస్టర్ ఇంపాక్ట్ విడుదల చేశామని, నిర్మాణానంతర కార్యక్రమాలను పూర్తిచేసి, మే 4న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్, శేఖర్ సంగీతాన్ని సమకూరుస్తున్న ఈ చిత్రంలోని ఇతర ముఖ్యపాత్రల్లో యాక్షన్ కింగ్ అర్జున్, శరత్‌కుమార్ తదితరులు నటిస్తుండగా, సినిమాటోగ్రఫీని రాజీవ్ రవి, ఎడిటింగ్‌ను కోటగిరి వెంకటేశ్వరరావును అందిస్తున్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: బన్ని వాసు.


అల్లు అర్జున్

మహానటిని మిగతా పాత్రల్లా భావించలేదు


-కీర్తిసురేష్

మహానటి చిత్రాన్ని చేయడానికి ముందే సావిత్రిగారి సినిమాలు చాలా చూశాను. ఆమె హావభావాలు పరిశీలించాను. ఆమెకు సంబంధించిన పుస్తకాలను చదవి ఆమె వ్యక్తిత్వం గురించి తెలుసుకున్నాను. ఇంకా చెప్పాలంటే...మిగతా చిత్రాల్లోని పాత్రల మాదిరిగా నేను ఈ సినిమాలోని పాత్రను భావించలేదు అని అందాల భామ కీర్తిసురేష్ స్పష్టంచేసింది. నేను శైలజ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ మలయాళీ భామ ఆ తొలి చిత్రంతోనే విజయాన్ని అందుకోవడంతో పాటు నేను లోకల్ చిత్రం ద్వారా మరో విజయాన్ని దక్కించుకున్నారు. అయితే ఇటీవల వచ్చిన అజ్ఞాతవాసి చిత్రం విజయవంతమైతే ఆమెకు హ్యాట్రిక్ లభించేది. అయితే ఆ చిత్రం అనుకున్నంతగా ఆడలేదు. దివంగత అలనాటి నటి సావిత్రి జీవితకథ ఆధారంగా రూపొందుతున్న మహానటి చిత్రంలో సావిత్రిగా టైటిల్‌ను పాత్రను కీర్తి పోషిస్తున్న విషయం తెలిసిందే. తెలుగు, తమిళ భాషలలో తెరకెక్కుతున్న ఈ చిత్రం తన కెరీర్‌లో ఓ మైలురాయిగా మిగిలిపోతుందన్న అభిప్రాయాన్ని కీర్తి వ్యక్తంచేస్తూ, సావిత్రిగారి పాత్రలో నటించాల్సి వచ్చేటప్పటికి ఆమె కుమార్తె చాముండేశ్వరిని కూడా కలుసుకుని మరికొన్ని విషయాలను అవగాహన చేసుకున్నాను. సావిత్రిగారి బాడీలాంగ్వేజ్‌ను తెలుసుకున్నాను. సినిమా చేసేటప్పుడు ఈ విషయాలన్నీ నాకెంతగానో ఉపయోగపడ్డాయి అని అంటున్న ఆమె ఈ చిత్రంలోని పాత్ర పరిధి మరింత ఆకర్షణీయంగా ఉండటం కోసం 120 రకాల కాస్ట్యూమ్స్ ఉపయోగించిందట. సాధారణంగా ఏ సినిమాలో అయినా పాతికకు పైగా కాస్ట్యూమ్స్‌ను వాడుతుంటారు. అయితే ఈ చిత్రంలో ఎక్కువ కాస్ట్యూమ్స్‌ను వినియోగించడం ఓ హైలైట్‌గా ఉంటుందని అంటున్నారు. ఇదిలావుండగా... ప్రస్తుతం తమిళంలో విక్రమ్, సూర్య, విజయ్‌లు వేరు వేరుగా నటిస్తున్న చిత్రాల్లో వారి సరసన ఆమె నటిస్తోంది.



నిధి అన్వేషణలో గులేబకావళి

ప్రభుదేవా, హన్సిక నాయకానాయికలుగా రేవతి ఓ పవర్‌ఫుల్ పాత్రలో నటించిన తమిళ చిత్రం గులేబకావళి. కల్యాణ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం సంక్రాంతికి కోలీవుడ్‌లో విడుదలై, ప్రేక్షకాదరణకు నోచుకుంది. ఇప్పుడు ఈ చిత్రాన్ని అదే పేరుతో సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా (ప్రై.లిమిటెడ్ పతాకంపై మల్కాపురం శివకుమార్ తెలుగులోకి అనువదిస్తున్నారు. మార్చి 16న ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా నిర్మాత శివకుమార్ ఆ విశేషాలను తెలియజేస్తూ...తమిళంలో విజయం సాధించిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు కూడా నచ్చుతుందనే విశ్వాసంతో తెలుగులోకి అనువదిస్తున్నాను. గులేబకావళి అనే గ్రామంలో నిక్షిప్తమైన నిధి కోసం జరిగే అన్వేషణ నేపథ్యంలో ఈ కథ కొనసాగుతుంది. పూర్తి వినోదాత్మకంగా రూపొందిన ఈ చిత్రంలోని ప్రతీ సన్నివేశం ఆసక్తికరంగా ఉంటుంది. ఇండియన్ మైఖేల్ జాక్సన్‌గా పేరు పొందిన ప్రభుదేవా నృత్యాలు, నటన ప్రధాన ఆకర్షణగా ఉంటుంది అని చెప్పారు. ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో మన్సూర్ అలీఖాన్, మధు, ఆనంద్‌రాజ్ తదితరులు తారాగణం. ఈ చిత్రానికి పాటలు: సామ్రాట్, సంగీతం: వివేక్ మెర్విన్, కెమెరా: ఆర్ఎస్ ఆనంద్‌కుమార్, స్టంట్స్: పీటర్ హెయిన్స్, ఆర్ట్: కదీర్,


ప్రభుదేవా, హన్సిక